సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 115

బుధవారం 16-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'



ఆ ఐదు రోజులు నిషేధంపై విజయం

- IIలో



'ట్రాన్స్'మిషన్ పుస్తకంలో పాఠమైంది!

- IIలో

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
బుధవారం ॥ 16-7-2025

సిటీ నుంచి ఇంటికొచ్చిన మనవడు
నానమ్మ గొలుసు కాజేశాడు.
ఆ సంగతి నానమ్మ కనిపెట్టింది.
మనవడంటే ఎంత ప్రేమో ఆమెకు.
ఇంట్లో ఉండగా బాగా చదువుకుని
టాపర్‌గా ఉన్న మనవడు
సిటీకి వెళ్లి ఇలా అయ్యాడా
అని బాధ పడింది.
తర్వాత ఆమె చేసిన పని
మనవడిలో మార్పు తెస్తుందో లేదో గాని
టీనేజ్‌లో ఉన్న పిల్లల గురించి
పెద్దలందరినీ
ఆలోచనల్లో పడేసింది.
కేరళలో జరిగిన ఈ తాజా ఘటన
వివరాలు....

● ఆర్ద్రత

మనవడా... నువ్వు మారుతావు


ప్రతీకాత్మక చిత్రం

కేరళలోని అలెప్పి.

ఆ నానమ్మ రోజూ నిద్రపోయే ముందు తన ఒకటిన్నర సవర్ల గొలుసు దిండుకింద పెట్టుకుంటుంది. తెల్లవారి లేచిన తర్వాత మళ్లీ ధరిస్తుంది. కాని ఆ రోజు లేచి దిండు కింద చూస్తే గొలుసు లేదు.

రెండు రోజుల క్రితం మనవడు వచ్చాడు. ఈ మధ్య వచ్చినప్పుడల్లా డబ్బు అడుగుతున్నాడు. ఈసారి గొలుసు తీసేశాడన్న మాట. ఆమెకు ఏం చేయాలో పాలుపోలేదు. మనవడిని ఈ చేతులతో పెంచింది. వాడు ఇంటర్ వరకూ నిన్న మొన్న ఇక్కడే చదివాడు. టాపర్. ఫ్యాషన్ డిజైనింగ్ చేస్తానని బెంగళూరు వెళ్లినప్పటి నుంచి ఏమైందో ఏమిటో ఇలా తయారయ్యాడు. నగరం వాడిని మార్చేసిందా... లేదంటే తల్లిదండ్రులకు దూరంగా ఉండటం... అజమాయిషీ లేకపోవడం... తల్లిదండ్రులు సరిగ్గా పట్టించుకోకపోవడం... ఇవి వాణ్ణి ఇలా తయారు చేశాయా అని మధన పడింది.

పోలీస్ రిపోర్టు ఇస్తే కేసవడం, అరెస్టు చేయడం తాను భరించలేదు. అలాగే తనకున్న ఒక్కగానొక్క గొలుసును పోగొట్టుకోవాలని లేదు. అందుకే పోలీసులకు చాటుగా ఫోన్ చేసింది. 'అయ్యా... నా మనవడు ఇంత పని చేశాడు. కేసు గీసు ఏం వద్దు. వాడి దగ్గరి నుంచి ఆ గొలుసు సంపాదించి ఇవ్వండి చాలు.... వాడిని తీసుకెళ్లి లోపల వేసి కొట్టడం, హింసించడం చేయవద్దు' అని బతిమిలాడింది.

అలెప్పి పోలీసులు నానమ్మ హృదయాన్ని అర్థం చేసుకున్నారు. వెంటనే మనవడి ఫొటోను వాట్సప్ చేయమన్నారు. ఆమె చేసింది. పోలీసులు ఆ ఫోటోను 'ఆల్ కేరళ గోల్డ్ మర్చంట్ అసోసియేషన్' అలెప్పీ సెక్రటరీ అబి థామస్‌కు పంపారు. అబి థామస్ దానిని తమ వర్తకుల వాట్సప్ గ్రూప్‌లో పెట్టి 'ఈ కుర్రాడు గొలుసు తీసుకొని వస్తే ఎవరూ కొనవద్దు' అని మెసేజ్ చేశాడు. అప్పటికే గొలుసుతో బయలుదేరిన మనవడు అలెప్పిలోని ఏ దుకాణానికి వెళ్లినా వర్తకులు 'నువ్వు దొంగవి' అనకుండా 'మేం కొనం' అని వెనక్కు పంపేయసాగారు. మనవడు మొత్తం 25 షాపులు తిరిగాడు. ఎవరూ కొనలేదు. దాంతో మూడు రోజుల తర్వాత ఆ గొలుసును తిరిగి నానమ్మకు ఇచ్చేశాడు. ఆమె కోప్పడలేదు. కన్నీరు కార్చింది. మనవడికి బహుమతిగా 1000 రూపాయలు ఇచ్చింది. నువ్వు మారతావని ఆశిస్తున్నా... అంది. మనవడు మారతాడో లేదో కానీ ఇదో ఆలోచించాల్సిన విషయం. చదువు కోసం, కోర్సుల కోసం నగరాలకు పిల్లల్ని పంపాక వారితో నిత్యం కమ్యూనికేషన్‌లో తల్లిదండ్రులు ఉండాలి, ప్రేమను చూపాలి, సాధక బాధకాలు వినాలి... లేకుంటే వారు పెడత్రోవ తొక్కవచ్చు.



మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలో స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మహిళలు నిర్మించుకున్న 'మావా ఆస్కాన్‌లోన్' ఇల్లు

* రుతు గుడిసె

ఆ ఐదు రోజులు నిషేధంపై విజయం

రుతుస్రావం జరుగుతున్న మహిళలను అపవిత్రమైన వారిగా.. అంటరాని వారిగా పరిగణించే గ్రామాలు ఇప్పటికీ మన దేశంలో ఇంకా ఉన్నాయి. మహారాష్ట్ర గడ్చిరోలి జిల్లాలోని మాడియా తెగ మహిళలు శతాబ్దాలుగా 'ఆ ఐదు రోజులు' ఊరికి దూరంగా రుతు గుడిసెలలో ఒంటరిగా ఉంటున్నారు. ఇప్పుడా ఆచారానికి అక్కడి మహిళలంతా కలిసి స్వస్తి పలికారు. ఆ గ్రామంలోని అన్ని వయసుల మహిళలకు సమష్టిగా 'మావా ఆస్కాన్‌లోన్' (మహిళలుగా ఇది మా నిజమైన ఇల్లు)ను ఏర్పాటు చేశారు. దశాబ్దాలుగా ఈ ఆచారాన్ని నిర్మూలించడానికి కృషి చేసి, విజయం సాధించారు. ఈ నిర్మాణం మహిళలకు ఒక ఆశ్రయం మాత్రమే కాదు సమావేశాలు జరుపుకోవడానికి, ఒకరికొకరు మద్దతుగా నిలబడటానికి మహిళల కమ్యూనిటీ కేంద్రంగా కూడా పనిచేస్తుంది. సమీప గ్రామాల మహిళలు కూడా ఈ ఇంటికి వస్తున్నారు. మహిళలే మహిళల కోసం ఐక్యతగా సదస్సులు ఏర్పాటు చేసి, అవగాహన కల్పిస్తున్నారు.

దశాబ్దాల కాలంగా కుర్మాఘర్ (రుతు గుడిసె) ఆచారాన్ని నిర్మూలించడానికి గడ్చిరోలికి చెందిన స్పర్శ్ అనే ఎన్జీవో అక్కడి మహిళలకు మద్దతుగా నిలిచింది. ఇది సహజమైన జీవప్రక్రియ. ఈ సమయంలో మహిళలకు అవసరమైన భావోద్వేగ, శారీరక మద్దతు కుటుంబం నుండి మాత్రమే లభిస్తుంది, ఒంటరితనంతో కాదు'' అని పదే పదే చెబుతూ గ్రామంలోని పురుష సభ్యులను, సంప్రదాయ విశ్వాస నాయకులలో మార్పునకు కృషి చేసింది. 'మొదట్లో అసాధ్యం అనిపించింది. కానీ, నిజాయితీగా కృషి చేయడంతో మనస్తత్వాలు మారడం ప్రారంభించాయి. ఇక నుంచి రుతు గుడిసెల్లో ఏ ఒక్క మహిళ కూడా ఉండకూడదు అని స్పష్టంగా చెబుతున్నారు' అంటారు ఎన్జీవో డైరెక్టర్ డాక్టర్ దిలీప్ బర్సగా.

ఒంటరి వేదన నుంచి విముక్తి

మహిళల కోసం ఆశ్రమాం నిర్మించాలనుకున్నప్పుడు కుర్మ ఘర్‌లాగా ఉండకూడదనే షరతుతో అంగీకరించారు. అంటే, వారు ఆ రుతు గుడిసెతో ఎంతటి మానసిక, శారీరక క్షోభను అనుభవించారో అర్థం చేసుకోవచ్చు. మహిళలు ఒంటరిగా ఉండే వ్యవధి ఐదు రోజుల నుండి మూడు రోజులకు, తరువాత రెండు రోజులకు తగ్గింది. అయినప్పటికీ చాలా ఇళ్ల వాళ్లు రుతుస్రావం ఉన్న మహిళలను ఇంట్లోకి అనుమతించడాన్ని నేటికీ వ్యతిరేకిస్తున్నాయి. రుతుస్రావం ఉన్న, లేని మహిళలు అందరూ ఒకే పైకప్పు కింద కలిసి ఉండటం వల్ల ఈ నిషేధం తొలగిపోయేంతవరకు అవి శ్రాంతంగా కృషి చేశారు. శ్రమించారు. ఫలితంగా నేడు అందరూ కలిసి ఉంటున్నారు. కొందరు రుతుక్రమంలో ఉన్న మహిళలు ఇప్పటికీ కేంద్రంలో పగటిపూట గడుపుతారు. కానీ, రాత్రికి ఇంటికి తిరిగి వెళతారు. ఈ ఇల్లు ఇప్పుడు అన్ని రకాల సమావేశాలకు ఉపయోగపడుతుంది. మహిళల విజయానికి చిహ్నంగా మారింది.


దశాబ్దాల కాలంగా ఉపయోగిస్తున్న కుర్మాఘర్ (రుతు గుడిసె)

ఆంక్షల నుంచి అవగాహన వైపుగా!

నెల్గుండ గ్రామానికి చెందిన మాడియా తెగ సభ్యురాలు బేబీ మడ్కమే మాట్లాడుతూ 'ఊరికి దూరంగా 15 గుడిసెల వరకు ఉన్నాయి. అక్కడ ఎలాంటి సౌకర్యాలు ఉండవు. తుఫానుల వల్ల చాలా వరకు పైకప్పులు ఎగిరిపోయాయి. రుతుక్రమం సమయంలో నది నీటిని తాకడానికి కూడా వీల్లేని ఆంక్షలు. మూడవ రోజు, మళ్లీ ఐదవ రోజున స్నానం చేసి, ఊరి లోపలికి వెళ్లాలి. దీనివల్ల రకరకాల జబ్బులు వచ్చేవి. కానీ, ఊరి పెద్దవాళ్లు మొండిగా ఉంటారు' అని చెబుతుంది ఆమె. 2011లో స్పర్శ్ 223 రుతు గుడిసెలలో ఒక సర్వే నిర్వహించింది. అందులో.. పాముకాటు, అడవి జంతువుల దాడులు, ఒంటరితనం, అధిక రక్తస్రావం, వైద్య అత్యవసర పరిస్థితుల వల్ల 28 మంది అమ్మాయిలు మరణించారని గుర్తించింది. బాధితుల్లో దాదాపు 70 శాతం మంది 11 నుంచి 37 సంవత్సరాల మధ్య వయసు గలవారే అని చెబుతారు ఇక్కడి మహిళలు. గిరిజన పరిశోధన శిక్షణ సంస్థ గడ్చిరోలిలోని 50 గ్రామాలకు తన బృందాన్ని పంపింది. ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తల సాయంతో విద్య, వైద్యం వంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తోంది..

● కిచెన్ టిప్స్

పకోడీలు కరకరలాడాలంటే...

వర్షాకాలంలో తరచూ వేసుకునే పకోడీలు, బజ్జీలు కరకరలాడుతూ క్రిస్పీగా రావాలంటే..

- పిండిని కలిపేటప్పుడు... పకోడీ, బజ్జీల పిండిని చల్లని నీటితో ఉండలు లేకుండా బాగా కలుపుకుని అరగంటపాటు పక్కన పెట్టుకోవాలి.



- పకోడీలు, బజ్జీలను నూనెలో వేసి డీప్‌ఫ్రై చేసేటప్పుడు పదేపదే తిప్పకూడదు. ఎక్కువగా తిప్పితే మెత్తగా వస్తాయి. అందువల్ల మాడకుండా మాత్రమే తిప్పుతూ ఫ్రై చేయాలి.
- పచ్చిమిర్చి, పాలకూర, వంకాయ, అరటికాయ, బంగాళ దుంప వంటివాటితో బజ్జీలు వేసేముందు శుభ్రంగా కడిగి, కాటన్ గుడ్డతో తడిలేకుండా తుడిచి ఫ్యాన్ గాలికింద ఆరబెట్టాలి. తరువాత పిండిలో ముంచితే ముక్కలకు పిండి చక్కగా అంటుకుని బజ్జీలు క్రిస్పీగా, క్రంచీగా వస్తాయి.

'ట్రాన్స్'మిషన్

పుస్తకంలో పాఠమైంది!

కేరళ విద్యావ్యవస్థలో అభ్యుదయం వెల్లివిరుస్తుంటుంది. జెండర్ వివక్ష లేని సమాజం కోసం బాల్యం నుంచే పాఠాలు బోధిస్తుంటుంది. ఒకప్పుడు పాఠ్యపుస్తకాలలో కుటుంబ ముఖచిత్రంలో అమ్మతోపాటు నాన్న కూడా ఇంటి పనులు చేయడాన్ని ప్రచురించింది. తాజాగా ఇప్పుడు ఓ ట్రాన్స్‌జెండర్ జీవితగాధను పాఠ్యాంశంగా తీసుకుంది. ఎనిమిదవ తరగతి ఆర్ట్స్ టెక్స్ట్ బుక్‌లో ట్రాన్స్ ఆర్టిస్ట్ నేహా ఎస్ విజయ గాధను చేర్చింది.


ఎనిమిదవ తరగతి ఆర్ట్స్ టెక్స్ట్ బుక్‌లో పాఠంగా ట్రాన్స్ ఆర్టిస్ట్ నేహా ఎస్ విజయ జీవితగాధ

అంతరించి పోవాలి!

ఎస్‌సీఈఆర్‌టీ (స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్) కొత్త కరికులమ్‌లో నాటకరంగం, శిల్పకళ, సంగీతం, సినిమా, నాట్యరంగాలను చేర్చింది. ఆయా రంగాల్లో ప్రముఖుల గురించిన పాఠాలను పాఠ్యపుస్తకాలలో ప్రచురించింది. ఈ క్రమంలో సినీ నటి నేహా ఎస్ గురించిన పాఠానికి చోటు కల్పించింది ఎస్‌సీఈఆర్‌టీ. మలయాళ నటి నేహా ఎస్... 2022లో నటించిన 'అంతరం' సినిమాకు గాను కేరళ రాష్ట్ర ప్రభుత్వం నుంచి బెస్ట్ పెర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్నారు. ఒక ట్రాన్స్ ఉమన్‌కు ఇలాంటి గౌరవం దక్కడం ఇదే తొలిసారి. పాఠ్యపుస్తకంలో తన జీవిత పాఠం గురించి తెలుసుకున్న నేహా ఎస్ భావోద్వేగాలకు లోనయ్యారు. 'టెక్స్ట్‌బుక్‌లో


'అంతరం' సినిమాలో ఓ దృశ్యం

పాఠాన్ని చూడగానే నాకు కన్నీళ్లు వచ్చాయి. సమాజం ఇన్నేళ్ల వరకు నన్ను నా పేరుతో గుర్తించనే లేదు. అలాంటిది 8వ తరగతి పాఠ్యపుస్తకంలోని ఓ పాఠంలో నా పేరు ఉండడం నన్ను కదిలించింది' అన్నారామె. సమాజం వేరుగా చూసిన వారిని సమాజంలో భాగంగా చూపించడానికి ఆ రాష్ట్ర విద్యావ్యవస్థ చేసిన ప్రయత్నం గొప్పది. ఆమె సొంతూరు తమిళనాడులోని తిరువారూర్ జిల్లా తీయన్నపురం. కేరళలో నటిగా పురస్కారం అందుకునే వరకు తన సొంత రాష్ట్రం కూడా తనను గుర్తించలేదని, పురస్కారం సందర్భంగా మీడియా కవరేజ్ తర్వాత తనను తన రాష్ట్రం స్వాగతించిందని, అయినప్పటికీ తమిళరాష్ట్ర ప్రభుత్వం నుంచి మాత్రం తనకు గుర్తింపు రాలేదన్నారామె. విద్యార్థుల్లో జెండర్ అవేర్‌నెస్ కోసం ఆమె అనేక ప్రభుత్వ స్కూళ్లలో క్లాసులు తీసుకున్నారు. ట్రాన్స్‌జెండర్‌ల పట్ల సమాజంలో నెలకొని ఉన్న తక్కువ భావనను తొలగించడానికి ఈ పాఠం ఒక మంచి ప్రయత్నం. అయితే ప్రపంచంలో కరడుగట్టి ఉన్న అంతరం తొలగిపోవడానికి ఇది సరిపోదు. అంతరించిపోయే వరకు ఇంకా చాలా చేయాలంటూ 'నా జీవిత పాఠం చదివిన విద్యార్థులు తమను తాము శక్తిమంతంగా తీర్చిదిద్దుకోగలగాలి' అని ఆశాభావం వ్యక్తం చేశారామె.

● పర్యావరణ హిత

గల్లీ క్లైమేట్ లీడర్స్



అహ్మదాబాద్, సూరత్, భోపాల్, జైపూర్‌లాంటి నగరాలలోని పేద మహిళలకు పర్యావరణంపై అవగాహన కలిగించడానికి నడుం కట్టింది మహిళా హౌజింగ్ ట్రస్ట్ (ఎంహెచ్‌టీ).

'మొదట్లో వాతావరణ మార్పుల గురించి మహిళలకు చెప్పినప్పుడు, మనం ఏమీ చేయలేము. అంతా భగవంతుడి లీల అన్నట్లుగా మాట్లాడేవారు. ఆ తరువాత మాత్రం వారిలో మార్పు వచ్చింది. ప్రకృతి విధ్వంసానికి కారణాల గురించి తెలుసుకున్నారు' అంటుంది ఎంహెచ్‌టీ ప్రోగ్రామ్ మేనేజర్ భవన మహేరియ.

పర్యావరణ విషయాలపై మహిళలతో చర్చా కార్యక్రమాలు నిర్వహిస్తుంటుంది ఎంహెచ్‌టీ. డ్రైనేజి సమస్య నుంచి సేఫ్టీ ఎలక్ట్రిసిటీ వరకు ఎన్నో విషయాల గురించి మాట్లాడుకుంటారు. పర్యావరణానికి ముప్పు వాటిల్లే చర్యలపై అధికారులకు ఫిర్యాదు చేయడం గురించి నేర్చుకున్నారు.

ఎండాకాలం భరించలేని వేడివల్ల ఇండ్లలో చాలామంది మహిళలకు కష్టంగా ఉండేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని ఇంటి లోపలి ఉష్ణోగ్రతలు తగ్గేలా సోలార్ - రెఫ్లెక్టివ్ రూఫ్ పెయింట్, బ్యాంబూ ప్యానెల్స్... మొదలైన వాటిని మహిళలకు పరిచయం చేసింది ఎంహెచ్‌టీ.

గుజరాత్‌లోని అహ్మదాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఎంహెచ్‌టీ ఎంతోమంది పేద మహిళలను 'క్లైమెట్ లీడర్'లుగా తీర్చిదిద్దింది. కమ్యూనిటీ యాక్షన్ గ్రూప్ (సీఏజీ) గా ఏర్పడిన మహిళలు పర్యావరణహిత కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషిస్తున్నారు.

బులియన్ జూలై 15న ముగింపు రూ.లలో
(బంగారం 10 గ్రా. : వెండి కిలో)

హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	98,600
బంగారం (22 క్యారెట్లు)	91,350
వెండి	1,14,300
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	1,01,100
బంగారం (22 క్యారెట్లు)	91,450
వెండి	1,15,100
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	99,770
బంగారం (22 క్యారెట్లు)	91,450
వెండి	1,25,000
రాజమండ్రి	
బంగారం (24 క్యారెట్లు)	1,01,100
బంగారం (22 క్యారెట్లు)	94,190
వెండి	1,15,100
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	98,300
బంగారం (22 క్యారెట్లు)	90,440
వెండి	1,13,400
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	99,760
బంగారం (22 క్యారెట్లు)	91,450
వెండి	1,25,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

లీగల్

కోరిన సమాచారం అందకపోతే అప్పీల్‌కు వెళ్లవచ్చు!

మా అమ్మాయికి రావలసిన స్కాలర్‌షిప్ రాకపోవటంతో నేను సదరు అధికారులకు గతంలో సమాచార హక్కు చట్టం కింద 'స్కాలర్షిప్ ఎందుకు రాలేదు, కారణాలు తెలపండి' అని అడిగాను. మొదట ఈ విషయం మా పరిధిలోకి రాదు అని ఒక శాఖ వారు సమాధానం ఇస్తూ సరైన శాఖకి నా దరఖాస్తును బదిలీ చేశారు. వారేమో ''మీరు కోరిన సమాచారం సెక్షన్ 8 ప్రకారం అందించటం వీలు కాదు'' అని తిరస్కరించారు. నాకు సమాచారం ఎలా వస్తుందో చెప్పగలరు.

- జాగృతి, ఆదిలాబాద్

సమాచార హక్కు చట్టం, 2005 ప్రకారం ప్రభుత్వ/ప్రభుత్వ అనుబంధ శాఖలు/ప్రభుత్వం ద్వారా నిధులు పొందుతున్న సంస్థలు, మొదలైన వారినుంచి ఎవరైనా సమాచారం పొందవచ్చు. అయితే అసలు ''సమాచారం'' అంటే ఏమిటి అని మనం తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. మీరు కోరుతున్న సమాచారం ఏదో ఒక రూపం కలిగి ఉండడం చాలా ముఖ్యం. అంటే సదరు సమాచారం పత్రాలు, మెమోలు, సలహాలు, ప్రకటనలు, నివేదికలు, అంకెల పట్టికలు, ఎలక్ట్రానిక్ సమాచారం వంటివి ఏదో ఒక రూపంలో నిక్షిప్తమై భౌతికంగా ఉండాలి. అలా లేని పక్షంలో మీ దరఖాస్తును తిరస్కరించే ఆస్కారం ఉంటుంది. ఉదాహరణకు: నాకు స్కాలర్షిప్ ఎందుకు మంజూరు అవలేదు అంటే మీరు కారణం అడుగుతున్నట్లు - అది సమాచారం అయుండకపోవచ్చు లేదా అందుకు దగ్గర కారణం రికార్డులో ఉండి ఉండకపోవచ్చు. అదే సమాచారాన్ని మీరు ''నా స్కాలర్షిప్ ప్రతిపాదనకు - మంజూరుకు సంబంధించి ఫైలు ఏ స్థాయిలో ఉన్నది - తగిన పత్రాలు అందించగలరు.'' అని కోరినట్లయితే మీకు ఖచ్చితంగా సమాధానం ఇవ్వవలసి ఉంటుంది. సెక్షన్ 8, 9 లోని మినహాయింపులు పరిశీలిస్తే, ముఖ్యంగా దేశభద్రతకు, అంతర్జాతీయ సంబంధాలకు, దేశ ఆర్థిక వ్యవస్థకు భంగం కలిగించే సమాచారాలు, గోప్యం వహించవలసిన సమాచారాలు, ఏదైనా చట్టం ద్వారా గాని కోర్టుల ద్వారా గాని నిషేధించబడిన సమాచారం, ఏదైనా వ్యక్తికి సంబంధించిన వ్యక్తిగతమైన సమాచారం, వ్యక్తిగత స్వేచ్ఛకు అలాగే భద్రతకు భంగం కలిగిస్తుంది అనిపించే సమాచారం వంటివి ఇవ్వవలసిన అవసరం లేదు. కొన్ని సందర్భాలలో ప్రజాప్రయోజనం ఉంటుంది అని సదరు అధికారులు తలిస్తే మీకు సమాచారాన్ని ఇచ్చే అవకాశం/ఆస్కారం ఉంటుంది. కాబట్టి మీరు ప్రశ్నలు అడిగేటప్పుడు ''ఎందుకు చేశారు, ఆ పనిచేయడానికి కారణం ఏమిటి'' వంటి ప్రశ్నలు అడగకుండా ఆ అంశానికి సంబంధించిన పత్రాలను మాత్రమే అడిగినట్లయితే మీరు కోరిన సమాచారాన్ని తిరస్కరించే ఆస్కారం తగ్గిపోతుంది. మీరు కోరిన సమాచారం చాలా ఎక్కువ పేజీలలో ఉండి ప్రభుత్వ ఉద్యోగుల సాధారణ పనికి భంగం కలిగిస్తుంది అని వారు భావిస్తే మిమ్మల్ని ఒకరోజు ఆఫీసుకు వచ్చి డాక్యుమెంట్లు పరిశీలించుకో వలసినదిగా సమాధానం ఇవ్వవచ్చు. అప్లికేషన్‌కు పదిరూపాయలు (తెల్ల రేషన్ కార్డు ఉంటే ఉచితంగా), సమాచారం పొందడానికి అధికారి నిర్దేశించిన రుసుము చెల్లించి మీరు సమాచారం పొందవచ్చు. మీ మొదటి దరఖాస్తుకు సమాచారం దక్కకపోతే మీరు అప్పీల్‌కు వెళ్ళవచ్చు. అప్పీల్‌లో కూడా మీకు సమాచారం దక్కకపోతే మీరు రాష్ట్ర సమాచార కమిషన్‌లో దరఖాస్తు చేయవచ్చు. మీరు కోరుతున్న సమాచారం ఎవరిని అడగాలో మీకు తెలియనప్పుడు, సదరు అంశానికి సంబంధించిన మంత్రివర్యులకు కూడా మీరు నేరుగా దరఖాస్తు చేయవచ్చు. వారు తగిన రీతిలో మీకు సమాచారాన్ని అందిస్తారు. చాలా సందర్భాలలో సమాచారం రాకపోవడానికి కారణం సరైన రీతిలో అడగకపోవడం అనేది కూడా గమనించాలి.

- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది



మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాలకోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.

వైరల్ హిట్



హైబ్రీడ్ డ్యాన్స్ స్టైల్

కేరళలోని సంప్రదాయ శాస్త్రీయ నృత్యం మోహినీయాట్టం, మోడ్రన్ ర్యాప్ ట్రాక్‌ను మిక్స్ చేసి సోషల్ మీడియా సెన్సేషన్‌గా మారింది శ్వేత వారియర్. ఎనిమిదిమంది డ్యాన్సర్‌లతో కలసి ఈ వినూత్న నృత్యం చేసింది.

'రన్ ఇన్ అప్ ర్యాప్ చూసిన తరువాత కొత్తగా ఏదైనా చేయాలనిపించింది' అని తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో రాసింది శ్వేత.

ఈ డ్యాన్స్ వీడియోకు 13 మిలియన్‌ల వ్యూస్ వచ్చాయి. 'రెఫ్రెషింగ్' 'ఇన్నోవేటివ్' 'పవర్‌ఫుల్' అని స్పందించారు నెటిజనులు.

కేరళలోని పాలక్కాడ్‌కు చెందిన శ్వేత వారియర్ కొత్త డ్యాన్స్ స్టైల్స్‌ను క్రియేట్ చేయడంలో పేరు తెచ్చుకుంది. మూడు సంవత్సరాల వయసు నుంచే తల్లి దగ్గర భరతనాట్యంలో శిక్షణ పొందింది. భరత నాట్యం, అర్బన్ స్ట్రీట్ స్టైల్స్‌ను మిక్స్ చేసి సృష్టించిన 'స్ట్రీట్ వో క్లాసికల్' సూపర్ హిట్ అయింది.

రకరకాల 'హైబ్రీడ్ డాన్స్ స్టైల్స్'తో డాన్సర్‌గా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది శ్వేత వారియర్.

సోనీ టీవి 'ఇండియాస్ బెస్ట్ డ్యాన్సర్'లో రన్నర్-అప్‌గా నిలిచింది.

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 18 వెల: ₹ 5.50

సంపుటి: 18 సంచిక: 115

బుధవారం 16-7-2025

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'



టెస్లా కారు వచ్చేసింది..

ముంబైలో మోడల్ 'వై' విడుదల.. రూ.59.89 లక్షల నుంచి మొదలు -17లో



వెస్టిండీస్ 27 ఆలౌట్

స్టార్క్‌కు 6 వికెట్లు. బోలండ్ 'హ్యాట్రిక్'. మూడో టెస్టులోనూ ఆసీస్ గెలుపు -16లో



నిమిష మరణశిక్ష వాయిదా

యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిష ప్రియకు చివరి నిమిషంలో భారీ ఊరట లభించింది.


- వివరాలు 8లో



ఉగ్ర పోరులో రాజీ వద్దు

షాంఘై సహకార సంస్థ లక్ష్యానికి కట్టుబడి ఉండాలని.. ఇందులో రాజీపడొద్దని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు.

- వివరాలు 8లో



మాస్కోను కొట్టగలవా?

అస్త్రశస్త్రాలు అందిస్తే రష్యాపై దాడి చేయ గలవా? అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ అడిగారు.

- వివరాలు 8లో



రూ. 62 కోట్ల కొకైన్

దోహా నుంచి ముంబై వచ్చిన ఓ మహిళ నుంచి రూ. 62 కోట్ల విలువైన డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు.

- వివరాలు 8లో

బనకచర్ల వద్దు

నేటి సీఎంల భేటీ ఎజెండాను సవరించండి.. కేంద్ర జలశక్తి శాఖకు రాష్ట్ర సర్కారు లేఖ

- ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిపాదనతో అప్రమత్తం
- అనుమతులే లేని ప్రాజెక్టుపై చర్చ అసమంజసమంటూ తీవ్ర అభ్యంతరం
- చట్టాలు, ట్రిబ్యునల్ తీర్పులన్నింటినీ ఉల్లంఘిస్తూ ఆ ప్రాజెక్టు చేపట్టారని వెల్లడి
- ఇప్పటికే గోదావరి బోర్డు, సీడబ్ల్యూసీ అభ్యంతరం వ్యక్తం చేయడాన్ని లేఖలో ప్రస్తావించిన సీఎస్
- డీపీఆర్ సమర్పించకుండా, టెండర్లు పిలవకుండా ఏపీని అడ్డుకోవాలని విజ్ఞప్తి
- తెలంగాణ ప్రతిపాదనలే ఎజెండాలో చేర్చాలని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ, ఏపీ మధ్య జల వివాదాలపై చర్చించేందుకు కేంద్ర జలశక్తి శాఖ బుధవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన సమావేశం ఎజెండాలో గోదావరి–బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టును చేర్చడంపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. అనుమతులు లేని ప్రాజెక్టుపై చర్చ అసమంజసమని స్పష్టం చేసింది. ఈ ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేనే లేదని, వెంటనే ఎజెండాను సవరించాలని కోరింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు మంగళవారం కేంద్ర జలశక్తి శాఖ కార్యదర్శికి లేఖ రాశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలతో రాసిన ఈ లేఖలో బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణకు ఉన్న అభ్యంతరాలన్నింటినీ సీఎస్ ప్రస్తావించారు.

బనకచర్లే సింగిల్ ఎజెండాగా ఏపీ ప్రతిపాదన

కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ అధ్యక్షతన ఏపీ, తెలంగాణ సీఎంలు చంద్రబాబు, రేవంత్‌రెడ్డితో ఈ సమావేశం జరగనుంది. అయితే ఈ భేటీ సింగిల్ (ఏకైక) ఎజెండాగా బనకచర్లపై మాత్రమే చర్చించాలని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించింది. దీంతో తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. ఏపీ ప్రతిపాదనను వ్యతిరేకిస్తూ లేఖ రాసింది. తెలంగాణ చేసిన పలు ప్రతిపాదనలను ఎజెండాలో చేర్చాలని కోరింది. కృష్ణా బేసిన్‌లోని తెలంగాణ పెండింగ్ ప్రాజెక్టులకు అనుమతులు, నీటి కేటాయింపులు, గతంలో కేంద్రం ఇచ్చిన హామీ ప్రకారం పాలమూరు, డిండి ప్రాజెక్టులకు జాతీయ ప్రాజెక్టులుగా గుర్తింపు అంశాన్ని ఎజెండాలో చేర్చి చర్చించాలని ఇప్పటికే కేంద్రాన్ని రాష్ట్ర సర్కారు కోరింది. అలాగే తుమ్మిడిహెట్టి వద్ద ప్రతిపాదించిన ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు 80 టీఎంసీల

మిగతా 10వ పేజీలో ▶



చర్చకు పెడితే బాయ్‌కాట్!

కేంద్ర జలశక్తి శాఖ ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో జరిగే సమావేశానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఉన్నతాధికారులు హాజరు కానున్నారు. ఇందుకోసం మంగళవారం రాత్రి వారు ఢిల్లీ బయలుదేరి వెళ్లారు. అయితే ఈ సమావేశానికి హాజరైనప్పటికీ, ఎట్టి పరిస్థితుల్లోనూ బనకచర్లపై చర్చకు ఒప్పుకునేది లేదని ప్రభుత్వ వర్గాలంటున్నాయి. తెలంగాణ అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికీ బనకచర్లను ఎజెండాలో పెట్టి చర్చ ప్రారంభిస్తే నిరసన వ్యక్తం చేస్తూ బాయ్‌కాట్ చేస్తారని తెలుస్తోంది. కాగా, వీలును బట్టి సీఎం బుధవారం రాత్రికి, లేదా గురువారం నగరానికి వస్తారని సీఎంవో కార్యాలయ వర్గాలు వెల్లడించాయి.



క్యాప్సూల్ నుంచి బయటకొస్తూ అభివాదం చేస్తున్న శుభాంశు శుక్లా

శుభ ఆగమనం

- 18 రోజులపాటు అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రంలో గడిపి క్షేమంగా భూమిపైకి చేరుకున్న భారత వ్యోమగామి
- భారత కాలమానం ప్రకారం మంగళవారం మధ్యాహ్నం పసిఫిక్ మహాసముద్రంలో దిగిన డ్రాగన్ 'గ్రేస్' వ్యోమనౌక
- పరీక్షల నిమిత్తం శుభాంశు బృందం క్వారంటైన్‌కు తరలింపు
- మానవసహిత అంతరిక్ష యాత్రలకు భారీ ఊపు
- శుభాంశుకు దేశవ్యాప్తంగా అభినందనల వెల్లువ.. భారత్ పేరును విశ్వవ్యాప్తంగా రెపరెపలాడించారన్న రాష్ట్రపతి, ప్రధాని

ఇలా తిరిగొచ్చారు శుభాంశు యాత్ర హైలైట్స్.. 8లో

"చరిత్రాత్మక అంతరిక్ష యాత్రను విజయవంతంగా ముగించుకుని భూమికి తిరిగి వచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను దేశ ప్రజలందరితో కలిసి సాదరంగా స్వాగతిస్తున్నా."

- ప్రధాని మోదీ

న్యూస్‌రీల్

19న సీజే ప్రమాణస్వీకారం



రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఏకే సింగ్ ఈ నెల 19న ప్రమాణ స్వీకారం చేయనున్నారు. శనివారం గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించనున్నారు. దీంతో ఏకే సింగ్ ఏడో సీజేగా బాధ్యతలు చేపడతారు.

- వివరాలు 4లో


మాజీ ఈఎన్‌సీ మురళీధర్‌రావు అరెస్ట్



ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో నీటిపారుదల శాఖ మాజీ ఈఎన్‌సీ మురళీధర్‌రావును ఏసీబీ మంగళవారం అరెస్ట్ చేసింది. 12 చోట్ల చేపట్టిన సోదాల్లో భారీగా ఆస్తుల పత్రాలు, బంగారాన్ని స్వాధీనం చేసుకుంది.

- వివరాలు 18లో

వైద్య ప్రవేశాలకు రిజిస్ట్రేషన్



రాష్ట్రంలో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి కాళోజీ నారాయణ రావు వైద్య విశ్వవిద్యాలయం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్, డెంటల్ కాలేజీల్లో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు తెలిపింది.

- వివరాలు 4లో

ఆదాయం ఉన్న చోటే విలువల సవరణ



రిజిస్ట్రేషన్ల ద్వారా ఎక్కువ ఆదాయం వస్తున్న జీహెచ్‌ఎంసీ, శివారు ప్రాంతాల్లోనే వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తుల విలువలు సవరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది.

- వివరాలు 5లో

ఇదండీ సంగతి



లేదంటే 50 రోజుల్లో మిమ్మల్ని నోబెల్‌కి నామినేట్ చేయమని అసలు విషయం చెప్పేద్దాం!

ప్రపంచ దేశాలతోనే పోటీ: సీఎం రేవంత్



- మంచి పారిశ్రామిక విధానాలతో ముందడుగు
- బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్
- రాబోయే రోజుల్లో డేటా సిటీగా మారనున్న నగరం
- జీనోమ్ వ్యాలీలో 'ఐకార్' కొత్త యూనిట్‌కు భూమి పూజ

- వివరాలు 4లో

రాజ్‌భవన్‌కు ఆర్డినెన్స్ ముసాయిదా



- గవర్నర్ ఆమోదిస్తే పీఆర్ చట్టానికి చేసిన సవరణ అమల్లోకి
- ఆపై 'స్థానిక' కోటా ఖరారు
- ఆ తర్వాత ఎస్‌ఈసీ ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేసే చాన్స్
- సవరణలో భాగంగా '50% మించకుండా రిజర్వేషన్లు' అనే వాక్యం తొలగింపు

5లో

కళ్లలో కారం చల్లి కాల్చి చంపారు



- సీపీఐ నేత చందు రాథోడ్ దారుణ హత్య..
- అతి సమీపం నుంచి కాల్పులు.. అక్కడికక్కడే కుప్పకూలిన వైనం
- హైదరాబాద్‌లోని మలక్‌పేటలో ఘటన
- హత్యలో నలుగురు పాల్గొన్నట్లు ఆధారాలు
- రంగంలోకి దిగిన పది ప్రత్యేక బృందాలు

9లో

కారులో కాల్పులు.. కాంగ్రెస్ నేత అనిల్ హత్య



- నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి పరారైన దుండగులు
- మెదక్ జిల్లాలో సోమవారం అర్ధరాత్రి ఘటన
- భూవివాదాలు, సెటిల్‌మెంట్లే కారణమా?
- రంగంలోకి ప్రత్యేక పోలీసు బృందాలు

9లో

రిజర్వేషన్లు ఎలా ఉంటాయో!?

- స్థానిక ఎన్నికల వేళ పార్టీల చర్చ
- ఈ ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్ల కల్పనకు సర్కారు నిర్ణయం
- పంచాయతీరాజ్ చట్టానికి సవరణలతో ఆర్డినెన్స్ తెచ్చేందుకు సిద్ధం
- గతంలో మండల ప్రాతిపదికన సర్పంచ్, ఎంపీటీసీ రిజర్వేషన్లు.. జిల్లా యూనిట్‌గా జెడ్పీటీసీ కోటా
- ఎంపీపీ అధ్యక్షుడికి జిల్లా యూనిట్‌గా, జెడ్పీపీ అధ్యక్షుడికి రాష్ట్ర యూనిట్‌గా రిజర్వేషన్లు
- ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఎలా మారుతాయనే దానిపై విస్తృత చర్చలు



సాక్షి, హైదరాబాద్: హైకోర్టు ఆదేశాల మేరకు సెప్టెంబర్ 30లోగా గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. మరోవైపు ఈ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి చట్టబద్ధత కల్పనకు పంచాయతీరాజ్ చట్టానికి సవరణలతో త్వరలో ఆర్డినెన్స్ సైతం తీసుకురానుంది. దీంతో ఆర్డినెన్స్ ఎప్పుడు జారీ అవుతుంది? రిజర్వేషన్లు ఎలా ఉంటాయి? అనే అంశాలు రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ

మిగతా 5వ పేజీలో ▶

అభిమాన తారలు నటించిన సినిమా ఎప్పుడు రిలీజవుతుందా.. ఓటీటీలోకి ఎప్పుడొస్తుందా అని ఎదురు చూసే వీక్షకులు కోట్లలో ఉంటారు. ఓటీటీలోకి వస్తోందని, ఫలానా తేదీన స్ట్రీమింగ్ అవుతుందని తెలియగానే ఆరోజు కోసం ఎదురు చూసేవారెందరో. ఆ సినిమా కోసమైనా ఓటీటీ యాప్‌ను సబ్‌స్క్రైబ్ చేసుకునేవారూ ఉన్నారు. ఇదంతా నాణేనికి ఒకవైపు. ఓటీటీ సబ్‌స్క్రిప్షన్‌ను రద్దు చేయాలంటే? సైన్ అప్ చేసినంత సులభం కాదని ఇటీవలి సర్వే వెల్లడించింది. అంతేకాదు వినియోగదారులను తప్పుదోవ పట్టించేలా యూజర్ ఇంటర్‌ఫేస్ ఉంటోందట.

- సాక్షి, స్పెషల్ డెస్క్

ఓటీటీ.. ఏమిటీ ట్రాప్!



సినిమాలూ, వెబ్ సిరీస్‌ల వంటివి చూపే ఓవర్ ద టాప్ (ఓటీటీ) యాప్‌లలో సబ్‌స్క్రిప్షన్‌ను (చందా) రద్దు చేయడం ఆషామాషీ వ్యవహారం కాదని కమ్యూనిటీ ప్లాట్‌ఫామ్ లోకల్‌సర్కిల్స్ సర్వేలో తేలింది. దేశంలోని డిజిటల్ వినియోగదారులలో డిజిటల్ సేవల సబ్‌స్క్రిప్షన్స్‌ను రద్దు చేయడంలో సగం మంది తరచూ ఇబ్బంది పడుతున్నారట. చాలా సందర్భాల్లో రద్దు చేసే ఆప్షన్ అందుబాటులో ఉండడం లేదని సర్వేలో పాలుపంచుకున్నవారు తెలిపారు. యాప్ లేదా వెబ్‌సైట్‌లో ఆ ఆప్షన్ ఎక్కడో ఉండటం వల్ల దాన్ని కనుక్కోలేకపోయామని వినియోగదారులు చెబుతున్నారు. దేశవ్యాప్తంగా 353 జిల్లాల్లోని 95,000కుపైగా మంది నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా లోకల్‌సర్కిల్స్ ఈ నివేదిక రూపొందించింది. చందా రద్దు ప్రక్రియ కష్టతరం చేయడానికి ప్లాట్‌ఫారాలు అనుసరిస్తున్న మోసపూరిత విధానాలను ఈ నివేదిక బహిర్గతం చేసింది. 'డార్క్ ప్యాటర్న్స్' అని పిలిచే ఈ ఉపాయాలు ఇప్పుడు వినియోగదారులు, నియంత్రణ సంస్థల నుండి విమర్శలను ఎదుర్కొంటున్నాయని ఈ నివేదిక తెలిపింది. దేశంలో ప్రస్తుతం 69 ఓటీటీ యాప్స్ అందుబాటులో ఉన్నాయి.

ఆసక్తి లేక పోయినా..

ఈ నివేదిక ద్వారా గుర్తించిన అత్యంత సాధారణ డార్క్ ప్యాటర్న్‌లలో సబ్‌స్క్రిప్షన్ ట్రాప్ ఒకటి. ఓటీటీలో సైన్ అప్ చేసే సమయంలోనే కంపెనీలు తమ ఉపాయాలను ప్రదర్శిస్తున్నాయి. ఫ్రీ ట్రయల్స్ ఆఫర్ చేసినా.. కాల పరిమితి ముగియగానే సులభంగా నిష్క్రమించే అవకాశం లేకుండా పోతోంది. అన్‌సబ్‌స్క్రయిబ్ చేసే ఆప్షన్ గుర్తించడం కష్టంగా ఉంటోంది. దీంతో వినియోగదారులు వారు అనుకున్న దానికంటే ఎక్కువ కాలం సభ్యత్వాన్ని కొనసాగించాల్సిన పరిస్థితి తలెత్తింది. బ్యాంకు ఖాతా నుంచి ఆటో డెబిట్ ఆప్షన్ ఉండడంతో కాల పరిమితి కాగానే ఖాతాలోంచి డబ్బులు కట్ అయిపోయి, సబ్‌స్క్రిప్షన్ రీచార్జ్ అయినట్టుగా చాలా మంది తెలిపారు. కొన్ని సందర్భాల్లో అదనపు యాప్‌లను ఇన్‌స్టాల్ చేయడం, లేదా అవసరమైన దానికంటే ఎక్కువ వ్యక్తిగత సమాచారాన్ని కూడా పంచుకోవాల్సి వస్తోంది. ఓటీటీ సేవలకు అవసరం లేని చర్యలను వినియోగదారులు పూర్తి చేయాల్సి ఉంటోంది. ముఖ్యం కాకపోయినా సబ్‌స్క్రిప్షన్ సమయంలో ఈ దశలను కంపెనీలు తప్పనిసరి అని చెప్పి పూర్తి చేయిస్తున్నాయి.

లోపించిన పారదర్శకత..

సబ్‌స్క్రిప్షన్ సమయంలో కంపెనీలు ఒక ధరను ముందుగా ప్రదర్శిస్తున్నాయి. చెక్ అవుట్ ప్రక్రియ సమయంలో తప్పనిసరి రుసుములు, ఛార్జీలను జోడిస్తున్నాయి. ఈ తరహా మోసానికి గురైనట్టు చందాదారులు చెబుతున్నారు. ఓటీటీ సేవలకు సబ్‌స్క్రైబ్ చేసుకునేటప్పుడు అదనపు ఛార్జీల గురించి ముందస్తుగా సమాచారం ఇవ్వలేదని 53% మంది వినియోగదారులు వెల్లడించారు. చెల్లింపు చివరి దశలో మాత్రమే ఈ అదనపు ఖర్చులు కనిపిస్తున్నాయని చెబుతున్నారు. కంపెనీల్లో పారదర్శకత లోపించిందనడానికి ఇది నిదర్శనమని నివేదిక వివరించింది.

దృష్టి మరల్చడానికి..

వినియోగదారుల దృష్టి మరల్చడానికి లేదా తప్పుదారి పట్టించడానికి ఉద్దేశించిన గమ్మత్తైన నేవిగేషన్, రంగు రంగుల సంకేతాలతో కూడిన ఇంటర్‌ఫేస్‌లను కంపెనీలు ఉపయోగిస్తున్నాయి. ఆఫర్స్‌ను తిరస్కరించడం, ట్రయల్స్‌ను నిలిపివేయడం, చందా రద్దు (క్యాన్సిలేషన్) మార్గాన్ని కనుగొనడం కష్టతరం అయ్యే పరిస్థితులను ఎదుర్కొన్నామని 86% మంది వినియోగదారులు చెప్పారు. 'కంపెనీలు ఒక ఆఫర్ లేదా సేవను ప్రమోట్ చేస్తున్నాయి. సైన్ అప్ చేసిన తర్వాత అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాయి. ప్రకటనలు లేకుండా సినిమాలు, వెబ్ సిరీస్‌లు అన్నీ చూడండని ఊదరగొట్టి ఆ హామీని నిలబెట్టుకోవడం లేదు. అదనంగా చెల్లించకపోతే ప్రకటనలను కొనసాగిస్తున్నాయి' అని సర్వేలో పాల్గొన్నవారు తెలిపారు.

రద్దు చేసినా చార్జీలు..

సబ్‌స్క్రిప్షన్‌ను రద్దు చేసిన తర్వాత కూడా కంపెనీలు ఛార్జ్ చేస్తున్నాయని వినియోగదారులు అంటున్నారు. సర్వేలో పాల్గొన్నవారిలో 24% మంది ఈ సమస్యను ఎదుర్కొన్నారు. ఎలాంటి అలర్ట్, వివరణ లేకుండానే ఈ ప్రక్రియ జరుగుతోందని వారు అంటున్నారు. సబ్‌స్క్రిప్షన్ గడువు అయిపోయిందని, ఇక డబ్బు చెల్లించనక్కర్లేదని భావించినప్పటికీ బ్యాంకు ఖాతా నుండి డబ్బు డెబిట్ అవుతోందని వారు చెబుతున్నారు. కంపెనీల ఈ డిజైన్ వ్యూహాలు స్వల్పకాలంలో ప్లాట్‌ఫామ్‌లకు ప్రయోజనం చేకూర్చినప్పటికీ వినియోగదారుల నమ్మకాన్ని కోల్పోతాయని లోకల్‌సర్కిల్స్ స్పష్టం చేసింది. సౌలభ్యం తగ్గిందని, ప్రకటనలు ఎక్కువయ్యాయని, గందరగోళమైన బిల్లింగ్ ఉంటోందన్నది కస్టమర్ల వాదన. సమస్యలను పరిష్కరించడానికి ప్రయత్నించేటప్పుడు కంపెనీల నుంచి సహాయం, స్పష్టత పొందలేకపోయామని వినియోగదారులు తెలిపారు.

'డార్క్ ప్యాటర్న్స్'లతో కస్టమర్లకు సినిమా

సబ్‌స్క్రిప్షన్ రద్దు అంత సులభం కాదు

పారదర్శకత లేని క్యాన్సిలేషన్ విధానం

లోకల్ సర్కిల్స్ సర్వేలో తేలింది ఇదే



అయినా మారలేదు..

ఈ సమస్యలను పరిష్కరించడానికి 2023లో కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ 13 రకాల డార్క్ ప్యాటర్న్స్ నివారణ, నియంత్రణ కోసం మార్గదర్శకాలను ప్రవేశపెట్టింది. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలు డిజిటల్ పారదర్శకతను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, కొన్ని ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లు అవి ఈ-కామర్స్ సేవలకు మాత్రమే వర్తిస్తాయని వాదిస్తున్నాయి. అయితే కంపెనీల మోసపూరిత విధానాలపై కన్నెర్ర చేసిన సెంట్రల్ కన్స్యూమర్ ప్రొటెక్షన్ అథారిటీ 2023 నవంబర్‌లో ఓ హెచ్చరిక జారీ చేసింది. తప్పుదోవ పట్టించే ఇంటర్‌ఫేస్‌లను తొలగించడానికి కంపెనీలకు మూడు నెలల సమయం ఇచ్చింది. ఆ తరవాత కూడా పరిస్థితుల్లో ఎలాంటి మార్పూ రాలేదని లోకల్‌సర్కిల్స్ సర్వేలో వెల్లడైంది. భారత్‌లో వినియోగదారుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతున్న నేపథ్యంలో స్పష్టమైన నియమాలు, బలమైన అమలు వ్యవస్థ ఉండాలని ఈ నివేదిక అభిప్రాయపడింది.

క్లుప్తంగా...

తాత్కాలిక అధ్యాపకుల సేవలు కొనసాగింపు

ఉత్తర్వులు విడుదల

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో వివిధ కేటగిరీల్లో పనిచేస్తున్న తాత్కాలిక అధ్యాపకులను ఏడాది పాటు కొనసాగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ఈమేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వీరిలో 459 మంది కాంట్రాక్టు లెక్చరర్లు, 1940 మంది గెస్ట్ లెక్చరర్లు, 311 మంది ఔట్‌సోర్సింగ్ అధ్యాపకులు, 50 మంది టీఎస్‌కేసీ ఉద్యోగులు ఉన్నారు. ఈ ఉత్తర్వులపై డిగ్రీ కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ జి.వైకుంఠం హర్షం వ్యక్తం చేశారు.

సెలూన్ ఎలా పెడతావంటూ దాడి

హైకోర్టులో బాధితుడి పిటిషన్

సాక్షి, హైదరాబాద్: నాయీ బ్రాహ్మణేతరుడివి.. సెలున్ ఎలా పెడతావంటూ దాడి చేయడంతో ఓ వ్యక్తి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదంటూ పేర్కొన్నారు. దీంతో బాధితుడికి రక్షణ కల్పించాలని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. అతను వ్యాపారం నిర్వహిస్తున్న ప్రాంతంలో గస్తీ ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది. వికారాబాద్‌లో ఫెరోజ్ ఖాన్ ఓ బ్యూటీ సెలూన్‌ను పెట్టుకున్నారు. జూన్ 21న రమేశ్‌తోపాటు 70 మంది వరకు అతని షాప్ వద్దకొచ్చి సెలూన్ ఎలా పెడతావని దూషిస్తూ దాడి చేశారని.. పోలీసులు పట్టించుకోవడం లేదంటూ ఫెరోజ్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌పై తడకమళ్ల వినోద్ కుమార్ విచారణ చేపట్టారు. పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి అక్కడున్న వాళ్లను చెదరగొట్టారని ఏజీపీ తెలిపారు. రమేశ్‌తో పాటు మరో కొందరిపై కేసు నమోదు చేశామన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. చట్టపరంగా దర్యాప్తు చేయాలని, పిటిషనర్ వ్యాపారం సజావుగా సాగేలా రక్షణ కల్పించాలని పోలీసులను ఆదేశించారు.

'ఉత్తమ ఉపాధ్యాయులకు' స్వల్పంగా దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి రాష్ట్రం నుంచి చాలా తక్కువమంది దరఖాస్తు చేశారు. ఇప్పటి వరకు కేవలం 117మంది దరఖాస్తులు సమర్పించారు. జనగాం, నారాయణపేట, మెదక్ జిల్లాల నుంచి ఒక్కరు కూడా దరఖాస్తు చేయలేదు. గడువు ఈ నెల 17వ తేదీతో ముగియనుంది. డీఈవోలు చొరవ తీసుకుని జిల్లాకు కనీసం 10 మంది చొప్పున దరఖాస్తు చేసేలా చూడాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ నవీన్ నికోలస్ ఆదేశించారు.

ప్రపంచ దేశాలతోనే పోటీ

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- మెరుగైన పారిశ్రామిక విధానాలతో ముందడుగు
- బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్
- రాబోయే రోజుల్లో డేటా సిటీగా మారనున్న నగరం
- జీనోమ్ వ్యాలీలో 'ఐకార్' కొత్త యూనిట్‌కు భూమి పూజ



భూమిపూజ చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి. చిత్రంలో మంత్రులు వివేక్, శ్రీధర్‌బాబు తదితరులు

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్రాలతో కాదు.. ప్రపంచ దేశాలతో పోటీ పడాలనేదే తమ ప్రభుత్వ ప్రయత్నమని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. ఇందుకోసం అధునాతన పారిశ్రామిక విధానాలు తీసుకొస్తున్నామని తెలిపారు. ప్రపంచ బల్క్ డ్రగ్స్ రాజధానిగా హైదరాబాద్ రూపుదిద్దుకుంటోందని, దేశంలోనే 33% టీకాలు, బల్క్ డ్రగ్స్‌లో 43% ఇక్కడి నుంచే ఉత్పత్తి అవుతున్నాయని చెప్పారు. రాబోయే రోజుల్లో హైదరాబాద్ డేటా సిటీగా మారనుందని, తాము అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.3 లక్షల 28 వేల కోట్ల పెట్టుబడులు సాధించామని తెలిపారు. మంగళవారం శామీర్‌పేట జీనోమ్ వ్యాలీలో ఐకార్ బయోలాజిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ విస్తరణలో భాగంగా 1.75 లక్షల చదరపు అడుగుల్లో నిర్మించనున్న కొత్త ప్లాంట్‌కు మంత్రులు శ్రీధర్‌బాబు, వివేక్ వెంకటస్వామితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ముఖ్యమంత్రి మాట్లాడారు.

జీనోమ్ వ్యాలీతో మంచి గుర్తింపు

దేశంలో జీనోమ్ వ్యాలీలోనే టీకాల ఉత్పత్తి జరుగుతోందని, జీనోమ్ వ్యాలీ తెలంగాణకు మంచి గుర్తింపు తీసుకొచ్చిందని రేవంత్‌రెడ్డి చెప్పారు. కోవిడ్ సమయంలో జీనోమ్ వ్యాలీ నుంచి ప్రపంచ దేశాలకు టీకాను ఎగుమతి చేసిన ఘనత ఇక్కడి పారిశ్రామికవేత్తలదని పేర్కొన్నారు. ప్రభుత్వాలు మారినా పారిశ్రామిక విధానాన్ని ముందుకు తీసుకెళ్లే విధంగానే తమ నిర్ణయాలు ఉన్నాయన్నారు. తమ ప్రభుత్వం మరింత సరళమైన విధానాలతో ముందుకెళ్తోందని, నూతన పారిశ్రామికవేత్తలను ఆహ్వానిస్తోందని, వారికి అవసరమైన సహకారాన్ని అందిస్తోందని చెప్పారు. రాబోయే పదేళ్లలో తెలంగాణను 1 ట్రిలియన్ ఎకానమీగా తీర్చి దిద్దడమే లక్ష్యంగా, తెలంగాణ రైజింగ్ 2047 లక్ష్యంగా ముందుకు వెళ్తున్నామని ముఖ్యమంత్రి తెలిపారు.

గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ: మంత్రి శ్రీధర్‌బాబు

తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మార్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తోందని పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చెప్పారు. ఈ లక్ష్య సాధనలో ఐకార్ రూపంలో మరో అడుగు ముందుకు పడిందని, కొత్తగా 800 మందికి ఉద్యోగాలు లభించనున్నాయని తెలిపారు. హైదరాబాద్-నాగ్‌పూర్, హైదరాబాద్-బెంగళూరు కారిడార్లలో ప్రత్యేకంగా ఫార్మా విలేజెస్‌ను అభివృద్ధి చేయబోతున్నామని చెప్పారు. లైఫ్ సైన్సెస్ రంగంలో నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించడంపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని, ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలని పిలుపునిచ్చారు..

యువతకు ఉద్యోగాలే లక్ష్యం: మంత్రి వివేక్

యువతకు ఉద్యోగాల కల్పన కోసం ప్రభుత్వం ప్రయత్నిస్తోందని మంత్రి వివేక్ వెంకటస్వామి చెప్పారు. అధిక ఉద్యోగాల కల్పనతో నిరుద్యోగాన్ని తగ్గించాలని సీఎం రేవంత్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. ఎక్కువ పరిశ్రమలను స్థాపించడం ద్వారా ఎక్కువ ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యమన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ మను చౌదరి, పలువురు శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పాలిసెట్‌లో 65.5 శాతం సీట్ల భర్తీ

ఇంకా మిగిలిపోయిన 10 వేల సీట్లు.. 10 రోజులు ఆలస్యంగా సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్: పాలిసెట్ కౌన్సెలింగ్‌లో ఎట్టకేలకు సాంకేతిక విద్యావిభాగం విద్యార్థులకు కాలేజీల్లో సీట్లు కేటాయించింది. వెబ్‌సైట్‌లో కౌన్సెలింగ్ డేటా ఎరేజ్ అవ్వడం, దాన్ని వారం రోజుల తర్వాత రికవరీ చేయడంతో ముందుగా ప్రకటించిన తేదీకంటే పది రోజులు ఆలస్యంగా మంగళవారం సీట్లు కేటాయించారు. తొలివిడతలో 65.5 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి. ఈసారి ప్రభుత్వ కాలేజీలకే విద్యార్థులు ప్రాధాన్యమిచ్చారు. వీటిల్లోని మొత్తం సీట్లలో 82 శాతం నిండగా, ప్రైవేట్ కాలేజీల్లో కేవలం 50 శాతం సీట్లు మాత్రమే నిండాయి. మొదటి విడత సీట్ల భర్తీ తర్వాత ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీల్లో 10,012 సీట్లు మిగిలాయి. అయితే, వెబ్ ఆప్షన్లు ఎంచుకున్నా.. రెండు వేలమందికి సీట్లు రాకపోవటం గమనార్హం.

- మొదటి విడతలో 6 కాలేజీల్లోని వందశాతం సీట్లు నిండాయి. వీటిలో ఐదు ప్రభుత్వ పాలిటెక్నిక్ కాలేజీలుండగా, ఒక ప్రైవేట్ కాలేజీ ఉంది.
- ఈడబ్ల్యూఎస్ కోటాలో 713 సీట్లు నిండాయి. ఎన్‌సీసీ, స్పోర్ట్స్‌కోటాను తుదివిడత కౌన్సెలింగ్‌లో భర్తీ చేస్తారు.
- సీట్లు పొందినవారు ఈ నెల 18లోగా ఫీజు చెల్లించి, ఆన్‌లైన్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి.
- తుది విడత కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత విద్యార్థులు ఈ నెల 28 నుంచి 30 లోపు కాలేజీల్లో ప్రత్యక్షంగా రిపోర్ట్ చేయాలి. ఇలా రిపోర్ట్ చేయకపోతే సీటు కోల్పోతారు.
- ఈ నెల 28 నుంచి 30 వరకు విద్యార్థులకు ఓరియంటేషన్ నిర్వహిస్తారు. 31 నుంచి పాలిటెక్నిక్ మొదటి సెమిస్టర్ క్లాసులు ప్రారంభమవుతాయి.
- ఆగస్టు 2, 3 తేదీల్లో సెంట్రలైజ్డ్ ఇంటర్నల్ స్లైడింగ్ ఉంటుంది. కౌన్సెలింగ్‌లో సీటు వచ్చిన కాలేజీలోని మరో బ్రాంచిలో సీటు ఖాళీగా ఉంటే ఈ స్లైడింగ్ విధానంలో మార్చుకోవచ్చు.

'ఏసీబీకి దొరికిన అధికారులకు పోస్టింగులు, ప్రమోషన్లు ఇవ్వొద్దు'

సాక్షి, హైదరాబాద్: ఏసీబీకి దొరికిన అధికారులకు పోస్టింగులు, ప్రమోషన్లు ఇవ్వొద్దని ఫోరం ఫర్ గుడ్ గవర్నెన్స్ (ఎఫ్‌జీజీ) కోరింది. ఈ మేరకు మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డి ఎఫ్‌జీజీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి లేఖ రాశారు. సామాన్యుడు ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగే అవినీతితో అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పురపాలక, రెవెన్యూ, పోలీసు శాఖల్లో లంచాలు ఇవ్వనిదే పని కావడం లేదన్నారు. అవినీతి అధికారులపై విచారణ జాప్యం అవుతూ కోర్టుల్లో చాలా కేసులు వీగిపోతున్నాయన్నారు. దీంతో అవినీతి అధికారులు తప్పు చేస్తే శిక్ష పడదన్న ధీమాతో మళ్లీ చేస్తున్నారని చెప్పారు. దీనిపై కోర్టులో ప్రాసిక్యూషన్ తరఫున గట్టిగా వాదనలు విని పించి దోషికి శిక్షపడేలా చూడాలన్నారు. ఏసీబీ కేసు నమోదు చేసిన తర్వాత మూడు నెలల్లో విచారణ పూర్తి చేసి తమ రిపోర్టు విజిలెన్స్ కమిషనర్ ద్వారా ప్రభుత్వానికి పంపాలని ఆ లేఖలో పేర్కొన్నారు.

నేటి నుంచి ఎంబీబీఎస్, బీడీఎస్
ప్రవేశాలకు రిజిస్ట్రేషన్

కన్వీనర్ కోటా భర్తీకి కాళోజీ వర్సిటీ నోటిఫికేషన్ జారీ
- నీట్‌లో అర్హత సాధించినవారికి మాత్రమే అవకాశం
- 25న సాయంత్రం 6 గంటల వరకు దరఖాస్తులకు గడువు
- వెబ్ ఆప్షన్ల తేదీలను త్వరలో ప్రకటించనున్న వర్సిటీ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కాలేజీల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశానికి సంబంధించి కాళోజీ నారాయణరావు వైద్య విశ్వవిద్యాలయం (కేఎన్‌ఆర్ యూహెచ్‌ఎస్) మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి కాంపిటెంట్ అథారిటీ (కన్వీనర్) కోటా కింద ప్రభుత్వ, ప్రైవేట్ కాలేజీలలో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల ప్రక్రియ బుధవారం (16వ తేదీ) ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది. చివరి తేదీ ఈ నెల 25 సాయంత్రం 6 గంటలు. అభ్యర్థులు https://tsmedadm.tsche.in వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవలసి ఉంటుంది. దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు తప్పనిసరిగా నీట్ యూజీ -2025లో అర్హత సాధించాలి. రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కళాశాలలతో పాటు ప్రైవేట్, మైనారిటీ, నాన్ మైనారిటీ మెడికల్, డెంటల్ కాలేజీలలోని కాంపిటెంట్ అథారిటీ కోటా కింద ఉన్న సీట్లకు మాత్రమే ఈ నోటిఫికేషన్ వర్తించనుంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు (జీఓ నంబర్ 114) జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ద్వారా ప్రభుత్వ కాలేజీల్లో 85 శాతం, ప్రైవేటు కాలేజీల్లో 50 శాతం సీట్లను భర్తీ చేస్తారు.

కటాఫ్ మార్కులు ఇలా:

ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు సంబంధించి వివిధ కేటగిరీల కింద నిర్దేశించిన కటాఫ్ మార్కులను యూనివర్సిటీ వెల్లడించింది. ఓసీ, ఈడబ్ల్యూఎస్ కేటగిరీ విద్యార్థులకు 144 మార్కులు (50 శాతం పైగా పర్సంటైల్), బీసీ, ఎస్సీ, ఎస్టీలకు 113 మార్కులు (40 శాతం పైగా), దివ్యాంగులకు 127 (45 శాతం పైగా) మార్కులు కటాఫ్‌గా నిర్ణయించారు.

అర్హతలు ఇవే

- అభ్యర్థి భారతీయ పౌరుడై ఉండాలి. పీఐఓ/ఓసీఐ కార్డు కలిగి వుండొచ్చు.
- తెలంగాణ రాష్ట్రంలో కనీసం 4 సంవత్సరాలు చదువుకున్న లేదా నివసించినవారు మాత్రమే అర్హులు.
- ఇంటర్ లేదా సమానమైన అర్హత సబ్జెక్టులు: ఫిజిక్స్, కెమిస్ట్రీ, బయాలజీ/బోటనీ/జువాలజీ లేదా బయోటెక్నాలజీ, ఇంగ్లిష్.
- నీట్‌లో ఓసీలు 50%, బీసీ, ఎస్సీ, ఎస్టీలు 40%, ఓసీ-పీడబ్ల్యూడీలు 45% మార్కులు సాధించటం తప్పనిసరి.
- 2025 డిసెంబర్ 31 నాటికి కనీస వయస్సు 17 ఏళ్లు ఉండాలి.
- రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.4,000, ఎస్సీ, ఎస్టీలకు రూ.3,200. ఫీజు ఆన్‌లైన్ ద్వారా మాత్రమే చెల్లించాలి.
- **అవసరమైన సర్టిఫికెట్లు:** నీట్ ర్యాంక్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం, ఇంటర్ మార్కుల మెమో, స్టడీ సర్టిఫికెట్లు (9వ తరగతి నుంచి ఇంటర్ వరకు), కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఫొటో, సంతకం వంటి పత్రాలు తప్పనిసరిగా అప్‌లోడ్ చేయాలి.
- ప్రవేశాలకు సంబంధించి మెరిట్ జాబితా జారీ చేయడమే అర్హత అని భావించరాదు. ఒరిజినల్ సర్టిఫికెట్లు పరిశీలించిన తర్వాతే ప్రవేశం ఖరారు అవుతుందని యూనివర్సిటీ తెలిపింది. వెబ్ ఆప్షన్ల తేదీలను విశ్వవిద్యాలయం తర్వాత ప్రకటించనుంది.

19న సీజే ప్రమాణస్వీకారం

నేడు ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్‌కు వీడ్కోలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ ఈ నెల 19న ప్రమాణస్వీకారం చేయనున్నారు. రాజ్‌భవన్‌లో శనివారం మధ్యాహ్నం 12.30కు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఆయనతో ప్రమాణం చేయించనున్నారు. దీంతో ఆయన ఏడో సీజేగా బాధ్యతలు చేపడతారు. రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఏకే సింగ్‌ను నియమిస్తూ కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. గత సీజే జస్టిస్ అలోక్ అరాధే జనవరిలో బదిలీపై బాంబే హైకోర్టుకు ప్రధాన న్యాయమూర్తిగా వెళ్లిన నాటి నుంచి సీజే పోస్టు ఖాళీగానే ఉంది. సీజే నియామకానికి గత మేలో సుప్రీంకోర్టు కొలీజియం సిఫార్సు చేయడంతో రెండు రోజుల క్రితం రాష్ట్రపతి ఆమోదముద్ర వేశారు. ఇదిలాఉండగా, కోల్‌కతా హైకోర్టు న్యాయమూర్తిగా బదిలీ అయిన రాష్ట్ర హైకోర్టు ఏసీజే జస్టిస్ సుజోయ్‌పాల్‌కు బుధవారం ఫుల్‌కోర్టు ఘన వీడ్కోలు పలకనుంది. బుధవారం మధ్యాహ్నం 3.45 గంటలకు ఫస్ట్‌కోర్టు హాల్‌లో జరిగే వీడ్కోలు సమావేశంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, సిబ్బంది పాల్గొననున్నారు. మధ్యప్రదేశ్‌కు చెందిన జస్టిస్ సుజోయ్‌పాల్ 2024, మార్చి 26న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు. ఈ ఏడాది జనవరి 21 నుంచి తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తిస్తున్న ఆయన బదిలీపై కోల్‌కతా హైకోర్టుకు వెళ్లనున్నారు.

నైపుణ్యమే సక్సెస్ మంత్ర

విద్యార్థులు నైపుణ్యాల సాధనపై దృష్టి పెట్టాలి
- ఐటీ, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు
- టాస్క్ ఆన్‌లైన్ ఐటీ ట్రైనింగ్ సర్టిఫికెట్ల ప్రదానం



ప్రతినిధులతో మంత్రి శ్రీధర్‌బాబు

సాక్షి, హైదరాబాద్: కాలం చెల్లిన జ్ఞానాన్ని విడిచిపెట్టి కొత్త అంశాలను నేర్చుకోవడం ద్వారానే విజయం లభిస్తుందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. 'నేర్చుకోవడం, తిరిగి నేర్చుకోవడం, మళ్లీ మళ్లీ నేర్చుకోవడం'అనేది ప్రస్తుతం సక్సెస్ ఫార్ములాగా మారిందని తెలిపారు. మాసాబ్ ట్యాంక్‌లోని తెలంగాణ అకాడమీ ఆఫ్ స్కిల్ అండ్ నాలెడ్జ్ (టాస్క్) ప్రధాన కార్యాలయంలో 'మన అమెరికా తెలుగు సంఘం'(మాట) ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన 'టాస్క్ ఫ్రీ ఆన్‌లైన్ ఐటీ ట్రైనింగ్ సర్టిఫికేట్ల ప్రదానోత్సవంలో శ్రీధర్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కేవలం డిగ్రీలు సాధిస్తేనే ఉద్యోగాలు వస్తాయనే పరిస్థితి లేదని, 50% మంది పట్టభద్రుల్లో ఉద్యోగ నిర్వహణకు అవసరమైన నైపుణ్యాలు లేవని నాస్కామ్ గుర్తించిందని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డేటా అనలిటిక్స్, సైబర్ సెక్యూరిటీ, క్లౌడ్ కంప్యూటింగ్ లాంటి ఎమర్జింగ్ టెక్నాలజీస్‌లో ఇంజనీరింగ్ పట్టభద్రులకు కనీస అవగాహన ఉండటం లేదని నాస్కామ్ తేల్చినట్లు పేర్కొన్నారు. ఆటోమేషన్ మూలంగా ఉద్యోగాలు కనుమరుగైపోతాయనే ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. రోబోలు, ఏఐ సాంకేతికత మూలంగా 2025 నాటికి 8.5 కోట్ల ఉద్యోగాలు కోల్పోతామని, అదే సమయంలో కొత్తగా 9.7 కోట్ల కొత్త ఉద్యోగాలు పుట్టుకొస్తాయని వరల్డ్ ఎకానమిక్ ఫోరం నివేదికలు వెల్లడించాయని శ్రీధర్‌బాబు తెలిపారు. డిగ్రీ సర్టిఫికేట్‌తోపాటు ఎమర్జింగ్ టెక్నాలజీలపై పట్టు ఉండాలని, వీటితోపాటు క్రిటికల్ థింకింగ్, ప్రాబ్లమ్ సాల్వింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, టీంవర్క్, అడాప్టబిలిటీ, ఎమోషనల్ ఇంటెలిజెన్స్ లాంటి నైపుణ్యాలు కూడా అవసరమని పేర్కొన్నారు. విద్యార్థులు, యువత వినూత్నంగా ఆలోచిస్తే ప్రభుత్వం అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. తెలంగాణను నైపుణ్య రాజధానిగా తీర్చిదిద్దేందుకు యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, టాస్క్ వంటి సంస్థలు కృషి చేస్తున్నాయని శ్రీధర్‌బాబు వెల్లడించారు. కార్యక్రమంలో టాస్క్ సీఈఓ శ్రీకాంత్ సిన్హా, సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి, మాట ప్రతినిధులు శ్రీనివాస్, ప్రదీప్, విజయ్ భాస్కర్, నగేశ్, కళ్యాణి, డా.విజయ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

మాస్టర్ ట్రైనర్ల ప్రతిక్షణం
అందుబాటులో ఉండాలి

గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్

సాక్షి, హైదరాబాద్: గిరిజనులు, ఆదివాసీల సంక్షేమంలో భాగంగా కేంద్ర గిరిజన మంత్రిత్వ శాఖ ద్వారా అమలు చేస్తున్న డీఏ-జుగా (ధర్తీ ఆభా-జనజాతీయ గ్రామ్ ఉత్కర్ష్ అభియాన్), జన్ భాగీదారీ-ఇన్ఫర్మేషనల్ అండ్ ఎడ్యుకేషనల్ కమ్యూనికేషన్ (ఐఈసీ) కార్యకలాపాల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి శరత్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో కీలకంగా వ్యవహరించే స్టేట్ మాస్టర్ ట్రైనర్స్ (ఎస్ఎంటీ), జిల్లా మాస్టర్ ట్రైనర్స్ (డీఎంటీ), బ్లాక్ మాస్టర్ ట్రైనర్స్ (బీఎంటీ) ప్రతిక్షణం గిరిజనులకు అందుబాటులో ఉండేలా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని సూచించారు. కేంద్ర ప్రాయోజిత కార్యక్రమాల అమలుకు సంబంధించిన మాస్టర్ ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం సచివాలయం నుంచి ప్రారంభించారు. ఇప్పటికే రాష్ట్ర స్థాయి ట్రైనర్లు బెంగళూరులో జరిగిన వర్క్‌షాప్‌లో శిక్షణ తీసుకున్నారని, వారి ద్వారా డీఎంటీ, బీఎంటీలకు శిక్షణ అందించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న డీఏ-జుగా, జన్ భాగీదారీ-ఐఈసీ కార్యక్రమాల ప్రాముఖ్యత, నేపథ్యాన్ని ఆయన ఉదాహరణలతో వివరించారు. కార్యక్రమంలో గిరిజన పరిశోధన, శిక్షణ సంస్థ సంచాలకురాలు సముజ్వల తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

గోదావరిని కావాలనే ఎండబెడుతున్నారు

● మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో నీళ్ల కోసం ఆరాట పడితే ప్రస్తుతం కాంగ్రెస్ నేతలు కమీషన్ల కోసం వెంపర్లాడుతున్నారని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి విమర్శించారు. గోదావరి ప్రాజెక్టులను ఉద్దేశపూర్వకంగా ఎండబెడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై రైతుల సమక్షంలో సీఎం, మంత్రులు ఎవరు ముందుకు వచ్చినా తాము చర్చించేందుకు సిద్ధమని పేర్కొన్నారు. తమకు మూడు రోజులు సమయం ఇస్తే కన్నెపల్లి మోటార్లను ఆన్‌చేసి చూపిస్తామని సవాలు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు అంశంలో ఎవరు తప్పులు చేసినా చెంప దెబ్బలు తినేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో బీఆర్‌ఎస్ మాజీ ఎమ్మెల్యేలతో కలిసి జగదీశ్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. రేషన్ కార్డుల పంపిణీ పేరిట ప్రజాధనంతో తుంగతుర్తిలో నిర్వహించిన సభలో సీఎం రేవంత్ అబద్ధాలు చెప్పుండటంతో జనాల నుంచి స్పందన కరువైందని తెలిపారు. కేసీఆర్ హయాంలో 6.47 లక్షల రేషన్ కార్డులు పంపిణీ చేశామని, గతంలో బీఆర్‌ఎస్‌లో కొనసాగిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఈ మేరకు పత్రికల్లో ప్రకటనలు కూడా ఇచ్చారని జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ పాలనలో నల్లగొండలో ఎలాంటి రాజకీయ కక్షలు లేవని, కానీ కాంగ్రెస్ నేతలు అంతర్గత కుమ్ములాటలతో తిరిగి ఫ్యాక్షన్ రోజులు తెస్తున్నారని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. సమావేశంలో మాజీ ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, ఎన్.భాస్కరరావు, రవీంద్ర కుమార్, ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపే రాజీనామా చెయ్ !

● ఉప ఎన్నికల్లో నువ్వు గెలిస్తే నేను రాజకీయాల నుంచి తప్పుకుంటా
● బీఆర్‌ఎస్ నేత జగదీశ్‌రెడ్డికి నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం సవాల్



సాక్షి, హైదరాబాద్: పేదలకు రేషన్ కార్డులిచ్చే ప్రజాపాలన కార్యక్రమం విజయవంతం కావడంతో మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డికి ఫీజులు ఎగిరిపోయి పిచ్చోడిలా మాట్లాడుతున్నాడని నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం వ్యాఖ్యానించారు. ఈసారి ఎన్నికల్లో నల్లగొండ జిల్లా నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఒకరిని కూడా గెలవనీయనని ప్రగల్భాలు పలుకుతున్న జగదీశ్‌రెడ్డికి నిజంగా దమ్ముంటే స్పీకర్ ఫార్మట్‌లో రేపే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. సూర్యాపేటలో ఉప ఎన్నికలు జరిగితే జగదీశ్‌రెడ్డిని కచ్చితంగా ఓడిస్తామని, ఒకవేళ జగదీశ్‌రెడ్డి గెలిస్తే తాను రాజకీయాల నుంచి శాశ్వతంగా తప్పుకుంటానని సవాల్ చేశారు. ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డిలతో కలిసి సీఎల్పీ కార్యాలయంలో వీరేశం విలేకరులతో మాట్లాడుతూ, సూర్యాపేటలో జగదీశ్‌రెడ్డిపై తాను పోటీకి సిద్ధమని, లేదంటే విప్ బీర్ల అయిలయ్య పోటీ చేస్తారని అన్నారు. బీఆర్‌ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఆరు లక్షల కార్డులిచ్చామని చెబుతున్న జగదీశ్‌రెడ్డిని చెంపదెబ్బ కొట్టాలో, కట్టెలతో కొట్టాలో ప్రజలే నిర్ణయించుకోవాలన్నారు. తిరుమలగిరిలో జరిగిన రేషన్‌కార్డుల పంపిణీ విజయవంతం కావడంతో బీఆర్‌ఎస్ నేతలు కళ్లలో నిప్పులు పోసుకుంటున్నారని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలో జగదీశ్‌రెడ్డి ఒక జోకర్ అని ఎద్దేవా చేశారు.

ఆదాయం ఉన్న చోటే విలువల సవరణ

రాష్ట్ర ప్రభుత్వ ఆలోచన
● జీహెచ్‌ఎంసీ, శివారు ప్రాంతాల్లో మాత్రమే భూముల విలువల పెంపు
● రాష్ట్ర ప్రజలందరిపై భారం పడకుండా జాగ్రత్త
● 38 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి మాత్రమే సవరణ ప్రతిపాదనలు
● త్వరలో మంత్రి పొంగులేటి సమీక్ష.. సీఎం ఆమోదించిన వెంటనే అమల్లోకి..
● గ్రామీణ ప్రాంతాల్లో అమలు ప్రస్తుతానికి వాయిదా



సాక్షి, హైదరాబాద్: ప్రస్తుతానికి రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వ్యవసాయ, వ్యవసాయేతర భూములు, ఆస్తుల విలువల సవరణ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. రిజిస్ట్రేషన్ల ద్వారా ఎక్కువ ఆదాయం వస్తున్న జీహెచ్‌ఎంసీ, శివారు ప్రాంతాల్లో మాత్రమే భూముల విలువలను పెంచాలని, తద్వారా అటు ఆదాయం పెరగడమే కాకుండా, రాష్ట్ర ప్రజలందరిపై భారం పడకుండా ఉంటుందని భావిస్తోంది. ఈ మేరకు ప్రతి ఏటా రిజిస్ట్రేషన్లు ఎక్కువగా జరుగుతూ రెవెన్యూ ఎక్కువగా వచ్చే రాష్ట్రంలోని 38 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి మాత్రమే ప్రభుత్వం విలువల సవరణ ప్రతిపాదనలు తెప్పిస్తోంది. గ్రామీణ ప్రాంతాల్లో సవరణను ప్రస్తుతానికి వాయిదా వేసినట్లు తెలుస్తోంది.

ఆదాయం పెరగాల్సి ఉండటంతో...: గత ఏడాదిలోనే భూముల విలువల సవరణ ప్రక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ నుంచి ప్రతిపాదనలు తెప్పించింది. క్షేత్రస్థాయి కమిటీల మదింపు మేరకు వచ్చిన ఈ ప్రతిపాదనలపై థర్డ్ పార్టీ చేత కూడా పరిశీలన చేయించింది. అనంతరం థర్డ్‌పార్టీ కూడా ప్రభుత్వానికి అప్పట్లోనే నివేదిక ఇచ్చింది. కానీ రాష్ట్రంలో రియల్ బూమ్ సరిగా లేని నేపథ్యంలో భూముల విలువలు సవరిస్తే ఆ రంగం మరింత దెబ్బతింటుందేమోననే ఆలోచనతో సవరణ ప్రతిపాదనను పక్కన పెట్టింది. అయితే గత నెలలో మళ్లీ ఈ ఫైలును ప్రభుత్వం కదిలించింది. రాష్ట్ర ఖజానాకు ఆదాయం ఇబ్బడిముబ్బడిగా పెరగాల్సి ఉన్న ప్రస్తుత పరిస్థితుల్లో భూముల విలువల సవరణ అనివార్యమని ప్రభుత్వ పెద్దలు నిర్ణయించినట్టు సమాచారం. ఈ క్రమంలో థర్డ్ పార్టీ నివేదికలను మళ్లీ క్షేత్రస్థాయికి పంపిన ప్రభుత్వం.. ఆదాయం ఎక్కువగా వచ్చే 38 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ప్రతిపాదనలు కోరింది.

హైదరాబాద్, రంగారెడ్డి నుంచే ఎక్కువ ఆదాయం
ఉమ్మడి హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోనే రిజిస్ట్రేషన్ల ఆదాయం ఎక్కువగా వస్తుంటుంది. మొత్తం ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో 60–70 శాతం ఆదాయం ఇక్కడినుంచే వస్తుందని గణాంకాలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో రంగారెడ్డి (ఆర్‌వో), గండిపేట, పటాన్‌చెరు, కుత్బుల్లాపూర్, బంజారాహిల్స్, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, ఉప్పల్, మేడ్చల్, కూకట్‌పల్లి, వరంగల్, మహేశ్వరం, బాలానగర్, మల్కాజిగిరి, ఎల్బీనగర్, ఎస్సార్‌నగర్, చంపాపేట, ఆజంపుర. నారపల్లి, సరూర్‌నగర్, వనస్థలిపురం, చిక్కడపల్లి, కాప్రా, వల్లభనగర్, కీసర, శంకర్‌పల్లి, ఇబ్రహీంపట్నం, చేవెళ్ల సహా 38 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి ప్రతిపాదనలు అడిగినట్టు సమాచారం.

త్వరలోనే మంత్రి పొంగులేటి సమీక్ష
రాష్ట్రంలోని భూముల ప్రభుత్వ విలువల సవరణ విషయంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఆచితూచి అడుగులు వేస్తున్నారు. ఎక్కడెక్కడ, ఏమేరకు విలువలు పెంచాలనే అంశంపై ఇప్పటికే పలుమార్లు సమీక్షలు నిర్వహించారు. థర్డ్‌పార్టీ నివేదికను కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. అటు స్టాంపుల శాఖ, ఇటు థర్డ్ పార్టీ నివేదికను మదింపు చేసిన మంత్రి.. తాజా ప్రతిపాదనల కోసం ప్రత్యేక ఫార్మాట్‌ను పంపినట్టు తెలుస్తోంది. ఈ ప్రతిపాదనలు పూర్తిస్థాయిలో ప్రభుత్వానికి అందగానే స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమావేశం నిర్వహించనున్నారు. అనంతరం భూముల విలువల సవరణ ఫైలును సీఎం ఆమోదానికి పంపుతారని, ముఖ్యమంత్రి ఆమోదం లభించగానే సవరించిన భూముల విలువలు అమల్లోకి వస్తాయని రిజిస్ట్రేషన్ల శాఖ వర్గాలు చెబుతున్నాయి.

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి

● ఆ తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి
● లేనిపక్షంలో లక్షలాది మంది బీసీలతో తెలంగాణలో భూకంపం సృష్టిస్తాం
● ఇందిరాపార్కువద్ద జరిగిన బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం మహాధర్నాలో పలువురు వక్తలు



మాట్లాడుతున్న జస్టిస్ ఈశ్వరయ్య. చిత్రంలో వినయ్‌భాస్కర్, పల్లెరవి, జైపాల్‌యాదవ్, వద్దిరాజు, చిరంజీవులు, శ్రీనివాస్‌గౌడ్, మధుసూదనాచారి, వకుళాభరణం, స్వామిగౌడ్, ఉమ, జోగురామన్న, గంగుల తదితరులు

కవాడిగూడ(హైదరాబాద్): బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని.. లేకపోతే తెలంగాణలో భూకంపం సృష్టిస్తామని పలువురు హెచ్చరించారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం.. బీసీలకు జనాభా దామాషా ప్రాతిపదికన విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. మంగళవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో బీసీ ప్రజాప్రతినిధుల ఫోరం ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. దీనికి అతిథులుగా జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య, మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్‌యాదవ్, వి. శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, జోగురామన్న, ఎమ్మెల్సీ మధుసూదనాచారి, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, రాజ్యసభ మాజీ సభ్యుడు బి.లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు ముఠాగోపాల్, కాలేరు వెంకటేశ్, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, నన్నపనేని నరేందర్, జైపాల్‌యాదవ్, శాసనమండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్, బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ తదితరులు హాజరయ్యారు.

జస్టిస్ ఈశ్వరయ్య మాట్లాడుతూ.. తమిళనాడు తరహాలో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు కావాలంటే ఈ అంశాన్ని రాజ్యాంగపరిధిలోని 9వ షెడ్యూల్‌లో చేర్చే విధంగా రాష్ట్ర ప్రభుత్వం పార్లమెంట్ ద్వారా చట్టం రూపొందించేందుకు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని డిమాండ్ చేశారు. అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలన్నారు. ఇవేమి చేయకుండా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఏవిధంగా కల్పిస్తారని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం నామమాత్రంగా కులగణన చేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని హడావిడిగా ప్రకటించడాన్ని తప్పుపట్టారు.

తలసాని శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ప్రకారం 42 శాతం బీసీల రిజర్వేషన్లు అమలు చేయకుంటే తెలంగాణలో భూకంపం సృష్టిస్తామని హెచ్చరించారు.

వి.శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. జీఓలతో రిజర్వేషన్లు అమలు అవుతాయంటే ఇన్నాళ్లు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. బీసీలు వేలిముద్ర వారు కాదని ప్రతి ఒక్కరిలో చైతన్యం వచ్చిందని గుర్తు చేశారు.

గంగుల కమలాకర్ మాట్లాడుతూ.. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారంలోకి రావడానికి మరోసారి బీసీలను మోసం చేయడానికి కుట్ర పన్నుతుందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చిరంజీవులు, సర్పంచ్‌ల సంఘం జేఏసీ అధ్యక్షుడు యాదగిరిగౌడ్, ప్రధాన కార్యదర్శి ప్రణీత్ చంద్ర, నాయకులు కుమార్, దూదిమెట్ల బాల్‌రాజ్ యాదవ్, కిషోర్, ఆంజనేయులు, గెల్లు శ్రీనివాస్ యాదవ్, తలసాని సాయికిరణ్, ముఠా జైసింహ తదితరులు పాల్గొన్నారు.

రాజ్‌భవన్‌కు ఆర్డినెన్స్ ముసాయిదా

● గవర్నర్ ఆమోదిస్తే పీఆర్ చట్టానికి చేసిన సవరణ అమల్లోకి
● అనంతరం స్థానిక ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల్లో వెనుకబడిన తరగతులకు 42 శాతం రిజర్వేషన్ల కల్పనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన ఆర్డినెన్స్ ముసాయిదా మంగళవారం రాజ్‌భవన్‌కు చేరింది. బీసీ రిజర్వేషన్ల పెంపునకు వీలుగా 2018 పంచాయతీరాజ్ చట్టానికి చేసిన సవరణను ఆమోదం నిమిత్తం గవర్నర్‌కు పంపింది. పీఆర్ చట్టం–2018 సెక్షన్ 285 క్లాజ్–ఏలో స్థానిక సంస్థల్లో 50 శాతం పరిమితికి మించకుండా రిజర్వేషన్లు అమలు అవుతాయని పేర్కొన్నారు. అయితే బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న హామీని నెరవేర్చడంలో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం.. 285 క్లాజ్–ఏలో ఉన్న 50 శాతం మించకుండా రిజర్వేషన్లు అనే వాక్యాన్ని తొలగించి ఆ మేరకు చట్టాన్ని సవరించింది. ఈ సవరణ మేరకు ప్రత్యేకపరిస్థితుల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను మరీ ముఖ్యంగా బీసీ రిజర్వేషన్ల పెంపుదలకు చర్యలు చేపట్టనున్నారు.

అంతటా ఆమోదంతో...: పీఆర్ చట్టాన్ని సవరిస్తూ ఆ శాఖ సిద్ధం చేసిన ఫైలులోని న్యాయపరమైన అంశాలను పరిశీలించి న్యాయశాఖ ఇప్పటికే ఆమోదించింది. దీనికి పీఆర్ శాఖ మంత్రి సీతక్క, సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ నేపథ్యంలో ముసాయిదా ఆర్డినెన్స్‌ను మంగళవారం రాజ్‌భవన్‌కు ప్రభుత్వం పంపించింది. ఈ ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం లభిస్తే, పీఆర్ చట్టానికి చేసిన సవరణ అమల్లోకి వస్తుంది. ఇందుకు అనుగుణంగా, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లకు డెడికేటెడ్ కమిషన్ చేసే సిఫారసు ఆధారంగా ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. అనంతరం రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్‌ఈసీ) ప్రభుత్వం పంపిస్తుంది. ఆ వెనువెంటనే అంటే అదేరోజు స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్‌ను ఎస్‌ఈసీ విడుదల చేయనుంది. ఇది వెలువడిన 20, 25 రోజుల్లోనే ముందుగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలు, కొన్నిరోజుల వ్యవధిలో పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. అన్నీ అనుకున్నట్టుగా జరిగితే హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగా...సెప్టెంబర్ 30వ తేదీలోగా గ్రామీణ స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే అవకాశాలున్నాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు.

బీసీల జాబితా నుంచి ముస్లింలను తొలగించాలి: బండి సంజయ్



సిరిసిల్ల: బీసీల జాబితా నుంచి ముస్లింలను తొలగించాలని, 42 శాతం రిజర్వేషన్ల అమలు పేరుతో ముస్లింలకు 10 శాతం అమలు దుర్మార్గమైన కుట్ర అని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్ కుమార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ కానుకగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పదో తరగతి విద్యార్థులకు మంగళవారం సైకిళ్ల పంపిణీ చేసిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్ల అమలు వెనుక కుట్ర దాగి ఉందన్నారు. ముస్లింలను బీసీ రిజర్వేషన్ల జాబితా నుంచి తొలగించకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. తక్షణమే బీసీల జాబితా నుంచి ముస్లింలను తొలగించి 42 శాతం రిజర్వేషన్లు పూర్తిగా బీసీలకే దక్కేలా చేయాలని డిమాండ్ చేశారు. మోదీ ప్రభుత్వం ఇప్పటికే బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తోందని, కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు అదనంగా ఇస్తున్న రిజర్వేషన్లు 5 శాతమేనన్నారు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమన్నారు. అయినా ఆర్డినెన్స్ తీసుకొస్తామని చెప్పడం దుర్మార్గమన్నారు. బనకచర్ల విషయంలో కేంద్రం రెండు రాష్ట్రాల సీఎంలతో సమావేశం ఏర్పాటు చేయడాన్ని స్వాగతించారు.

బీజేపీ 'స్థానిక' సమరం!

స్థానిక ఎన్నికల కోసం నెల రోజుల కార్యాచరణ ప్రకటన



సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీజేపీ రాష్ట్ర శాఖ నెల రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రకటించింది. రాష్ట్రాన్ని 5 జోన్లుగా విభజించి, ఒక్కో జోన్‌లో కొన్ని జిల్లాల చొప్పున శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. స్థానిక ఎన్నికల కోసం ఒక ఎంపీ, ఎమ్మెల్యే, రాష్ట్ర పార్టీ ప్రధాన కార్యదర్శులతో కమిటీని ఏర్పాటు చేయనున్నారు. మంగళవారం ఘట్‌కేసర్‌లోని అవుషాపూర్‌లోని ఒక కన్వెన్షన్ సెంటర్‌లో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్ర పదాధికారులు, జిల్లా అధ్యక్షులకు స్థానిక సంస్థల ఎన్నికలపై వర్క్‌షాప్ నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఇన్‌చార్జి సునీల్‌బన్సల్, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, ఎంపీలు డీకే అరుణ, ఈటల రాజేందర్, బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, పార్టీ నేతలు అభయ్‌పాటిల్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, గరికపాటి మోహన్‌రావు, చంద్రశేఖర్ తివారీ, కాసం వెంకటేశ్వర్లు ఇతరులు పాల్గొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు పూర్తిస్థాయిలో సిద్ధమయ్యేందుకు అనుసరించాల్సిన వ్యూహాలపై చర్చించారు. ఈ సమావేశంలో రాంచందర్‌రావు మాట్లాడుతూ.. 'స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలిచి తీరాలి. రానున్న రోజుల్లో ప్రజా ఉద్యమాలు చేయాలి'అని పిలుపునిచ్చారు. పార్టీలో పక్షపాత ధోరణిని విడిచిపెట్టి ముందుకు సాగాలని నేతలకు సునీల్ బన్సల్ సూచించారు. నేతలంతా కలిసి పనిచేయా లన్నారు. అనంతరం పార్టీ జిల్లా అధ్యక్షులతో బన్సల్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

ఇదీ కార్యాచరణ షెడ్యూల్
ఈ నెల 18, 19, 20 తేదీల్లో జిల్లాస్థాయి వర్క్‌షాప్; 21, 22, 23 తేదీల్లో మండలస్థాయి వర్క్‌షాప్; 25, 26 తేదీల్లో పోలింగ్ బూత్ బైఠక్; 29, 30 తేదీల్లో మహా సంపర్క్ అభియాన్; ప్రముఖ దేవాలయాల సందర్శన, డోర్ టు డోర్ క్యాంపెయిన్; ఆగస్టు 1, 2, 3 తేదీల్లో మండలాలవారీగా ర్యాలీలు; 4, 5 తేదీల్లో జిల్లాల్లో ర్యాలీలు; 9, 10 తేదీల్లో మండల ప్రవాస యోజన (సమ్మేళనాలు, కుల సంఘాల మీటింగ్); 11 నుంచి 20 వరకు మోర్చాల సమావేశాలు; నామినేషన్లు వేసిన తర్వాత కార్యక్రమాలకు సైతం రూపకల్పన.

రిజర్వేషన్లు ఎలా ఉంటాయో!?

▶ మొదటి పేజీ తరువాయి

రేకెత్తిస్తున్నాయి. అన్ని రాజకీయ పార్టీల సన్నాహాలతో స్థానిక సంస్థల ఎన్నికల రాజుకుంటున్న నేపథ్యంలో గతంతో పోల్చితే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఏ విధంగా ఉండవచ్చనేది చర్చనీయాంశంగా మారింది.

ఆర్డినెన్స్ ఎలా ఉంటుందో..
పంచాయతీరాజ్ చట్టం–2018 ప్రకారం చూస్తే.. అన్ని రిజర్వేషన్లు కలుపుకొని 50 శాతానికి లోబడి ఉండాలి. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు ప్రస్తుతం ఉన్న 22 శాతం రిజర్వేషన్లను, 42 శాతానికి పెంచి స్థానిక ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయించింది. ఇందుకోసం ఆర్డినెన్స్ తేనుండటంతో.. అందులో పొందుపరిచే అంశాలు, బీసీ జనాభా లెక్కలు, వాటిని బట్టి మారే రిజర్వేషన్లు చర్చనీయాంశమయ్యాయి. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లు వారి జనాభా ప్రాతిపదికన ఖరారు కానున్నందున వాటి విషయంలో పెద్దగా మార్పు ఉండకపోవచ్చునని అంటున్నారు. అయితే రిజర్వేషన్లు మొత్తంగా మారిపోయే అవకాశం ఉందని, కాబట్టి ఎస్సీ,ఎస్టీ స్థానాలు కూడా కొంత మేరకు ప్రభావితం కావచ్చునని చెబుతున్నారు. వార్డు స్థానాలు మొదలు సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ అధ్యక్షులు, జడ్పీ చైర్‌పర్సన్ స్థానాల వరకు రిజర్వేషన్లలో మార్పులు జరిగే అవకాశాలున్నాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటివరకు.. గతంలో ఉన్న రిజర్వేషన్లు రెండు పదవీ కాలాల (టర్మ్‌లు) సమయం కొనసాగాయి. ఇప్పుడు ఒకే టర్మ్‌కు రిజర్వేషన్లు పరిమితం కానున్నాయి. అంటే ఈసారి నిర్ణయించే రిజర్వేషన్లు ఒక టర్మ్ మాత్రమే ఉంటాయన్న మాట. ఈ కారణంగానూ రిజర్వేషన్ స్థానాల్లో అనేక మార్పులు చోటు చేసుకోవచ్చునని అంటున్నారు.

తాజా జనాభా లెక్కలతోనూ ప్రభావితం!
గతంలో మాదిరిగానే సర్పంచ్, ఎంపీటీసీ రిజర్వేషన్లు మండల ప్రతిపాదికన, జెడ్పీటీసీ స్థానాలు జిల్లా యూనిట్‌గా..ఎంపీపీ అధ్యక్షుడు జిల్లా యూనిట్‌గా, జెడ్పీపీ చైర్మన్ రాష్ట్ర యూనిట్‌గా రిజర్వేషన్లు ఉంటాయా లేదా అనేది కూడా రాజకీయ పార్టీల నేతలు, ఆశావహుల్లో తీవ్ర ఉత్కంఠకు కారణమౌతోంది. అయితే ప్రభుత్వం జారీచేసే ఆర్డినెన్స్‌కు అనుగుణంగా ఆయా రిజర్వేషన్లు మారే అవకాశాలున్నాయని అంచనా వేస్తున్నారు. మరోవైపు తాజా జనాభా లెక్కల్లో (కుల గణన)వచ్చిన మార్పులను బట్టి రిజర్వేషన్లు కూడా మారిపోతాయని భావిస్తున్నారు.

స్థానాల సంఖ్యపై స్పష్టత!
రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు, వార్డుల సంఖ్యతో పాటు ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాల సంఖ్యపై స్పష్టత వచ్చినట్టు సమాచారం. గ్రామ పంచాయతీలు 12,782గా, గ్రామాల వార్డులు 1,12,712, ఎంపీటీసీ స్థానాలు 5,816, జెడ్పీటీసీ స్థానాలు 566, మండల ప్రజా పరిషత్‌లు 566, జిల్లా పరిషత్‌లు 31గా లెక్క తేలినట్లు తెలుస్తోంది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖాపరంగా ఈ లెక్క తేల్చినట్లు అధికారవర్గాల భోగట్టా. 2019లో జరిగిన మండల, జిల్లా పరిషత్ ఎన్నికలతో పోలిస్తే రాష్ట్రంలో ఒక జిల్లా ప్రజా పరిషత్ (జెడ్పీపీ)–(మేడ్చల్ జిల్లా పరిషత్ రద్దు) స్థానం తగ్గగా అనేక గ్రామాలు, మండలాలు సమీప మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో ఎంపీటీసీ స్థానాల సంఖ్య 55 నుంచి 60 స్థానాల వరకు తగ్గినట్లు తెలుస్తోంది. మరోవైపు కొత్త మండలాలు, గ్రామ పంచాయతీల సంఖ్య పెరిగింది.

తగ్గిన ఎంపీటీసీలు, పెరిగిన మండలాలు

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని అనేక గ్రామాలు సమీప మున్సిపాలిటీల్లో విలీనం కావడంతో మేడ్చల్ జిల్లా ప్రజా పరిషత్ (గ్రామీణ జిల్లా) ఉనికిలో లేకుండా పోతోంది. కొత్త మున్సిపాలిటీలు ఏర్పాటు చేయడం, కార్పొరేషన్లలో ఆయా గ్రామాలు విలీనం కావడం వల్ల ఎంపీటీసీ స్థానాల సంఖ్య తగ్గనున్నట్టు తెలుస్తోంది. 2019లో ఎంపీటీసీ స్థానాలు 5,847 ఉండగా, ప్రస్తుతానికి ఆ సంఖ్య 5,800 వరకు తగ్గవచ్చని అంచనా. రాష్ట్రంలో మండలాల సంఖ్య 539 నుంచి 566కు పెరిగింది. గత ఎన్నికల్లో 12,769 గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగాయి. ప్రస్తుతం వాటి సంఖ్య 12,782కు పెరిగింది. వీటిపై రాష్ట్రవ్యాప్తంగా 10–11 తేదీలలో అభ్యంతరాలను స్వీకరించి 12న తుది జాబితా ప్రకటించాల్సి ఉండగా, క్షేత్రస్థాయి నుంచి సకాలంలో పూర్తి సమాచారం అందకపోవడంతో వాటి ప్రకటనలో జాప్యం జరిగింది. సోమవారం నాటికి కూడా కొన్నిచోట్ల నుంచి వివరాలు రాకపోవడంతో ఎంపీటీసీ, జెడ్పీటీసీ సీట్లపై కచ్చితమైన సంఖ్యను అధికారులు అధికారికంగా వెల్లడించలేదు. 2019 ఎన్నికల నాటికి మండల ప్రజా పరిషత్‌లు 539 ఉండగా, 2025 ఎన్నికల నాటికి 566కు పెరగనున్నాయి. గతంలో గ్రామ పంచాయతీలు 12,769 ఉండగా, ఇప్పుడు 12,782కు చేరుకున్నట్టు అధికారవర్గాల సమాచారం.



చిత్తము ద్వంద్వ లోక ధర్మాలైన – లాభనష్టాల, కీర్త్యపకీర్తుల, నిందాస్తుతుల, సుఖదుఃఖాల స్పర్శచే చలించక, శోకము లేనిదై, నిర్మలంగా, క్షేమంగా, నిర్భయంగా ఉండటమే మంగళకరం. అత్యంత సంతోషకరం.

– బౌద్ధ ధర్మం

సాక్షి
బుధవారం, 16 జూలై 2025

ఇకనైనా చైనా మారేనా?

గల్వాన్ లోయలో భారత, చైనాల మధ్య ఘర్షణలు జరిగిన అయిదేళ్లకు మన విదేశాంగ మంత్రి జైశంకర్ చైనాలో అడుగుపెట్టారు. షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) విదేశాంగ మంత్రుల సదస్సుకు హాజరైన సందర్భంగా ఆయన మంగళవారం చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌ను ఇతర దేశాల విదేశాంగమంత్రులతోపాటు కలవటమేకాక, చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్‌తో ముందు రోజు భేటీ అయ్యారు. చైనా విదేశాంగమంత్రి వాంగ్ యీతో కూడా విడిగా భేటీ అయ్యారు. ఇరుగుపొరుగన్నాక సమస్యలు రావటం సహజం. అందునా చైనా వంటి దేశం పొరుగున వుంటే ఇవి మరింత క్లిష్టం కావటం, అవి ఘర్షణలుగా రూపాంతరం చెందటంలో ఆశ్చర్యం లేదు. సరిహద్దుల్లో ఎవరి భూభాగం ఎంతవరకూ వుందన్న అంశంలో మాత్రమే కాదు... పాకిస్తాన్‌తో మనకు సమస్య తలెత్తినప్పుడల్లా ఆ దేశాన్ని నెత్తిన పెట్టుకోవటం చైనాకు అలవాటైంది. ఉగ్రవాద దాడులకు కారణమైన సంస్థల్ని, ఉగ్రవాదుల్ని నిషేధ జాబితాలో చేర్చాలని భద్రతా మండలిలో కోరినప్పుడల్లా చైనా మోకాలడ్డుతోంది. ఇలాంటి సమస్యలెన్ని వున్నా సామరస్య వాతావరణంలో చర్చించుకుని పరిష్కరించుకోవటమే విజ్ఞత. అందుకే అయిదేళ్ల జాప్యం తర్వాతైనా ఈ పరిణామం చోటుచేసుకోవటం హర్షించదగ్గది. నిరుడు అక్టోబర్‌లో రష్యాలో జరిగిన బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సు సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కలుసుకున్నారు. ఉభయ దేశాల సంబంధాలనూ మళ్లీ పూర్వ స్థితికి తీసుకెళ్లాలని ఆ సమావేశంలో నిర్ణయించుకున్నారు. అటు తర్వాత మధ్య మధ్యలో చైనా వ్యవహార శైలివల్ల ఇబ్బందులేర్పడినా ఇరు దేశాల మధ్య సంబంధాలూ ఎంతో కొంత మెరుగయ్యాయని చెప్పాలి. సరిహద్దుల్లోని డెమ్‌చోక్, డెస్పాంగ్ ప్రాంతాల్లో సైన్యాలను వెనక్కి పిలవాలని ఇరు దేశాలూ నిరుడు అక్టోబర్‌లో నిర్ణయించటంతో పరిస్థితుల్లో గణనీయంగా మార్పు వచ్చింది.

కానీ మొన్న ఏప్రిల్‌లో హఠాత్తుగా విద్యుత్ వాహనాల తయారీలో, ఏఐ సహా అధునాతన సాంకేతికతల్లో తోడ్పడే అత్యంత కీలక ఖనిజాల ఎగుమతులపై చైనా ఆంక్షలు విధించింది. అంతర్జాతీయ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో) ఒడంబడిక ప్రకారం ఇది సరైంది కాదని మన దేశం చెబుతూ వచ్చింది. ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడటానికి కూడా ఇలాంటి ఆంక్షలు ప్రతిబంధకమవుతాయి. ఈ సంబంధాలు మెరుగుపడటం, అభివృద్ధి చెందటం అంత సులభంగా సాధ్యపడలేదని, జాగ్రత్తగా వ్యవహరించి దీన్ని సుస్థిరపరుచుకోవాల్సిన అవసరం వున్నదని చైనా ఉపాధ్యక్షుడు హాన్ జెంగ్ అన్నట్టు అక్కడి మీడియా తెలిపింది. ఈ విషయంలో చైనా నిజంగా చిత్తశుద్ధి ప్రదర్శిస్తే, కీలక ఖనిజాల ఎగుమతులపై వున్న నిషేధాన్ని తొలగిస్తే ద్వైపాక్షిక సంబంధాలు మెరుగుపడతాయి. ప్రపంచంలో రెండూ అతి పెద్ద మార్కెట్లు. కానీ వృథా వివాదాల కారణంగా వాటిని వినియోగించుకోలేని నిస్సహాయత రెండు దేశాలనూ ఆవరిస్తోంది.

ఈ ఏడాది చివరిలో ఎస్‌సీఓ దేశాధినేతల శిఖరాగ్ర సదస్సు చైనాలో జరగబోతోంది. దానికి ప్రధాని నరేంద్ర మోదీ వెళ్తున్నారు. కనుక ఈలోగా ద్వైపాక్షిక సంబంధాలను మరింత పెంచుకోవటానికి కృషి చేయాల్సి వుంది. కశ్మీర్‌లోని పెహల్గాంలో పాకిస్తాన్ నుంచి వచ్చిన ఉగ్రవాదులు దాడిచేయటం, అనంతరం 'ఆపరేషన్ సిందూర్'తో మన దేశం గట్టిగా జవాబీయటం వంటి పరిణామాల్లో చైనా, పాకిస్తాన్ వైపే నిలబడింది. ఇక దలైలామా వారసుడి నిర్ణయం తమ అంతర్గత వ్యవహారమంటూ చైనా వాదిస్తోంది. గత నెలలో బంగ్లాదేశ్, పాకిస్తాన్‌లతో కలిసి చైనా త్రైపాక్షిక సమావేశం నిర్వహించటాన్ని కూడా సాధారణ విషయంగా పరిగణించటానికి వీల్లేదు. ఈ సమావేశానికి ప్రత్యేక ప్రాధాన్యతేమీ లేదని బంగ్లాదేశ్ చెప్పినా, పాకిస్తాన్ మాత్రం భవిష్యత్తు త్రైపాక్షిక సమావేశాలకు ఇది ఆరంభమని ప్రకటించింది. ఇదిగాక అమెరికాలో ట్రంప్ ఆగమనం తర్వాత ఆ దేశం బంగ్లాదేశ్ వ్యవహారాల్లో ఏ పాత్ర పోషిస్తుందనేది ఇంకా అస్పష్టంగా వుంది. చైనాకు వ్యతిరేకంగా ఇండో–పసిఫిక్ ప్రాంతంలో మనతో కలిసి కూటమి కట్టిన అమెరికా, దానిపై కూడా తన వైఖరేమిటని చెప్పటం లేదు. తన మనసులోని మాట చెప్పకుండా ఈ మధ్య జపాన్, ఆస్ట్రేలియాలతో జరిపిన సమావేశంలో తైవాన్ విషయంలో చైనా దూకుడు నిర్ణయం తీసుకుంటే మీ చర్యలెలావుంటాయంటూ ట్రంప్ ఆరా తీశారు. అమెరికా ఏం చేస్తుందో, ఏ విషయంలో ఎలా వ్యవహరిస్తుందో తెలియకుండా హామీ ఇవ్వటానికి రెండు దేశాలూ నిరాకరించాయి. ఆస్ట్రేలియా అయితే నేరుగానే అది తన సమస్య కాదన్నట్టు మాట్లాడింది. కనుక స్వీయ ప్రయోజనాల రీత్యా చైనా విషయంలో మనం కూడా ఆచితూచి అడుగేయక తప్పదు.

అయితే మన భద్రత విషయంలో రాజీ పడాల్సిన పనిలేదు. ఎస్‌సీఓలో మంగళవారం మాట్లాడిన జైశంకర్ నిర్మొహమాటంగానే మన వైఖరేమిటో చెప్పారు. ఉగ్రవాదం, వేర్పాటు వాదం, తీవ్రవాదం అనే మూడు దుష్టశక్తులతో పోరాడాల్సి వుంటుందని ఆయన ప్రకటించారు. పెహల్గాం దాడి జమ్మూ కశ్మీర్ పర్యాటకాన్ని దెబ్బతీసేందుకు జరిగిన కుట్రని చెప్పటంతోపాటు ఎస్‌సీఓ తన ప్రకటిత లక్ష్యాలకు అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. ఎస్‌సీఓకు నేతృత్వం వహిస్తూ దాని లక్ష్యాలకు భిన్నంగా పాకిస్తాన్‌కు మద్దతీయటం సరికాదని చైనా గుర్తించక తప్పదు. స్నేహ సంబంధాలుంటే వాటిని పెంపొందించుకోవటానికి ఇతరేతర మార్గాలున్నాయి. అంతేతప్ప పాక్ తప్పులన్నిటినీ భుజాన మోసుకెళ్లటం తన ఎదుగుదలకు కూడా చేటు తెస్తుందని చైనా గుర్తించాలి.

బ్రిక్స్... ట్రంప్... కాగితం పులి కథ!

విశ్లేషణ



టంకశాల అశోక్

బ్రెజిల్‌లోని రియో డి జనేరో నగరంలో ఈ నెల 6–7 తేదీలలో జరిగిన 'బ్రిక్స్' 17వ శిఖరాగ్ర సమావేశాలను ఒకవైపు, దానిపై మొదటినుంచే కత్తులు దూసిన అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌ను మరొకవైపు గమనించగా కాగితం పులి కథ గుర్తుకు వస్తుంది. బ్రిక్స్... తన సభ్య దేశాల అభివృద్ధికి, పరస్పర సహకారానికి ఏర్పడినటువంటిది. 2009లో స్థాపించినప్పటి నుంచి గత 16 సంవత్సరాలలో అందుకు అనుగుణంగా వ్యవహరిస్తూ వచ్చింది తప్ప, అమెరికాకు గానీ, మరొకరికిగానీ వ్యతిరేకంగా ఎప్పుడు ఏ చర్యలూ తీసుకోలేదు. అయినప్పటికీ, అమెరికా అధ్యక్షులందరికి భిన్నమైన రీతిలో ట్రంప్ మాత్రం బ్రిక్స్‌ను తమకు వ్యతిరేకమైన కూటమి అంటున్నారు. అధికారానికి వచ్చిన కొత్తలో బ్రిక్స్ దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామని హెచ్చరించారు. ఇపుడు బ్రెజిల్ సమావేశాలకు ముందు రోజున 10 శాతం అన్నారు. బ్రిక్స్‌లో చేర రాదంటూ ప్రపంచ దేశాలను కొన్ని నెలలుగా ఒత్తిడి చేస్తున్నారు. కానీ, ఈసారి సమావేశాలు ముగిసే నాటికి, ట్రంప్‌ను అమెరికా సన్నిహిత దేశాలు సహా ఎవరూ ఖాతరు చేయనట్లు స్పష్టమైంది.

జనాభా... జీడీపీ... 40 శాతం వాటా!

2009లో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనాలలో బ్రిక్‌గా మొదలైన సంస్థ, దక్షిణాఫ్రికా చేరికతో బ్రిక్స్‌గా మారటం తెలిసిందే. ట్రంప్ హెచ్చరికలు చేసిన మరునాడే ఇండోనేషియా పూర్తి సభ్య దేశంగా చేరింది. ఇపుడు బ్రెజిల్‌లో బేలారూస్, బొలీవియా, కజకిస్థాన్, క్యూబా, నైజీరియా, మలేషియా, థాయ్‌లాండ్, వియత్నాం, ఉగాండా, ఉజ్బెకిస్తాన్ భాగస్వామ్య దేశాలుగా కొత్తగా చేరాయి. బ్రెజిల్ సమావేశాల కన్న ముందు మాసాలలో ఈజిప్టు, ఇథియో పియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ పార్ట్‌నర్ దేశాలయ్యాయి.

ఈ జాబితాను విశ్లేషించినట్లయితే నాలుగు విషయాలు దృష్టికి వస్తాయి. ఒకటి, సంఖ్య రీత్యా ఇపుడవి మొత్తం 21 దేశాలు. రెండు, అమెరికా, యూరప్‌తో కూడిన పాశ్చాత్య ప్రపంచానికి బయటగల ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా ఖండాలన్నింటికి అందులో ప్రాతినిధ్యం ఉంది. మూడు, వాటిలో అనేకం ఆర్థికంగా శక్తిమంతమైనవి. నాలుగు, బహుశా అంతకన్న విశేషంగా పలు దేశాలకు అమెరికాకు అనుకూలమైనవనే పేరున్నది. అటువంటి పేరే గల ఆసియన్ కూటమి దేశాలు కూడా బ్రిక్స్‌కు తోడుకావటం మరొక విశేషం.

తాజా విస్తరణ తర్వాత బ్రిక్స్ దేశాల జనాభా మొత్తం ప్రపంచ జనాభాలో 41 శాతానికి చేరింది. వీటి జీడీపీ ప్రపంచ జీడీపీలో 40 శాతం అయింది. ఇవన్నీ అభివృద్ధి చెందిన దేశాల కూటమి అయిన జీ–7కు మించిపోయిన లెక్కలు. బ్రిక్స్ నెలకొల్పిన న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ (ఎన్‌డిబి) రుణ సహాయాలతో 40 బిలియన్ డాలర్ల విలువ గల 120 అభివృద్ధి పథకాలను వర్ధమాన దేశాలలో అమలుపరుస్తున్నారు. అమెరికా చెప్పు చేతలలో గల ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్ తరహా షరతులుగానీ, ఆయా దేశాల ఆర్థిక విధానాలలో జోక్యం గానీ బ్రిక్స్ బ్యాంక్ నుంచి ఉండవు.

అమెరికాకు ఎందుకు కలవరం?

అమెరికా తన డాలర్‌ను ఒక ఆయుధంగా ఉపయోగిస్తూ ప్రపంచ దేశాల కరెన్సీ విలువలను, మార్కెట్లను, బ్యాంక్ చెల్లింపులను, రిజర్వ్‌లను నియంత్రిస్తున్నందున, తమకు సరిపడని దేశాల డాలర్ అకౌంట్లను స్తంభింపజేస్తున్నందున, డాలర్ మారకం నుంచి విముక్తి అవసరమని బ్రిక్స్ దేశాలు కొంతకాలం క్రితమే నిర్ణయించుకున్నాయి. ముఖ్యంగా నిరుడు అక్టోబర్‌లో రష్యాలోని కజాన్ నగరంలో జరిగిన 16వ సమావేశాలలో ఇందుకు మరింత కదలిక వచ్చింది. ఆ ప్రకారం బ్రిక్స్ దేశాలు డాలర్‌తో సంబంధాలను ఒకేసారి పూర్తిగా తెంచుకోవటంగాక, తమ మధ్య వాణిజ్యానికి పరస్పర చెల్లింపులు డాలర్‌లో గాక వీలైనంత మేర తమ సొంత కరెన్సీలలో జరుపుకోవాలనీ, ఆ స్థాయిని క్రమంగా పెంచుకోవాలనీ నిర్ణయించుకున్నాయి. ఈ పని బ్రిక్స్ దేశాల మధ్యనే గాక, ఇతర దేశాలతోనూ జరిగేందుకు ప్రయత్నించాలని భావించాయి. అనగా డాలర్ పాత్రను, ఆధిపత్యాన్ని తగ్గించటమన్నమాట!

నిజానికి స్థానిక కరెన్సీలలో చెల్లింపుల పద్ధతి స్వల్ప స్థాయిలో గతంలోనూ ఉండేది. కానీ బ్రిక్స్ నిర్ణయాలతో అది గణనీయంగా పెరిగి ప్రస్తుతం ప్రపంచ వాణిజ్యంలో 30 శాతానికి మించినట్లు అంచనా. బ్రెజిల్ విస్తరణతో ఈ ధోరణి పెరిగినట్లయితే, త్వరలో 50 శాతానికి చేరే అవకాశం ఉంది. బ్రిక్స్ అంటే అమెరికా అధ్యక్షుడు ఎందుకింత కలవరపడుతున్నారో, దీన్ని బట్టి తేలికగా అర్థం చేసుకోవచ్చు. ప్రపంచంపై అమెరికా సామ్రాజ్యవాదపు ఆధిపత్యం వెంటనే అంతం కాక పోయినా క్రమంగా బలహీనపడుతుంది. మారిన పరిస్థితులలో ఒకప్పటివలె బ్రిక్స్ వంటి దేశాలపై ప్రత్యక్ష యుద్ధాలు చేయలేరు గనుక, టారిఫ్‌ల హెచ్చింపు, ఇతర వాణిజ్య ఆంక్షల రూపంలో ఆర్థిక యుద్ధాలు ప్రకటిస్తున్నారు. వాస్తవానికి, అమెరికా ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలు, ఇతరుల నుంచి వస్తున్న పోటీలను తట్టుకునేందుకు ఆయన స్వపర భేదాలు లేకుండా అన్ని దేశాలపై ఎడాపెడా టారిఫ్‌ల యుద్ధం ఆరంభించారు. అయితే, బ్రిక్స్‌తో వైరం భిన్నమైనది. ఆ సంస్థ వర్ధమాన దేశాల కోసం భిన్నమైన, దీర్ఘకాలిక, ప్రత్యామ్నాయ వ్యవస్థను సృష్టించే అజెండాతో పని చేస్తున్నది. ఆర్థికంగానే కాదు. అభివృద్ధి నమూనా దృష్ట్యా కూడా.

వాణిజ్యంలో 'స్వేచ్ఛ' కోసం...

మరొక కీలకమైన అంశం స్వేచ్ఛా వాణిజ్యం. ఈ భావనను ముందుకు తెచ్చి డబ్ల్యూటీవోను నెలకొల్పిన అమెరికా కూటమి, దానిని తమ ప్రయోజనాలకు అనుకూలమైనంత కాలం ఉపయోగించుకుని, ఇటీవల ఇతర దేశాలు కూడా లాభపడుతుండటంతో ఆ నియమాలను భంగపరచజూస్తున్నది. స్వేచ్ఛా వాణిజ్యం యథాతథంగా కొనసాగటమే గాక, ఆ సంస్థలో వర్ధమాన దేశాల గొంతుకలు వినవస్తూ ప్రజాస్వామ్యబద్ధంగా పనిచేయాలన్నది బ్రిక్స్ వాదనలలోని ముఖ్యాంశాలలో ఒకటి. ఆ పని జరిగితే వర్ధమాన దేశాల వనరులకు, ఉత్పత్తులకు తగిన ధరలు లభిస్తాయి. ధనిక రాజ్యాలు ఇతరులను ఒత్తిడి చేసి తక్కువ ధరలకు కొనుగోలు చేయటం, తమ ఉత్పత్తులను మాత్రం అధిక ధరలకు విక్రయించటం వంటి పరిస్థితి పోతుంది.

మరొక స్థాయిలో బ్రిక్స్ దేశాలు అమెరికా ఏకధ్రువ ప్రపంచం ఆమోదయోగ్యం కాదనీ, బహుళ ధ్రువ ప్రపంచం తమ లక్ష్యమనీ స్పష్టంగానే చెప్తున్నాయి. బ్రిక్స్ గురించి యూరోపియన్ దేశాలు ఇంతవరకైతే వ్యతిరేకంగా మాట్లాడలేదుగానీ, అమెరికా వైపు చూస్తున్నాయి. కజాన్, రియో డి జనేరో సమావేశాల దరిమిలా ట్రంప్‌పై ఒత్తిడి పెరిగింది.

ఈ పరిణామాల తక్షణ ప్రభావాల గురించి కూడా కొంత చెప్పుకోవాలి. ఇండియాను టారిఫ్‌లతో లొంగదీసి ఒప్పందాలు చేసుకోజూడగా, దానిపై ఒకవైపు చర్చలు సాగిస్తూనే, తాము కూడా 25 శాతం ఎదురు సుంకాలు విధించగలమని భారత ప్రభుత్వం డబ్ల్యూటీవోలో స్పష్టం చేసింది. తామూ అదే పని చేయగలమని బ్రెజిల్, వియత్నాం, 'ఆసియాన్', దక్షిణాఫ్రికా మొదలైనవి హెచ్చరించాయి. చైనా, రష్యా సరేసరి. టారిఫ్‌లు ప్రకటించినపుడు ట్రంప్ మాట్లాడుతూ 90 రోజులలో 90 ఒప్పందాలు చేసుకోగలమని, అందరూ క్యూలు కడుతున్నారని ఆట్టహాసంగా అన్నారు. 90 రోజులు గడిచేసరికి జరిగినవి ఇంగ్లండ్, వియత్నాంలలో మాత్రమే. కెనడా, యూరప్ సైతం ధిక్కార స్వరంలోనే ఉన్నాయి. ఈ పరిణామాల మధ్య బ్రిక్స్‌ను ఢీకొంటున్న ట్రంప్, కాగితం పులిగా మిగలటం తప్ప గత్యంతరం కనిపించదు.

వ్యాసకర్త సీనియర్ సంపాదకుడు



బ్రెజిల్‌లో జరిగిన 'బ్రిక్స్' సదస్సులో వివిధ దేశాల నేతలు

◆ తాజా విస్తరణ తర్వాత బ్రిక్స్ దేశాల జనాభా మొత్తం ప్రపంచ జనాభాలో 41 శాతానికి చేరింది. వీటి జీడీపీ ప్రపంచ జీడీపీలో 40 శాతం అయింది. ఇవన్నీ అభివృద్ధి చెందిన దేశాల కూటమి జీ–7ను మించిన లెక్కలు.

◆ స్థానిక కరెన్సీలలో చెల్లింపుల పద్ధతి స్వల్ప స్థాయిలో గతంలోనూ ఉండేది. కానీ బ్రిక్స్ నిర్ణయాలతో అది ప్రపంచ వాణిజ్యంలో 30 శాతానికి మించినట్లు అంచనా. సభ్య దేశాల విస్తరణతో, 50 శాతానికి చేరే అవకాశం ఉంది. అది డాలర్ ఆధిపత్యాన్ని తగ్గిస్తుంది! ట్రంప్ ఎందుకు కలవరపడుతున్నారో, దీన్ని బట్టి అర్థం చేసుకోవచ్చు.

సోషల్ మీడియా

అది కదా ప్రమాదం!



సమోసా, జిలేబీల్లాంటి తిండి పదార్థాలకు కూడా సిగరెట్ల మాదిరిగా ఆరోగ్య హెచ్చరికలు ఇవ్వాలని వార్త. ఎంత అర్థరహితం ఇది! పకోడీ, వడాపావ్ లాంటివి అమ్ముకుని బతికే పేదవాళ్లను ఇది లక్ష్యంగా చేసుకున్నది. నిజంగా జనాల ఆరోగ్యం పట్ల ప్రభుత్వానికి అంత పట్టింపు ఉంటే, ప్రమాదకరమైన అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్ అమ్ముతున్న ధనిక, శక్తిమంతమైన బహుళజాతి సంస్థల మీద చర్యలు తీసుకోవాలి.

– వీర్ సంఘ్వీ, జర్నలిస్ట్

కొత్త ప్రయాణం



భౌతిక జీవితంలో తెలిసివచ్చేదేమంటే, మీరు ఇక్కడ కేవలం ఇవ్వడానికే ఉన్నారని! కానీ మీరు కేవలం తీసుకుంటున్నారనీ, బదులుగా ఇవ్వడానికి మీ దగ్గర ఏమీలేదనీ అవగాహన కలిగినప్పుడు కృతజ్ఞతతో ఆధ్యాత్మిక జీవితం మొదలవుతుంది. – శ్రీశ్రీ రవిశంకర్, ఆధ్యాత్మిక బోధకుడు

మీరే బాధ్యులు!



మీ సొంత తృష్ణకు మీరే బాధ్యత తీసుకోండి. అది మీ పిల్లలైనా, మీ సృజనాత్మక భావ పరంపరలైనా! తృష్ణతో ఉండమని మిమ్మల్ని ఎవరూ అడగలేదు కాబట్టి ఫిర్యాదులు వద్దు. మీ దీవెనల పట్ల కృతజ్ఞతగా ఉండండి.

– సుధీర్ మిశ్రా, దర్శకుడు

వేచి చూద్దాం!



మల్లెపువ్వు పుష్పించడానికి మూడు రోజులు తీసుకుంటుంది. బంతి ఆరు రోజులు, పొద్దుతిరుగుడు పది రోజులు తీసుకుంటాయి. ప్రకృతిలో ప్రతిదీ తనదైన వేగంతో పుష్పిస్తాయి. అలాగే మన పిల్లలు! వాళ్లను వాళ్ల సమయం తీసుకోనివ్వండి.

– మనోజ్ అరోరా, ఫైనాన్షియల్ ప్లానర్

అవే చెబుతాయి



జనాల మాటల కంటే, వారి ఫీలింగ్స్‌ను మనం తరచుగా వేగంగా అర్థం చేసుకోగలం.

– నీలే డోనాల్డ్ వాల్ష్, రచయిత

వైజ్ఞానిక వేగుచుక్కలు–26

తొలి డెవలప్మెంటల్ బయాలజిస్ట్

భారత స్వాతంత్ర్య సమరం జరుగుతున్న రోజుల్లో పూణెలోని పరశురామ్ బావ్ కాలేజీలో జువాలజీ లెక్చరర్‌గా పనిచేస్తున్న 39 ఏళ్ల లీలా గణేష్ ముల్హెర్కర్ 16 నెలల్లో గొప్ప పరిశోధన చేశారు. ఎడిన్‌బరో పరిశోధకులు చార్లెస్ వెడ్డింగ్‌టన్ ఆధ్వర్యంలో 'ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనిటిక్స్ అండ్ ఎంబ్రియాలజీ'లో పిండం పరిణామం, అభివృద్ధి మధ్య ఉన్న సంబంధం గురించి అధ్యయనం చేయడంతో ఆమె పేరు మారుమోగిపోయింది. పూనా విశ్వవిద్యాలయంలో ఈ డెవలప్మెంటల్ బయాలజీ కోర్సును ప్రవేశపెట్టడమే కాకుండా, 'ఇండియన్ సొసైటీ ఆఫ్ డెవలప్మెంటల్ బయాలజిస్ట్స్' అనే సంస్థను కూడా ప్రారంభించారామె.



లీలా ముల్హెర్కర్

ముంబైకి ఉత్తరాన ఉన్న 'బోర్డీ' గ్రామంలో 1915లో లీల జన్మించారు. 1954లో భారత ప్రభుత్వమిచ్చే విదేశీ చదువుల స్కాలర్‌షిప్ రావడంతో ఇంగ్లాండ్‌లోని ఎడిన్‌బరో విశ్వవిద్యాలయంలో పీహెచ్‌డీ పూర్తిచేశారు. తిరిగివచ్చి పుణె విశ్వవిద్యాలయం జువాలజీ శాఖలో అధ్యాపకులుగా చేరారు. గర్భవతుల నిద్రలేమి, వికారం, మబ్బుగా ఉండటం వంటి లక్షణాలకు ప్రపంచ వ్యాప్తంగా వాడే 'తలిడోమైడ్' ఔషధం ఎన్నో సమస్యలకు దారి తీసిన కాలమది. దీనికి సంబంధించి లీలా ముల్హెర్కర్ దృష్టి పెట్టి పరిశోధనలు కొనసాగించారు.

తన ఇంటినే పరిశోధనాశాలగా మార్చుకొని సాగిన పరిశోధనా ధీర లీల. తన విద్యార్థులను పరిశోధకులుగా మలుస్తూ స్థానికంగా లభ్యమయ్యే హైడ్రాలు, కప్పలు, బల్లులు, నత్తలు వంటి వాటి పిండోత్పత్తి, దాని ఎదుగుదల, ఆ ప్రక్రియలో సంభవించే పరిణామాల గురించి అధ్యయనం చేపట్టారు. పరిశోధనలో మునిగిపోయి లీల తన 52వ ఏట 1967లో వసంతరావు గోలేను వివాహం చేసుకున్నారు.

యూనివర్సిటీలో రెండు దశాబ్దాలు పనిచేసి 1977లో పదవీ విరమణ చెందినా మరో 15 ఏళ్లు అక్కడ పరిశోధనలు కొనసాగించారు. 65 ఏళ్ల వయసులో కూడా సున్నితంగా ఉండే పలురకాల పిండాలను కోసి భాగాలను అధ్యయనం చేయడం ఆమెకు ఎంతో సునాయాసంగా ఉండేది. కనుకనే 2005లో ఆమె మరణించేదాకా యూనివర్సిటీ క్యాంపస్‌లోనే చలాకీగా అందుబాటులో ఉండేవారు. ఆమె దగ్గర 18 మంది పరిశోధన పట్టాలు పొంది జాతీయ, అంతర్జాతీయ స్థాయికి వెళ్లారు.

భారతీయ కళలు, కవిత్వం, నాటకాలు, ఫిలాసఫీ వంటి అంశాల పట్ల లీలా ముల్హెర్కర్‌కు చాలా మక్కువ. ఆమె నాటకానికి వెళితే తప్పనిసరిగా తొలి వరుసలోనే కూర్చునేవారు. బాలగంధర్వ ఆడిటోరియం ముందు వరుసలో వారికి రెండు సీట్లు ప్రత్యేకంగా కేటాయించబడేవి. వృక్ష శాస్త్రవేత్తలు, జంతుశాస్త్రవేత్తలు, వైద్యులు... ఈ మూడు విభాగాల జీవశాస్త్రజ్ఞులకు ఒక వేదికను కల్పిస్తూ 1977లో 'ఇండియన్ సొసైటీ ఆఫ్ డెవలప్మెంటల్ బయాలజిస్ట్స్' సంస్థను ప్రారంభించారు. ఈ సంస్థ ద్వారా నేటికీ శాస్త్రజ్ఞులు ప్రతి రెండేళ్లకు ఒకచోట పెద్ద ఎత్తున సమావేశమవుతూ డెవలప్మెంటల్ బయాలజీ అభివృద్ధికి ఎంతో దోహదం చేస్తున్నారు.

– డా॥ నాగసూరి వేణుగోపాల్ । ఆకాశవాణి మాజీ ఉన్నతాధికారి

ఈ గణాంకాలు... పురోగతికి నిదర్శనాలు!

అభిప్రాయం



పి. భానుచందర్ రెడ్డి

'అబద్ధం తాత్కాలికంగా ముందడుగేసినా, నిజానిదే శాశ్వత విజయం. వాస్తవాలను మాటల గారడీ దాచిపెట్టొచ్చు, గణాంకాలు దాచిపెట్టలేవు. కళ్లకు కట్టినట్లు చెప్పేస్తాయి'... ఈ మాటలు పారిశ్రామికాభివృద్ధిలో దూసుకెళ్తున్న 'తెలంగాణ' విషయంలో అచ్చుగుద్దినట్లు సరిపోతాయి. 2024–25 ఆర్థిక సంవత్సరంలో జాతీయ సగటును మించి పారిశ్రామిక వృద్ధి రేటు ఇక్కడ నమోదయ్యింది. ఇదే వేగం కొనసాగితే రాబోయే రోజుల్లో దేశ పారిశ్రామిక రంగ వృద్ధికి తెలంగాణ రోల్ మోడల్‌గా నిలవడం ఖాయం.

రాష్ట్రాల ఆర్థిక ప్రగతిని అంచనా వేసేందుకు ఉపయోగించే ముఖ్యమైన సూచికల్లో 'గ్రాస్ స్టేట్ వాల్యూ యాడెడ్'(జీఎస్‌వీఏ) ఒకటి. ఆర్థిక వ్యవస్థకు వివిధ రంగాలు (వ్యవసాయం, పరిశ్రమలు, సేవలు) ఎంత విలువను జోడించాయో ఇది తెలియజేస్తుంది. స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో ఇది ఒక భాగం. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు సమకూరే మొత్తం జీఎస్‌వీఏలో పారిశ్రామిక రంగం నుంచి సమకూరిన వాటా 2023–24లో 17.78 శాతం ఉండగా... 2024–25లో అది 18.7 శాతానికి పెరిగింది.



2035 నాటికి ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చి దిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ లక్ష్య సాధనలో పారిశ్రామిక రంగం కీలక పాత్ర పోషించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది.

2023–24లో పారిశ్రామిక రంగ జీఎస్‌వీఏ రూ. 2.46 లక్షల కోట్లు. అది 2024–25లో రూ. 2.77 లక్షల కోట్లకు చేరుకుంది. వృద్ధి రేటు 8.68 శాతం. గతేడాదితో పోలిస్తే 2.1 శాతం అధికంగా నమోదయ్యింది. ఇదిలా ఉండగా ఈ కేటగిరీలో 2024–25లో జాతీయ సగటు వృద్ధి రేటు 6.2 శాతం మాత్రమే కావడం గమనార్హం. పారిశ్రామిక రంగంలో తయారీ, నిర్మాణం, మైనింగ్ – క్వారీయింగ్ (గనులు, ఖనిజ తవ్వకాలు), విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా, ఇతర ఉపయోగితా సేవలను ఉప రంగాలుగా వర్గీకరిస్తారు. 2024–25లో ఉప రంగాల జాతీయ సగటు వృద్ధి రేటు తెలంగాణ కంటే తక్కువగా ఉండటం గమనార్హం.

తెలంగాణలో పారిశ్రామిక రంగంలోని ఉపరంగాల వృద్ధి రేటు కూడా ముందంజలో ఉంది. 2023–24లో తయారీ రంగం వృద్ధి రేటు 8.2 శాతం ఉండగా... అది 2024–25 నాటికి 9.6 శాతానికి పెరిగింది. నిర్మాణ రంగ వృద్ధి రేటు 9.3 శాతం నుంచి 10.9 శాతం, మైనింగ్– క్వారీయింగ్ 5.6 శాతం నుంచి 10.5 శాతం, విద్యుత్, గ్యాస్, నీటి సరఫరా ఇతర యుటిలిటీ సేవల రంగం 6.1 శాతం నుంచి 10.3 శాతం పెరుగుదలను నమోదు చేశాయి.


ఆర్థిక వ్యవస్థలో పారిశ్రామిక రంగ వృద్ధిని కొలిచే మరో సూచిక ఇండెక్స్ ఆఫ్ ఇండస్ట్రియల్ ప్రొడక్షన్ (ఐఐపీ). సెంట్రల్ స్టాటిస్టికల్ ఆర్గనైజేషన్ (సీఎస్‌వో), గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎంవోఎస్‌పీఐ) జాతీయ స్థాయిలో ఐఐపీని లెక్కిస్తాయి. రాష్ట్ర స్థాయిలో డైరెక్టరేట్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ (డీఈఎస్) గణిస్తుంది. తెలంగాణ డీఈఎస్ రూపొందించిన 'ఎకనామిక్ పల్స్ ఆగస్టు 2024' నివేదిక ప్రకారం, రాష్ట్ర ఐఐపీ కంపౌండ్ మంత్లీ గ్రోత్ రేట్ (సీఎంజీఆర్) 2.9 శాతం. ఇదే సమయంలో జాతీయ సగటు సీఎంజీఆర్ కేవలం 0.52 శాతం మాత్రమే. ఈ లెక్కన చూస్తే తెలంగాణ పారిశ్రామికాభివృద్ధి రేటు సుమారు 6 రెట్లు అధికంగా నమోదయ్యిందన్న మాట. ఈ వృద్ధికి ప్రధాన కారణం తెలంగాణ తయారీ రంగం. ఇది రాష్ట్రంలో 6.50 శాతం సీఎంజీఆర్‌ను సాధించగా, జాతీయ సగటు 0.25 శాతం మాత్రమే కావడం గమనార్హం.

ఇవి గణాంకాలు కాదు. పారిశ్రామిక రంగంలో తెలంగాణ సాధించిన పురోగతికి నిదర్శనాలు. ఈ వృద్ధి యాదృచ్ఛికమో... అనూహ్యమో కాదు. రాష్ట్ర ప్రభుత్వ పకడ్బందీ కార్యాచరణ ఫలితం. ఏడాదిన్నరలోనే రాష్ట్రానికి రూ. 3 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయి. కొత్త పరిశ్రమల ఏర్పాటుకు ఊతమిచ్చేలా మౌలిక సదుపాయాల కల్పనపై ఫోకస్, నూతన పారిశ్రామిక విధానం – 2025, ఎంఎస్‌ఎంఈ – 2024, ఆర్ఆర్ఆర్, ఓఆర్ఆర్ కేంద్రంగా కొత్త జోనింగ్ రెగ్యులేషన్స్... ఇలా రాష్ట్రంలో పారిశ్రామికాభివృద్ధిని మరింత ప్రోత్సహించేందుకు, పరిశ్రమలకు అవసరమైన ఎకో సిస్టంను అభివృద్ధి చేసేందుకు వేసిన అడుగులెన్నో! 2035 నాటికి ట్రిలియన్ డాలర్ల (లక్ష కోట్ల రూపాయలు), 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల (3 లక్షల కోట్ల రూపాయల) ఆర్థిక వ్యవస్థగా తెలంగాణను తీర్చి దిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఈ లక్ష్య సాధనలో పారిశ్రామిక రంగం కీలక పాత్ర పోషించేలా ప్రణాళికలు రూపొందిస్తోంది. ఐటీ, ఫార్మా, లైఫ్ సైన్సెస్, మాన్యుఫాక్చరింగ్, సినీ పరిశ్రమ, పర్యాటక, ఇంధన, రవాణా, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించేందుకు కృషి చేస్తోంది.

వ్యాసకర్త తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి పీఆర్వో
మొబైల్: 99516 03595

ఎవరిది కృతజ్ఞత?

జెన్ మాస్టర్ డోజో ఆశ్రమానికి ఒక ధనవంతుడు వచ్చి పదివేల బంగారు నాణేలను దానం చేశాడు. డోజో ఏమీ మాట్లాడకుండా ఆ విరాళాన్ని స్వీకరించారు. అయితే డోజో కృతజ్ఞతలు చెప్తారని ఆశించాడు ధనవంతుడు. కానీ అదేమీ జరగక పోవడంతో ధనవంతుడు ఒకింత అసంతృప్తితో... "నేను మీకు ఇచ్చిన విరాళం పదివేల బంగారు నాణేలని మీకు తెలుసా?" అని సన్నని స్వరంతో అన్నాడు.



జ్యోతిర్మయం

అప్పుడు డోజో "తెలుసు. మీరు మాకిచ్చిన పదివేల బంగారు నాణేలు చాలా పెద్ద మొత్తమే. కనుక మీరు కృతజ్ఞతలు చెప్తారని కదా నేను ఆశించేది. కానీ మీరు చెప్పలేదు" అన్నారు శాంతంగా నవ్వుతూ. అక్కడితో ఆగకుండా, "మీరు నాతో మళ్ళీ మళ్ళీ చెప్తున్నారు మీరిచ్చినవి బంగారు నాణేలని... నేను మీ మాటలు విన్నాను. నేను చెవిటివాడినని మీరు అనుకుంటున్నారా? నేను మీకు కృతజ్ఞతతో ఉండాలని మీరు భావిస్తున్నారు కదూ?" అని అడిగారు డోజో.

"ఔను, అదే ఆశిస్తున్నాను.అది చాలు నాకు" అన్నాడు ధనవంతుడు. అంతట, జెన్ గురువు "మీరు మీ బంగారు నాణేలను వెనక్కు తీసుకోవచ్చు. మీరు నిజంగా ఆలయానికి విరాళం ఇవ్వాలనుకుంటే, నేను విరాళాన్ని అంగీకరించినందుకు మీరే మాకు కృతజ్ఞతతో ఉండాలి" అన్నారు.

ఎవరు ఇస్తారో వారే కృతజ్ఞతతో ఉండాలి. అదే నిజమైన భాగస్వామ్యం. ఎవరైనా మీ నుండి బహుమతిని స్వీకరిస్తే, అది మీకు దక్కిన బహుమతిగా భావించాలి. మనం ఇచ్చే దానిని ఒకరు స్వీకరించడానికి నిరాకరించవచ్చు, లేదా స్వీకరించవచ్చు. మీ బహుమతిని స్వీకరించడం ద్వారా అతను మీకు గౌరవమిచ్చినట్లే అనుకోవాలి. అందుకే ఇచ్చేవారు పుచ్చుకునే వారి పట్ల కృతజ్ఞతతో ఉండాలి. అలా లేకపోతే బేరసారాలతో సమానం.

ఇచ్చినందుకు ప్రతిఫలాన్ని ఆశించేవాడు ఆ బహుమతి కంటే విలువైనదాన్ని ఆశిస్తున్నట్లే అవుతుంది. 'జ్ఞానోదయం పొందిన వ్యక్తి మాత్రమే దేన్నయినా పంచుకోగలడు' అన్నది ఓషో మాట.


– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.షష్ఠి రా.8.25 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర ఉ.6.12 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర తె.5.01 వరకు (తెల్లవారితే గురువారం), **వర్జ్యం:** ప.3.20 నుండి 4.51 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.11.39 నుండి 12.31 వరకు, **అమృతఘడియలు:** రా.12.25 నుండి 1.56 వరకు, కర్కాటక సంక్రమణం; **రాహుకాలం:** ప.12.00 నుండి 1.30 వరకు, **యమగండం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **సూర్యోదయం:** 5.37, **సూర్యాస్తమయం:** 6.34.

పంటల బీమా వచ్చేనా?

- ఇంకా ఖరారు కాని విధివిధానాలు
- 2024 వానాకాలం నుంచే ఇస్తామన్న సీఎం
- ఇప్పటికే రెండు పంటలకు మొండిచెయ్యి
- గత ఏప్రిల్‌లో మంత్రి తుమ్మల సమావేశం
- నెలలు గడుస్తున్నా అతీగతీ లేని విధివిధానాలు
- క్రాప్ బుకింగ్ తరువాతే నిర్ణయిస్తామంటున్న అధికారులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర దాటినా... పంటల బీమా పథకం అమలుపై ఇప్పటివరకు మార్గదర్శకాలు రూపొందించలేదు. బీఆర్‌ఎస్ హయాంలో రద్దయిన పంటల బీమా పథకాన్ని 2024 వానకాలం సీజన్‌లోనే పునః ప్రారంభిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినా.. గత రెండు సీజన్లలో పంటల బీమాపై అడుగు ముందుకు పడలేదు. రాష్ట్రంలో వానకాలం సీజన్ ప్రారంభమై ఇప్పటికే 60 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. ఈసారైనా పంటల బీమా పథకాన్ని అమలు చేస్తారా లేదా? అని రైతులు ఎదురు చూస్తున్నారు. పంటల బీమాకు సంబంధించి ప్రధాన మంత్రి ఫసల్ బీమా పథకంలో చేరాలా లేక సొంతంగా రాష్ట్రంలో బీమా పథకాన్ని రూపొందించాలా? అనేది ప్రభుత్వం తేల్చుకోలేకపోతోంది.

మూడు నెలలైనా ముందుకు పడని అడుగు

పంటల బీమా పథకానికి విధి విధానాలు రూపొందించాలని ఏప్రిల్ 23వ తేదీన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కానీ, ఇప్పటివరకు వ్యవసాయ శాఖ దానిని పట్టించుకోనే లేదు. గతంలో వ్యవసాయ శాఖ అధికారులు, బ్యాంకర్లతో మంత్రి సమావేశమైనప్పటికీ బ్యాంకర్లు పంటల బీమాపై ఆసక్తి చూపలేదు. దీంతో ప్రధాని ఫసల్ బీమా పథకంలోనే చేరాలని సూత్రప్రాయంగా నిర్ణయించినప్పటికీ, ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. రాష్ట్రంలో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకాన్ని గతంలో అమలు చేశారు. 2018–19 సీజన్ తరువాత ఈ పథకాన్ని బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిలిపివేసింది.

11 క్లస్టర్లుగా రాష్ట్రం

రాష్ట్రంలో పంటల బీమాను పునరుద్ధరించాలంటే ఫసల్ బీమా ఒక్కటే సరైనదిగా రాష్ట్ర ప్రభుత్వం ఒక అంచనాకు వచ్చింది. రాష్ట్రాన్ని 11 క్లస్టర్లుగా విభజించి బీమా అమలు చేయాలని నిర్ణయించారు. వానకాలం సీజన్‌లో సుమారు 132 లక్షల ఎకరాల్లో పంటలు, యాసంగిలో 78 లక్షల ఎకరాల్లో వేస్తారని లెక్క కట్టారు. ఈ నేపథ్యంలో ఫసల్ బీమా పథకం మార్గదర్శకాల ప్రకారంగా వానకాలానికి మొత్తం ప్రీమియంలో రైతు వాటా కింద 2 శాతం, యాసంగిలో 1.5 శాతం.. వాణిజ్య, ఉద్యాన పంటలకు 5 శాతం ప్రీమియం రైతు వాటాగా తీసుకోవాలని నిర్ణయించారు. మిగిలిన ప్రీమియంలో రాష్ట్రం, కేంద్రం 50:50 చొప్పున భరిస్తాయి. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులతో ఈసారి వరి సాగు మందగించింది. కాగా, పంటలు వేసిన తరువాత క్షేత్రస్థాయిలో వ్యవసాయ విస్తరణాధికారులు క్రాప్ బుకింగ్ ప్రక్రియ చేపడతారు. అంటే ఏ పంటను ఏ రైతు ఎంత విస్తీర్ణంలో సాగు చేశారనే లెక్కలను రూపొందిస్తారు. ఈ ప్రక్రియ పూర్తయిన తరువాతే పంటల బీమా పథకం అమలు ప్రక్రియ ప్రారంభమవుతుందని వ్యవసాయశాఖలోని ఒక కీలక అధికారి తెలిపారు.

ఫుడ్‌పాయిజన్‌పై నివేదిక సమర్పించండి

- సీఎస్‌కు హెచ్‌ఆర్‌సీ ఆదేశాలు

సిటీ కోర్టులు: ప్రభుత్వ హాస్టళ్లలో ఫుడ్ పాయిజన్ ఘటనలపై పూర్తి సమాచారంతో నివేదిక అందజేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి మానవ హక్కుల కమిషన్ ఆదేశాలు జారీ చేసింది. నల్లగొండ జిల్లాలో సోమవారం వేర్వేరు ప్రభుత్వ హాస్టళ్లలో 53 మంది విద్యార్థులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని పత్రికల్లో ప్రచురితమైన వార్తలపై మానవ హక్కుల కమిషన్ స్పందించింది. దేవరకొండ మండలం ముదిగొండ గిరిజన హాస్టల్‌లో 35 మంది విద్యార్థులు, అదేవిధంగా మర్రిగూడలోని ఆదర్శ పాఠశాల హాస్టల్‌లో 18 మంది విద్యార్థులు తీవ్ర కడుపునొప్పి, వాంతులు, విరోచనాలతో ఇబ్బందులు పడ్డారు. ఈ రెండు ఘటనలకు సంబంధించి సాక్షి తోపాటు పలు పత్రికల్లో వచ్చిన కథనాలపై మంగళవారం రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్, సభ్యులు శివాది ప్రవీణ, బి.కిశోర్‌తో కూడిన బెంచ్ స్పందించి సుమోటోగా కేసు నమోదు చేసుకొని విచారణ చేపట్టింది. ఈ ఘటన పిల్లల హక్కులను తీవ్రంగా ఉల్లంఘించే అంశంగానే కమిషన్ పరిగణిస్తుందని అభిప్రాయపడింది. వచ్చే విచారణలోపు ఈ అంశంపై పూర్తి వివరాలు తీసుకొని కమిషన్ ముందు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి ఆదేశాలు జారీ చేసింది.

‘విద్యుదాఘాతం’పై నివేదిక ఇవ్వండి

- సంగారెడ్డి విద్యుత్ అధికారులకు లోకాయుక్త ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలం గొల్లపల్లిలో విద్యుదాఘాతంతో తండ్రీకొడుకు మృతి చెందిన ఘటనపై నివేదిక అందజేయాలని విద్యుత్ ఉన్నతాధికారులను లోకాయుక్త ఆదేశించింది. ‘విద్యుదాఘాతంతో తండ్రి, కొడుకు మృతి’శీర్షికతో ‘సాక్షి’దినపత్రికలో సోమవారం వార్త ప్రచురితమైంది. ఈ వార్తకు స్పందించిన లోకాయుక్త.. ఘటనపై నివేదిక ఇవ్వాలని టీజీఎస్‌పీడీసీఎల్ సంగారెడ్డి జిల్లా ఎస్ఈ, కొండాపూర్ ఎస్ఐలకు ఆదేశాలు జారీ చేసింది. ఈ నెల 28న నివేదికను తమ ముందు ఉంచాలని స్పష్టం చేసింది.

చంపేసి.. రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించి..

- వేధిస్తున్న భర్తను అంతంచేయాలని భార్య నిర్ణయం
- సోదరుడు, ప్రియుడితో కలిసి భర్తను హత్య చేయించిన భార్య



వివరాలు వెల్లడిస్తున్న భువనగిరి డీసీపీ

సాక్షి, యాదాద్రి : భర్త వేధింపులతో విసిగిపోయిన ఆమె.. తన సోదరుడు, ప్రియుడితో కలిసి భర్తను హత్యచేసింది. కారుతో ఢీకొట్టి చంపి రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేసి.. చివరకు పోలీసులకు దొరికిపోయారు. మంగళవారం భువనగిరి డీసీపీ ఆకాంక్ష్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్ల గ్రామానికి చెందిన వస్తువుల స్వామి(36)కి ఆత్మకూరు(ఎం) మండల కేంద్రానికి చెందిన పొట్టిపాక మహేశ్ సోదరి స్వాతితో వివాహమైంది. వీరికి ముగ్గురు పిల్లలు. స్వామి భువనగిరిలోని ఓ ట్రాక్టర్ షోరూంలో మేనేజర్‌గా పనిచేసేవాడు. భార్య స్వాతి భువనగిరి హౌసింగ్ బోర్డు కాలనీలో ఉద్యోగం చేసే క్రమంలో తుర్కపల్లి మండలం పల్లెపహాడ్ గ్రామానికి చెందిన గుంటిపల్లి సాయికుమార్‌తో పరిచయం ఏర్పడింది.

గొడవలు ఇలా..

స్వాతి సోదరుడు మహేశ్‌కు ఇద్దరు భార్యలు. తన బావ తన భార్యతోనే వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని మహేశ్ స్వామిపై కోపం పెంచుకున్నాడు. ఈ విషయాన్ని స్వాతితో చెప్పగా, ఆమె భర్తను నిలదీసింది. దీంతో స్వాతిని స్వామి వేధించడం మెదలు పెట్టాడు. ఇదిలావుంటే.. గత సంవత్సరం ఫిబ్రవరిలో స్వాతి మోత్కూరుకు వెళ్లి సాయికుమార్‌ను కలిసి తన భర్త వేధింపులను సాయికుమార్‌కు వివరించింది. ఈ క్రమంలో వారి మధ్య వివాహేతర సంబంధం మొదలైంది. అక్క వివాహేతర సంబంధానికి మహేశ్ కూడా సహకరించాడు. తమను వేధిస్తున్న స్వామిపై ఎలాగైనా పగతీర్చుకోవాలని స్వాతి, మహేశ్ నిర్ణయించుకున్నారు.

కారు అద్దెకు తీసుకుని..

ఈనెల 13న స్వామి భువనగిరికి పనిమీద వస్తున్న విషయాన్ని స్వాతి.. సాయికుమార్, మహేశ్‌లకు చెప్పింది. దీంతో వారు స్వామి కదలికలపై నిఘా పెట్టారు. స్వామిని హత్య చేసేందుకు సాయికుమార్, తన స్నేహితుడు చీమల రామలింగస్వామి సహాయంతో భువనగిరిలో కారును అద్దెకు తీసుకున్నారు. స్వామి భువనగిరిలో పని ముగించుకుని రాత్రి వేళ స్నేహితుడు వీరబాబుతో కలిసి బైక్‌పై బయలుదేరాడు. రాత్రి 11.15 గంటల సమయంలో సాయికుమార్ కాటేపల్లి శివారులో కారుతో వారి బైక్‌ను ఢీకొట్టి కొంతదూరం ఈడ్చుకుపోయాడు. ఘటనలో స్వామి అక్కడికక్కడే మృతిచెందగా వీరబాబుకు గాయాలయ్యాయి. అయితే కారు అదుపుతప్పి రోడ్డు కిందకు దూసుకుపోయి ముందుకు కదలకుండా ఆగిపోయింది. స్వామి మృతి విషయం సాయికుమార్ ద్వారా తెలుసుకున్న మహేశ్ ద్విచక్ర వాహనం తీసుకుని సంఘటనా స్థలానికి చేరుకున్నాడు. సాయికుమార్, రామలింగస్వామిని బైక్‌పై ఎక్కించుకుని వచ్చి భువనగిరి రైల్వే స్టేషన్ వద్ద వదిలేశాడు.

కారుతో.. కదిలిన డొంక

రోడ్డు పక్కన ఆగిపోయిన కారును చూసిన పోలీసులకు అనుమానం వచ్చింది. కారు నంబర్ ఆధారంగా జరిపిన విచారణలో.. సాయికుమార్ సెల్ఫ్ డ్రైవింగ్ కోసం అద్దెకు తీసుకున్నాడని తెలిసింది. అతన్ని అదుపులోకి తీసుకుని విచారించారు. అతని సెల్‌ఫోన్‌లో స్వాతి ఫోన్ నంబర్ కన్పించడంతో స్వాతిని విచారించగా మొత్తం విషయం వెలుగులోకి వచ్చింది. పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపించారు. మరో నిందితుడు చీమల రామలింగస్వామి పరారీలో ఉన్నాడు.

కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలిపి..

- కుటుంబ కలహాలతో భర్తను చంపిన భార్య
- వరంగల్ జిల్లాలో ఘటన



జాటోతు బాలాజీ (ఫైల్)

వర్ధన్నపేట: కుటుంబ కలహాల కారణంగా ఓ భార్య కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలిపి భర్తకు ఇవ్వడంతో తీవ్ర అనారోగ్యానికి గురైన అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. వర్ధన్నపేట ఎస్సై చందర్ తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా వర్ధన్నపేట మండలం భవానికుంట తండాకు చెందిన జాటోతు బాలాజీ (44) ఈనెల 8న తండాలోని తన నివాసంలో దాటుడు పండుగ జరుపుకున్నాడు. పండుగ సందర్భంగా సాయంత్రం ఏడు గంటల సమయంలో బాలాజీ తాను మద్యం సేవించేందుకు బయటికి వెళ్తున్నానని భార్య కాంతికి చెప్పాడు. బయటికి వెళ్లొద్దని, ఇంట్లోనే మద్యం ఉందని చెప్పిన భార్య, వంటింట్లోకి వెళ్లి ఒక గ్లాసులో కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలిపి బాలాజీకి ఇచ్చింది. ఇది తాగిన కొద్దిసేపటికే బాలాజీ గొంతులో నొప్పిగా ఉందని చెప్పడంతో కాంతి అతన్ని వదిలిపెట్టి అదే తండాలో ఉండే తన బావ అయిన వాంకుడోతు దశరు ఇంటికి వెళ్లింది. బాలాజీ పరిస్థితిని గమనించిన తండావాసులు వెంటనే వర్ధన్నపేట ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, వైద్యుల సూచనల మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఎంజీఎంనుంచి ఈనెల 13న హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మరణించినట్లు ఎస్ఐ తెలిపారు. భర్తతో గొడవను మనసులో పెట్టుకున్న కాంతి తన బావ దశరు ప్రోత్సాహంతో గడ్డి మందును ఉద్దేశ పూర్వకంగానే బాలాజీకి తాగించినట్లు చెప్పారు. మృతుడికి కూతురు, కుమారుడు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వైద్యురాలిది ఆత్మహత్యే

- ‘బుట్టబొమ్మ’ను వదల్లేనని భార్యతో చెప్పిన డాక్టర్ సృజన్
- క్షణికావేశానికిలోనై ఉరివేసుకున్న డాక్టర్ ప్రత్యూష
- సృజన్, బానోతు శ్రుతితో పాటు అత్తామామల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి

హసన్‌పర్తి: ‘ఇన్‌స్టా రీల్స్ అమ్మాయి బుట్టబొమ్మతో ప్రేమాయణం కొనసాగిస్తా ...ఏం చేసుకుంటావో చేసుకో’ అన్న భర్త మాటలతో క్షణికావేశానికి లోనైన వైద్యురాలు ప్రత్యూష ఇంట్లోనే ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని కాజీపేట ఏసీపీ పింగిలి ప్రశాంత్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం డాక్టర్ ప్రత్యూష అనుమానాస్పదంగా మృతి చెందినట్లు నమోదైన కేసులో విచారించిన పోలీసులు మంగళవారం ఆమె భర్త డాక్టర్ అల్లాడి సృజన్, అత్తమామలు పుణ్యవతి-మధుసూదన్‌తోపాటు ఇన్‌స్టా రీల్స్‌గర్ల్ బానోతు శ్రుతిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు. హసన్‌పర్తి పోలీస్‌స్టేషన్‌లో కాజీపేట ఏసీపీ ప్రశాంత్‌రెడ్డి ఆవివరాలు వెల్లడించారు. మట్టెవాడకు చెందిన తంజావూరి పద్మావతి కూతురు డాక్టర్ ప్రత్యూషకు (35), ములుగు జిల్లా మంగపేట మండలం కమలాపూర్‌కు చెందిన డాక్టర్ అల్లాడి సృజన్‌కు 2017లో వివాహం జరిగింది. ప్రస్తుతం వీరు హసన్‌పర్తిలోని కాకతీయ వెంటిజ్‌లో ఓ విల్లా కొనుగోలు చేసి నివాసం ఉంటున్నారు. వీరికి ఇద్దరు కూతుళ్లు. వీరితోపాటు సృజన్ తల్లిదండ్రులు పుణ్యవతి-మధుసూదన్‌లు కూడా ఇక్కడే ఉంటున్నారు.

బానోతు శ్రుతితో కుటుంబంలో చిచ్చు..

ఏడాది క్రితం బుట్టబొమ్మ-17 ఇన్‌స్ట్రాగాం ఐడీ పేరుతో రీల్స్ చేసే అమ్మాయి బానోతు శ్రుతితో డాక్టర్ సృజన్ దగ్గరయ్యాడు. ఈ క్రమంలో తన భార్యకు విడాకులు ఇస్తానని బెదిరించాడు. మరో వైపు శ్రుతి కూడా ఫోన్ ద్వారా ప్రత్యూషను వేధింపులకు గురి చేయడం ప్రారంభించింది. ఆదివారం కూడా ఆ దంపతుల మధ్య గొడవ జరిగింది. శ్రుతిని వదిలేది లేదని సృజన్ చెప్పడంతో ప్రత్యూష పైఅంతస్తుకు వెళ్లి ఆత్మహత్య చేసుకుంది. కాగా గొడవ విషయంలో సృజన్ తల్లిదండ్రులు కూడా కొడుకుకే మద్దతు పలికారని ఏసీపీ పేర్కొన్నారు. మృతురాలి తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

తరగతి గదిలో ఉరేసుకుని విద్యార్థిని ఆత్మహత్య!

- సూర్యాపేట జిల్లా నడిగూడెం కేజీబీవీలో ఘటన



తనూషా మహాలక్ష్మి (ఫైల్)

నడిగూడెం: పదోతరగతి చదువుతున్న విద్యార్థిని తరగతి గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మంగళవారం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో జరిగింది. స్థానిక ఎస్ఐ గంధమళ్ల అజయ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మునగాల మండలం కలకోవ గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ నిమ్మ వెంకటేశ్వర్లు, వసుంధర దంపతులకు కుమార్తె తనూషా మహాలక్ష్మి (14), ఇద్దరు కుమారులు సంతానం. తనూషా మహాలక్ష్మి నడిగూడెం మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 10వ తరగతి చదువుతోంది. ఈనెల 4వ తేదీన వ్యక్తిగత కారణాలతో బాలిక ఇంటికి వెళ్లింది. తిరిగి 6వ తేదీన పాఠశాలకు వచ్చింది. ఆదివారం తనూషాను చూసేందుకు ఆమె తల్లి పాఠశాల వద్దకు వచ్చి భోజనం పెట్టి వెళ్లింది. సోమవారం సాయంత్రం ఆరు గంటల సమయంలో తండ్రి వెంకటేశ్వర్లు కూడా కుమార్తెను చూసి వెళ్లాడు. మంగళవారం తెల్లవారుజామున తనూషా పాఠశాలలోని తన తరగతి గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఉదయం ఐదు గంటల సమయంలో తనూషా స్నేహితురాలు తమ తరగతి గదిలోకి వెళ్లగా.. అప్పటికే తనూషా ఫ్యాన్‌కు చున్నీతో ఉరేసుకుని కనిపించింది. రాత్రి విధుల్లో ఉన్న హిందీ ఉపాధ్యాయురాలు సునీత పాఠశాల ప్రత్యేకాధికారి వెంకటరమణకు, పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతురాలి తండ్రి తన కుమార్తె మృతిపై అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేయడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఈ ఘటనతో విద్యాలయంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. కాగా, పాఠశాలను సూర్యాపేట జిల్లా విద్యాధికారి అశోక్, తహసీల్దార్ వి.సరిత, జీసీడీఓ తీగల పూలాన్, మునగాల సీఐ రామకృష్ణారెడ్డి పరిశీలించి సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.



డ్రాగన్ వేగాన్ని తగ్గిస్తున్న ప్యారాచూట్లు


సాగర జలాల్లో దిగిన క్యాప్సూల్


క్యాప్సూల్‌ను బోట్‌లోకి చేరుస్తున్న సిబ్బంది


రికవరీ షిప్ పైకి చేరిన క్షణాల్లో క్యాప్సూల్

శుభ ఆగమనం

భారత అంతరిక్ష చరిత్రలో సువర్ణాధ్యాయం

- భూమికి చేరుకున్న శుభాంశు బృందం
- 18 రోజుల ఐఎస్‌ఎస్ యాత్ర విజయవంతం

న్యూఢిల్లీ: భారత అంతరిక్ష చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగిన అద్భుతమైన అధ్యాయానికి ఘనమైన ముగింపు లభించింది. మన వ్యోమగామి, వాయుసేన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లా 18 రోజుల అంతరిక్ష యాత్రను విజయవంతంగా ముగించుకుని అంతరిక్ష కేంద్రం (ఐఎస్‌ఎస్) నుంచి క్షేమంగా తిరిగొచ్చారు. ఆయనతో పాటు యాగ్జియం–4 మిషన్ బృందంలోని మరో ముగ్గురు వ్యోమగాములను తీసుకుని స్పేస్ ఎక్స్ డ్రాగన్ 'గ్రేస్'వ్యోమనౌక భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం 4:45 గంటలకు ఐఎస్‌ఎస్ నుంచి విడివడి నింగి నుంచి నేలకేసి సుదీర్ఘయానం ప్రారంభించడం తెలిసిందే. 22.5 గంటల ప్రయాణం అనంతరం షెడ్యూల్ ప్రకారం అది మంగళవారం తెల్లవారుజామున 2.31 గంటలకు (భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:02కు) అమెరికాలో దక్షిణ కాలిఫోర్నియాలోని శాన్‌డీగో తీర సమీపంలో పసిఫిక్ సముద్ర జలాల్లో విజయవంతంగా దిగింది. తర్వాత కాసేపటికే ముందుగా అమెరికాకు చెందిన మిషన్ కెప్టెన్ పెగ్గీ వాట్సన్ డ్రాగన్ క్యాప్సూల్ నుంచి బయటికొచ్చారు. మిషన్ పైలట్‌గా వ్యవహరించిన 39 ఏళ్ల శుభాంశు, ఆ తర్వాత కొద్ది నిమిషాలకే నిండైన చిరునవ్వుల నడుమ బయటికి వచ్చి దేశవాసులను ఉద్దేశించి చేతులూపుతూ అభివాదం చేశారు. అప్పటిదాకా దేశవ్యాప్తంగా టీవీ తెరలకు అతుక్కుపోయి ఉత్కంఠభరితంగా వీక్షించిన ప్రజలంతా పెద్దపెట్టున హర్షధ్వానాలు చేశారు. భారత్‌మాతా కీ జై అంటూ ఆనందోత్సాహాలతో నినదించారు. శుభాంశు స్వస్థలమైన యూపీ రాజధాని లఖ్‌నవూలోనైతే సంబరాలు అంబరాన్నంటాయి. ఎవరిని చూసినా మిఠాయిలు పంచుకుంటూ, బాణసంచా కాలుస్తూ కన్పించారు. తనయుడు క్షేమంగా భూమికి తిరిగొచ్చిన క్షణాలను వీక్షించే క్రమంలో ఆయన తల్లిదండ్రులు ఆనందబాష్పాలు రాల్చారు. అమెరికాలోని ఫ్లోరిడాలో శుభాంశు భార్య కామ్నాది కూడా అదే పరిస్థితి! రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర మంత్రులు, విపక్ష నేతలు మొదలుకుని రాజకీయ తదితర రంగాల ప్రముఖులంతా శుభాంశును అభినందించారు. ''చరిత్రాత్మక అంతరిక్ష యాత్రను విజయవంతంగా ముగించుకుని భూమికి తిరిగొచ్చిన గ్రూప్ కెప్టెన్ శుభాంశు శుక్లాను దేశవాసులందరితో కలిసి అత్యంత సాదరంగా స్వాగతిస్తున్నా'' అంటూ మోదీ హర్షం వెలిబుచ్చారు. వైద్యపరీక్షలు తదితరాల అనంతరం శుభాంశు బృందాన్ని వారం రోజుల పాటు క్వారెంటైన్‌కు తరలించారు. ఇస్రో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన మానవసహిత అంతరిక్ష యాత్ర (గగన్‌యాన్)కు శుభాంశు ఐఎస్‌ఎస్ యానం భారీ ఊపునిచ్చింది. నాసా, ఇస్రో సంయుక్తంగా రూపొందించిన యాగ్జియం–4 మిషన్‌లో భాగంగా శుభాంశు, వాట్సన్‌తో పాటు స్లావోజ్ ఉజ్నాన్‌స్కీ, విస్నియెవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ) జూన్ 25న బయల్దేరి 26న ఐఎస్‌ఎస్ చేరడం తెలిసిందే. అక్కడ 18 రోజుల పాటు వారు వివిధ రకాలైన 60 ప్రయోగాలు నిర్వహించి తిరిగొచ్చారు.


క్యాప్సూల్ నుంచి బయటికొస్తూ శుభాంశు అభివాదం

విశేషాలు...

- శుభాంశు అంతరిక్ష, ఐఎస్‌ఎస్ యాత్రపై ఇస్రో రూ.550 కోట్లు వెచ్చించింది. ఈ యాత్రలో ఆయన సాధించిన అనుభవం 2027 కల్లా సాకారం చేసుకోవాలని తలపెట్టిన గగన్‌యాన్ ప్రాజెక్టుకు ఎంతగానో ఉపకరించనుంది.
- విస్నియెవ్‌స్కీ (పోలండ్), టిబర్ కపు (హంగరీ) కూడా తమ దేశాల నుంచి ఐఎస్‌ఎస్‌లో అడుగుపెట్టిన తొలి వ్యోమగాములుగా నిలిచారు.
- తనయుడు క్షేమంగా తిరిగి రావాలని ప్రార్థిస్తూ డ్రాగన్ క్యాప్సూల్ భూమిని చేరేదాకా ఆయన తల్లి ఆశాదేవి సుందరకాండ పారాయణం చేస్తూ గడిపారు.


లఖ్‌నవూలో శుభాంశు తల్లిదండ్రులు, బంధుమిత్రుల ఆనందోత్సాహాలు

ఇలా తిరిగొచ్చారు...

శుభాంశు బృందాన్ని తీసుకుని భారత కాలమానం ప్రకారం సోమవారం సాయంత్రం **4:45** గంటలకు ఐఎస్‌ఎస్ నుంచి బయల్దేరిన డ్రాగన్ వ్యోమనౌక 22.5 గంటల పాటు ప్రయాణించి మంగళవారం భూమిని చేరింది.

మధ్యాహ్నం 2:07 గంటలు: క్యాప్సూల్ భూ వాతావరణంలోకి ప్రవేశించే ముందు కక్ష్య నుంచి విడివడే ప్రక్రియ మొదలై 18 నిమిషాల పాటు కొనసాగింది.

2:27: సోలార్ ప్యానెళ్లు, రేడియేటర్లతో కూడిన ముందు భాగాన్ని క్యాప్సూల్ విజయవంతంగా వదిలించుకుంది.

2:33: తిరిగి క్యాప్సూల్ ముందు భాగాన్ని మూసివేసే ప్రక్రియ విజయవంతంగా జరిగింది.

2:43: గంటకు ఏకంగా 28 వేల కి.మీ. వేగంతో భూ వాతావరణంలో ప్రవేశించింది. ఆ రాపిడి ఫలితంగా ఏకంగా 1,600 నుంచి 1,900 డిగ్రీల సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రత పుట్టుకొచ్చింది. అంతటి వేడినీ డ్రాగన్ క్యాప్సూల్ తాలూకు హీట్ షీల్డ్ విజయవంతంగా తట్టుకుంది.

2:44: విపరీతమైన వేగం కారణంగా స్పేస్ ఎక్స్ గ్రౌండ్ స్టేషన్‌తో క్యాప్సూల్‌కు 11 నిమిషాల పాటు సంబంధాలు తెగిపోయాయి. అదే సమయంలో దాని వేగాన్ని తగ్గించే ప్రక్రియ మొదలైంది.

2:54: మళ్లీ సిగ్నల్స్ కలిశాయి.

2:59: భూమికి 5 కి.మీ. ఎత్తులో రెండు ప్యారాచూట్లు తెరుచుకుని వేగాన్ని చాలావరకు తగ్గించాయి.

3:00: 2 కి.మీ. ఎత్తులో ఉండగా మరో నాలుగు ప్యారాచూట్లు విచ్చుకోవడంతో క్యాప్సూల్ వేగం గంటకు 118 మైళ్లకు దిగివచ్చింది.

మధ్యాహ్నం 3:02 గంటలు: డ్రాగన్ క్యాప్సూల్ సురక్షితంగా పసిఫిక్ జలాల్లో దిగింది.

3:07: రికవరీకి తాము సిద్ధంగా ఉన్నట్టు మిషన్ కంట్రోల్‌కు పెగ్గీ వాట్సన్ సందేశమిచ్చారు

3:10: అప్పటికే పసిఫిక్ జలాల్లో సిద్ధంగా ఉన్న స్పేస్‌ఎక్స్ రికవరీ షిప్‌తో పాటు బోట్లు 'షానన్' క్యాప్సూల్‌ను సమీపించాయి.

3:15: క్యాప్సూల్‌ను సిబ్బంది సురక్షితంగా వెలికితీశారు.

3:30: దాన్ని జాగ్రత్తగా నౌక పైకి చేర్చారు.

3:41: వ్యోమగాములు బయటికి వచ్చేందుకు వీలుగా సిబ్బంది క్యాప్సూల్ మూతను తెరిచారు.

3:49: మిషన్ కమాండర్ పెగ్గీ వాట్సన్ బయటికి వచ్చారు.

3:52: శుభాంశు, ఆ తర్వాత వ్యోమగాములు ఉజ్నాన్‌స్కీ, కపు క్యాప్సూల్ నుంచి బయటికొచ్చారు. 20 రోజుల అంతరిక్ష యాత్ర అనంతరం తిరిగి భూ గురుత్వాకర్షణ శక్తికి అలవాటు పడి వ్యోమగాములు తమ కాళ్లపై నిలబడేందుకు సిబ్బంది సహకరించారు. అనంతరం నౌక మీదే వారికి పలురకాల వైద్య పరీక్షలు నిర్వహించారు.

4:10: తర్వాత హెలికాప్టర్లో ముందుగా తీరానికి, అనంతరం క్వారంటైన్ నిమిత్తం నాసా కేంద్రానికి తరలించారు.

''యాగ్జియం-4 మిషన్‌కు సారథ్యం వహించి సురక్షితంగా తిరిగొచ్చిన శుభాంశుకు, ఈ చరిత్రాత్మక మిషన్‌లో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ నా అభినందనలు''
- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము

''ఐఎస్‌ఎస్‌లో అడుగుపెట్టిన తొలి భారతీయునిగా శుభాంశు సాధించిన ఘనత కోట్లాది మంది భారత యువత తమ కలలను నిజం చేసుకునేందుకు తిరుగులేని స్ఫూర్తిగా నిలిచింది. గగన్‌యాన్ ప్రాజెక్టు దిశగా ఈ యాత్ర ఓ తిరుగులేని మైలురాయి''
- ప్రధాని మోదీ

శుభాంశు యాత్ర హైలైట్స్

- రాకేశ్ శర్మ అనంతరం 41 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత అంతరిక్షంలో వెళ్లిన తొలి భారతీయునిగా శుభాంశు రికార్డు సృష్టించారు. ఐఎస్‌ఎస్‌లోకి అడుగు పెట్టిన తొలి భారతీయుడు కూడా ఆయనే. ఆయన అంతరిక్ష యాత్ర సాగిన తీరు...
- 2024లో యాగ్జియం–4 వాణిజ్య మిషన్‌ను ఇస్రో, నాసా సంయుక్తంగా ప్రకటించాయి.
- 2025 మొదట్లోనే ప్రయోగం జరగాల్సింది. ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా పదే పదే వాయిదా పడుతూ వచ్చింది.
- జూన్ 25న స్పేస్ ఎక్స్ ఫాల్కన్–9 రాకెట్ ద్వారా యాగ్జియం–4 మిషన్ అంతరిక్షానికి బయల్దేరింది.
- 28 గంటల సుదీర్ఘ ప్రయాణం అనంతరం 26న విజయవంతంగా ఐఎస్‌ఎస్‌ను చేరింది.
- అక్కడ శుభాంశు బృందం 18 రోజుల పాటు గడిపింది. ఆయన పలు కీలక ప్రయోగాలు చేయడంతో పాటు ప్రధాని మోదీ, విద్యార్థులు, తన తల్లిదండ్రులతో సంభాషించారు.
- జూలై 13న శుభాంశు బృందం తిరుగు ప్రయాణ సన్నాహాలు మొదలయ్యాయి. ఐఎస్‌ఎస్‌లోని సహచరులు వారికి సాదరంగా వీడ్కోలు పలికారు.
- జూలై 14 సాయంత్రం డ్రాగన్ వ్యోమనౌకలో శుభాంశు బృందం తిరుగు పయనమైంది.
- జూలై 15 మధ్యాహ్నం 3:01 గంటలకు కాలిఫోర్నియా తీర సమీపంలో సురక్షితంగా దిగింది.

ఉగ్రవాదంపై పోరులో రాజీ వద్దు

ఎస్సీవో వ్యవస్థాపక లక్ష్యం నుంచి దూరం కావొద్దు • షాంఘై సహకార సంస్థ సదస్సులో విదేశాంగ మంత్రి జైశంకర్

తియాంజిన్: ఉగ్రవాదం, తీవ్రవాదం, వేర్పాటువాదాన్ని నియంత్రించాలన్న ఉన్నత లక్ష్యంతో షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) ఏర్పాటయ్యిందని, ఆ లక్ష్యానికి కట్టుబడి ఉండాలని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ పేర్కొన్నారు. ఉగ్రవాదం, తీవ్రవాదం విసురుతున్న సవాళ్లను ఎదుర్కొనే విషయంలో ఎట్టిపరిస్థితుల్లోనూ రాజీపడొద్దని స్పష్టంచేశారు. మంగళవారం చైనాలోని తియాంజిన్‌లో షాంఘై సహకార సంస్థ విదేశాంగ మంత్రుల సదస్సులో జైశంకర్ ప్రసంగించారు. జమ్మూకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రస్తావించారు. జమ్మూకశ్మీర్‌లో పర్యాటక రంగాన్ని దెబ్బకొట్టడంతోపాటు ప్రజల మధ్య మతపరంగా చిచ్చుపెట్టాలన్న ఉద్దేశంతో ముష్కరులు ఈ దాడికి పాల్పడ్డారని ఆరోపించారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో సహా పెకలించి వేసేందుకు భారత ప్రభుత్వం కట్టుబడి ఉందని తేల్చిచెప్పారు. ఇందులో భాగంగానే 'ఆపరేషన్ సిందూర్' చేపట్టినట్లు వెల్లడించారు. పాకిస్తాన్ ఉగ్రవాదుల స్థావరాలు, శిక్షణ శిబిరాలపై భారత సైన్యం దాడులు చేయడాన్ని సరైన చర్యగా అభివర్ణించారు. ఎస్సీఓ సభ్యదేశాలు కీలక రంగాల్లో పరస్పరం సహకరించుకోవాలని, కలిసికట్టుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఈ సహకారం పరస్పర గౌరవంపై ఆధారపడి ఉండాలన్నారు. ఒక దేశ ప్రాదేశిక సమగ్రత, సార్వభౌమతాన్ని మరో దేశం తప్పనిసరిగా గౌరవించాలని స్పష్టంచేశారు.

జిన్‌పింగ్‌తో జైశంకర్ భేటీ

భారత విదేశాంగ శాఖ మంత్రి ఎస్.జైశంకర్ చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్‌తో సమావేశమయ్యారు. షాంఘై సహకార సంస్థ(ఎస్సీఓ) సభ్యదేశాల విదేశాంగ మంత్రులతో కలిసి ఆయన మంగళవారం ఉదయం చైనా రాజధాని బీజింగ్‌లో జిన్‌పింగ్‌ను కలిశారు. భారత్-చైనా ద్వైపాక్షిక సంబంధాల్లో తాజా పరిణామాల గురించి చైనా అధినేతకు వివరించినట్లు జైశంకర్ 'ఎక్స్'లో పోస్టుచేశారు. భారత రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీల తరపున జిన్‌పింగ్‌కు శుభాకాంక్షలు తెలియజేసినట్లు పేర్కొన్నారు. ఎస్సీఓ సదస్సులో పాల్గొనేందుకు జైశంకర్ సోమవారం చైనాకు చేరుకున్నారు. భారత్, చైనా సైనికుల మధ్య 2020 జూన్‌లో గల్వాన్ లోయలో జరిగిన ఘర్షణ తర్వాత భారత విదేశాంగ మంత్రి చైనాలో పర్యటిస్తుండడం ఇదే మొదటిసారి.

చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో జైశంకర్


మాస్కోను కొట్టగలవా?

- రష్యా నడిబొడ్డుపై నిప్పులు కురిపించగలవా?
- ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి ట్రంప్ సూటి ప్రశ్నలు
- ఆయుధాలందిస్తే అంత పనీచేస్తానన్న జెలెన్‌స్కీ


ట్రంప్


జెలెన్‌స్కీ

వాషింగ్టన్: దీటైన అస్త్రశస్త్రాలు అందిస్తే మాస్కోను కొట్టగలవా? రష్యాపై భీకరంగా దాడిచేయగలవా? అని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీకి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సూటి ప్రశ్న వేశారు. జూలై నాలుగో తేదీన జెలెన్‌స్కీకి ఫోన్‌చేసిన మాట్లాడిన సందర్భంగా ట్రంప్, వొలదిమిర్ జెలెన్‌స్కీల మధ్య జరిగిన సంభాషణ తాలూకు విశేషాలను తాజాగా అంతర్జాతీయ మీడియా బయటపెట్టింది. ఉక్రెయిన్ రాజధాని నగరం కీవ్‌పై క్షిపణుల వర్షం కురిపిస్తూ తీవ్ర నష్టం చేకూరుస్తున్న రష్యాకు సైతం అదే స్థాయిలో ఆస్తి, ప్రాణ నష్టం కల్గించాలని జెలెన్‌స్కీకి ట్రంప్ సూచించినట్లు తెలుస్తోంది. ఇరునేతల సంభాషణ వివరాలను కొన్ని అత్యున్నత వర్గాలు వెల్లడించాయని అంతర్జాతీయ మీడియా పేర్కొంది. '' చూడు వొలదిమిర్.. నువ్వు రష్యా రాజధాని మాస్కో నగరంపై క్షిపణులతో దాడి చేయగలవా?'' అని ట్రంప్ ప్రశ్నించగా.. '' తప్పకుండా. మీరు సరైన మిస్సైళ్లు ఇస్తే దాడి చేసి చూపిస్తా'' అని జెలెన్‌స్కీ హామీ ఇచ్చారు. '' మీకు కావాల్సిన సుదీర్ఘ శ్రేణి క్షిపణులను అందిస్తాం. రష్యాలోని సెయింట్‌పీటర్స్‌బర్గ్‌ను ధ్వంసం చేయగలరా?'' అని ట్రంప్ ప్రశ్నించగా.. '' ఆ స్థాయిలో దాడికి సరిపడా ఆయుధాలు సమకూరిస్తే తప్పకుండా దాడిచేస్తాం'' అని జెలెన్‌స్కీ మాటిచ్చారు. '' దాడుల్లో రక్తమోడుతూ ఉక్రెయిన్‌వాసులు పడుతున్న బాధను రష్యన్లు అనుభవించాలి. మీ దాడులతో వాళ్లకూ నొప్పి తెలిసిరావాలి'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌తో సయోధ్య కుదుర్చుకోవాలని, లేదంటే 50 రోజుల్లోపు సుంకాల సుత్తితో మోదుతానని రష్యాను ట్రంప్ హెచ్చరించిన మరుసటి రోజే ఈ సంభాషణల అంశం తెరమీదకు రావడం గమనార్హం. శాంతి ఒప్పందం చేసుకోండని ఎంతమొత్తుకున్నా రష్యా వినిపించుకోవట్లేదని, సహనం నశించి ట్రంప్ ఇలా జెలెన్‌స్కీని దాడులు చేయగలవా? అని ప్రశ్నించారని తెలుస్తోంది. అయితే సంభాషణల వార్తపై అటూ శ్వేతసౌధం గానీ, ఇటు ఉక్రెయిన్ అధ్యక్ష కార్యాలయంగానీ స్పందించలేదు. నాటో కూటమి ప్రధాన కార్యదర్శి మార్క్ రుట్టేతో కలిసి శ్వేతసౌధంలో ట్రంప్ సోమవారం మీడియాతో మాట్లాడారు. '' పుతిన్ అంత సులభంగా లొంగే మనిషి కాదు. మన నేతలనే మభ్యపెట్టాడు. క్లింటన్ మొదలు జార్జ్ బుష్, ఒబామా, బైడెన్‌దాకా అమెరికా అధ్యక్షులను తన మాటలతో మభ్యపెట్టాడు. నేను వాళ్లలాగా ఫూల్‌ను కాబోను. బిలియన్ల డాలర్ల విలువైన అత్యాధునిక ఆయుధాలను ఉక్రెయిన్‌కు సరఫరా చేస్తా. నాటో సభ్యదేశాలు ఆర్డర్ ఇచ్చిన 17 గగనతల రక్షణ వ్యవస్థ మిస్సైల్ లాంఛర్లన్నీ ఉక్రెయిన్‌కు పంపిస్తాం'' అని ట్రంప్ వ్యాఖ్యానించారు.

నిమిష మరణశిక్ష అమలు వాయిదా

కేరళ నర్సుకు యెమెన్‌లో భారీ ఊరట

తిరువనంతపురం/న్యూఢిల్లీ: వ్యాపార భాగస్వామిని హత్యచేసిందన్న ఆరోపణలపై యెమెన్‌లో మరణశిక్షను ఎదుర్కొంటున్న భారతీయ నర్సు నిమిష ప్రియకు చివరి నిమిషంలో భారీ ఊరట లభించింది. యెమెన్ కోర్టు నిర్ణయానుసారం జూలై 16వ తేదీన ఆమెను అక్కడ ఉరితీయాల్సి ఉండగా చివరి నిమిషంలో మరణశిక్ష అమలును స్థానిక జైలు అధికారులు నిలుపుదల చేశారు. బాధిత కుటుంబానికి పరిహారం భారీ నగదు మొత్తం ముట్టజెప్పడంతో మరోసారి పునరాలోచన చేయాలని భారత ప్రభుత్వంతోపాటు పలు వర్గాల నుంచి వచ్చిన ఒత్తిడికి తలొగ్గి యెమెన్ అధికారులు శిక్షను తాత్కాలికంగా వాయిదా వేసినట్లు తెలుస్తోంది. దీంతో మరణశిక్ష అమలును మరింతకాలం నిలుపుదల చేయొచ్చనే ఆశలు చిగురించాయి. బాధిత కుటుంబంతో పరస్పర అంగీకార ఒప్పందం కుదుర్చుకునేందుకు నిమిష ప్రియ కుటుంబానికి తగు గడువు ఇవ్వాలని భారత ప్రభుత్వం, ప్రముఖ సున్నీ ముస్లిం మతబోధకుడు కంథపురం ఏపీ అబూబకర్ ముస్లియార్ చేసిన అభ్యర్థనను అక్కడి అధికారులు ఆలకించారు. 2017 జూలైలో యెమెన్ పౌరుడిని హత్యచేసిందన్న ఆరోపణలు రుజువుకావడంతో ఆమెకు శిక్ష ఖరారైన విషయం తెల్సిందే.

వెల్లువెత్తిన సంతోషం

కేరళలోని పాలక్కడ్ జిల్లాలోని కొల్లెన్‌గోడ్‌కు చెందిన నిమిష ప్రియ మరణశిక్ష అమలు ఆగడంతో ఆమె కుటుంబంతోపాటు కేరళ రాజకీయ, మత నాయకులు సంతోషం వ్యక్తంచేశారు. శిక్షను ఎలాగైనా రద్దుచేసి భారత్‌కు తిరిగి తీసుకొచ్చేందుకు అందరం సమష్టిగా శాయశక్తులా కృషిచేస్తున్నామని నిమిష భర్త టోమీ థామస్ చెప్పారు. శిక్ష అమలుకు కృషిచేసిన వారందరికీఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. తలాల్‌ను హత్యచేసిన కేసులో 2018లో కోర్టు ఆమెను దోషిగా తేల్చి ఉరిశిక్ష ఖరారు చేసింది. శిక్షను రద్దుచేయాలని ఆమె చేసిన అభ్యర్థనను కోర్టు తర్వాత యెమెన్ సుప్రీం జ్యుడీషియల్ కౌన్సిల్‌కు పంపించగా కౌన్సిల్ ఆమె అభ్యర్థనను 2023 నవంబర్‌లో తిరస్కరించింది. దీంతో మరణశిక్ష అనివార్యమైంది. చివరి ప్రయత్నంగా నిమిష కుటుంబం 'బ్లడ్ మనీ' కింద బాధిత కుటుంబానికి రూ.8.6 కోట్లు పరిహారంగా ఇస్తామని ప్రతిపాదించింది. కానీ ఆనాడు బాధిత కుటుంబం స్పందించకపోవడం తెల్సిందే. నిమిష ప్రస్తుతం యెమెన్ రాజధాని సనాలోని జైలులో ఖైదీగా ఉన్నారు. ఈ నగరం ప్రస్తుతం ఇరాన్ మద్దతుతో తిరుగుబాటు చేస్తున్న హౌతీ రెబల్స్ అధీనంలో ఉంది.



హెచ్చరిక లేబుళ్లు కాదు

సలహా బోర్డులే • సమోసా తదితర చిరుతిళ్లపై కేంద్రం

న్యూఢిల్లీ: భారతీయులు అమితంగా ఇష్టపడి తినే సమోసా, జిలేబీ వంటి చిరుతిళ్లలో చక్కెర, నూనె శాతం ఎక్కువగా ఉంటాయని స్పష్టంగా తెలిపేలా హెచ్చరిక లేబుళ్లు పెట్టాలంటూ వచ్చిన వార్తల్లో వాస్తవం లేదని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. సమోసా, జిలేబీ, పకోడీ, వడా పావ్ మొదలు చాయ్ బిస్కట్ దాకా దాదాపుగా అన్నిరకాల చిరుతిళ్ల ప్యాకెట్లపైనా వాటిలోని నూనెలు, చక్కెర, కొవ్వు తదితరాల శాతాన్ని ప్రముఖంగా కనిపించేలా హెచ్చరిక లేబుళ్లను ముద్రించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని సోమవారం వార్తలువెలువడ్డాయి. ఈ వార్తల్లో వాస్తవం లేదని ప్రభుత్వం మంగళవారం స్పష్టంచేసింది. అధిక చక్కెర, నూనెలున్న ఇలాంటి చిరుతిళ్లపై ప్రజల్లో మరింత అవగాహన పెరిగేలా దేశవ్యాప్తంగా పాఠశాలలు, కార్యాలయాలు, క్యాంటీన్లు, కెఫేరియన్లు, లాబీలు, సమావేశ మందిరాల్లో ఆరోగ్య సలహా బోర్డులు మాత్రమే ప్రదర్శించాలని సలహా ఇచ్చినట్లు కేంద్రం మంగళవారం స్పష్టతనిచ్చింది. '' చిరుతిళ్లపై ముఖ్యంగా భారతీయ పిండివంటలు, ఇతర వంటకాల ప్యాకెట్లపై హెచ్చరిక లేబుల్ ముద్రించాలని మేం ఎలాంటి ఆరోగ్య అడ్వైజరీ జారీచేయలేదు. చక్కెర, నూనె ఎక్కువుండే వంటకాలపై ప్రజావగాహన పెరిగేలా చూడాలని సూచించాం'' అని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఒక వివరణ ఇచ్చింది.

ఖైదీలకు ఖరీదైన ఆహారం ఇవ్వకపోవడం

ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కాదు

న్యూఢిల్లీ: జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న ఖైదీలకు ఖరీదైన ఆహారం ఇవ్వకపోవడం ప్రాథమిక హక్కుల ఉల్లంఘన కిందకు రాదని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 కింద జీవించే హక్కు ఖైదీలకు సైతం వర్తిస్తుందని, అయితే జైల్లో ఖరీదైన ఆహారం లేదా విలాసవంతమైన వస్తువులు కావాలని కోరే హక్కు వారికి లేదని వెల్లడించింది. ఖైదీలకు వారికి ఇష్టమైన లేదా ఖరీదైన భోజన పదార్థాలను ఇవ్వకపోవడాన్ని ప్రాథమిక హక్కుల ఉల్లంఘనగా పరిగణించలేమని పేర్కొంది. జైళ్లలో శిక్ష అనుభవిస్తున్న దివ్యాంగులు సహా ఖైదీలందరికీ తగిన ఆహారం అందించేందుకు చర్యలు తీసుకోవడం ప్రభుత్వ బాధ్యత అని వెల్లడించింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఖైదీలకు వారి అవసరాలు తగ్గట్టుగా పోషక విలువలున్న ఆహారం అందించాలని సూచించింది. జైళ్లు అనేవి ఖైదీల్లో పరివర్తన తెచ్చే కేంద్రాలు మాత్రమేనని, పౌర సమాజంలోని విలాసవంతమైన జీవితాన్ని ఖైదీలకు ఇచ్చేవి కావని స్పష్టంచేసింది. తమిళనాడుకు చెందిన ఎల్.మురుగనాథమ్ అనే వ్యక్తి అడ్వొకేట్‌గా పని చేస్తున్నాడు. ఓ భూవివాదంలో ఆయనకు శిక్ష పడింది. ఆయన కండరాల సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. జైల్లో తనకు నిత్యం పౌష్టికాహారం, గుడ్లు, కోడిమాంసం, డ్రైఫ్రూట్స్ ఇవ్వడం లేదని ఆరోపిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశాడు. దీనిపై జస్టిస్ జె.బి.పార్దివాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. అనారోగ్యంతో బాధపడుతున్న ఖైదీలకు, దివ్యాంగ ఖైదీలకు చికిత్స అందించేందుకు జైళ్లలో తగిన ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

బిస్కెట్లు, చాకెట్ల బాక్సుల్లో

రూ.62 కోట్ల కొకైన్

ముంబై ఎయిర్‌పోర్టులో పట్టుబడిన మహిళ

ముంబై: దోహా నుంచి ముంబైకి వచ్చిన ఓ భారతీయ మహిళ నుంచి దొంగచాటుగా తరలిస్తున్న రూ.62 కోట్ల విలువైన డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విమానాశ్రయం నుంచి బయటకు వెళ్తున్న ఈ మహిళను మంగళవారం పట్టుకున్నామని డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్‌ఐ)వర్గాలు తెలిపాయి. దోహా నుంచి ముంబైకి ఈ నెల 14వ తేదీన వస్తున్న మహిళ దేశంలోకి డ్రగ్స్‌ను స్మగ్లింగ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు అందిన నిఘా వర్గాల సమాచారం మేరకు తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఓ మహిళ వద్ద ఉన్న ఓరియో బిస్కెట్ల ఆరు పెద్ద బాక్సులు, చాక్లెట్లున్న మూడు బాక్సులను క్షుణ్ణంగా పరిశీలించారు. మొత్తం 9 బాక్సుల్లోనూ తెల్లటి పౌడర్ నింపిన క్యాప్స్యూల్స్ కనిపించాయి. ఇలాంటి మొత్తం 6,261గ్రాముల బరువున్న 300 క్యాప్స్యూల్స్‌లను ఒక్కోటీ తెరిచి పరిశీలించగా అది కొకైన్ అనే డ్రగ్‌గా తేలింది. దీని విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో రూ.62.6 కోట్లని సమాచారం. ఆ మహిళను అధికారులు అరెస్ట్ చేసి, దర్యాప్తు చేపట్టారు. జూన్ 22న ముంబై విమానాశ్రయంలో డీఆర్‌ఐ అధికారులు సియెర్రా లియోన్ నుంచి వచ్చిన ప్రయాణికుడి నుంచి రూ.11.39 కోట్ల విలువైన కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు.

విదేశాంగ విధాన వినాశనమే జైశంకర్ లక్ష్యం: రాహుల్

న్యూఢిల్లీ: విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ తీరును కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. చైనా అధినేత జిన్‌పింగ్‌తో సమావేశమై సరిహద్దు పరిణామాలను వివరించడాన్ని ఆక్షేపిస్తూ మంగళవారం ఆయన 'ఎక్స్'లో పోస్టు చేశారు. భారత విదేశాంగ విధానాన్ని నాశనం చేయడానికే జైశంకర్ కంకణం కట్టుకున్నారని మండిపడ్డారు. ఇప్పుడిక చైనా విదేశాంగ మంత్రి భారత్ వచ్చి ప్రధాని మోదీని కలిసి ద్వైపాక్షిక సంబంధాలపై వివరణ ఇస్తారని భావిస్తున్నానంటూ వ్యంగ్యాస్త్రాలు విసిరారు. చైనాతో సంబంధాలు మెరుగుపడుతున్నాయని జైశంకర్ చెప్పడం పట్ల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. ''ఆపరేషన్ సిందూర్ సమయంలో పాకిస్తాన్‌కు చైనా మద్దతిచ్చింది. ఆయుధాలు పరీక్షించుకోవడానికి పాక్‌ను వాడుకుంది. ఈ విషయం జైశంకర్ మర్చిపోయారా?'' అని ప్రశ్నించారు.

క్లుప్తంగా...

వేధింపుల కుమారుడి నుంచి రక్షించండి

వృద్ధ దంపతుల దీక్ష



మునుగోడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్ష చేస్తున్న వృద్ధ దంపతులు

మునుగోడు: అలనాపాలనా చూడాల్సిన కుమారుడే తమను ఇబ్బందులకు గురిచేస్తున్నాడని, అతని నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ వృద్ధ దంపతులు మంగళవారం నల్లగొండ జిల్లా మునుగోడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షకు దిగారు. బాధితులు తెలిపిన వివరాలివి. మునుగోడు మండలం సింగారం గ్రామానికి చెందిన కోడి చంద్రయ్య, అంజమ్మ దంపతులకు ఒక కుమారుడు, కుమార్తె సంతానం. ఇద్దరికీ వివాహాలు చేశారు. అయితే పదేళ్ల క్రితమే కుమారుడు ఆస్తిలో వాటా కోరగా.. గ్రామ పెద్దల సమక్షంలో తల్లిదండ్రులు కొంత ఆస్తి ఇచ్చి బాండ్ పేపర్ రాసుకున్నారు. మిగిలిన ఆస్తులు అమ్మి కుమార్తె వివాహం చేసేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. కానీ గతంలో చేసుకున్న ఒప్పందం ప్రకారం కాకుండా.. మిగిలిన ఆస్తి కూడా రాసివ్వాలని, తల్లిదండ్రుల బాగోగులు చూడనని కుమారుడు వివాదానికి దిగుతున్నాడు. దీంతో అధికారులు న్యాయం చేయాలని తల్లిదండ్రులు మునుగోడు తహసీల్దార్ కార్యాలయం ఎదుట దీక్షకు దిగారు.

ఇద్దరు ఉపాధ్యాయుల హత్య

ఇన్‌ఫార్మర్ల నెపంతో మావోయిస్టుల దుశ్చర్య

చర్ల: పోలీస్ ఇన్‌ఫార్మర్లుగా అనుమానిస్తూ ఇద్దరు ఉపాధ్యాయులను కిడ్నాప్ చేసిన మావోయిస్టులు.. వారిని హతమార్చారు. వివరాలివి. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలోని పీలేరు, టేకుగూడ గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు సురేశ్, వినోద్‌ను సోమవారం సాయంత్రం మావోయిస్టులు కిడ్నాప్ చేశారు. వారిద్దరినీ విచారించిన తర్వాత ఇన్‌ఫార్మర్లుగా పేర్కొంటూ హత్య చేశారు. మృతదేహాలను నేషనల్ పార్క్ అటవీ ప్రాంతంలో పడేశారని మంగళవారం ఉదయం గ్రామస్తుల ద్వారా సమాచారం అందింది. అయితే ఈ ఘటనను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అధికారికంగా ధ్రువీకరించలేదు.

బీజేపీకి కొత్త కళాకారులు

భువనగిరి ఎంపీ చామల ఎద్దేవా

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బీజేపీలో కొత్త కళాకారులు వచ్చారని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. ఆయన మంగళవారం గాంధీభవన్‌లో రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్, టీపీసీసీ అధికార ప్రతినిధి శ్రీకాంత్‌యాదవ్‌లతో కలిసి విలేకరులతో మాట్లాడారు. బీజేపీ కొత్త అధ్యక్షుడు రాంచందర్‌రావుకు సబ్జెక్టు లేదని, ఆయన విషయ పరిజ్ఞానం పెంచుకుంటే మంచిదని సూచించారు. నరేంద్రమోదీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు.. అక్కడి రేషన్ కార్డుల్లో అప్పటి ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్ ఫొటో ముద్రించారా? అని ప్రశ్నించారు. అలా చేసిఉంటే.. తాము కూడా మోదీ ఫొటోలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. రాంచందర్‌రావు తన రాజకీయాల కోసం మతాల మధ్య చిచ్చు పెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో కూడా.. ముస్లిం మైనార్టీలు బీసీల్లో ఉన్నారన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్నప్పుడు ఏ ఒక్కరోజూ తుంగతుర్తి నియోజకవర్గ అభివృద్ధి గురించి మాట్లాడని జగదీశ్‌రెడ్డి.. ఇప్పుడు ఏదేదో మాట్లాడుతున్నారని విమర్శించారు.

కళ్లలో కారం చల్లి కాల్చి చంపారు

సీపీఐ నేత చందు రాథోడ్ దారుణ హత్య..

- అతి సమీపం నుంచి కాల్పులు.. అక్కడికక్కడే కుప్పకూలిన వైనం
- హైదరాబాద్‌లో ఘటన
- హత్యలో నలుగురు పాల్గొన్నట్లు ఆధారాలు
- రంగంలోకి దిగిన పది ప్రత్యేక బృందాలు



భర్త మృతదేహం వద్ద విలపిస్తున్న నారీబాయి (ఇన్‌సెట్) చందు రాథోడ్ (ఫైల్)

సాక్షి, హైదరాబాద్/మలక్‌పేట: సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేతావత్ చందు రాథోడ్ అలియాస్ చందు నాయక్ (50) దారుణ హత్యకు గురయ్యారు. హైదరాబాద్ మలక్‌పేట పోలీసుస్టేషన్ పరిధిలోని శాలివాహననగర్ పార్కులో వాకింగ్ పూర్తి చేసుకుని ఇంటికి వెళ్తుండగా దుండగుల కాల్పుల్లో చనిపోయారు. కళ్లలో కారం చల్లిన నిందితులు అతి సమీపం నుంచి కాల్పులు జరపడంతో ఆయన శరీరంలోకి మూడు తూటాలు దూసుకుపోయాయి. ఈ హత్యలో నలుగురు ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు గుర్తించిన పోలీసులు.. పరోక్షంగా సహకరించిన వారి వివరాలు ఆరా తీస్తున్నారు. మూడేళ్ల క్రితం ఎల్బీనగర్ ఠాణాలో నమోదైన హత్య కేసులో చందు నిందితుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ప్రతీకారం, భూ వివాదాలతోపాటు వివాహేతర సంబంధం కోణాన్ని పరిగణనలోకి తీసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు, హతుడి కుటుంబీకులు, ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.

వసూళ్లు అడ్డుకోవడంతో వివాదాలు

నాగర్‌కర్నూల్ జిల్లా నర్సాయిపల్లికి చెందిన చందు.. భార్య నారీబాయి, కుమారుడు సిద్ధు, కుమార్తె సింధులతో కలిసి దిల్‌సుఖ్‌నగర్ సమీపంలోని విద్యుత్‌నగర్‌లో ఉంటున్నారు. ప్రస్తుతం సిద్ధు కెనడాలో ఎంటెక్ చదువుతుండగా... సింధు గ్రూప్స్‌కు సన్నద్ధమవుతోంది. చందు విద్యార్థి దశలో ఎస్‌ఎఫ్‌ఐలో, కార్మిక నాయకుడిగా సీఐటీయూలో పని చేశారు. ఎల్బీనగర్ ఏరియా సీపీఎం నాయకుడిగా నాగోల్ శ్రీసాయినగర్‌లోని స్థలాల్లో పేదలతో గుడిసెలు వేయించారు. 2010లో సీపీఐలో చేరి భూపోరాటం చేసి పట్టాలు ఇప్పించారు. సీపీఐ (ఎంఎల్) నాయకుడు రాజేష్‌తో కొన్నాళ్లుగా చందుకు విభేదాలున్నాయి. కుంట్లూర్ రావినారాయణరెడ్డి నగర్‌లోని మూడెకరాల భూమిలో గుడిసెలు వేసుకున్న వారి నుంచి రాజేష్ తదితరులు డబ్బులు వసూలు చేస్తుండటాన్ని చందు అడ్డుకున్నారు. దీంతో రాజేష్, సుధాకర్, మున్నా, రాయుడుతో కొన్నాళ్లుగా గొడవలు జరుగుతున్నాయి.

వాకింగ్ చేసిన పార్కు బయటే...

రాజేశ్‌తోపాటు మరికొందరు సోమవారం రాత్రి కారులో చందు ఇంటి సమీపంలో సంచరించడాన్ని నారీబాయి గమనించి చందును హెచ్చరించారు. మంగళవారం ఉదయం భార్య, కుమార్తెతో కలిసి చందు శాలివాహననగర్ పార్కులో వాకింగ్ చేశారు. 7.30 గంటల ప్రాంతంలో బయటకు రాగా.. అక్కడే కారులో రాజేష్ కనిపించడంతో నారీబాయి హెచ్చరించారు. 'నాకేం కాదు. ఏం భయం లేదు. మీరు ఇంటికి వెళ్లండి'అంటూ భార్య, కుమార్తెను పంపేశాడు. పార్కు వెస్ట్ గేట్ నుంచి కుడి వైపు రోడ్డులో కారు వద్దకు వెళ్తుండగా అందులోంచి దిగిన ఇద్దరు చందు కళ్లలో కారం కొట్టారు. అప్రమత్తమైన ఆయన తప్పించుకోవడానికి వెనక్కు పరిగెత్తగా.. పార్కు గేటు వద్ద ఉన్న ఇసుకలో కాలు జారి పడిపోయారు. సమీపంలోకి వచ్చిన ఇద్దరు పిస్టల్‌తో అతని ఛాతీ, పొట్ట భాగాల్లో కాల్చారు. రక్తం మడుగులో ఉన్న అతడిని కాలుతో వెనక్కు తిప్పి తలపై మరో రౌండ్ కాల్చి కారులో పారిపోయారు.

సెల్ఫ్ డ్రైవింగ్ కారు అద్దెకు తీసుకుని...

ఘటనాస్థలి వద్ద ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డయిన దృశ్యాల ఆధారంగా దుండగులు స్విఫ్ట్ (టీఎస్ 08 హెచ్‌డబ్ల్యూ 0875) కారులో వచ్చినట్లు గుర్తించారు. ఇది పీర్జాదిగూడకు చెందిన ఓ మహిళ పేరుతో రిజిస్టరై ఉంది. ఆమె దీన్ని కొత్తపేట కేంద్రంగా కార్యకలాపాలు సాగించే ఓ సెల్ఫ్ డ్రైవింగ్ కార్ ఏజెన్సీకి కాంట్రాక్టుకు ఇచ్చారు. సోమవారం ఆన్‌లైన్‌లో ఆ కారును బుక్ చేసుకున్న ఏడుకొండలు అనే వ్యక్తి తీసుకుని వెళ్లారు. అతడితోపాటు రాజేష్, ప్రశాంత్, మరొకరు ప్రత్యక్షంగా హత్యలో పాల్గొన్నట్లు పోలీసులు గుర్తించారు. ఏడుకొండలు కారు తీసుకెళ్లి అద్దెకు ఇచ్చిన సంస్థకు అప్పగించి పారిపోయారు. క్లూస్ టీమ్ ఘటనాస్థలిలో మూడు ఖాళీ క్యాట్రిడ్జ్‌లు, రెండు పేలని తూటాలను స్వాధీనం చేసుకుంది. పేలింది నాటు తుపాకీ అని, తూటాలు 7.65 ఎంఎం క్యాలిబర్‌కు చెందినవిగా తేల్చారు.



ఆగంతకులు పారిపోయిన కారు

భానుచందర్ హత్య కేసులో నిందితుడు...

చందు 2022లో జరిగిన రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ ప్రధాన కార్యదర్శి పదిర భానుచందర్ హత్య కేసులో నిందితుడిగా ఉన్నాడు. భూ వివాదాల నేపథ్యంలో నాగోలుకు చెందిన భాను చందర్‌ను, మన్సూరాబాద్‌కు చెందిన సీపీఐ నాయకుడు కందుల సుధాకర్, చందు తదితరులు ఆ ఏడాది ఏప్రిల్ 16న కిడ్నాప్ చేశారు. యాదాద్రి జిల్లా తిరుమలగిరి వద్ద అతడిని హత్య చేసి మృతదేహాన్ని ఖమ్మం జిల్లా పాలేరు రిజర్వాయర్ సమీపంలో పడేశారు. ఈ కేసులో పోలీసులు చందుతోపాటు మిగిలిన నిందితులను అరెస్టు చేశారు.


రంగంలోకి పది ప్రత్యేక బృందాలు

హత్య విషయం తెలిసిన వెంటనే సౌత్‌ఈస్ట్ డీసీపీ ఎస్.చైతన్యకుమార్, అదనపు డీసీపీ కె.శ్రీకాంత్, టాస్క్‌ఫోర్స్ అదనపు డీసీపీ అందె శ్రీనివాసరావు ఘటనాస్థలికి వచ్చారు. సీపీఐ నాయకులు అజీజ్‌పాషా, ఈటీ నర్సింహా, ఛాయాదేవి తదితరులు ఘటనాస్థలికి తరలివచ్చారు. చందు భార్య, కుమార్తె మృతదేహం వద్ద కన్నీరు మున్నీరయ్యారు. ఏడాదిన్నర నుంచి చందుకు ప్రాణహాని ఉందని రాజేష్ తదితరులే చంపారని ఆమె ఆరోపించారు. చందు మృతితో నాగర్‌కర్నూల్ జిల్లాలోని స్వగ్రామం నర్సాయిపల్లిలో విషాద ఛాయలు అలముకున్నాయి. చందు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. నిందితులను పట్టుకోవడానికి పది ప్రత్యేక బృందాలను రంగంలోకి దింపామని, అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నామని చైతన్య కుమార్ చెప్పారు. మలక్‌పేట పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఈ ఘటనలో పాలుపంచుకున్నట్లు అనుమానిస్తున్న నలుగురిని పోలీసులు మంగళవారం రాత్రి అదుపులోకి తీసుకున్నారు. అలాగే రెంటల్ ఏజెన్సీ నుంచి నిందితులు వాడిన కారును స్వాధీనం చేసుకున్నారు.

పరస్పర అంగీకారంతోనే కలిసి ఉన్నారు

- అసిస్టెంట్ ప్రొఫెసర్‌పై ఆరోపణలు నిరాధారమన్న హైకోర్టు
- అత్యాచార కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చిన న్యాయస్థానం



సాక్షి, హైదరాబాద్: అత్యాచార ఆరోపణలపై నమోదైన కేసులో అసిస్టెంట్ ప్రొఫెసర్ రంజిత్‌కు హైకోర్టులో ఊరట లభించింది. ఇద్దరు మేజర్లు పరస్పర అంగీకారంతో కలసి ఉన్నప్పుడు ఒక్కరిపై ఆరోపణలు చేయడం సరికాదని, అవి నిరాధారమైనవని న్యాయస్థానం వ్యాఖ్యానించింది. ఫిర్యాదుదారు(మహిళ) గతంలోనూ ఇలా మరొకరిపై ఫిర్యాదు చేయగా, అతనిపై కేసును సుప్రీంకోర్టు కొట్టివేసిన విషయాన్ని ప్రస్తావించింది. 21 ఏళ్ల మహిళకు తాను ఏం చేస్తున్నానో తెలుసని.. తెలిసే పిటిషనర్‌తో ఉన్నారని అభిప్రాయపడింది. దీనికి పిటిషనర్‌ను బాధ్యుడిని చేయలేమని తేల్చిచెబుతూ.. రంజిత్‌పై కేసును కొట్టివేస్తూ తీర్పునిచ్చింది. ఫిర్యాదుదారు మేరకు.. '2017లో నేను హాస్టల్‌లో ఉండి ఎంఏ ఇంగ్లిష్ చదువుతున్నప్పుడు అసిస్టెంట్ ప్రొఫెసర్‌తో పరిచయం ఏర్పడింది. తన భార్యకు విడాకులు ఇచ్చిన వెంటనే వివాహం చేసుకుంటానని హామీ ఇచ్చి నన్ను లైంగికంగా వాడుకున్నారు. ఆ తర్వాత వివాహం చేసుకోవడానికి నిరాకరించి.. ఇంటి నుంచి గెంటివేశారు'. ఈ ఫిర్యాదు ఆధారంగా, 2019లో పోలీసులు కేసు నమోదు చేశారు. దర్యాప్తు పూర్తయిన తర్వాత ట్రయల్‌కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. తనపై నమోదు చేసిన కేసు కొట్టివేయాలని కోరుతూ అసిస్టెంట్ ప్రొఫెసర్ రంజిత్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ జువ్వాడి శ్రీదేవి విచారణ చేపట్టారు.

అన్నీ తెలిసే పిటిషనర్‌తో ఉన్నారు..: పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ..'పిటిషనర్ నిర్దోషి. ఫిర్యాదుదారు ఆరోపణలతో పిటిషనర్‌కు ఎలాంటి సంబంధం లేదు. రెండేళ్ల గడిచిన తర్వాత పోలీసులు చార్జిషీట్ దాఖలు చేశారు. ఇంత ఆలస్యానికి కారణం చెప్పలేదు. ఫిర్యాదుదారుకు బ్లాక్‌మెయిల్ చేసే అలవాటు ఉంది. కేశవ్‌కుమార్ అనే వ్యక్తిపై కూడా ఫిర్యాదు చేసింది. మాదాపూర్ పోలీసులు నమోదు చేసిన ఆ కేసును సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఫిర్యాదుదారు చేసిన ఫిర్యాదులో తేదీలు, సమయం, స్థలం సరిగా వివరించలేదు. పిటిషనర్‌పై నేరాలు ఆమోదయోగ్యం కాదు.. ఎఫ్‌ఐఆర్‌ను రద్దు చేయాలి'అని కోరారు. ఏపీపీ వాదనలు వినిపిస్తూ.. 'పిటిషనర్‌పై నిర్దిష్ట ఆరోపణలు ఉన్నా యి. అతనిపై ఆరోపణలలో నిజానిజాలు ట్రయల్‌కోర్టు తేలుస్తుంది. పిటిషన్‌ను కొట్టివేయాలి'అని విజ్ఞప్తి చేశారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. 2019, జనవరి 16న ఇంటి నుంచి గెంటివేశారని చెబుతున్న మహిళ ఫిర్యాదు చేయడానికి 23 వరకు ఎందుకు ఆగాల్సి వచ్చిందో పేర్కొనలేదన్నారు. ఆమెకు ఇలా ఫిర్యాదు చేసే అలవాటు ఉందని గత వివరాలు పరిశీలిస్తే తెలుస్తోందన్నారు. పిటిషనర్, మహిళ.. ఇద్దరూ మేజర్లు. వారి మధ్య సంబంధం ఏకాభిప్రాయంతోనే జరిగినట్లు అవగతమవుతోందని స్పష్టం చేశారు. 21ఏళ్ల మహిళకు తాను ఏం చేస్తున్నానో తెలుసని.. తెలిసే పిటిషనర్‌తో ఉన్నారని న్యాయమూర్తి అభిప్రాయపడ్డారు. దీనికి పిటిషనర్‌ను బాధ్యుడిని చేయలేమని తేల్చిచెప్పారు. అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాత పిటిషనర్‌పై కేసును కొట్టివేస్తున్నామని తీర్పునిచ్చారు.

మావోయిస్టు దంపతుల లొంగుబాటు

- 40 ఏళ్లుగా అజ్ఞాతంలో ఆత్రం లచ్చన్న, అంకుబాయి
- మావోయిస్టులూ మీ ఊరిలోకి రండి
- రామగుండం సీపీ అంబర్ కిశోర్ ఝా పిలుపు



మావోయిస్టు దంపతులు ఆత్రం లచ్చన్న, అంకుబాయికి చెక్కు అందజేస్తున్న సీపీ అంబర్‌కిశోర్ ఝా, పక్కన మంచిర్యాల డీసీపీ భాస్కర్, అడిషనల్ డీసీపీ రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/గోదావరిఖని/కోటపల్లి: మావోయిస్టు పార్టీలో నాలుగు దశాబ్దాలపాటు పనిచేసిన దంపతులు లొంగిపోయారు. మంగళవారం రామగుండం కమిషనరేట్ కార్యాలయంలో సీపీ అంబర్ కిశోర్ ఝా... మంచిర్యాల డీసీపీ ఎగ్గడి భాస్కర్, అదనపు డీసీపీ (అడ్మిన్) రాజు, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, ఎస్బీ ఏసీపీ మల్లారెడ్డిలతో కలిసి విలేకరులకు ఆ వివరాలు వెల్లడించారు. ప్రశాంత జీవితం గడపాలని రాష్ట్ర కమిటీ సభ్యుడు, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు ఆత్రం లచ్చన్న అలియాస్ గోపన్న అలియాస్ రాజప్ప, నార్త్ బస్తర్ డివిజన్ కమిటీ (టెక్నికల్) చౌదరి అంకుబాయి అలియాస్ అనితక్క అలియాస్ లక్ష్మి లొంగిపోయారని తెలిపారు. ఆత్రం లచ్చన్నపై ఉన్న రూ.20 లక్షల రివార్డు, అంకుబాయిపై ఉన్న రూ.5 లక్షల రివార్డుల్లో చెరో రూ.5లక్షల విలువైన చెక్కులను సీపీ ఈ సందర్భంగా అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మావోయిస్టులు అజ్ఞాతంలో ఉండి చేసేదేమీ లేదని, సొంతూళ్లకు వచ్చి జనజీవన స్రవంతిలో కలిసి ప్రజలకు సేవచేయాలన్నారు.

42 ఏళ్లుగా అజ్ఞాతంలోనే..

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం పార్‌పల్లికి చెందిన లచ్చన్న 1983లో పీపుల్స్‌వార్ గ్రూప్ చెన్నూరు దళంలో చేరారు. 2002లో డివిజనల్ కమిటీ సభ్యుడిగా, 2007లో నార్త్ బస్తర్ డివిజన్ కమిటీ సాంకేతిక విభాగం ఇన్‌చార్జ్‌గా పనిచేశారు. 2023 నుంచి దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడిగా కొనసాగుతున్నారు. ఈయనపై పలు పోలీస్‌స్టేషన్లలో 35 కేసులు ఉన్నాయి.

అన్న కోసం అడవికి చెల్లె..

కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా పెంచికల్‌పేట మండలం అగర్‌గూడకు చెందిన చౌదరి అంకుబాయి 1988లో తన అన్న(చిన్నన్న)ను కలిసేందుకు అడవిబాట పట్టింది. అన్న ప్రోత్సాహంతో పార్టీలో చేరి పీపుల్స్‌వార్ సిర్పూర్ దళ సభ్యురాలిగా పనిచేస్తూ ఆత్రం లచ్చన్నను పెళ్లి చేసుకుంది. 1995లో భర్త లచ్చన్నతో పట్టణ ప్రాంతానికి బదిలీ కాగా, 2002లో ఏరియా కమిటీ సభ్యురాలిగా, తర్వాత దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ సాంకేతిక విభాగానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం నార్త్ బస్తర్ డివిజనల్ కమిటీ టెక్నికల్ విభాగం సభ్యురాలిగా ఉన్నారు. ఈమెపై 14 కేసులు ఉన్నాయి. అయితే చిన్నన్న కొన్నేళ్ల క్రితమే లొంగిపోయి సాధారణ జీవితం గడుపుతున్నారు. చెల్లె మాత్రం 37ఏళ్లుగా అజ్ఞాతంలోనే ఉండిపోయింది.

గ్రామస్తుల ఘనస్వాగతం

కోటపల్లి మండలం పార్‌పల్లి గ్రామానికి చేరుకున్న మావోయిస్టు దంపతులు ఆత్రం లచ్చన్న, అంకుబాయికి మంగళవారం గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. టపాకాయలు కాలుస్తూ శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. డప్పు చప్పుళ్ల మధ్య ఇంటికి తీసుకెళ్లారు.

సంస్మరణ వారోత్సవాలకు మావోలు సిద్ధం

ఈ నెల 28 నుంచి నిర్వహణకు ఏర్పాట్లు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: తీవ్ర నిర్బంధం..వరుస నష్టాల నడుమ కూడా ఈ నెల 28 నుంచి వచ్చే ఆగస్టు 3 వరకు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించాలని మావోయిస్టు పార్టీ నిర్ణయించింది. ఈ మేరకు పార్టీ సెంట్రల్ కమిటీ (సీసీ) పేరిట గత జూన్ 23న రాసిన 22 పేజీల డాక్యుమెంట్ మంగళవారం వెలుగులోకి వచ్చింది. సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు చనిపోయిన తర్వాత ఆ పార్టీ ఆత్మపరిశీలనకు సంబంధించిన వివరాలు ఇందులో ఉన్నాయి. గతంలో కేంద్ర కమిటీ తరఫున అభయ్ పేరుతో మీడియాకు లేఖలు వచ్చేవి. ప్రస్తుతం వెల్లడైన డాక్యుమెంట్‌లో కేవలం కేంద్రకమిటీ అని ఉండడం గమనార్హం.

మావోయిస్టుల డాక్యుమెంట్‌లో ఏముందంటే..?
పూర్తి వివరాలు సాక్షి ప్లస్ ఈ-పేపర్‌లో

ఇద్దరి ప్రాణాలు తీసిన భార్యాభర్తల పంచాయితీ

కత్తులతో దాడులు చేసుకున్న ఇరువర్గాలు... మరో ఇద్దరికి తీవ్రగాయాలు



మల్లేశం (ఫైల్)



గణేశ్ (ఫైల్)

సుల్తానాబాద్ రూరల్ (పెద్దపల్లి): కుటుంబ కలహాలతో ఠాణా మెట్లెక్కిన భార్యాభర్తల మధ్య సయోధ్య కుదిర్చేందుకు కులపెద్దల సమక్షంలో చేపట్టిన పంచాయితీ ఇరువర్గాల్లోని ఇద్దరి ప్రాణాలు తీసింది. పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సుగ్గాంపల్లి గ్రామంలో మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా ఓదెల మండలానికి చెందిన మొటం మారయ్య ఉపాధి నిమిత్తం కాల్వశ్రీరాంపూర్ మండలం పెగడపల్లిలో నివాసం ఉంటున్నాడు. పెద్దపల్లిలోని శాంతినగర్‌కు చెందిన లక్ష్మిని 14 ఏళ్లక్రితం వివాహం చేసుకున్నాడు. కాగా, ఇటీవల భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో భార్య పుట్టింటికి వెళ్లిపోయింది. అయితే, అత్తింటివారు తన భార్యను కాపురానికి పంపించడం లేదని భర్త పెద్దపల్లి పోలీస్‌స్టేషన్‌లో నెలరోజుల క్రితం ఫిర్యాదు చేశాడు. తన భర్త వేధిస్తున్నాడని భార్య కూడా అదే ఠాణాలో ఫిర్యాదు చేసింది. పోలీసులు వారికి సర్దిచెప్పినా వినలేదు. చివరకు పెద్దమనుషుల సమక్షంలో సయోధ్య కుదుర్చుకోవాలని వారు సూచించడంతో భార్యాభర్తలు వేర్వేరుగా పెద్దమనుషులను ఆశ్రయించారు. మంగళవారం సుల్తానాబాద్ మండలం సుగ్గాంపల్లి గ్రామంలో పంచాయితీ ఏర్పాటు చేసుకున్నారు.

కత్తులతో దాడులు.. రణరంగాన్ని తలపించిన పంచాయితీ ప్రదేశం..

పెద్దమనుషుల సమక్షంలో జరుగుతున్న పంచాయితీలో భార్యాభర్తల కుటుంబాలకు మధ్య మాటామాటా పెరిగింది. ఆగ్రహంతో ఊగిపోయిన ఇరువర్గాలు హఠాత్తుగా కత్తులతో దాడులకు దిగాయి. ఈక్రమంలో భర్త తమ్ముడు మొటం మల్లేశం (37), భార్య సమీప బంధువు పస్తం గణేశ్ (38) కత్తిపోట్లకు గురవడంతో తీవ్రరక్తస్రావమైంది. వారిని ఆస్పత్రికి తరలించేలోపే మృతి చెందారు. ఇదే ఘటనలో మారయ్య మరో తమ్ముడు మొటం మధునయ్య కత్తిపోట్లకు గురై తీవ్రంగా గాయపడ్డాడు. తండ్రి సారయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. మధునయ్య పరిస్థితి విషమంగా ఉంది. సమాచారం అందుకున్న పెద్దపల్లి డీసీపీ కరుణాకర్, ఏసీపీ కృష్ణ వెంటనే సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి చేరుకున్నారు. సీఐ సుబ్బారెడ్డి, ఎస్సై శ్రావణ్‌కుమార్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు.

రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా 311 పీఏసీఎస్‌లు

- దేశంలో 10వేల ఎఫ్‌పీఓల లక్ష్యానికి అనుగుణంగా రాష్ట్రం నుంచి 311 ప్రాథమిక సహకార పరపతి సంఘాల ఎంపిక
- ఒక్కో ఎఫ్‌పీఓకు రూ.15 లక్షల ఈక్విటీ గ్రాంటు, రూ.18 లక్షల మేనేజ్‌మెంట్ ఖర్చు కేటాయింపు
- తొలి విడతగా రూ.9.85 కోట్లు విడుదల.. ఎంపికైన పీఏసీఎస్‌లకు చెక్కులు అందజేసిన మంత్రి తుమ్మల



చెక్కు అందజేస్తున్న మంత్రి తుమ్మల

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని 311 పీఏసీఎస్ (ప్రాథమిక సహకార పరపతి సంఘం)లను కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌పీఓ (రైతు ఉత్పత్తిదారుల సంఘం)లుగా గుర్తించింది. వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రైతులకు సంబంధించిన వివిధ సేవల రూపకల్పనలో పాలుపంచుకునేలా ఈ సంఘాలు పనిచేస్తాయి. దేశంలో 10 వేల రైతు ఉత్పత్తి సంఘాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంలో భాగంగా ఇప్పటికే ఉన్న పీఏసీఎస్‌లను రైతు ఉత్పత్తిదారుల సంఘాలుగా మార్చడంతోపాటు ఆర్థిక తోడ్పాటు అందించాలని కేంద్రం నిర్ణయించింది. ఇందులో భాగంగా నేషనల్ కో ఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌సీడీసీ) సహకారంతో తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్‌ను క్లస్టర్ బేస్డ్ బిజినెస్ ఆర్గనైజేషన్ (సీబీబీఓ)గా నియమించింది. ఈ సీబీబీఓ ద్వారా ఒక్కో పీఏసీఎస్‌కు రూ.15 లక్షల ఈక్విటీ గ్రాంటుతోపాటు రూ. 18 లక్షల మేనేజ్‌మెంట్ ఖర్చు కింద వెచ్చించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 920 పీఏసీఎస్‌లు ఉండగా, తొలివిడతతో 311 పీఏసీఎస్‌లకు అవకాశం దక్కింది. దేశంలోనే ఇది అత్యధికం. వచ్చే ఏడాది కూడా రాష్ట్రం నుంచి మరికొన్ని పీఏసీఎస్‌లకు చోటు దక్కే అవకాశాలున్నాయి

రాష్ట్రంలో రూ.167.93 కోట్లు

ఎంపికైన 311 పీఏసీఎస్‌లకు ఎన్‌సీడీసీ రూ.167.93 కోట్లు కేటాయించింది. ఇందులో మొదటి విడతగా ఒక్కో పీఏసీఎస్‌కు రూ.3,16,849 చొప్పున రూ.9.85 కోట్లు మంగళవారం విడుదల అయ్యాయి. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం క్రెడిట్ గ్యారంటీ స్కీమ్‌లో భాగంగా రూ.2 కోట్లు వరకు లోన్ గ్యారంటీ సౌకర్యం కూడా ఉంటుంది.

పాల ఉత్పత్తిదారులు మొదలుకొని అన్ని రకాల సేవల్లో..

ముల్కనూరు పాల ఉత్పత్తిదారుల సమాఖ్య.. సహకార రంగంలో ఓ విప్లవం సృష్టించిన విషయం తెలిసిందే. ఇదే తరహాలో రైతు ఉత్పత్తి సంఘాలు ఆయా గ్రామాలు, మండలాలు, జిల్లాల పరిధిలో పీఏసీఎస్‌ల ద్వారా సహకార రంగంలో కొత్త వ్యాపార అవకాశాలను అందిపుచ్చుకోవాలనేది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆలోచన. రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో కూరగాయలు, పండ్ల సాగును ప్రోత్సహించడం, రైతుల మారుతున్న ఆలోచనా సరళికి అనుగుణంగా సేంద్రియ వ్యవసాయానికి అవసరమైన ఎరువులను సమకూర్చడం, యంత్ర పరికరాలు, కోల్డ్ స్టోరేజీ యూనిట్లు, పౌల్ట్రీ పరిశ్రమ వంటి వాటిపై దృష్టి పెట్టనున్నారు. తెలంగాణ కోఆపరేటివ్ యూనియన్ ద్వారా ఈ కార్యక్రమాలు సాగేలా రూపకల్పన చేశారు.

రైతు సహకార సంఘాలు స్వయం సమృద్ధి సంస్థలుగా ఎదగాలి: మంత్రి తుమ్మల

రైతు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం నిరంతర కృషి చేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కేంద్ర సహకార అభివృద్ధి సంస్థ(ఎన్‌సీడీసీ) రాష్ట్రంలో 311 పీఏసీఎస్‌లను ఎఫ్‌పీఓలుగా ఎంపిక చేస్తూ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవిద్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. పీఏసీఎస్‌లు లాభదాయక వ్యాపార అవకాశాలను గుర్తించి, అదనపు ఆదాయాన్ని సృష్టించుకోవాలని సూచించారు. పీఏసీఎస్‌లు ధాన్యం సేకరణపై ఆధారపడకుండా, ప్రాసెసింగ్, విలువ జోడింపు కార్యకలాపాల్లో నిమగ్నం కావాలన్నారు. ఈ సందర్భంగా ఎంపికైన పీఏసీఎస్ అధ్యక్షులకు చెక్కులు పంపిణీ చేశారు.

కారులో కాల్పులు.. కాంగ్రెస్ నేత అనిల్ హత్య

నాలుగు రౌండ్లు కాల్పులు జరిపి పరారైన దుండగులు

- మెదక్ జిల్లాలో సోమవారం రాత్రి ఘటన
- భూవివాదాలు, సెటిల్‌మెంట్లే కారణమా?
- రంగంలోకి ప్రత్యేక పోలీసు బృందాలు



ఘటనాస్థలంలో అనిల్ మృతదేహం



అనిల్ (ఫైల్)



ఘటనాస్థలిలో బుల్లెట్ సెల్స్..

సాక్షి ప్రతినిధి, సంగారెడ్డి/కొల్చారం/మెదక్ జోన్: మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కార్యదర్శి మరెల్లి అనిల్‌కుమార్ దారుణ హత్యకు గురయ్యారు. కొల్చారం మండలం పైతర గ్రామానికి చెందిన అనిల్‌పై గుర్తు తెలియని దుండగులు నాలుగు రౌండ్లు కాల్పులు జరిపారు. హైదరాబాద్‌లో పార్టీ సమావేశం ముగించుకుని స్వగ్రామానికి కారులో వెళ్తుండగా సోమవారం రాత్రి మెదక్ –జోగిపేట రహదారిపై చిన్నఘనపూర్ గ్రామం సబ్‌స్టేషన్ వద్ద దుండగులు కాల్పులు జరిపారు. దీంతో కారు అదుపుతప్పి పక్కన ఉన్న కల్వర్టును ఢీకొంది. ఆ దారిలో వెళ్తున్న కొంతమంది తండావాసులు రోడ్డు ప్రమాదంగా భావించి ఆసుపత్రికి తరలించగా, శరీరంపై బుల్లెట్ల గాయాలు కనిపించాయి. దీంతో ఘటనా స్థలానికి వచ్చి చూడగా నాలుగు బుల్లెట్లకు సంబంధించిన ఆనవాళ్లు లభించడంతో పోలీసులు హత్యగా నిర్ధారణకు వచ్చారు. కుడి భుజంపై రెండు బుల్లెట్లు, వీపు వైపు రెండు బుల్లెట్లు దిగినట్లు వైద్యులు తెలిపారు. ఒక బుల్లెట్ శరీరంలో లోతుకి దిగిందన్నారు. రెండు మీటర్ల దూరం నుంచి కాల్పులు జరిగినట్లు భావిస్తున్నారు.

హైదరాబాద్ నుంచి ఫాలో చేస్తూ..

సోమవారం గాంధీభవన్‌లో ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులతో మంత్రి పొన్నం ప్రభాకర్ సమీక్ష నిర్వహించారు. అనంతరం అనిల్ పార్టీకి చెందిన నలుగురు నాయకులతో కలిసి బెంజ్ కారులో స్వగ్రామానికి బయలుదేరారు. మార్గమధ్యంలో నలుగురిని వారివారి ప్రాంతాల్లో దింపేశారు. అనిల్ కారును హైదరాబాద్ నుంచి రెండు కార్లలో ఫాలో అయిన దుండగులు అనిల్ సొంత గ్రామం పైతరకు 5 కి.మీ. దూరంలో ఉండగా చిన్నఘనపూర్ శివారు వద్ద అడ్డగించినట్లు సీసీటీవీ ఫుటేజీ ఆధారంగా గుర్తించారు. దుండగులు ఒక కారును అనిల్ కారుకు అడ్డంగా నిలిపివేసినట్లు తెలిసింది. డ్రైవర్ సీటులో ఉన్న అనిల్ కారు అద్దాలు దించగానే మరో కారులోంచి దిగిన దుండగులు అతనిపై కాల్పులు జరిపినట్లు పోలీసులు భావిస్తున్నారు. దుండగులు మెదక్ మీదుగా కామారెడ్డి జిల్లా వైపు వెళ్లినట్లు అనుమానిస్తున్నారు.

అనిల్ వద్దే రెండు నెలల నుంచి కారు

అనిల్ ప్రయాణిస్తున్న బెంజ్ కారు (టీఎస్ 08 ఎఫ్‌డీ 1122) ప్రస్తుతం వెంకట శ్రీనివాససాగర్ రవడ (ఉప్పల్ రామంతాపూర్ అడ్రస్‌తో) అనే వ్యక్తి పేరుతో రికార్డుల్లో ఉండగా, 2017 నుంచి 2020 వరకు పొద్దుటూరి సర్వీసెస్ పేరుతో రికార్డుల్లో ఉంది. ఈ కారును అనిల్ రెండు నెలల క్రితం తీసుకొచ్చినట్లు తెలిసింది. కారు విషయమై కొందరు అనిల్‌కు ఫోన్లు చేశారని ఆయన తండ్రి అనంతి మీడియాకు తెలిపారు. డబ్బులు చెల్లించి కారును తీసుకెళ్తామని చెప్పారన్నారు.

భూవివాదాలే కారణమా?

అనిల్ హత్యకు భూవివాదాలు, సెటిల్‌మెంట్లే కారణమా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అందరితో కలుపుగోలుగా ఉండే అనిల్‌కు రాజకీయంగా ప్రత్యర్థులు లేరు. దీంతో భూవివాదాలు, ఇతర సెటిల్‌మెంట్లు కారణమై ఉండొచ్చనే కోణంలో దర్యాప్తు ప్రారంభించారు. అనిల్ కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నారు. హైదరాబాద్‌లో సుమారు రూ.20 కోట్ల ఓ భూమి విషయంలో అనిల్‌కు ఏపీలోని కడప జిల్లాకు చెందిన ఓ ఎమ్మెల్యేతో వివాదం నడుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఆ ఎమ్మెల్యే అనుచరులు ఈ దురాగతానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఎవరైనా సుపారీ ఇచ్చి అనిల్‌ను హత్య చేయించారా? అనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నట్లు తెలుస్తోంది. హైదరాబాద్ నుంచి ఘటనా స్థలి వరకు ఉన్న సీసీటీవీ ఫుటేజీలను పోలీసులు సేకరిస్తున్నారు. హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ నిర్మాణ సంస్థకు చెందిన వ్యాపారి నంబర్ అనిల్ చేతిపై రాసి ఉంది. ఈ నంబర్‌పై పోలీసులు ఆరా తీస్తున్నారు. అలాగే కొల్చారం మండలం అప్పాజిపల్లి భూ వివాదంలో కోర్టులో కేసు ఫైల్ అయిందని అనిల్ తన సన్నిహితులకు చెప్పినట్లు సమాచారం. బుధవారం అనిల్ పుట్టిన రోజు అని ఆయన సన్నిహితులు పేర్కొంటున్నారు. ఘటనా స్థలాన్ని ఐజీ చంద్రశేఖర్‌రెడ్డి, ఎస్పీ శ్రీనివాసరావు పరిశీలించారు. దుండగులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను నియమించినట్లు పోలీసులు తెలిపారు. అనిల్ మృతదేహానికి మెదక్ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. హత్యపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ శ్రీనివాస్‌రావు తెలిపారు.

స్టాక్ మార్కెట్లో ట్రేడింగ్-పెట్టుబడులు, డిజిటల్ అరెస్ట్, టాస్క్, పెట్టుబడి.. ఎంచుకున్న విధానం ఏదైనా విదేశీ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో భారతీయులు చిక్కుతున్నారు. తద్వారా ప్రతి నెల సగటున రూ.1,000 కోట్లకుపైగా దోపిడీకి గురవుతున్నారు. భారతీయులను లక్ష్యంగా చేసుకుని అత్యధికంగా ఆగ్నేయాసియా కేంద్రంగా ఈ సైబర్ మోసాలు జరుగుతున్నాయని కేంద్ర హోం శాఖ (ఎంహెచ్ఏ) గుర్తించింది. భారతీయులతో సహా అక్రమ రవాణాకు గురైన వ్యక్తులతో ఈ కేంద్రాల్లో బలవంతంగా మోసాలు చేయిస్తున్నారు.



దేశంలో జరుగుతున్న సైబర్ మోసాల విలువ!

జనవరి–మే మధ్య రూ.7,000 కోట్లు సమర్పయామి

విదేశీ సైబర్ నేరగాళ్ల ఉచ్చులో భారతీయులు

వల వేస్తున్న దక్షిణాసియా దేశాల సైబర్ నేరగాళ్లు

నెలకు రూ.1,000 కోట్లకుపైనే

ఈ ఏడాది జనవరి నుండి మే వరకు ఆన్‌లైన్ స్కామ్‌ల వల్ల భారతీయులు కోల్పోయిన మొత్తం సుమారు రూ.7,000 కోట్లు. ఇందులో సగానికి పైగా మోసాలకు మయన్మార్, కంబోడియా, వియత్నాం, లావోస్, థాయిలాండ్ నుండి పనిచేస్తున్న నెట్‌వర్క్‌లే కారణమని కేంద్ర హోం శాఖ వెల్లడించింది. ఎంహెచ్ఏ అనుబంధ విభాగమైన ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) రూపొందించిన డేటా ప్రకారం.. అధిక భద్రత కలిగిన ప్రదేశాల నుండి సైబర్ నేరగాళ్లు ఈ నేరాలకు పాల్పడుతున్నారు. ఈ నెట్‌వర్క్‌లను చైనీస్ ఆపరేటర్లు నియంత్రిస్తున్నారు.

కాల్ 1930..: సైబర్ నేరం మీ దృష్టికి వచ్చినా.. ఎవరైనా సైబర్ నేరాలకు పాల్పడుతున్నారని అనుమానం వచ్చినా వెంటనే 1930కి కాల్ చేయండి.
cybercrime.gov.in వెబ్‌సైట్లో ఫిర్యాదు చేయండి

తక్షణ నివారణ చర్యలు తీసుకోకపోతే మొత్తం నష్టాలు వచ్చే ఏడాది కాలంలో రూ.1.2 లక్షల కోట్లకు మించి ఉండవచ్చని ఇండియన్ సైబర్ క్రైమ్ కోఆర్డినేషన్ సెంటర్ హెచ్చరించింది.

బాధితులే ఉద్యోగులు..


విదేశాల్లో ఉద్యోగాల ఆశతో మానవ అక్రమ రవాణాకు గురై.. ఆయా దేశాల కేంద్రాల్లో వీరితో బలవంతంగా పనిచేయిస్తున్నారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో కరీంనగర్ జిల్లాతోపాటు పలువురు యువకులు ఉపాధి కోసం థాయ్‌లాండ్ వెళ్లి అక్కడి సైబర్ కేఫ్‌లలో బందీలుగా చిక్కుకున్నారు. దీనిపై వార్తల నేపథ్యంలో స్పందించిన కేంద్రం అక్కడి 539 భారతీయ బందీలను విడిపించి, మార్చి 11న సురక్షితంగా భారత్‌కు తరలించిన విషయం తెలిసిందే. ఇలా చాలామందిని నిఘా సంస్థలు రక్షించాయి. వీరి సాయంతో ఇంటెలిజెన్స్ ఏజెన్సీలు కంబోడియాలో కనీసం 45, లావోస్‌లో ఐదు, మయన్మార్‌లో ఒక కేంద్రాన్ని గుర్తించాయి. బాధితుల్లో భారతీయులతో పాటు, ఆఫ్రికా, తూర్పు ఆసియా, ఆగ్నేయాసియా, దక్షిణాసియా, మధ్య ఆసియా, పశ్చిమాసియా దేశాలు, యూరప్/ఉత్తర అమెరికా, దక్షిణ అమెరికా నుండి వచ్చిన వ్యక్తులు కూడా ఉన్నారు. ఆగ్నేయాసియా నుండి పనిచేస్తున్న సైబర్ నేరగాళ్ల ప్రధానంగా మూడు రకాల మోసాలకు పాల్పడుతున్నట్టు దర్యాప్తులో వెల్లడైంది. వీటిలో స్టాక్ ట్రేడింగ్/పెట్టుబడి మోసాలు, డిజిటల్ అరెస్ట్, టాస్క్ ఆధారిత, పెట్టుబడి ఆధారిత మోసాలు ఉన్నాయి.

బాధితులే ఉద్యోగులు..

సైబర్ నేరాల కోసం వ్యక్తులను నియమించుకుంటున్న అనేక మంది ఏజెంట్లను భారత ప్రభుత్వం గుర్తించింది. వీరిలో మహారాష్ట్ర నుంచి 59 అత్యధికంగా మంది ఉన్నారు. తమిళనాడు 51, జమ్మూ కాశ్మీర్ 46, ఉత్తర ప్రదేశ్ 41, ఢిల్లీ నుంచి 38 మంది ఈ కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ ఏజెంట్లు లావోస్, మయన్మార్, కంబోడియాలకు ఎక్కువ మందిని నియమించుకుంటున్నారు. 5,000 మందికిపైగా భారతీయులు కంబోడియాలో చిక్కుకున్నట్టు సమాచారం. నేరగాళ్లు వీరిని నిర్బంధించి, బలవంతంగా సైబర్ మోసాలు చేయిస్తున్నారు.

ఘోస్ట్ సిమ్ కార్డులతో..

ప్రభుత్వ అంచనాల ప్రకారం ప్రస్తుత సంవత్సరం మార్చికి ముందు ఆరు నెలల్లో భారతీయులు కనీసం రూ.500 కోట్ల మేర మోసపోయారని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి కేంద్ర ప్రభుత్వం వివిధ మంత్రిత్వ శాఖల అధికారులతో కమిటీ ఏర్పాటు చేసింది. బ్యాంకింగ్, ఇమిగ్రేషన్, టెలికం రంగాలలో ఉన్న లొసుగులను ప్యానెల్ గుర్తించింది. నకిలీ, దొంగిలించిన గుర్తింపులతో సిమ్‌లను జారీ చేశారనే ఆరోపణలపై వివిధ రాష్ట్రాల్లోని పాయింట్ ఆఫ్ సేల్ ఏజెంట్లపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. నకిలీ, ఇతరుల గుర్తింపుతో జారీ అయిన ఈ ఘోస్ట్ సిమ్‌లను పాయింట్ ఆఫ్ సేల్ ఏజెంట్లు సైబర్ నేరస్తులకు విక్రయిస్తున్నారు. మోసపూరితంగా సిమ్ జారీ కావడంతో నేరస్తులను గుర్తించడం కష్టమవుతోంది.



దేశాలను దాటి..

సైబర్ నేరస్తుల చెర నుంచి రక్షించిన బందీలు, తిరిగి వచ్చిన వ్యక్తుల వాంగ్మూలాలను ప్రభుత్వం నమోదు చేసింది. భారత్ నుంచి కంబోడియాకు బాధితులను తరలిస్తున్న తీరు నిఘా సంస్థల విచారణలో బయటపడింది. తొలుత దుబాయ్.. అక్కడి నుండి చైనా, కంబోడియాకు; తమిళనాడు నుండి కంబోడియా; మహారాష్ట్ర నుండి థాయిలాండ్, కంబోడియా; జైపూర్ నుండి థాయిలాండ్, కంబోడియా; జైపూర్ నుండి వియత్నాం.. అక్కడి నుండి బ్యాంకాక్, కంబోడియాకు; ఢిల్లీ నుండి బ్యాంకాక్, కంబోడియా, లక్నో నుండి బ్యాంకాక్, కంబోడియా; కేరళ నుండి వియత్నాం, కంబోడియా; కేరళ నుండి సింగపూర్, కంబోడియాకు తరలిస్తున్నారు. ఇక కోల్‌కతా నుండి వియత్నాం, కంబోడియాకు రోడ్డు మార్గం ద్వారా చేరవేస్తున్నట్లు తేలింది.

ఆధునిక మోసాలు..: తప్పుదోవ పట్టించి రహస్య సమాచారాన్ని తెలుసుకోవడం, నకిలీ యాప్‌లు, ఫిషింగ్ హెచ్చరికలు, వంచన వంటి వివిధ పద్ధతులను సైబర్ నేరగాళ్లు అనుసరిస్తున్నారు. కేవైసీ అప్‌డేట్ పేరుతో ఒత్తిడికి గురిచేయడం, లాభదాయక రాబడి పేరుతో వల వేస్తున్నారు. డిజిటల్ అరెస్ట్ కారణంగా 2025లోనే రూ.210 కోట్లకుపైగా నష్టాలు నమోదయ్యాయి. సైబర్ నేరస్తులు గ్రామీణులతో పాటు నగరవాసులనూ లక్ష్యంగా చేసుకుని మరింత ఆధునిక మోసాలకు తెరలేపుతున్నారు.

– సాక్షి, స్పెషల్ డెస్క్

కృష్ణా ట్రిబ్యునల్-2 గడువు పొడిగింపు

సాక్షి, హైదరాబాద్: జస్టిస్ బ్రిజేష్ కుమార్ నేతృత్వంలోని కృష్ణా జల వివాదాల ట్రిబ్యునల్-2 గడువును కేంద్ర ప్రభుత్వం మరోసారి పొడిగించింది. ఏపీ, తెలంగాణ మధ్య కృష్ణా జలాల పంపకాలపై నివేదిక సమర్పించేందుకు ఈనెల 31తో గడువు పూర్తికానుండగా, వచ్చే ఏడాది జూలై 31 వరకు పొడిగిస్తూ కేంద్ర జలశక్తి శాఖ మంగళవారం గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసింది.

ఆర్టీసీ ఉద్యోగుల పీఎఫ్‌పై వివరణ ఇవ్వండి: హైకోర్టు

ఈపీఎఫ్, ఏపీఎస్ఆర్టీసీకి నోటీసులు

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ డిపాజిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ స్కీమ్ (ఈడీఎల్ఐ)కు సంబంధించి టీజీఎస్ఆర్టీసీ దాఖలు చేసిన పిటిషన్‌లో వివరణ ఇవ్వాలని ఈపీఎఫ్, ఏపీఎస్ఆర్టీసీ అధికారులను హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు వారికి నోటీసులు జారీ చేస్తూ, తదుపరి విచారణ 29కి వాయిదా వేసింది. ఈడీఎల్ఐకు ఏపీఎస్ఆర్టీసీ చెల్లించాల్సిన బకాయిలపై ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్.. గత ఫిబ్రవరి 11న ఉత్తర్వులు జారీ చేసింది. బకాయిల చెల్లింపులో టీజీఎస్ఆర్టీసీ విఫలమైందంటూ ఈ జూలై 9న ఖాతాలపై చర్యలకు ఉత్తర్వులిచ్చింది. దీన్ని సవాల్ చేస్తూ టీజీఎస్ఆర్టీసీ హైకోర్టులో పిటిషన్‌ను దాఖలు చేసింది. రీజినల్ పీఎఫ్ కమిషనర్-1, అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ రికవరీ, ఏపీఎస్ ఆర్టీసీ తరఫున కమిషనర్, విద్యానగర్ యూనియన్ బ్యాంక్ మేనేజర్‌ను ప్రతివాదులుగా చేర్చింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ ఎన్వీ శ్రావణ్‌కుమార్ మంగళవారం విచారణ చేపట్టారు. అడ్వొకేట్ జనరల్ ఏ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. '2003–04 నుంచి 2024–25 మధ్య కాలంలో టీజీఎస్ఆర్టీసీ ఈడీఎల్ఐకి రూ.95.19 కోట్లు విరాళంగా ఇచ్చింది. మరణించిన ఉద్యోగులకు చెందిన 10,270 కుటుంబాలకు మొత్తం రూ.160.54 కోట్లు కూడా పంపిణీ చేసింది. ఈ నెల 9 నాటి నిషేధిత ఉత్తర్వు ప్రకారం రూ.131 కోట్లు రెండు రాష్ట్రాలకు సంబంధించింది. ఏ రాష్ట్రం నుంచి ఎంత వసూలు చేయాలో అందులో పేర్కొనలేదు. 600 పీఎఫ్ క్లెయిమ్‌ల్లో 433 ఏపీఎస్ఆర్టీసీవి, 165 మాత్రమే టీజీఎస్ఆర్టీసీవి'అని పేర్కొన్నారు. ఈపీఎఫ్ తరఫున హాజరైన న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. చట్టంలోని సెక్షన్ 7(ఐ) ప్రకారం పిటిషనర్ బకాయి మొత్తంలో 50 శాతం డిపాజిట్ చేయాల్సిందేనన్నారు. దీనిపై మరిన్ని వివరాలు తెలుసుకుని చెప్పడానికి సమయం కావాలని కోరడంతో న్యాయమూర్తి తదుపరి విచారణ ఈ నెల 29కి వాయిదా వేశారు. ఫిబ్రవరిలో జారీ చేసిన ఉత్తర్వులను రెండు వారాలు నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

సోషల్ ఆడిట్‌లో రికార్డుల డిజిటలైజేషన్

సోషల్ ఆడిట్ డైరెక్టర్ నిర్మల వెల్లడి

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఉపాధి హామీ పథకంలో మరింత పాదర్శకత పెంచే దిశగా చర్యలు చేపట్టినట్టు రాష్ట్ర సోషల్‌ఆడిట్‌డైరెక్టర్‌తమ్మినేని నిర్మల తెలిపారు. ఇందులో భాగంగా సోషల్‌ఆడిట్ రికార్డుల డిజిటలైజేషన్‌నిర్వహిస్తున్నట్టు చెప్పారు. మంగళవారం ఆమె మీడియాతో మాట్లాడుతూ సామాజిక తనిఖీలో పేపర్ రహిత పాలన తీసుకొస్తామన్నారు. ఉపాధి హామీలో అవకతవకలు నివారించేలా పనుల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంచేందుకు సాంకేతికతను వినియోగిస్తామని చెప్పారు. రికార్డులను డిజిటల్ రూపంలోకి మార్చడం ద్వారా డేటా నిర్వహణ సులభతరం అవుతుందన్నారు. అవకతవకలను తగ్గించడంతోపాటు, సామాజిక తనిఖీలను సమర్థవంతంగా, సమయానుకూలంగా నిర్వహించేందుకు సహాయపడుతుందని తెలిపారు. ఈ పథకంలో చేపట్టిన పనులకు ఇప్పటిదాకా ఆర్నెళ్లకోసారి గ్రామాల్లో సోషల్‌ఆడిట్‌చేసేవారని, ఇక నుంచి చేసిన పనికి వెంటనే ఆడిట్‌చేసేలా చర్యలు చేపడుతున్నట్లు నిర్మల వివరించారు. సామాజిక తనిఖీల్లో బినామీ మస్టర్లు, కొలతల్లో తేడాలు, రికార్డుల్లో వివరాలు సరిగా నమోదు చేయకపోవడం, ప్లాంటేషన్, ఇంకుడుగుంతలు, చెరువు పూడికతీతలు ఇలా పలు పనుల్లో అవకతవకలు బయటకు వస్తున్నాయన్నారు. ఆడిట్ పేరాలు క్లోజింగ్‌కోసం రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఆగస్టు 9 వరకు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు.

బనకచర్ల.. ఓ ఎండమావే!

ప్రాజెక్టులకు వరద జలాలు అనేవి ఊహాజనితం.. కల్పితమే

- వాటి ఆధారంగా ప్రాజెక్టులు కట్టడం డబ్బులు వృథానే..: సాగునీటి రంగ నిపుణుడు వెదిరే శ్రీరామ్ స్పష్టీకరణ
- 3 వేల టీఎంసీలు సముద్రంలో కలుస్తున్నాయనడం పూర్తిగా అసత్యం
- ఎగువ రాష్ట్రాలు వాడుకోని 1138.2 టీఎంసీలే మిగులుగా ఉన్నాయి
- వాటిపై బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకూ హక్కు

సాక్షి, హైదరాబాద్: వరద జలాలు ఎండమావి తరహాలో ఊహాజనితమని, వాటి ఆధారంగా ప్రాజెక్టులకు అనుమతులు జారీ చేసే విధానం భారత దేశంలో లేదని ..కేంద్ర జలశక్తి శాఖ మాజీ సలహాదారులు, నదుల అనుసంధానంపై ఏర్పాటైన టాస్క్‌ఫోర్స్ కమిటీ మాజీ చైర్మన్ వెదిరే శ్రీరామ్ తేల్చి చెప్పారు. 200 టీఎంసీల వరద జలాలను తరలించడానికి ఏపీ ప్రతిపాదించిన గోదావరి–బనకచర్ల అనుసంధానం ప్రాజెక్టు పేరును ప్రస్తావించని శ్రీరామ్.. దాని భవితవ్యాన్ని ఎండమావిగా అభివర్ణించారు. రూ.లక్షల కోట్లు అప్పు చేసి వరద జలాల ఆధారంగా ప్రాజెక్టులు నిర్మించాక నీటి లభ్యత లేకుంటే డబ్బులు వృథా అవుతాయని, ప్రజలపై అనవసర అప్పుల భారం పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఏటా 3 వేల టీఎంసీల గోదావరి జలాలు సముద్రంలో కలుస్తున్నాయనే భావన కేవలం కల్పితమని తోసిపుచ్చారు. 75 శాతం డిపెండబిలిటీ ఆధారంగా గోదావరి ట్రిబ్యునల్ జరిపిన నికర జలాల ఆధారంగానే ప్రాజెక్టులకు కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) అనుమతులు జారీ చేస్తుందని, ఈ దేశంలోని అన్ని రాష్ట్రాలకు ఉమ్మడిగా వర్తించే న్యాయసూత్రం ఇదే అని అన్నారు. 'గోదావరి జల వివాదం–నిజాలు'అనే అంశంపై తెలంగాణ జర్నలిస్టు



యూనియన్ అధ్యక్షుడు కప్పర ప్రసాద్‌రావు అధ్యక్షతన మంగళవారం నగరంలోని ఓ హోటల్‌లో నిర్వహించిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చి మాట్లాడారు. గోదావరి ట్రిబ్యునల్ తీర్పులో ఆల్ వాటర్స్, మిగులు జలాలు, నికర జలాలు, సగటు జలాలు వంటి పదాలు కనిపిస్తాయని, ఎక్కడా వరద జలాలు అనే ప్రస్తావన ఉండదన్నారు. వరద జలాల ఆధారంగా ఇప్పటి వరకు దేశంలో ప్రాజెక్టులకి అనుమతులు ఇవ్వలేదని, దీనికి దేశ చట్టాలు అంగీకరించవని పేర్కొన్నారు. వరద జలాల లభ్యతపై సీడబ్ల్యూసీ వద్ద ఎలాంటి శాస్త్రీయ లెక్కలూ లేవని స్పష్టం చేశారు.

నికర జలాలకు మించి వాడితే సమస్యలే..

'నికర జలాల వాటాకు మించి నీళ్లను ఎగువ రాష్ట్రాలు వాడుకున్నా, దిగువ రాష్ట్రాలు వాడుకున్నా ఇలాంటి సమస్యలు ఉత్పన్నమవుతాయి. కాళేశ్వరం, సమక్క సారక్క, సీతారామ వంటి ప్రాజెక్టుల ద్వారా 400 టీఎంసీల నికర జలాలను వేర్వేరు కారణాలతో తెలంగాణ వాడుకోలేకపోతోంది. ఎగువన ఉన్న మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రలు సైతం తమ నికర జలాల వాటాను పూర్తిగా వాడుకోలేకపోతున్నాయి. దీంతోనే నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి. ఈ రాష్ట్రాలన్నీ తమ నికర జలాల వాటాను పూర్తిగా వాడుకోవడానికి వీలుగా ప్రాజెక్టులు నిర్మిస్తే ఈ పరిస్థితి ఉండదు.

ఆ నీళ్లన్నీ మావేనంటే ఇతర రాష్ట్రాలు ఒప్పుకోవు..

ఏటా 3 వేల టీఎంసీల గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలుస్తున్నట్టు ఎవరు తేల్చారో, ఎలా తేల్చారో అర్థం కాని విషయం. 75 శాతం లభ్యత ఆధారంగా గోదావరిలో 3,396.9 టీఎంసీల నికర జలాల లభ్యతతో పాటు సగటున 4,535.1 టీఎంసీల ప్రవాహం లభ్యతగా ఉందని సీడబ్ల్యూసీ తేల్చింది. అలాగే నికర జలాల్లో వాడకం పోగా సగటున మిగిలే 1138.2 టీఎంసీలు మాత్రమే సముద్రంలో కలుస్తున్నాయని వివరణ ఇచ్చింది. ఈ జలాలపై బేసిన్ చివరిలోని ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకే కాకుండా, బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకూ హక్కులుంటాయి. కిందికి పోయే నీళ్లన్నీ మావేనని అంటే ఇతర రాష్ట్రాలు ఒప్పుకోవు. గోదావరి జలాల్లో ఉమ్మడి ఏపీకి 1470 టీఎంసీల వాటా ఉండగా, విభజన అనంతరం తెలంగాణకు 968, ఏపీకి 531.9 టీఎంసీలను సీడబ్ల్యూసీ కేటాయించింది. వాటి ఆధారంగానే రెండు రాష్ట్రాలు ప్రాజెక్టులు కట్టుకోవాల్సి ఉంటుంది..'అని శ్రీరామ్ స్పష్టం చేశారు.

గోదావరి-కావేరి అనుసంధానమే పరిష్కారం

'చెరో 200 టీఎంసీల వరద జలాలతో బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తామని ఏపీ, ఇచ్చంపల్లి ప్రాజెక్టు కడతామని తెలంగాణ అంటున్నాయి. రేపు మహారాష్ట్ర సైతం 200 టీఎంసీల వరద జలాలను వాడుకుంటామంటే ఈ రెండు రాష్ట్రాలకూ ఇబ్బందులు తప్పవు. గోదావరిలో మిగిలి ఉన్న నికర జలాలను వాడుకోవడానికి ఏకైక పరిష్కారం గోదావరి–కావేరి అనుసంధానం ప్రాజెక్టే. ఇందులో ఏపీ, తెలంగాణకి 80 శాతం వాటా ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉంది. ఛత్తీస్‌గఢ్ ఇటీవల 90 టీఎంసీలతో బోధిఘాట్ ప్రాజెక్టుకు, 150 టీఎంసీలతో మహానది–ఇంద్రావతి అనుసంధానం ప్రాజెక్టుకు అనుమతులు తీసుకుంది. ఆ రాష్ట్రం నికర జలాలను పూర్తి స్థాయిలో వాడుకుంటే గోదావరి–కావేరి ప్రాజెక్టుకు సైతం నీటి లభ్యత ఉండదు. ఇచ్చంపల్లి వద్ద ఎక్కువ ఎత్తులో బరాజ్ నిర్మిస్తే కాళేశ్వరం ప్రాజెక్టులోని కన్నెపల్లి పంప్‌హౌస్‌కి సైతం నీళ్లు అందుతాయి. పూర్తిగా 95 శాతం కేంద్ర నిధులతో కట్టే ఈ ప్రాజెక్టుకు రెండు తెలుగు రాష్ట్రాలు సమ్మతి తెలపాలి..'అని శ్రీరామ్ సూచించారు.

ఆహారం బదులు పిల్లలకు విషం పెడతారా?

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫైర్
- విద్యార్థుల మరణాలకు సీఎం రేవంత్‌రెడ్డి బాధ్యత వహించాలి



సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం వల్ల రాష్ట్రంలోని విద్యాసంస్థల్లో ఏడాదిలో వెయ్యికిపైగా ఫుడ్ పాయిజనింగ్ సంఘటనలు నమోదయ్యాయని, వేలాది మంది అనారోగ్యం పాలవగా.. వంద మందికిపైగా విద్యార్థులు మరణించారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారక రామారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురుకులాల్లో కలుషిత ఆహారం సంఘటనలు, ఆ కారణంగా సంభవించిన విద్యార్థుల మరణాలకు సీఎం రేవంత్‌రెడ్డి పూర్తి బాధ్యత వహించాలని ఆయన డిమాండ్ చేశారు. పిల్లలకు ఆహారం బదులు విషం పెడతారా? అని మండిపడ్డారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులు పిట్టల్లా రాలుతున్నా రాష్ట్ర ప్రభుత్వం మొద్దునిద్రలోనే ఉందని ధ్వజమెత్తారు. కలుషిత ఆహారం, విద్యార్థుల మరణాలపై ముఖ్యమంత్రిగా కాకుండా, కనీసం ఒక తండ్రిగా అయినా రేవంత్ రెడ్డి ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. వీటిపై ఇప్పటికైనా రేవంత్‌రెడ్డి దృష్టి పెట్టాలని ఇద్దరు పిల్లల తండ్రిగా విజ్ఞప్తి చేస్తున్నట్టు తెలిపారు. సీఎం గతంలో అన్నట్లు విద్యార్థుల మరణాలకు ఎవరిని బాధ్యుల్ని చేస్తారో, ఎవరెవరిని ఉరి తీస్తారో చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ప్రభుత్వం మొద్దునిద్ర వీడకుంటే బీఆర్ఎస్ తరఫున ఉద్యమిస్తామని హెచ్చరించారు.

క్షమాపణ.. లేదా రూ.25 కోట్ల పరిహారం

డిప్యూటీ సీఎం భట్టికి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు లీగల్ నోటీస్



సాక్షి, హైదరాబాద్: తనపై చేసిన తప్పుడు ఆరోపణలకు మూడురోజుల్లో బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు లీగల్ నోటీస్ పంపించారు. క్షమాపణలు చెప్పకుంటే తన ప్రతిష్టకు భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేసినందుకు చట్టపరంగా ముందుకెళ్లి రూ.25 కోట్ల నష్టపరిహారాన్ని కోరే హక్కు ఉంటుందని తెలిపారు. అంతేకాక ఈ కేసుకు సంబంధించిన అన్ని ఖర్చులతో పాటు, ఈ లీగల్ నోటీసుకు డిపాజిట్ రూపంలో చెల్లించిన రూ.లక్ష కూడా డిప్యూటీ సీఎం భరించాల్సి ఉంటుందన్నారు. మంగళవారం ఈ మేరకు రాంచందర్‌రావు తరఫు న్యాయవాది ఎం.విజయ్‌కాంత్ నోటీసులు పంపారు. తన గౌరవ, మర్యాదలకు భంగం కలిగించేలా డిప్యూటీ సీఎం వ్యాఖ్యలున్నాయని తెలిపారు. ఇటీవల ఢిల్లీ ఏఐసీసీ కార్యాలయంలో కాంగ్రెస్ నేత రాజేంద్ర పాల్ గౌతమ్‌తో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో 'అప్పటి స్థానిక ఎమ్మెల్సీ రాంచందర్‌రావు వీసీపై ఒత్తిడి తెచ్చి హెచ్‌సీయూ క్యాంపస్‌లో రోహిత్ వేములతో పాటు నలుగురు, ఐదుగురు విద్యార్థులను రస్టికేట్ చేయించారు. దీంతో వేరే మార్గం లేక తప్పని పరిస్థితుల్లో రోహిత్ ఆత్మహత్య చేసుకున్న పరిస్థితి వచ్చింది. అలాంటి వారిని తెలంగాణ బీజేపీ అధ్యక్షుడిగా నియమించడమా? ఎవరెవరైతే దళితులను ఇబ్బంది పెడుతున్నారో వారికి పదవులు ఇవ్వడం బాధాకరం'అని భట్టి వ్యాఖ్యలు చేశారని నోటీసుల్లో పేర్కొన్నారు.

బనకచర్ల వద్దు



▶ మొదటి పేజీ తరువాయి

నీటి కేటాయింపుతో పాటు ఏబీఐపీ పథకం కింద సాయం, గోదావరిపై ఇచ్చంపల్లి వద్ద 200 టీఎంసీల వరద జలాల వినియోగానికి కొత్త ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు, నిధుల కేటాయింపు వంటి అంశాలను చేర్చాలని విజ్ఞప్తి చేసింది. తాజాగా ఇప్పుడు కూడా ఈ అంశాలపైనే చర్చించాలని సీఎస్ స్పష్టం చేశారు.

తెలంగాణ లేవనెత్తిన అభ్యంతరాలు ఇవే..

- ➤ పరీవాహక ప్రాంతంలోని ఇతర రాష్ట్రాలతో సంప్రదింపులు జరపకుండా, అంగీకారం తీసుకోకుండా, గోదావరి ట్రిబ్యునల్ తీర్పు, ఏపీ పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఏపీ ప్రతిపాదించిన బనకచర్ల ప్రాజెక్టుతో రాష్ట్రాలకు ట్రిబ్యునల్ జరిపిన నీటి కేటాయింపుల్లో మార్పులు చోటు చేసుకుంటాయి. ప్రాజెక్టుల నిర్వహణలో సైతం మార్పులు చోటుచేసుకుంటాయి. ఏకపక్షంగా 200 టీఎంసీలను తరలించాలని చేసిన ప్రతిపాదనతో పోలవరం ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్‌లో మార్పులు జరగడంతో పాటు తెలంగాణ నీటి హక్కులకు విఘాతం కలుగుతుంది.
- ➤ ఏపీ పునర్విభజన చట్టం ప్రకారం ప్రాజెక్టుకు అనుమతుల జారీకి సీడబ్ల్యూసీ, గోదావరి బోర్డు, కృష్ణా బోర్డు, అపెక్స్ కౌన్సిల్ నుంచి క్లియరెన్స్‌లు అవసరం కాగా, బనకచర్ల ప్రాజెక్టుకు ఇవేమీ లేవు.
- ➤ ఏపీ సమర్పించిన ప్రీ ఫీజబిలిటీ రిపోర్టులో కీలకమైన సమాచార లోపాలున్నాయి. నీటి లభ్యత, సాంకేతిక సమాచారం లోపించింది.
- ➤ పోలవరం ప్రాజెక్టుతో ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌లో ఏర్పడే ముంపుపై ఇప్పటికే న్యాయస్థానాల్లో కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ సమయంలో ఈ ప్రాజెక్టును ఎలా చేపడతారు?
- ➤ ఈ ప్రాజెక్టు తెలంగాణకు హక్కుగా రావాల్సిన నీటి వాటాలను హరిస్తుంది. ప్రధానంగా కరువు పీడిత ప్రాంతాలపై దుష్ప్రభావం చూపుతుంది.

ఆ సంస్థల విశ్వసనీయత దెబ్బతింటుంది..

బనకచర్ల ప్రాజెక్టుపై గోదావరి బోర్డు, కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ), కేంద్ర పర్యావరణ శాఖలోని నిపుణుల మదింపు కమిటీ తీవ్ర అభ్యంతరాలు తెలపడాన్ని సీఎస్ గుర్తు చేశారు. ఎలాంటి అనుమతులు లేకుండా, చట్టాలను, ట్రిబ్యునల్ తీర్పులన్నింటినీ ఉల్లంఘిస్తూ చేపట్టిన బనకచర్ల ప్రాజెక్టుపై చర్చించాల్సిన అవసరం లేనేలేదని తేల్చి చెప్పారు. ఇలాంటి చర్యలు కేంద్ర ప్రభుత్వ నియంత్రణ సంస్థల విశ్వసనీయతను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే ఏపీ సమర్పించిన ప్రీ ఫీజబిలిటీ రిపోర్టును కేంద్ర పర్యావరణ శాఖ పరిధిలోని నిపుణుల కమిటీ తిరస్కరించిన విషయాన్ని ప్రస్తావించారు. సీడబ్ల్యూసీ కూడా ఈ రిపోర్టును తిరస్కరించాలని కోరారు. డీపీఆర్ సమర్పించకుండా, టెండర్లు పిలవకుండా ఏపీని అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అన్ని ప్రక్రియలూ పూర్తైన తర్వాతే చర్చించాలి

- ➤ చట్టబద్ధంగా రావాల్సిన అన్ని అనుమతులు, అంతర్రాష్ట్ర సంప్రదింపులు, అభ్యంతరాల పరిష్కారం వంటి ప్రక్రియలు పూర్తైన తర్వాతే ఈ ప్రాజెక్టుపై అయినా, ఏ సమావేశంలోనైనా చర్చ జరగాలి. ఆ తర్వాతే ప్రాజెక్టును ఆమోదించాలి.
- ➤ బనకచర్ల ద్వారా తరలించనున్న 200 టీఎంసీల గురించి పోలవరం ప్రాజెక్టు డీపీఆర్‌లో ప్రస్తావన లేదు. నీటి లభ్యత, అంతర్రాష్ట్ర ప్రభావాలపై సమగ్ర అధ్యయనంతో పాటు ట్రిబ్యునల్ తీర్పులను నిక్కచ్చిగా అమలు చేస్తేనే ఇలాంటి ప్రాజెక్టులు చేపట్టాల్సి ఉంటుందని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ) స్పష్టం చేసింది.
- ➤ బనకచర్ల ప్రాజెక్టుతో పోలవరం ప్రాజెక్టు ఆపరేషన్ షెడ్యూల్, గోదావరి ట్రిబ్యునల్ తీర్పు, 1980 ఏప్రిల్ 2న జరిగిన అంతర్రాష్ట్ర ఒప్పందం అమలు తీరులో మార్పులు చోటుచేసుకుంటాయని గోదావరి బోర్డు అభ్యంతరం తెలిపింది. ఎలాంటి మార్పులకైనా పరీవాహకంలోని అన్ని రాష్ట్రాల నుంచి తప్పనిసరిగా రాతపూర్వకంగా సమ్మతి తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. గోదావరి జలాల బట్వాడా విషయంలో ఏపీ, తెలంగాణ మధ్య ఎలాంటి ఒప్పందం లేదని కూడా తెలిపింది. 80 టీఎంసీలకు మించి జలాలను ఇతర బేసిన్లకు మళ్లిస్తే బేసిన్‌లోని అన్ని రాష్ట్రాలకు వాటాలు ఇవ్వాలని కృష్ణా, గోదావరి ట్రిబ్యునల్ తీర్పులు స్పష్టం చేస్తున్నాయని తెలిపింది.
- ➤ గోదావరి ట్రిబ్యునల్ పరీవాహక ప్రాంతంలోని అన్ని రాష్ట్రాలకు కేటాయించిన నికర జలాల కోటాలను పూర్తిగా వాడుకోవడానికి ఆయా రాష్ట్రాల్లో ప్రాజెక్టులను నిర్మించిన తర్వాతే బనకచర్ల ప్రాజెక్టుకు ప్రతిపాదించిన 200 టీఎంసీల లభ్యతపై స్పష్టత వస్తుందని సీడబ్ల్యూసీ తేల్చి చెప్పింది.
- ➤ ప్రాజెక్టు గోదావరి ట్రిబ్యునల్ తీర్పుకు విరుద్ధమని పేర్కొంటూ బనకచర్ల ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు జారీ చేయడానికి కేంద్ర పర్యావరణ శాఖ నిరాకరించిన విషయాన్ని సైతం లేఖలో తెలంగాణ ప్రస్తావించింది. అన్ని రకాల అనుమతులు సాధించిన తర్వాతే పర్యావరణ అనుమతులకు దరఖాస్తు చేసుకోవాలని కోరిందని తెలిపింది.

బీఆర్ఎస్‌కు 'గుర్తుల' భయం

- 'స్థానిక' ఎన్నికలకు 36 ఫ్రీ సింబల్స్‌తో నోటిఫికేషన్ విడుదల చేసిన ఎస్ఈసీ
- తమ పార్టీ ఎన్నికల చిహ్నం కారును పోలిన గుర్తులపై బీఆర్ఎస్ అభ్యంతరం




సాక్షి, హైదరాబాద్: తమ పార్టీ ఎన్నికల చిహ్నం 'కారు'ను పోలిన గుర్తులను ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు కేటాయిస్తుండటంతో నష్టం జరుగుతోందని బీఆర్ఎస్ భావిస్తోంది. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కారును పోలిన చిహ్నాలను ఇతరులకు కేటాయిస్తే పార్టీ అభ్యర్థుల విజయావకాశాలను దెబ్బతీస్తుందని ఆందోళన చెందుతోంది. ఈ నేపథ్యంలో ఫ్రీ సింబల్స్ జాబితాలో పేర్కొన్న కారును పోలిన గుర్తులను తొలగించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ)కు మంగళవారం వినతిపత్రం సమర్పించింది. మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్, పార్టీ నాయకులు సోమ భరత్‌కుమార్ ఎన్నికల కమిషనర్‌ను కలిశారు. కారును పోలిన చపాతీ రోలర్, కెమెరా, ఓడ గుర్తులతో 2023 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు జరిగిన నష్టాన్ని వివరించారు. కారును పోలిన గుర్తులను స్తంభింప చేయడంతో పాటు ఏ పార్టీ లేదా అభ్యర్థులకు కేటాయించొద్దని కోరారు. టీఆర్ఎస్ పార్టీ బీఆర్ఎస్‌గా పేరు మార్చుకున్న తర్వాత కూడా తమ పార్టీ ఎన్నికల చిహ్నంగా 'కారు'గుర్తు కొనసాగుతోందని, కానీ కారును పోలిన ఇతర గుర్తుల మూలంగా తమ పార్టీ అభ్యర్థులకు పడాల్సిన ఓట్లు ఇతరులకు పడుతున్నాయన్నారు. ఓటర్లను అయోమయానికి గురి చేసేందుకు కొన్ని రాజకీయ పక్షాలు కొన్ని గుర్తింపు లేని రాజకీయ పార్టీలు, అభ్యర్థులను బరిలోకి దింపి తమ పార్టీకి నష్టం కలిగిస్తున్నాయని చెప్పారు.

'ఫ్రీ సింబల్స్'పై ఆందోళన

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నిర్వహణ దిశగా అడుగులు పడుతున్న తరుణంలో రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 10న 36 చిహ్నాలను 'ఫ్రీ సింబల్స్'గా ప్రకటిస్తూ నోటిఫికేషన్ విడుదల చేసింది. జాతీయ, ప్రాంతీయ పార్టీలు మినహా రిజిస్టర్డ్ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులకు ఫ్రీ సింబల్స్‌ను కేటాయిస్తారు. ఫుట్‌బాల్, జావెలిన్ త్రో, ఏసీ, ఫ్రిజ్, రోలు, రోకలి, యాపిల్, పనస పండు, కెమెరా, చపాతి రోల్, ఓడ తదితర చిహ్నాలు ఈ జాబితాలో ఉన్నాయి. అయితే కెమెరా, చపాతీ రోలర్, ఓడ గుర్తులు ఓటర్లను అయోమయానికి గురి చేసేలా ఉన్నాయని బీఆర్ఎస్ ఉదహరించింది. కెమెరా బొమ్మకు ముందు భాగంలో ఉన్న లెన్స్ కారు చక్రాన్ని పోలి ఉందని, చపాతీ రోలర్ కారు పైభాగాన్ని, ఓడ ముందు భాగం కారు హెడ్ లైట్స్‌ను పోలి ఉన్నాయని బీఆర్ఎస్ చెప్తోంది. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో కెమెరా గుర్తు మూలంగా నాలుగు అసెంబ్లీ నియోజకవర్గాల్లో, చపాతీ రోలర్ వల్ల 19 నియోజకవర్గాల్లో, ఓడ గుర్తు మూలంగా రెండు చోట్ల స్వతంత్రులు, గుర్తింపు పొందని పార్టీల అభ్యర్థులకు భారీగా ఓట్లు పోలైన విషయాన్ని ఎన్నికల కమిషన్ దృష్టికి తీసుకెళ్లింది.

రూ.10 లక్షల ఖర్చు దాటితే.. ప్రభుత్వ ఆమోదం తప్పనిసరి



- ఇక ప్రతి గుడి బడ్జెట్‌కు ప్రభుత్వ పర్యవేక్షణలో ఆమోదం
- 'సాక్షి' కథనానికి స్పందన

సాక్షి, హైదరాబాద్: దేవాదాయ శాఖ అధీనంలోని దేవాలయాల వార్షిక బడ్జెట్‌కు ఆమోదముద్ర వేసే విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇక నుంచి ఆలయాల బడ్జెట్ ప్రతిపాదనలన్నీ కచ్చితంగా ప్రభుత్వ పరిశీలనకు పంపాల్సిందేనని తాజాగా ఆదేశించింది. ఇక దేవాలయాల్లో రూ.10 లక్షలకు మించి ఖర్చు చేయాల్సిన ప్రతి పనికి ప్రభుత్వ ఆమోదం కూడా తప్పనిసరి చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇంతకాలం డిప్యూటీ కమిషనర్లు, రీజినల్ జాయింట్ కమిషనర్లు, కమిషనర్ స్థాయిలో బడ్జెట్‌లను ఆమోదిస్తున్నారు. అయితే, కొందరు అధికారులు బడ్జెట్‌కు ఆమోదముద్ర వేయాలంటే ఆలయ కార్యనిర్వహణాధికారులను కమీషన్ల కోసం వేధిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వారికి డబ్బులివ్వకుంటే బడ్జెట్ ప్రతిపాదనలను పెండింగులో ఉంచుతున్నారని కొన్ని ప్రధాన దేవాలయాల కార్యనిర్వహణాధికారులు ఆరోపిస్తున్నారు. వీటిపై ఫిర్యాదులు చేస్తే వేధిస్తారన్న భయంతో ఎక్కడా లిఖితపూర్వక ఫిర్యాదులు చేయట్లేదు. దీన్ని ఆసరా చేసుకుని అలాంటి అధికారులు మరింత చెలరేగిపోతున్నారు. అవినీతి అధికారుల వల్ల దేవాదాయశాఖకు చెడ్డపేరు వస్తోంది. ఈ తీరుపై ఇటీవల 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనిపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ వివరాలు ఆరాతీసి చర్యలకు ఉపక్రమించారు. శాఖను అప్రదిష్టపాలు చేస్తున్న ఆరోపణలను ఆమె తీవ్రంగా పరిగణించారు. వెంటనే తీరు మారాలని ఆ శాఖ ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్‌ను ఆదేశించారు. ప్రభుత్వం దృష్టికి రాకుండా ఆలయాల బడ్జెట్‌లను అధికారులే మంజూరు చేయటం కూడా సరికాదని మంత్రి అభిప్రాయం వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఈమేరకు తాజాగా దేవాదాయ శాఖ ప్రత్యేక సూచనలు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

ప్రభుత్వం ఆమోదిస్తేనే నిధులు..

ప్రస్తుతం దేవాదాయ శాఖలో 6ఏ, 6బీ, 6 సీలుగా దేవాలయాలను వాటి ఆదాయం ప్రకారం విభజించారు. ఇందులో తక్కువ ఆదాయం ఉన్నవాటిని 6సీలో ఉంచారు. ఆదాయం ఎక్కువ ఉండే దేవాలయాల్లో 6బీ కేటగిరీలోని దేవాలయాల బడ్జెట్‌లను డిప్యూటీ కమిషనర్లు ఆమోదిస్తున్నారు. 6ఏ కేటగిరీ దేవాలయాల్లో రూ.25 లక్షల వరకు ఉండే బడ్జెట్‌లను రీజినల్ జాయింట్ కమిషనర్ ఆమోదిస్తున్నారు. అంతకంటే ఎక్కువుండే జాయింట్ కమిషనర్ స్థాయి దేవాలయాల బడ్జెట్‌లను కమిషనర్ ఆమోదిస్తున్నారు. ఇకపై అన్ని దేవాలయాల బడ్జెట్‌లను తొలుత నేరుగా ప్రభుత్వానికి సమర్పించాలి. ప్రభుత్వం ఆమోదిస్తేనే అధికారులు మంజూరు చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం అభ్యంతరం వ్యక్తం చేసే అంశాలను తిరిగి మార్చాల్సి ఉంటుంది. దీంతో అధికారుల ఇష్టారాజ్యానికి కళ్లెం వేయొచ్చన్నది ప్రభుత్వ ఆలోచన. అలాగే రూ.10 లక్షలను మించి ఖర్చయ్యే ప్రతి పనికి ఇక ప్రభుత్వం ఆమోదముద్ర వేయాల్సి ఉంటుంది.

సాక్షి హైదరాబాద్


బుధవారం । 16 । జూలై । 2025



చెత్తపై చిత్తశుద్ధి!

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును స్వీకరించనున్న సందర్భంలో జీహెచ్ఎంసీ.. స్వచ్ఛతకు సంబంధించి మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.

-12లో



కొరియన్ రుచులు.. కోరి.. కోరి..

భాగ్యనగర వాసులు ఆహార ప్రియులు. ఇటీవలి కాలంలో కొరియన్ రుచులను కోరి.. కోరి ఎంచుకుంటున్నారు.

- సిటీప్లస్‌లో

గరిష్టం/కనిష్టం
33.0/24.0

వాతావరణం

నగరంలో బుధవారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశముంది. గరిష్టంగా 33, కనిష్టంగా 24 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయని అంచనా.

భాగ్యలక్ష్మి అమ్మవారికి బంగారు బోనం



అశేష జనవాహిని మధ్య..



బంగారు బోనంతో జోగిని అవిక

పాతబస్తీలోని చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారికి మంగళవారం బంగారు బోనం సమర్పించారు. స్థానిక భక్తులతో పాటు పర్యాటకులు సైతం బంగారు బోనానికి స్వాగతం పలికారు. అంతకుముందు అక్కన్న మాదన్న దేవాలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. - చార్మినార్

మళ్లీ పేలిన తూటా!

బిహార్, యూపీ నుంచే నగరానికి అక్రమ ఆయుధాలు

- నేరగాళ్ల చేతికి చేరుతుండటంతో పెను సవాల్
- సీపీఐ నేత చందు నాయక్ హత్యకు వాడింది 7.65 ఎంఎం నాటుతుపాకీ
- నిఘా అధికారుల నిద్రమత్తే ఈ పరిస్థితికి ప్రధాన కారణం

సాక్షి, సిటీబ్యూరో: సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కేతావత్ చందు రాథోడ్ అలియాస్ చందు నాయక్‌ను హత్య చేయడానికి దుండగులు 7.65 క్యాలిబర్ నాటు తుపాకీని వినియోగించారు. నగరంలో ఈ ఏడాది చోటు చేసుకున్న మూడో కాల్పుల ఉదంతమిది. బిహార్, ఉత్తరప్రదేశ్ సహా ఉత్తరాది నుంచి నగరానికి వస్తున్న అక్రమ ఆయుధాలు పెనుముప్పుగా పరిణమిస్తున్నాయి. సరైన నిఘా లేని ఫలితంగా ఎక్కడపడితే అక్కడ నాటు తుపాకులు లభిస్తున్నాయి.

అక్రమంగా 'అత్యాధునిక' ఆయుధాలు..

మధ్యప్రదేశ్, బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లోని గ్రామాల్లో నాటు తుపాకుల తయారీ విచ్చలవిడిగా సాగుతోంది. ఆ ప్రాంతాల నుంచే నగరానికి అత్యధికంగా సరఫరా అవుతున్నాయి. ఎప్పటికప్పుడు అప్‌డేట్ అవుతున్న ఈ తయారీదారులు నాటు తుపాకులు సేఫ్టీలాక్‌తో రూపొందిస్తున్నారు. కేవలం 0.32, 7.65, 7.61 క్యాలిబర్స్ మాత్రమే కాకుండా... ప్రొహిబిటెడ్ కేటగిరీలో ఉండే 0.9 ఎంఎం తుపాకులు, తూటాలు నాటు పద్ధతిలో తయారవుతున్నాయి. రివాల్వర్లు, పిస్టళ్లు, డబుల్ బ్యారెల్, సింగిల్ బ్యారెల్ గన్స్ కూడా అక్రమంగా తయారవుతున్నాయి.



ఘటనా స్థలంలో చందు నాయక్ మృతదేహం

వివిధ మార్గాల్లో సిటీకి చేరుతూ...

అక్రమ ఆయుధాలను సిటీకి చేర్చడానికి అనేక మార్గాలు ఉంటున్నాయి. ప్రధానంగా రైళ్లలోని జనరల్ బోగీలు, ట్రాన్స్‌పోర్ట్ లారీలు, ప్రైవేట్ బస్సుల్లో తీసుకువస్తున్నారు. ఆయా ప్రాంతాలకు చెందిన దినసరి కూలీలు సైతం ఆయుధ వ్యాపారాన్ని చేస్తున్నారు. సిటీ శివార్లలో ఉన్న అనేక ప్రాంతాల కేంద్రంగా వీటి విక్రయం జరుగుతోంది. పోలీసు నిఘా అంతంత మాత్రంగానే ఉంటోంది. ఫలితంగా అక్రమ ఆయుధాల దందా యథేచ్ఛగా సాగిపోతోంది. టాస్క్‌ఫోర్స్, ఎస్‌ఓటీ పోలీసులకు అప్పుడప్పుడు కొన్ని ముఠాలు చిక్కుతున్నాయి. అయితే తెరపైకి రాకుండా దందా చేస్తున్న వాళ్లు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు సమాచారం.



దుండగులు పేల్చిన తూటా

కట్ట మైసమ్మకు మేయర్ ప్రత్యేక పూజలు



లక్డీకాపూల్: తెలంగాణ సంస్కృతిని ప్రతిబింబించేలా నగర వాసులు బోనాల ఉత్సవాలను ఘనంగా జరుపుకొంటున్నారని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. మంగళవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో బోనాల సంబరాలు వైభవంగా జరిగాయి. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో మేయర్ పాల్గొన్నారు. జీహెచ్ఎంసీ ప్రాంగణంలోని కట్ట మైసమ్మ ఆలయంలో అమ్మవారికి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ ఉద్యోగుల భాగస్వామ్యంతో జరుపుకొనే బోనాల ఉత్సవం అందరికీ స్ఫూర్తిదాయకమని మేయర్ పేర్కొన్నారు.

రాజీవ్ స్వగృహ ఫ్లాట్లపై ఆసక్తి

సాక్షి, సిటీబ్యూరో: మధ్యతరగతి ప్రజలకు సొంతింటి వసతిని కల్పించేందుకు లాభాపేక్ష లేకుండా తక్కువ ధరలకు అందుబాటులో తెచ్చిన ఫ్లాట్ల కొనుగోలుకు నగరవాసుల ఆసక్తి పెరుగుతోందని రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ సూపరింటెండింగ్ ఇంజినీర్ సి.భాస్కర్ రెడ్డి తెలిపారు. నగరంలోని బండ్లగూడ, పోచారం ప్రాంతాల్లోని ఫ్లాట్ల మార్కెట్ ధర కంటే దాదాపు 40 శాతం తక్కువకే అందుబాటులో ఉన్నాయన్నారు. నాగోల్ బండ్లగూడలోని 159 ఫ్లాట్లకు, పోచారంలోని 601 ఫ్లాట్ల విక్రయానికి నోటిఫికేషన్ విడుదలైనట్లు తెలిపారు. నాగోల్ బండ్లగూడలోని ఫ్లాట్ల కోసం సుమారు 12 వందల మంది ఫోన్లు చేయగా, 700 మంది ప్రాజెక్టును సందర్శించినట్లు తెలిపారు. పోచారం ఫ్లాట్లకు సంబంధించిన 800 మంది వరకు టెలిఫోన్‌లో సంప్రదించగా, సుమారు 300 మంది వరకు ప్రాజెక్టును సందర్శించారన్నారు. బండ్లగూడ ప్రాజెక్టుకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 29 వరకు స్వీకరిస్తామని, 30వ తేదీన లాటరీ ద్వారా కేటాయిస్తామని, పోచారం ప్రాజెక్టుకు సంబంధించిన దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ వరకు స్వీకరిస్తామని, ఆగస్టు 1వ తేదీన లాటరీ ద్వారా కేటాయిస్తామని ఆయన వివరించారు. అతితక్కువ ధరల్లోనే సొంతింటి కలను నెరవేరేలా ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

మహా జలఘోష!

వానాకాలంలోనూ నగరంలో నీటి కోసం విలవిల

గతేడాది కంటే 36 శాతం పెరిగిన ట్యాంకర్ల బుకింగ్

- నగం సైతం నమోదు కాని సాధారణ వర్షపాతం
- పాతాళంలోకి పడిపోయిన భూగర్భ జలమట్టం
- అత్యవసర ట్యాంకర్ల పేరిట ప్రైవేట్ దోపిడీ

బిగ్ స్టోరీ

సాక్షి, సిటీబ్యూరో

మహా హైదరాబాద్‌గా నలు దిక్కులా విస్తరిస్తున్న నగరాన్ని జలఘోష వెంటాడుతోంది. వేసవిలోనే కాదు.. వానా కాలంలో సైతం నిత్యావసరాలకు వినియోగించే నీటి కోసం విలవిలలాడే దుస్థితి నెలకొంది. అడుగడుగునా కాంక్రీట్ జంగిల్‌గా మారడంతో భూమిలో వర్షపు నీరు ఇంకే పరిస్థితి లేకుండా పోయింది. విచ్చలవిడిగా వందల మీటర్ల లోతుతో బోర్ల తవ్వకాలు నీటి మట్టాన్ని పాతాళంలోకి నెట్టేశాయి. తాజాగా తక్కువ వర్షాలతో భూగర్భజలాలు పైకి రాని పరిస్థితి నెలకొనడంతో ట్యాంకర్లపై ఆధారపడక తప్పడం లేదు. బహుళ అంతస్తు భవన సముదాయాలు, గేటెడ్ కమ్యూనిటీలు, ఐటీ కంపెనీల నుంచి ట్యాంకర్లకు తాకిడి పెరిగింది. జలమండలి శుద్ధి చేసిన నీటిని ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తుండగా.. ప్రైవేట్ వ్యాపారులు శుద్ధి చేయని నీటిని సరఫరా చర్మ వ్యాధులకు గురి చేస్తోంది.

బావురుమంటున్న బోర్లు..

బహుళ అంతస్తుల భవన సముదాయాల్లో బోరుబావులు బావురుమంటున్నాయి. నగరంలో సుమారు 3.29 లక్షల వరకు చిన్నా.. పెద్దా అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలుండగా ఇందులో సుమారు 72 వేల సముదాయాల్లో నీటి ఎద్దడి నెలకొంది. కేవలం నిత్యావసర నీటికి డిమాండ్ పెరగడంతో వేసవి మాదిరిగానే రోడ్లపై ట్యాంకర్ల పరుగులు కనిపిస్తున్నాయి. ఓఆర్ఆర్ పరిధిలో వేలాది సముదాయలకు వాటర్ బోర్డు నల్లా కనెక్షన్లు లేవు. బోరుబావుల్లో నీటి మట్టం పెరగకపోవడంతో ట్యాంకర్లను ఆశ్రయించాల్సి వస్తోంది.

36 శాతం పెరిగిన బుకింగ్

జలమండలికి ఈ నెలలో ట్యాంకర్ తాకిడి బాగా పెరిగింది. గతేడాది జూలై మొదటి రెండు వారాలతో పోల్చితే 36 శాతం బుకింగ్ పెరిగినట్లు కనిపిస్తోంది. మొత్తం 22 డివిజన్ పరిధిలో గతేడాది 63,724 ట్యాంకర్లు బుకింగ్ జరిగితే ఈసారి 86,520 ట్యాంకర్లు బుకింగ్ అయినట్లు అధికారగణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. శివారు ప్రాంతల్లో 23 నుంచి 51 శాతం పెరగగా, ఎల్‌బీనగర్ పరిధిలో మాత్రం ఐదింతల ట్యాంకర్ల తాకిడి పెరిగింది. నారాయణగూడ డివిజన్‌లో 51 శాతం, పాతబస్తీలోని చార్మినార్, రియాసత్ నగర్ డివిజన్ పరిధిలో గతేడాది కంటే 117 నుంచి 257 శాతం పెరగడాన్ని బట్టి భూగర్భ జలాల పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. రోజువారీగా 5 వేల నుంచి 6 వేల ట్యాంకర్లు బుకింగ్ జరుగుతోంది. మొత్తమ్మీద దాదాపు 14.06 లక్షలకు పైగా కనెక్షన్లు ఉండగా.. అందులో కేవలం 42 వేల గృహ సముదాయాల నుంచి మాత్రమే వాటర్ ట్యాంకర్ల డిమాండ్ ఉంటుందని జలమండలి పేర్కొంటోంది. సుమారు 500 గృహ సముదాయాలు వేసవిలో 75 రోజుల్లో 31 వేల ట్యాంకర్లు బుక్ చేయగా, మిగిలిన 41,500 వేల సముదాయాలు 90 శాతం అంటే.. 2.84 లక్షల ట్యాంకర్లను బుక్ చేసుకున్నట్లు తెలుస్తోంది.



నీటిని ఇలా నిల్వ చేసి ట్యాంకర్లతో సరఫరా చేస్తున్న ప్రైవేట్ వ్యాపారులు

ప్రైవేట్ ట్యాంకర్లకు కాసుల పంట

ప్రజల నీటి అత్యవసరం ప్రైవేట్ జల వ్యాపారులకు కాసులు కురిపిస్తోంది. వాటర్‌బోర్డు ట్యాంకర్ల ధర తక్కువగా ఉన్నప్పటికీ.. సరఫరాలో కొద్ది జాప్యం ప్రైవేట్ ఆపరేటర్లకు కలిసి వస్తోంది. ఖాళీ ప్లాట్లతో పాటు చెరువుల సమీప స్థలాల్లో బోర్లు వేసి భూగర్భ జలాలను తోడేసి పగలు, రాత్రి అనే తేడా లేకుండా దందా కొనసాగిస్తున్నారు. నీరు నిత్యావసరం కావడం.. ట్యాంకర్ దొరికితే చాలన్న గత్యంతరం లేని పరిస్థితుల్లో.. ఎంత ధరయినా పెట్టి ట్యాంకర్లు తెప్పించుకోవడం సర్వసాధారణమైంది. వాటర్ బోర్డు కస్టమర్ అకౌంట్ నంబర్ (సీఏఎన్) ద్వారా 5000 లీటర్ల వాటర్ ట్యాంకర్‌ను బుక్ చేసిన వారికి రూ.500కు లభిస్తోంది. సీఏఎన్ లేనివారికి అదే ట్యాంకర్‌ను రూ.850కు సరఫరా చేస్తోంది. అదే ట్యాంకర్‌ను ప్రైవేటులో తెప్పించుకోవాలంటే ప్రాంతాన్ని బట్టి, అత్యవసరాన్ని బట్టి రూ.1000 నుంచి రూ.1500 వరకు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది.

వర్షాభావ పరిస్థితులతో..

ముందస్తు వర్షాలు ప్రారంభమైనప్పటికీ.. సాధారణ వర్షపాతం సగటున సగం కూడా నమోదు కాకపోవడంతో భూగర్భజలాల పెరుగుదల లేకుండా పోయింది. గత నెలలో సాధారణ వర్షపాతం 40 శాతం మించకపోగా, ఈ నెలలో సైతం అదే పరిస్థితి పునరావృతమవుతోంది. వేసవి కంటే ముందు అడుగంటిన నీటి మట్టంలో వృద్ధి కనిపించడం లేదు. హైదరాబాద్ జిల్లా పరిధిలో 17 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 8.3 సెంటీమీటర్లకు మించలేదు. రంగారెడ్డి జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సాధారణ వర్షపాతం నమోదైనా.. నగర శివారులోని ఎనిమిది అర్బన్ మండలాల్లో 30 నుంచి 40 శాతం కూడా నమోదు కాలేదు. మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా సాధారణ వర్షపాతం 56 శాతం తక్కువగా నమోదైంది. వేసవిలో సుమారు 10 నుంచి 20 మీటర్ల కంటే ఎక్కువ లోతుకు భూగర్భ జలాలు చేరాయి. తాజా వర్షాభావ పరిస్థితులతో పలు ప్రాంతాల్లో తక్కువ లోతులో ఉన్న బోర్ల నుంచి సైతం నీటి చుక్కనీరూ పైకి రావడం లేదు.

జల మండలి పరిధిలో జులై 1 నుంచి 14 వరకు ట్యాంకర్ల బుకింగ్ ఇలా

డివిజన్	2024	2025	పెరిగిన శాతం
దుర్గం చెరువు	14,589	17,872	23
ఎస్ఆర్‌నగర్	9,058	13,660	51
కూకట్‌పల్లి	8,764	10,782	23
మణికొండ	6,897	9,822	42
నిజాంపేట	5,454	7,127	31
హఫీజ్‌పేట	3,880	4,265	10
అల్వాల్ మల్కాజిగిరి	1,960	3,645	86
ఆసిఫ్‌నగర్	2,372	3,399	43
కుత్బుల్లాపూర్	2,464	3,150	28
సాహెబ్‌నగర్	1,708	2,539	49
మారేడుపల్లి	1,810	2,540	40
నారాయణగూడ	1,363	2,112	55
రాజేంద్రనగర్	1,189	1,779	50
బోడుప్పల్	706	1,097	55
ఎల్‌బీనగర్	276	1027	272

జలమండలి పరిధిలో..

మొత్తం ట్యాంకర్ల సంఖ్య : 1,135
ఫిల్లింగ్ స్టేషన్లు : 88
ఫిల్లింగ్ పాయింట్స్ : 140
రోజువారీగా సరఫరా : 5 వేల నుంచి 6 వేల ట్యాంకర్లు
ట్యాంకర్ల డెలివరీ సమయం : 12 నుంచి 24 గంటలు
సరఫరా : రెండు షిఫ్టులు



ఇంకుడు గుంతలు తప్పనిసరి..



భూగర్భ జలాల పెంపునకు 300 గజాలపైగా ఉన్న ప్రతి ప్రాంగణంలో ఇంకుడు గుంత తప్పనిసరి. ఇప్పటికే సర్వే నిర్వహించి ఇంకుడు గుంతలు లేని సుమారు 16 వేల గృహ సముదాయాలకు నోటీసులు జారీ చేశాం. వర్షాకాలంలో 90 రోజుల ప్రత్యేక ప్రణాళికలో భాగంగా ఇంకుడు గుంతలపై అవగాహన కల్పిస్తున్నాం. జలయజ్ఞంలో అందరి భాగస్వామ్యం అవసరం

– అశోక్ రెడ్డి, ఎండీ, జలమండలి

ముష్కి చెరువును మురుగులో కలిపేస్తారా?

హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆగ్రహం



స్థానికులతో కలిసి ముష్కి చెరువు వద్ద హైడ్రా కమిషనర్ రంగనాథ్

మణికొండ: కాలగర్భంలో కలిసిపోయిన చెరువులను ఓ వైపు పునరుద్ధరిస్తుంటే.. మరోవైపు ఉన్న చెరువులను నాశనం చేస్తారా? అంటూ హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మంగళవారం మణికొండ, నార్సింగి మున్సిపాలిటీల మధ్యలో మై హోం అవతార్ సమీపంలోని ముష్కి చెరువును ఆయన పరిశీలించారు. చెరువులో మురుగు చేరడం, ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లలో మట్టి పోసి కుదించటంపై ఇరిగేషన్, మున్సిపల్ అధికారులను రంగనాథ్ నిలదీశారు. ధ్రువాన్ష్ అనే స్వచ్ఛంద సంస్థ ప్రభుత్వ శాఖల నుంచి డబ్బులు తీసుకుని, రియల్ ఎస్టేట్ సంస్థలతో మిలాఖత్ అయి చెరువును పాడు చేయటంతో పాటు చుట్టు పక్కల నివసించలేని విధంగా దుర్గంధం, దోమలు వ్యాప్తి చెందుతున్నాయని స్థానికులు ఆయన దృష్టికి తెచ్చారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్, తూముల వద్ద పోసిన మట్టిని తొలగించాలని, చెరువులో మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకోవాలని మణికొండ మున్సిపల్ కమిషనర్ ప్రదీప్‌కుమార్‌ను ఆదేశించారు. చెరువును అభివృద్ధి చేస్తామని దత్తత తీసుకుని.. చేసే పని ఇలాగేనా అంటూ తత్వ రియల్ ఎస్టేట్ సంస్థ ప్రతినిధిని నిలదీశారు.

నిమ్స్‌లో 17 మంది కల్తీ కల్లు బాధితులకు చికిత్స

నలుగురు బాధితుల డిశ్చార్జి

లక్డీకాపూల్ : కూకట్‌పల్లి కల్తీ కల్లు ఘటనలో అస్వస్థతకు గురైన 17 మందికి నిమ్స్‌లో చికిత్స అందిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యానారాయణ తెలిపారు. ట్రామా బ్లాక్‌లోని ప్రత్యేక వైద్యసేవలు పొందుతున్న వారిలో మంగళవారం నలుగురిని డిశ్చార్జి చేశామని చెప్పారు. దీంతో డిశ్చార్జి అయిన వారి సంఖ్య 23కి చేరిందన్నారు. కల్తీ కల్లు తాగి వాంతులు, విరోచనాలతో బాధపడుతూ ఆస్పత్రికి వచ్చిన వారికి మెరుగైన వైద్యం అందించి ప్రాణాపాయ పరిస్థితి నుంచి తప్పించినట్లు ఆయన పేర్కొన్నారు. వెంటిలేటర్‌పై చికిత్స పొందిన వారు సైతం డిశ్చార్జి అయ్యారని గుర్తు చేశారు. రోగుల విషయంలో నిమ్స్ తీసుకున్న ఉన్నత వైద్య ప్రమాణాలే ఇందుకు కొలమానమన్నారు.

డిష్యుం ..డిష్యుం ..

గౌతంనగర్ బీఆర్ఎస్ కార్పొరేటర్ భర్తపై దాడి

- రసాభాసగా మారిన బోనాల చెక్కుల పంపిణీ
- ప్రొటోకాల్ విషయమై తలెత్తిన వివాదం
- కాంగ్రెస్, బీఆర్ఎస్ పరస్పర ఘర్షణలు
- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిపైనా దాడికి యత్నం



అల్వాల్ పోలీస్‌స్టేషన్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

అల్వాల్: బోనాల చెక్కుల పంపిణీ రసాభాసగా మారింది. ప్రొటోకాల్ పేరుతో కాంగ్రెస్, బీఆర్ఎస్ శ్రేణులు పరస్పరం దాడులకు పాల్పడ్డాయి. బోనాలను పురస్కరించుకుని మల్కాజిగిరి నియోజకవర్గ పరిధిలోని ఆలయాలకు ఆర్థిక సహాయం అందించడానికి అల్వాల్‌లోని బాలాజీ వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాగణంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య హాజరయ్యారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు వేదిక వద్దకు వచ్చారు.

ఈ క్రమంలో వేదికపై ఏర్పాటు చేసిన కుర్చీల్లో కూర్చోవడానికి బీఆర్ఎస్ మహిళా కార్పొరేటర్లకు స్థానం కల్పించలేదంటూ ఆ పార్టీ శ్రేణులు ప్రశ్నించడంతో తలెత్తిన వివాదం.. ఘర్షణకు దారి తీసింది. బీఆర్ఎస్ గౌతంనగర్ మహిళా కార్పొరేటర్ సునీత భర్త రాము యాదవ్‌పై కాంగ్రెస్ కార్యకర్తలు దాడికి దిగారు. ఆయన ప్రాణ భయంతో అక్కడి నుంచి పరుగులు తీశారు. ఈ సమయంలోనే నలుగురికి చెక్కులు పంపిణీ చేసి ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య వెళ్లిపోయారు. అనంతరం ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డిపై కొందరు వాటర్ బాటిళ్లు విసిరారు. అప్రమత్తమైన గన్‌మెన్ వెంటనే దానిని అడ్డుకున్నారు. పరిస్థితి మరింత ఉద్రిక్తతకు దారి తీస్తే గన్‌మెన్ వార్నింగ్ కాల్పులకు సిద్ధమయ్యే స్థితి ఏర్పడింది. పోలీసులు హుటాహుటిన అక్కడికి చేరుకుని కాంగ్రెస్, బీఆర్ఎస్ కార్యకర్తలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకున్నారు. పేట్ బషీరాబాద్ ఏసీపీ బాలగంగిరెడ్డి మాట్లాడుతూ.. ఈ ఘటనకు సంబంధించిన సీసీ ఫుటేజీ, వీడియోలను పరిశీలిస్తున్నామని, చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం బీఆర్ఎస్, కాంగ్రెస్ నేతల ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు.



దాడిలో గాయపడిన కార్పొరేటర్ సునీత భర్త రాము యాదవ్

కాంగ్రెస్ శ్రేణుల ధర్నా

ఈ ఘటనతో ప్రజాప్రతినిధుల భద్రతపై మరోసారి ప్రశ్నలు తలెత్తాయి. పోలీస్‌స్టేషన్‌లో కూడా కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతలు పరస్పర సవాళ్లు విసురుతూ గొడవకు దిగి దృశ్యాలు బయటకు రావడంతో పోలీసులు కేవలం ప్రేక్షక పాత్రలో మిగిలారని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమయంలో పోలీసులు ఇరు వర్గాలను వేరుచేసి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. అనంతరం ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా.. కాంగ్రెస్ పార్టీ నాయకులు రోడ్డుపై బైఠాయించారు. బీఆర్ఎస్ నాయకులపై కేసులు నమోదు చేయాలంటూ ధర్నాకు దిగారు. ప్రభుత్వ కార్యక్రమాన్ని అప్రతిష్ట పాల్జేయడానికే బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నించారని విమర్శించారు.

దాడులు దారుణం:
ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

బోనాల సందర్భంగా ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సహాయ పంపిణీలో కాంగ్రెస్ కార్యకర్తలు గొడవకు దిగి బీఆర్ఎస్ శ్రేణులపై దాడి చేయడం వారి దౌర్జన్యాలకు పరాకాష్ట అని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి అన్నారు. నిధుల మంజూరు కోసం పోటీ పడాలి తప్ప దాడులు చేయడం సరికాదని హితవు పలికారు. తాను చేస్తున్న అభివృద్ధిని ఓర్వలేకనే ఇలాంటి ఘటనలకు పాల్పడుతున్నారని విమర్శించారు.

మల్కాజిగిరిలో ఉద్రిక్తత



మల్కాజిగిరి చౌరస్తాలో బైఠాయించిన మైనంపల్లి

మల్కాజిగిరి: అల్వాల్‌లో చెక్కుల పంపిణీ ఘటన కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల మధ్య చిచ్చు రేపింది. మల్కాజిగిరికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు చిన్నా యాదవ్‌పై దాడి జరగడంతో అతని బాబాయి సంఘ సేవకుడు మండల రాధాకృష్ణ యాదవ్ మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకు ఫోన్ చేసి మల్కాజిగిరి చౌరస్తాకు వస్తే తేల్చుకుందామని సవాల్ విసిరారు. దీంతో మైనంపల్లి, మెదక్ ఎమ్మెల్యే రోహిత్, కార్పొరేటర్లు ప్రేమ్‌కుమార్, జితేంద్రనాథ్ తదితరులు కాంగ్రెస్ కార్యకర్తలతో మల్కాజిగిరి చౌరస్తాకు వచ్చి బైఠాయించారు. మల్కాజిగిరి ఏసీపీ చక్రపాణి, సీఐ సత్యనారాయణలు పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. గంటసేపు గడిచినా ఎవరూ రాకపోవడంతో మైనంపల్లి ఆనంద్‌బాగ్‌లోని తన కార్యాలయానికి వెళ్లారు. మండల రాధాకృష్ణ యాదవ్ స్వయంగా ఫోన్ చేసి సవాల్ విసిరారని.. ఆయన వచ్చి ఉంటే తన సత్తా ఏంటో చూపించేవాడినన్నారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ కార్యకర్తలపై దాడి చేస్తే ప్రతిదాడి చేస్తామని మైనంపల్లి హన్మంతరావు హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిబద్ధతతో పని చేయాలని, కలిసికట్టుగా పనిచేయాలని ప్రమాణం చేయించారు.

12 వేల డిటొనేటర్లు స్వాధీనం

ఘట్‌కేసర్: నిషేధిత డిటొనేటర్లు తరలిస్తున్న వారిని ఘట్‌కేసర్ పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ పరశురాం తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని యంనంపేట్ చౌరస్తాలో వాహనాలు తనిఖీ చేయగా రెండు కార్లలో అక్రమంగా తరలిస్తున్న నిషేధిత 12 వేల డిటొనేటర్లు కనిపించాయి. దీంతో కారులో ప్రయాణిస్తున్న వారిని అదుపులోకి తీసుకొని విచారించగా హనుమకొండ భీమారం మండలం, గోపాలపూర్ గ్రామానికి చెందిన బొమ్మకంటి వేణుగోపాల్, యాదాద్రి-భువనగిరి జిల్లా పోచంపల్లి చెందిన గుండు శ్రీనాథ్, తాటిపల్లి రవీందర్, కర్నాటకకు చెందిన సంగన్‌గౌడ్, పడిలప్ప గౌడ్, బస్వప్పగౌడ్‌గా తేలింది. కర్నాటకలోని సాయి ఎంటర్‌ప్రైజెస్ నుంచి డిటొనేటర్లు కొనుగోలు చేసి యాదాద్రి-భువనగిరి జిల్లా కప్రాయిపల్లిలోని వెంకటేశ్‌కు అప్పగించేందుకు వస్తుండగా పోలీసులకు పట్టుబడ్డారు. రెండు కార్లు, డిటొనేటర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశారు.

ట్రేడింగ్ పేరుతో రూ.57 లక్షలు స్వాహా

సాక్షి, సిటీబ్యూరో: జూబ్లీహిల్స్‌కు చెందిన ఓ వృద్ధుడికి (60) ట్రేడింగ్ పేరుతో ఆన్‌లైన్ ద్వారా ఎర వేసిన సైబర్ నేరగాళ్లు రూ.57 లక్షలు స్వాహా చేశారు. దీనిపై సైబర్ క్రైమ్ పోలీసులు మంగళవారం కేసు నమోదు చేసుకున్నారు. ఆన్‌లైన్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ 'ఎఫ్ఎక్స్ రోడ్' ద్వారా బాధితుడు ఈ వల్లో చిక్కారు. తొలుత తక్కువ లాభాలు చూపించిన నేరగాళ్లు ఆపై భారీ మొత్తం పెట్టుబడులు పెట్టించారు. బాధితుడు అప్పులు చేసి, తనకు ఉన్న పాలసీలు సరెండర్ చేసి రూ.57,43,414 ఇన్వెస్ట్ చేసి మోసపోయాడు.

నాంపల్లి స్టేషన్‌కు ఇక కొత్తరూపు!

పునరాభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన దక్షిణ మధ్య రైల్వే

- రూ.327 కోట్లతో రీ డెవలప్‌మెంట్ పనులు
- హైదరాబాద్ సంస్కృతి ఉట్టిపడే విధంగా నిర్మాణ పనులు
- అత్యాధునిక వసతులు..హైటెక్ హంగులు



నాంపల్లి రైల్వే స్టేషన్‌లో పనులు ప్రారంభించిన దృశ్యం..

సాక్షి, సిటీబ్యూరో: నిజాం కాలంనాటి చారిత్రక నాంపల్లి రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి. సికింద్రాబాద్ తరహాలో అంతర్జాతీయ ప్రమాణాలతో ఆధునిక సదుపాయాలతో స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నారు. హైదరాబాద్ సంస్కృతి ఉట్టిపడేవిధంగా నాంపల్లి స్టేషన్‌ను అభివృద్ధి చేయనున్నట్లు దక్షిణమధ్య రైల్వే అధికారులు తెలిపారు. అమృత్ భారత్ పథకం కింద రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధిలో భాగంగా రూ.327 కోట్ల అంచనాలతో పనులు చేపట్టినట్లు పేర్కొన్నారు. నాంపల్లి స్టేషన్ నుంచి ప్రతి రోజు 65 రైళ్లు రాకపోకలు సాగిస్తాయి. 25 వేల మందికి పైగా ప్రయాణం చేస్తారు. స్టేషన్‌లో మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేసేందుకు, సమగ్రమైన రవాణా సదుపాయాలను అందజేసేందుకు గతంలోనే మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. ఇందుకనుగుణంగా ప్రస్తుతం అభివృద్ధి పనులను ప్రారంభించారు. సికింద్రాబాద్ తరహాలోనే నాంపల్లికి చేరుకొనే రైళ్లు, బయలుదేరే రైళ్ల కోసం వేర్వేరుగా ప్లాట్‌ఫామ్‌లను ఏర్పాటు చేస్తారు. ప్రయాణికులకు సీమ్‌లెస్ జర్నీ సదుపాయాన్ని కలుగజేసేవిధంగా పార్కింగ్ సదుపాయాలను అభివృద్ధి చేస్తారు. హైదరాబాద్ చారిత్రక, వారసత్వ కట్టడాలను ప్రతిబింబించేవిధంగా, పర్యాటక ప్రాంతాలకు అద్దంపట్టేలా నాంపల్లి స్టేషన్‌ను ఒక అందమైన భవనంగా తీర్చిదిద్దనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే ఉన్నతాధికారి ఒకరు తెలిపారు.

పునరాభివృద్ధి ఇలా...

- నవాబు కుటుంబాలకు రైల్వేసేవల కోసం అప్పటి నిజాం నవాబు మీర్ ఉస్మాన్‌అలీఖాన్ 1907లో దక్కన్ రైల్వేస్టేషన్‌ను నిర్మించారు. కాలక్రమంలో ఇది నాంపల్లి స్టేషన్‌గా స్థిరపడింది. సికింద్రాబాద్ తరువాత నాంపల్లి స్టేషన్ రెండవ స్థానంలో నిలిచింది. చార్మినార్, శబరి, నర్సాపూర్, గోదావరి తదితర ప్రధాన రైళ్లు ఇక్కడి నుంచే బయలుదేరుతాయి.
- సుమారు 9,245 చ.మీ.ల పరిధిలో స్టేషన్ భవనాలను, మౌలిక సదుపాయాలను పునరాభివృద్ధి చేయనున్నారు. పర్యావరణహితమైన భవనాలుగా నిర్మిస్తారు. అలాగే విద్యుత్ సదుపాయం కోసం సోలార్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేస్తారు.
- స్టేషన్ చుట్టూ ఉన్న 13,550 చ.మీ. పరిధిలో పార్కింగ్ తదితర మౌలిక సదుపాయాలను కల్పించనున్నారు. స్టేషన్ ప్రధాన ప్రవేశ ద్వారాన్ని, రెండో ద్వారాన్ని ఎత్తైన స్కై కాంకోర్స్‌తో కనెక్ట్ చేస్తారు.
- నాంపల్లి మెట్రో స్టేషన్ నుంచి ప్రయాణికులు నేరుగా రైల్వేస్టేషన్‌కు చేరుకొనేవిధంగా 9 మీటర్ల పొడవైన ఫుట్ ఓవర్ బ్రిడ్జిని నిర్మించనున్నారు.
- సుమారు 1450 చ.మీ.వెయిటింగ్ హాళ్లు అందుబాటులోకి రానున్నాయి. ఏసీ డార్మెటరీతో పాటు 14 విశ్రాంతి గదులను నిర్మిస్తారు.
- సుమారు 23,146 చ.మీ. విస్తీర్ణాన్ని హోటళ్లు, ఇతర వ్యాపార, వాణిజ్య సముదాయాలకు కేటాయించనున్నారు. అలాగే స్టేషన్‌లో బుకింగ్ కౌంటర్లను పునర్నిర్మించనున్నారు. ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ యంత్రాలను ఏర్పాటు చేస్తారు.
- నాంపల్లిస్టేషన్‌లో కొత్తగా 16 లిఫ్టులు, 8 ఎస్కలేటర్లు, టికెట్ కౌంటర్‌లు, దివ్యాంగులకు అవసరమైన సదుపాయాలను కల్పించనున్నారు. అలాగే అగ్నిమాపక యంత్రాలు, వైఫై సదుపాయం, ల్యాప్‌టాప్, మొబైల్‌చార్జింగ్ పాయింట్లు, ఫార్మసీ, వైద్య సదుపాయాలు, ఫుడ్‌కోర్ట్, షాపింగ్ సెంటర్‌లు ఏర్పాటు చేస్తారు.
- సీసీటీవీలతో పూర్తిస్థాయి పర్యవేక్షణ ఉంటుంది.
- వాన నీటి సంరక్షణకు భారీ ఎత్తున ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయనున్నారు.
- మార్చి 2027 నాటికి నాంపల్లి రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి ప్రాజెక్టును పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించారు.
- కాగా సికింద్రాబాద్, మల్కాజిగిరి రైల్వే స్టేషన్ల అభివృద్ధి పనులు ఇప్పటికే శరవేగంగా జరుగుతున్నాయి.

నాంపల్లి, చర్లపల్లి స్టేషన్‌లలో జీఎం పర్యటన





నాంపల్లి స్టేషన్‌లో జీఎం...

సాక్షి, సిటీబ్యూరో: దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ సంజయ్ కుమార్ శ్రీవాస్తవ మంగళవారం హైదరాబాద్ దక్కన్ (నాంపల్లి), చర్లపల్లి రైల్వేస్టేషన్లను తనిఖీ చేశారు. ఆయనతో పాటు సికింద్రాబాద్ డివిజనల్ రైల్వే మేనేజర్ భరతేష్ కుమార్ జైన్, ఇతర సీనియర్ అధికారులు ఉన్నారు. ఈ సందర్భంగా నాంపల్లి స్టేషన్‌లో అందుబాటులో ఉన్న ప్రయాణికుల సౌకర్యాలు, వసతులను ఆయన సమీక్షించారు. బుకింగ్ కౌంటర్, వెయిటింగ్ రూమ్, స్టేషన్ మాస్టర్ కార్యాలయం, స్టేషన్‌లోని సర్క్యులేటింగ్ ప్రాంతాన్ని కూడా ఆయన పరిశీలించారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా నాంపల్లి స్టేషన్‌లో జరుగుతున్న పునరాభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ పనుల పురోగతిపై డివిజనల్ అధికారులు సమగ్ర నివేదికను ఆయనకు అందజేశారు. నిర్ణీత గడువులోగా పనులు పూర్తి చేయడానికి పనులను వేగవంతం చేయాలని జనరల్ మేనేజర్ అధికారులను ఆదేశించారు. నాంపల్లి పర్యటనకు ముందు ఆయన చర్లపల్లి రైల్వే స్టేషన్‌లో పర్యటించారు. ఎగ్జిక్యూటివ్ లాంజ్, వెయిటింగ్ హాళ్లు, స్లీపింగ్ పాడ్‌లు, కెఫెటేరియా, టికెట్ బుకింగ్ కౌంటర్లు, లిఫ్టులు, ఎస్కలేటర్లు, ఫుట్ ఓవర్ బ్రిడ్జి, ఈవీ ఛార్జింగ్ పాయింట్లు,తదితర ఆధునిక సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బుకింగ్ క్లర్క్, 'సఫాయ్ మిత్ర' సిబ్బందితో ఆయన సంభాషించారు. వారి డ్యూటీ వేళలు, పని వాతావరణం, వాళ్లకు అందజేసే సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు.

పసివాడిపై పైశాచికంగా దాడి: పోలీసులకు ఫిర్యాదు


అమీర్‌పేట: అభం శుభం తెలియని పసివాడిపై పైశాచికంగా దాడికి పాల్పడ్డారు. బాలుడు నాడీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడని చెప్పినా కనికరం చూపకుండా..విచక్షణ మరిచి కర్కశంగా వ్యవహరించారు. ఈ దారుణ ఘటనపై బాధితులు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం..నల్లకుంటకు చెందిన జనరల్ సర్జన్ డాక్టర్.డి.కృష్ణ, అతని భార్య కిరణ్మయి, ఆరేళ్ల కుమారుడు, నాలుగేళ్ల కుమార్తెను తీసుకుని అమీర్‌పేట స్వర్ణజయంతి కాంప్లెక్స్‌లోని యుఐడీఏఐ ప్రాంతీయ కార్యాలయంలో ఉన్న ఆధార్ నమోదు కేంద్రానికి వచ్చారు. అదే ఫ్లోర్‌లో హార్టికల్చర్ కార్యాలయం కూడా ఉంది. కృష్ణ కుమారుడు కార్యాలయం ఆ కార్యాలయం డోర్ పట్టుకుని ఆడుకోవడంతో శబ్దం వచ్చింది. ఇది గమనించిన కార్యాలయం ఉద్యోగిని కోపంతో రగిలిపోయింది. బాలుడి చెంపపై ఈడ్చి కొట్టింది. గమనించిన తండ్రి కృష్ణ వారించి అడ్డుకోగా అతనిపైనా దాడి చేశారు. కార్యాలయంలోని శ్యామ్యూల్, వెంకట్‌రెడ్డి అనే వ్యక్తులు కృష్ణను కార్యాలయం లోపలికి లాక్కెళ్లి చితకబాదారు. అడ్డుకోబోయిన కిరణ్మయిని దుర్భాషలాడారు. కుమారుడు ఆటిజం స్పెక్ట్రమ్ డిసార్డర్ అనే వ్యాధితో బాధపడుతున్నాడని చెప్పినా వారు వినిపించుకోలేదు. దీంతో గాయపడ్డ బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ సుధీర్‌రెడ్డి తెలిపారు.

వ్యాపారం కలిసిరాలేదని యువకుడి ఆత్మహత్య

పంజగుట్ట: బీటెక్‌లో ఫెయిలై, వ్యాపారం ప్రారంభించగా..అందులోనూ కలిసి రాకపోవడంతో మానసిక వేదనకు గురైన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన పంజగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..ఖమ్మం ప్రాంతానికి చెందిన సత్తు గురవయ్య ఎల్లారెడ్డిగూడ, శాలివాహన నగర్‌లో నివాసం ఉంటున్నాడు. ఇతడి కొడుకు సత్తు అనిల్ కుమార్ (27) ఓ ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలో బీటెక్ చదవగా..కొన్ని సబ్జెక్టుల్లో ఫెయిల్ అయ్యాడు. తర్వాత కుటుంబ సభ్యులు నిర్వహిస్తున్న డెకరేషన్ షాపు పనులు చూసుకుంటున్నాడు. అందులోనూ కలిసి రాలేదు. 13వ తేదీన డెకరేషన్ వస్తువులను డెలివరీ చేసేందుకు నిజామాబాద్ వెళ్లిన అనిల్ కుమార్ అర్ధరాత్రి ఆలస్యంగా ఇంటికి వచ్చాడు. సోమవారం మధ్యాహ్నం భోజనం తర్వాత నిద్రపోతాను అని తల్లికి చెప్పి గదిలోకి వెళ్లి డోర్ పెట్టుకున్నాడు. రాత్రి అయినా బయటకు రాకపోవడంతో తలుపు విరగ్గొట్టి లోనికి వెళ్లి చూసేసరికి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. కిందకు దింపి చూడగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. సోమవారం రాత్రి పంజగుట్ట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అధికారుల నిర్లక్ష్యం తగదు

- పనితీరు మార్చుకోవాలి
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే సబితారెడ్డి

బడంగ్‌పేట్: ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వీడాలని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆమె బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ పరిధిలోని గుర్రంగూడ, మామిడిపల్లి, మల్లాపూర్ పరిధిలో అభివృద్ధి పనులపై చర్చించారు. పెండింగ్ పనులపై అధికారులను నిలదీశారు. సమస్యలపై స్పందించకుంటే తాను ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీ, సీసీ రోడ్లు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, ఎస్ఎన్‌డీపీ నాలా పనులు తదితర అంశాల్లో నేటికీ పురోగతి లేదని అసహనం వ్యక్తం చేశారు. అధికారులు పనితీరు మార్చుకోవాలని.. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సరస్వతి, డీఈఈ వెంకన్న, ఏఈ హరీశ్, ఏఈ అరుణ, టీపీఓ కిరణ్‌కుమార్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ యాదగిరి, వర్క్ ఇన్‌స్పెక్టర్లు వినయ్, సంపత్, రాకేశ్, కల్యాణ్, మేనేజర్ నాగేశ్వర్‌రావు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫోరెన్సిక్ ల్యాబ్‌కు అస్థిపంజరం

- నివేదిక రావడానికి వారం రోజుల సమయం
- దుబాయ్‌లో ఉన్న ఫిరోజ్‌ఖాన్‌ను రప్పించేందుకు పోలీసుల యత్నం

నాంపల్లి: ఎవరూ లేని ఇంట్లో లభించిన అస్థిపంజరాన్ని హబీబ్‌నగర్ పోలీసులు ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. ఫోరెన్సిక్ ల్యాబ్ నుంచి డీఎన్ఏ నివేదిక వస్తే కానీ మృతిచెందిన వ్యక్తి ఎవరనేది తెలియదని హబీబ్‌నగర్ ఇన్‌స్పెక్టర్ టి.పురుషోత్తం రావు పేర్కొన్నారు. ఈ నివేదిక రావడానికి మరో వారం రోజుల సమయం పడుతుందని వివరించారు. ఇటీవల స్థానిక యువకుడు ఒకరు తన మొబైల్ ఫోన్‌లో తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఈ అస్థి పంజరం విషయం వెలుగులోకి వచ్చింది. కాగా ఈ కేసు మిస్టరీని ఛేదించేందుకు పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు. ఇందులో భాగంగా అస్థిపంజరం లభించిన ఇంటిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఆ ఇంట్లో ఒక పాత నోకియా మొబైల్ ఫోన్, మంచం దిండు కింద కొంత పాత కరెన్సీ లభించినట్లు పోలీసులు తెలిపారు. దర్యాప్తులో భాగంగా నోకియా ఫోన్‌ను మరమ్మతు చేసి ఆన్ చేయగా అందులో 84 మిస్డ్ కాల్స్ ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. 2015, మే 31వ తేదీ వరకు నోకియా మొబైల్ ఫోన్ పనిచేసినట్లు తెలిపారు. అదే రోజు రాత్రి సెల్‌ఫోన్ వాడిన వ్యక్తి మృతి చెందినట్లుగా పోలీసులు భావిస్తున్నారు. ఈ ఫోన్‌ను పరిశీలించిన పోలీసులు మునీర్‌ఖాన్ కుమారుడు అమీర్ ఖాన్ వాడినట్లుగా స్పష్టం చేశారు. కాగా అమీర్‌ఖాన్‌కు పది మంది తోబుట్టువులు ఉన్నారని, వారిలో అన్నదమ్ములు ముగ్గురు సోమవారం రాత్రి హబీబ్‌నగర్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిరోజ్ ఖాన్ అనే ఒక సోదరుడు దుబాయ్‌లో ఉంటున్నాడని పోలీసులు వివరించారు. అక్కా చెల్లెల్లో ఇద్దరు మృతి చెందారని, మిగిలిన ముగ్గురిలో ఒకరు ముంబైలో స్థిరపడగా మరో ఇద్దరు పాతబస్తీలో ఉన్నట్లు చెప్పారు. ఇక మిగిలిన వ్యక్తి అమీర్‌ఖాన్ జాడ తెలియరావడం లేదని పోలీసులు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా నాంపల్లిలో పాడుబడిన ఇంట్లో బయటపడిన అస్థిపంజరం పదేళ్లుగా అక్కడే ఉన్నట్లు తెలుస్తోంది. మృతి చెందిన వ్యక్తి ఎవరనేది ఇప్పుడు మిస్టరీగా మారింది. నాటి సీసీ కెమెరాల ఫుటేజీ సేకరణ కష్టసాధ్యంగా మారిందని పోలీసులు పేర్కొంటున్నారు.

మైనర్ డ్రైవింగ్ అని ఆపితే...
చోరీ అయిన బైకు తేలింది

బంజారాహిల్స్: ఓ మైనర్ హెల్మెట్ లేకుండా వస్తున్నాడని హోండా యాక్టివాను ఆపి చలానా విధించిన ట్రాఫిక్ పోలీసులకు..అది చోరీ బైకు అని తెలిసింది. వివరాల్లోకి వెళ్తే.. బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు చౌరస్తాలో బంజారాహిల్స్ ట్రాఫిక్ ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేస్తున్నారు. అదే సమయంలో ముగ్గురు యువకులు హోండా యాక్టివాపై నెంబర్ ప్లేట్ లేకుండా వస్తూ కనిపించారు. హెల్మెట్ కూడా ధరించకపోవడంతో వారిని ఆపారు. బైక్ నడిపిస్తున్న వ్యక్తి మైనర్ అని తేలింది. బైక్ ధ్రువ పత్రాలు అడగ్గా చూపించలేదు. బైక్ నెంబర్ కూడా చెప్పకపోవడంతో చాసిస్ నెంబర్ ఆధారంగా టీఎస్09 ఈ జెడ్ 1525 అనే రిజిస్ట్రేషన్ నెంబర్ కలిగిన బైక్ అని గుర్తించారు. దీంతో ఈ నెంబర్ మీద మైనర్ డ్రైవింగ్, ట్రిపుల్ రైడింగ్ చలానా విధించారు. బైక్ నెంబర్‌తో పాటు ఫోటోను ట్యాబ్ ద్వారా ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. ఆన్‌లైన్‌లో బండి నెంబర్ నమోదైన వెంటనే యజమానికి మెసేజ్ వెళ్ళింది. నిమిషాల వ్యవధిలోనే వాహన యజమాని లియాండర్ టెర్రస్ స్మిత్ అనే వ్యక్తి బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ వద్దకు ఉరుకులు పరుగులతో వచ్చాడు. కాసేపటి క్రితం ట్రాఫిక్ పోలీసులు చలానా విధించిన బండి తనదేనని, ఏప్రిల్ 2వ తేదీన తన బైక్ చోరీకి గురికాగా అదే రోజు మీర్‌పేట పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు. దీంతో అప్రమత్తమైన ట్రాఫిక్ పోలీసులు ఈ విషయాన్ని బంజారాహిల్స్ రోడ్ నెంబర్ 14 లో వాహన తనిఖీలు నిర్వహిస్తున్న ఎస్ఐ ప్రభాకర్ రెడ్డి తదితరులకు తెలిపారు. అప్పటికీ యాక్టివా మీద వచ్చిన ముగ్గురు అక్కడే ఉండడంతో వారిని పట్టుకున్న ట్రాఫిక్ పోలీసులు ఈ వ్యవహారాన్ని మీర్‌పేట పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. తమ పీఎస్ పరిధిలో యాక్టివా బైక్ చోరీ అయిన మాట వాస్తవమేనని ఈ మేరకు ఎఫ్ఐఆర్ నమోదు చేశామని అక్కడ పోలీసులు తెలిపారు. దీంతో బైక్ మీద వచ్చిన ముగ్గురితో పాటు బైక్‌ను కూడా మీర్‌పేట పోలీసులకు అప్పగించారు. మొత్తానికి ట్రాఫిక్ పోలీసులు విధించిన చలానా చోరీ బైక్‌ను పట్టించడంతో మీర్‌పేట్ పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు.



బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్

బహిరంగంగా బరితెగించారు!

మొహర్రం, బోనాల ఊరేగింపుల్లో పోకిరీలు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలో ఇటీవల జరిగిన మొహర్రం, బోనాలు ఊరేగింపుల్లో పోకిరీలు రెచ్చిపోయారు. విచక్షణా రహితంగా, అనుచితంగా తాకుతూ మహిళలు, యువతులను వేధించారు. ఈ రెండు సందర్భాల్లోనూ షీ-టీమ్స్ నిఘాలో మొత్తం 478 మంది పట్టుబడినట్లు డీసీపీ డాక్టర్ ఎస్‌జేపీ లావణ్య మంగళవారం ప్రకటించారు. దీనికోసం షీ-టీమ్స్ రహస్య కెమెరాలు వినియోగించాయి. చిక్కిన పోకిరీల్లో 386 మంది మేజర్లు, 92 మంది మైనర్లు ఉన్నారు. ఈ ఆకతాయిల్లో నలుగురిపై పెట్టీ కేసులు, నగంలోని వివిధ ఠాణాల్లో ఎనిమిది ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయించారు. మిగిలిన వారిని మందలించి పంపారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య

జీడిమెట్ల: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్ తెల్పిన వివరాల ప్రకారం.. గాజుల రామారం గ్రామానికి చెందిన రంగయ్య సాగర్ బిల్డింగ్ నిర్మాణ కాంట్రాక్ట్ పనులు చేస్తుంటాడు. మంగళవారం ఉదయం 4 గంటలకు రంగయ్య ఇంటి నుండి తాను కాంట్రాక్ట్ తీసుకున్న బిల్డింగ్ వద్దకు వెళ్లాడు. 8 గంటల సమయంలో రంగయ్య కుమారుడు రాఘవేంద్రసాగర్‌కు బిల్డింగ్ వద్ద పనులు నిర్వహించే పరమేష్ అనే వ్యక్తి ఫోన్‌చేసి రంగయ్య ఉరి వేసుకున్నాడని తెలిపాడు. వెంటనే అక్కడకు చేరుకున్న రాఘవేంద్ర రంగయ్యను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు రాఘవేంద్రపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

ట్రాన్స్‌జెండర్ల ఉపాధి కోసం దరఖాస్తుల ఆహ్వానం

ఇబ్రహీంపట్నం రూరల్: జిల్లా పరిధిలో నిరుద్యోగులైన ట్రాన్స్‌జెండర్లకు ప్రైవేట్‌రంగ సంస్థల్లో ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు నైపుణ్య శిక్షణ అందిస్తామని జిల్లా సంక్షేమాధికారి శ్రీలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డ్రైవింగ్, ఫొటో, వీడియోగ్రఫీ, బ్యుటీషియన్, జ్యూట్ బ్యాగ్ మేకింగ్, టైలరింగ్, లాజిస్టిక్స్ రంగాల్లో నైపుణ్య శిక్షణ కోసం ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వివరాలకు 96035 25866 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ట్రిపుల్ ఐటీలో పేద విద్యార్థినికి సీటు


గుగులోత్ బిందు

బంజారాహిల్స్: తల్లిదండ్రులిద్దరూ దినసరి కూలీలు.. చదివింది సర్కార్ బడిలో.. అయితేనేం.. ఆ విద్యార్థిని కష్టపడి చదివి శ్రమకు తగ్గ ఫలితాన్ని సాధించి తాను నివసిస్తున్న బస్తీతో పాటు చదువుకున్న పాఠశాలకు గర్వకారణంగా నిలిచింది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్–7లోని గతి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుకున్న గుగులోత్ బిందు ఇటీవలి పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 549మార్కులు సాధించింది. ఈ బాలికకు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు రావడంతో పాఠశాల టీచర్లతో పాటు ఆమె నివసిస్తున్న బంజారాహిల్స్ రోడ్డు నంబర్–10లోని సింగాడికుంట బస్తీలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. బాలికను మంగళవారం అటు టీచర్లతో పాటు ఇటు బస్తీవాసులు అభినందించారు. చదువుకు పేదరికం అడ్డురాదని ఈ బాలిక నిరూపించింది.

శాకాంబరి అలంకరణలో..



పంజగుట్ట: ప్రేమ్‌నగర్‌లోని ఎల్లమ్మ, నల్ల పోచమ్మ అమ్మవార్లు శాకాంబరి అలంకరణలో మంగళవారం భక్తులకు దర్శనం ఇచ్చారు. వివిధ రకాల కూరగాయలతో అమ్మవార్లను అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక మహిళలు పెద్దఎత్తున అమ్మవార్లకు పూజలు చేశారు. 20వ తేదీన ఆలయంలో బోనాల ఉత్సవాలు, ఘటాల ఊరేగింపు ఉంటుందని బస్తీ అధ్యక్షుడు దాసరి విశ్వనాథం, భగవాన్‌దాస్ తెలిపారు.

విద్యార్థులకు బ్యాగుల పంపిణీ



పంజగుట్ట: పీజేఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఫౌండేషన్ చైర్మన్, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి రాజ్‌భవన్ హైస్కూల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నతస్థాయికి ఎదగాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ గోపాల్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీసీలంతా కాంగ్రెస్‌కు అండగా ఉండాలి



శ్రీనగర్‌కాలనీ: బీసీల అభ్యున్నతికి, రాజ్యాధికారానికి కృషి చేసిన కాంగ్రెస్ పార్టీని బీసీలంతా సంఘటితమై అండగా నిలవాలని, రానున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘన విజయాన్ని అందించాలని మాజీ కార్పొరేటర్, కాంగ్రెస్ సీనియర్ నేత మురళీగౌడ్ కోరారు. దేశంలో ఎవరూ చేయని విధంగా బీసీల కోసం సీఎం రేవంత్ రెడ్డి చేసిన కృషి మరువలేదని కొనియాడారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లతో సంక్షేమాభివృద్ధి జరుగుతుందని, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట నిలబెట్టుకుందని అన్నారు.

జలమండలి కార్యాలయంలో బోనాలు



బంజారాహిల్స్: బంజారాహిల్స్ తట్టికాన జలమండలి సెక్షన్ కార్యాలయంలో మంగళవారం బోనాల వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో సెక్షన్ కార్యాలయంలో విధులు నిర్వర్తించే ఉద్యోగులు, సిబ్బంది కలిసి కార్యాలయ ఆవరణలో ఉన్న అమ్మవారికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా వస్తోందని సెక్షన్ మేనేజర్ రాంబాబు తెలిపారు. జలమండలి సీజీఎం ప్రభు, డివిజన్–6 జీఎం ప్రభాకర్, డీజీఎంలు షీలారాణి, సరిత, శ్రీనివాసులు, మేనేజర్ శివ పాల్గొన్నారు.

మధురానగర్‌కాలనీలో విద్యుత్ సరఫరాకు ఆటంకం



వెంగళరావునగర్: డివిజన్ పరిధిలోని మధురానగర్ కాలనీలో మంగళవారం ఉదయం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పేలిపోయింది. బీ బ్లాక్‌లో ఉన్న ఓ ట్రాన్స్‌ఫార్మర్‌పై చెట్ల కొమ్మలు విరిగి పడటంతో ఈ ఘటన చోటుచేసుకుంది. దాంతో కాలనీలో అధిక శాతం విద్యుత్ సరఫరా ఆటంకం కలిగింది. వెంటనే విద్యుత్‌శాఖ అధికారులకు సమాచారం అందజేయడంతో విద్యుత్ శాఖ ఏఈ తిరుపతిరావు, ఫోర్‌మెన్ మల్లారెడ్డి తన సిబ్బందితో వచ్చి సాయంత్రానికి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

మహిళా గ్రూపులకు వడ్డీలేని రుణం

- ఆర్థిక స్వావలంబన దిశగా మహిళా గ్రూపులు
- సక్రమంగా చెల్లించిన వారికి రుణాలు
- వడ్డీ లేని రుణాలపై అవగాహన కార్యక్రమాలు
- జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల్లో హర్షం వ్యక్తం చేస్తున్న మహిళలు

బంజారాహిల్స్: స్వయం సహాయక సంఘాల్లోని మహిళలు తమ కాళ్లపై తాము నిలబడి ఆర్థిక సాధికారత సాధించుకునేందుకు ప్రభుత్వం పటిష్టమైన ప్రణాళికలు రూపొందించి పలు పథకాలతో వారికి భరోసా కల్పిస్తోంది. దీంతో మహిళా గ్రూపులు పొదుపు మంత్రం జపిస్తున్నాయి. బ్యాంక్ రుణాలు తీసుకుని స్వయం ఉపాధి పొందుతూ ఆర్థిక సాధికారత దిశగా ముందుకుసాగుతున్నారు. మహిళలకు మరింత ఆర్థిక సాంత్వన కలిగించేందుకు ప్రభుత్వం వడ్డీ లేని రుణాలు(వీఎల్ఆర్) విధానాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి ఆయా గ్రూపులకు రుణాలు కూడా మంజూరు చేసింది. జూబ్లీహిల్స్, ఖైరతాబాద్ నియోజకవర్గాల పరిధిలో మహిళా గ్రూపుల సభ్యులు వడ్డీ లేని రుణాలతో మరింతగా ఆర్థికంగా నిలదొక్కుకోనున్నారు. ఈ పథకం పట్ల మహిళలంతా హర్షం వ్యక్తం చేస్తుండగా నెల రోజుల నుంచి ఈ పథకంపై జీహెచ్ఎంసీ యూసీడీ విభాగం అధికారులు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారు.

- క్రమం తప్పకుండా రుణాల వాయిదాలు చెల్లించిన సంఘాలకు వడ్డీ ప్రభుత్వమే భరిస్తోంది.
- ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి సంబరాల్లో భాగంగా వడ్డీ లేని రుణాలు మంజూరు చేయడంతో మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- స్వశక్తి మహిళలకు 2012లో అప్పటి ప్రభుత్వం వడ్డీ లేని రుణ విధానాన్ని తెర మీదకు తీసుకువచ్చింది.
- రూ.5 లక్షలలోపు రుణాలు పొంది వాయిదాలు సకాలంలో చెల్లించిన సంఘాలకు విడతల వారీగా వడ్డీ విడుదల చేస్తున్నారు.
- జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17, జూబ్లీహిల్స్ సర్కిల్–18, యూసుఫ్‌గూడ సర్కిల్–19 పరిధిలో 1500లకు పైగా మహిళా సంఘాలు ఉండగా వేలల్లోనే మహిళలు సభ్యులుగా కొనసాగుతున్నారు.
- ప్రభుత్వం మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దేందుకు బ్యాంక్ రుణాలతో పాటు మహిళాశక్తి పథకంలో క్యాంటీన్లు, చీరల దుకాణాలు, కిరాణా షాపులు తదితర రంగాల్లో ప్రోత్సాహం ఇస్తోంది.
- ఈ నెల 10 నుంచి 18 వరకు ఇందిరా మహిళా శక్తిలో రోజువారీగా సంబరాలు నిర్వహిస్తున్నారు. ఇందులోనే వడ్డీ లేని రుణాలను అందజేస్తున్నారు.
- సంఘాల ఖాతాలకు ఈ రుణాలను నేరుగా జమ చేయనున్నారు. 2024 ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు వడ్డీ వచ్చింది.
- జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ సర్కిల్–17 పరిధి కిందికి వచ్చే సోమాజీగూడ, ఖైరతాబాద్, అమీర్‌పేట, సనత్‌నగర్ డివిజన్ల పరిధిలో మొత్తం 720 గ్రూపులు ఉండగా ఇందులో 350 గ్రూపులకు వడ్డీ లేని రుణాలు మంజూరయ్యాయి. ఈ గ్రూపులకు రుణాల రూపేణా రూ.54 లక్షలు విడుదలయ్యాయి.
- జీహెచ్ఎంసీ జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధి కిందికి వచ్చే బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, వెంకటేశ్వరకాలనీ, షేక్‌పేట డివిజన్ల పరిధిలో మొత్తం 925 మహిళా గ్రూపులు ఉండగా ఇందులో 434 గ్రూపులకు వడ్డీ లేని రుణాలు మంజూరయ్యాయి. ఇందుకోసం రూ.4 లక్షలు మంజూరయ్యాయి.
- జీహెచ్ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్–19 పరిధి కిందికి వచ్చే రహమత్‌నగర్, యూసుఫ్‌గూడ, వెంగళరావునగర్,ఎర్రగడ్డ, బోరబండ డివిజన్ల పరిధిలో మొత్తం 1200గ్రూపులు ఉండగా ఇందులో 737గ్రూపులకు వడ్డీ లేని రుణాలు మంజూరయ్యాయి. వీరికి రూ.75 లక్షలు మంజూరైనట్లు సర్కిల్ యూసీడీ డీపీఓ వెంకటకృష్ణ తెలిపారు.


వడ్డీ లేని రుణాలపై మహిళలకు అవగాహన కలిగిస్తున్న జీహెచ్ఎంసీ అధికారులు

అపోలో రోడ్డును 60ఫీట్ల మేర విస్తరించండి


ఫిలింనగర్ అపోలో రోడ్డులో పర్యటిస్తున్న కమిషనర్ ఆర్‌వీ కర్ణన్

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లోని సురేష్‌బాబు గెస్ట్‌హౌస్ స్వాగత్ హోటల్ చౌరస్తా నుంచి అపోలో ఆస్పత్రి మీదుగా టీటీడీ టెంపుల్ వరకు కిలోమీటరు మేర రోడ్డు విస్తరణ పనులు వెంటనే చేపట్టాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డులో మంగళవారం ఆయన పర్యటించి ట్రాఫిక్ సజావుగా సాగడంలేదని, రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణలు ఉన్నాయని, వెంటనే ఆక్రమణలు తొలగించి రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు రూపొందించాలన్నారు. ప్రస్తుతం స్వాగత్ హోటల్ చౌరస్తా నుంచి అపోలో మెయిన్ గేటు మీదుగా టీటీడీ టెంపుల్ గేటు వరకు 40 ఫీట్ల రోడ్డు ఉండగా చాలా మంది నివాసితులు తమ ఇళ్ల ముందు రోడ్డును ఆక్రమించి డబ్బాలు ఏర్పాటు చేసి అద్దెలకు ఇచ్చారు. వాటిని వెంటనే తొలగించాలని, మాస్టర్ ప్లాన్ ప్రకారం ఈ రోడ్డును 60 ఫీట్లకు విస్తరించాలని సూచించారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి, ఈఈ విజయ్‌కుమార్ ఉన్నారు.

కేబీఆర్ గేటు నంబర్-3లో అక్రమ నిర్మాణాల కూల్చివేత


అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నంబర్–2లోని కేబీఆర్ పార్కును ఆనుకుని జీహెచ్ఎంసీ పార్కింగ్ స్థలంలో గేట్ నంబర్–3లో అక్రమంగా ఏర్పాటు చేసిన షాపును జీహెచ్ఎంసీ సిబ్బంది కూల్చివేశారు. జూబ్లీహిల్స్ సర్కిల్–18 డీఎంసీ సమ్మయ్య ఆధ్వర్యంలో టౌన్‌ప్లానింగ్ అధికారులు ఈ అక్రమ నిర్మాణాలను మంగళవారం నేలమట్టం చేశారు. అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా పార్కింగ్ స్థలంలో చిచ్చాస్ రెస్టారెంట్‌ను ఆనుకుని ఈ అక్రమ నిర్మాణాలు చోటుచేసుకున్నాయని అధికారులు తెలిపారు.

అమరుల త్యాగాలను దేశం మరువదు

కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన ఆర్మీ ఆఫీసర్ కుటుంబానికి సత్కారం


అమరవీరుల కుటుంబాలకు జ్ఞాపికను అందజేస్తున్న మాజీ సైనికులు

బంజారాహిల్స్: కార్గిల్ అమరవీరుల కుటుంబాలను వారి నివాసాలకు వెళ్లి గౌరవించి భారత సైన్యం ప్రత్యేకంగా స్మరించుకుంటోంది. అమర వీరుల ఇళ్లను సందర్శిస్తున్న సైనికులు వారి కుటుంబ సభ్యులకు జ్ఞాపికలు అందజేసి సత్కరిస్తున్నారు. ఇందులో భాగంగా జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్–70లో నివసించే మహావీర్ చక్ర పురస్కార గ్రహీత పి.ఆచార్య ఇంటికి ఆర్మీ అధికారి లెఫ్టినెంట్ షాహిద్ అహ్మద్‌తో పాటు మాజీ సైనికులు రమణారెడ్డి, పాండురంగారెడ్డి, కేఎం రావు, సీఎస్ చౌదరి తదితరులు వెళ్లి ఆయన సతీమణి చారులతకు జ్ఞాపిక అందజేశారు. కార్గిల్ యుద్ధంలో వీరమరణం పొందిన ఆచార్య చిత్రపటానికి సైనికులు నివాళులర్పించారు. వారి త్యాగాన్ని దేశం ఎప్పుడూ మరిచిపోదని అన్నారు. 1999 కార్గిల్ యుద్ధంలో అత్యున్నత త్యాగం చేసిన అమర వీరులను భారత సైన్యం తరపున గుర్తుచేసుకునేందుకే ఈ కార్యక్రమం చేపట్టినట్లు నాయబ్ సుబేదార్ ఎం.వెంకట్‌రెడ్డి తెలిపారు.

పేదల సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం

రహమత్‌నగర్: పేదల సంక్షేమం, అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యమని మాజీ ఎంపీ, కాంగ్రెస్ జూబ్లీహిల్స్ ఇన్‌చార్జి మహ్మద్ అజహరుద్దీన్ అన్నారు. రహమత్‌నగర్ డివిజన్ శ్రీరాంనగర్‌లో మంగళవారం బస్తీబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీలతో పేదలకు ఎంతో మేలు జరుగుతోందని స్పష్టం చేశారు. కార్పొరేటర్ సీఎస్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ ప్రోత్సాహంతో రహమత్‌నగర్ డివిజన్ అభివృద్ధిలో దూసుకుపోతోందని తెలిపారు. అసంపూర్తి పనులను పూర్తి చేస్తామని చెప్పారు.

రాధామనోహర్‌దాస్‌పై చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న స్వామి జోసఫ్

పంజగుట్ట: ఒక మతాన్ని కించపరుస్తూ ప్రజల్ని రెచ్చగొడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న రాధామనోహర్ దాస్‌ను వెంటనే అరెస్టు చేయాలని సామాజికవేత్త ఎ.స్వామి జోసఫ్ డిమాండ్ చేశారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఆయన శ్యామ్, సరోజా భాస్కర్, అశోక్‌తో కలిసి మాట్లాడారు. రాధామనోహర్ దాస్ అనే వ్యక్తి క్రైస్తవ మతాన్ని, గ్రాంథాలను టార్గెట్ చేస్తూ రోడ్లపై, బస్టాప్స్, రైల్వే స్టేషన్ల వద్ద ప్రజల్ని రెచ్చగొడుతున్నాడని, వీడియోలు తీసి యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేస్తున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. అతడిపై చర్యలు తీసుకోవాలని బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో మే 30వ తేదీన ఫిర్యాదు చేశామని, మే 31న కేసు నమోదు చేశారని, కానీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ అంటే ఇదేనా..?

- చెత్తపై ఫిర్యాదు చేసినా పట్టించుకోని ఏఎంఓహెచ్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న కాలనీవాసులు

వెంకటేశ్వరకాలనీ: డివిజన్ పరిధి కిందికి వచ్చే శ్రీనగర్‌కాలనీ డబుల్ రోడ్డు డివైడర్ వద్ద మూడు నెలల నుంచి చెత్త కుప్పలుగా పేరుకుపోయి స్థానికంగా పారిశుద్ధ్య సమస్య తీవ్రరూపం దాల్చింది. చెత్తను తొలగించాలంటూ రెండున్నర నెలల నుంచి తాము సంబంధిత ఏఎంఓహెచ్‌కు ఫిర్యాదు చేస్తున్నా ఆయన ఏమాత్రం పట్టించుకోవడం లేదని కాలనీ వెల్ఫేర్ జనరల్ సెక్రటరీ శ్రీకాంత్‌రెడ్డి ఆరోపించారు. సమస్యను చెబుతుంటే సంబంధిత ఏఎంఓహెచ్ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లారీలు కొద్దీ చెత్త పేరుకుపోయిందని, తొలగించాలని అధికారులకు చెప్పి చెప్పి విసుగు చెందామని అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అంటే ఇదేనా..? అని కాలనీవాసులు ప్రశ్నిస్తున్నారు.


శ్రీనగర్‌కాలనీ డబుల్‌రోడ్డు డివైడర్ వద్ద పేరుకున్న చెత్త కుప్పలు

బోనాల ఉత్సవాలకు ఆహ్వానం

రహమత్‌నగర్: బోరబండలో నిర్వహించే బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలని మంత్రి వివేక్, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు మాజీ డిప్యూటీ మేయర్ బాబాఫసియుద్దీన్ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు మంగళవారం వారిని కలిసి ఆహ్వాన పత్రికను ఆయన అందజేశారు. కాంగ్రెస్ నాయకులు బండారి అశోక్, కాసుల మహేష్‌కుమార్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

ముదిరాజ్‌లకు అన్ని పార్టీలు సీట్లు కేటాయించాలి

– తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు శంకర్ ముదిరాజ్

హిమాయత్‌నగర్: త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ముదిరాజ్‌లకు అన్ని రాజకీయ పార్టీలు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని తెలంగాణ మన ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చొప్పరి శంకర్ ముదిరాజ్ డిమాండ్ చేశారు. హైదర్‌గూడలోని మహాసభ రాష్ట్ర కార్యాలయంలో మహాసభ సంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా పులిమామిడి రాజు ముదిరాజ్‌ను నియమిస్తూ మంగళవారం నియామక పత్రం అందజేశారు. మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు శైలేంద్ర శివయ్య ముదిరాజ్, బోళ్ల కరుణాకర్ ముదిరాజ్, డాక్టర్ మద్దెల సంతోష్ ముదిరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాస వెంకట్, నేతలు సుధాకర్, గంగాధర్, రమేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

రుణమేళాలను సద్వినియోగం చేసుకోవాలి


లోన్‌మేళాకు హాజరైన యువతీ యువకులు

వెంగళరావునగర్: ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు అందజేస్తున్న రుణాలను సద్వినియోగం చేసుకుని యువత ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని నిమ్స్‌మే సీనియర్ ఫ్యాకల్టీ మెంబర్ వి.స్వప్న అన్నారు. యూసుఫ్‌గూడలోని మైక్రో స్మాల్ మీడియం ఎంటర్‌ప్రైజెస్(నిమ్స్ మే) కేంద్ర శిక్షణ సంస్థలో మంగళవారం లోన్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వప్న మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ ఆధ్వర్యంలో యువతకు అనేకరకాల శిక్షణ నిమ్స్ మేలో ఉచితంగా అందిస్తున్నట్లు చెప్పారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారికి బ్యాంకుల ద్వారా రుణాలను అందజేస్తూ సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. లోన్‌మేళాలో యాక్సిస్ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా తదితర బ్యాంకులకు చెందిన ప్రతినిధులు హాజరయ్యారు.

ఉద్యోగం పేరుతో ఆన్‌లైన్ మోసం

వెంగళరావునగర్: ఉద్యోగం పేరుతో మహిళ వద్ద ఆన్‌లైన్ మోసగాళ్లు నగదు కాజేసిన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం శ్రీకృష్ణానగర్‌లో నివసించే శ్రీజయలక్ష్మికి ఈ నెల 2వ తేదీన వాట్సాప్ మెసేజ్ వచ్చింది. ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్వాతి అనే యువతి ఫుల్‌టైం, పార్ట్ టైం ఉద్యోగాలు ఉన్నాయంటూ తెలిపింది. ముందుగా రూ.3 వేలు పంపితే అరగంటలో రూ.10 వేలు ఇస్తామని చెప్పారు. దాంతో ఆమె రూ.54 వేల వరకు ఆన్‌లైన్ ట్రాన్స్‌ఫర్ చేసింది. తిరిగి రాకపోవడంతో సైబర్ క్రైం పోలీసులకు సమాచారం అందజేసింది. మధురానగర్ పీఎస్‌లో మంగళవారం ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయం

వెంగళరావునగర్: పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం మాయమైన ఘటన మధురానగర్ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం రహమత్‌నగర్‌లో నివసిస్తున్న ఆర్.సమ్మయ్య కూరగాయల వ్యాపారం చేస్తుంటాడు. ఈ నెల 6వ తేదీన కళ్యాణ్‌నగర్ పక్కనే ఉన్న బార్ వద్ద తన ద్విచక్ర వాహనాన్ని పార్కింగ్ చేశాడు. మరుసటి రోజు బైక్ కనిపించకపోవడంతో మంగళవారం మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నాలా ఇలా.. వరద పోయేదెలా..?


చెత్తా చెదారంతో నిండిపోయిన ఎంజీ నగర్ నాలా

ఫిలింనగర్: వరద నీటి కాల్వల్లో చెత్త కుప్పలుగా పేరుకుపోవడంతో వరద సాఫీగా వెళ్లేలా కనిపించడం లేదు. జూబ్లీహిల్స్ సర్కిల్–18 పరిధిలోని కొత్త చెరువు పక్కన ఉన్న ఎంజీ నగర్ నాలాలో లారీల కొద్దీ చెత్త పేరుకుపోయి వరద ముందుకు సాగలేని దుస్థితి. నెల రోజుల క్రితమే ఈ నాలాలో పూర్తిగా పూడిక తొలగించినా మళ్లీ చెత్త పేరుకుపోయిందని అధికారులు చెబుతున్నారు. పైనుంచి చెత్తా చెదారం కొట్టుకురావడంతో పాటు స్థానికులు సైతం పెద్ద ఎత్తున నాలాలో వ్యర్థాలు విసిరేస్తున్నారు. దీంతో ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వరదలు వచ్చిన ప్రతీసారి ఇక్కడ నివాసాల్లోకి వరద ముంచెత్తుతోంది.



రాజకీయ ముసుగులో దాడులు మానుకోవాలి

హిమాయత్‌నగర్: రాజకీయ పార్టీల ముసుగులో పాఠశాలలోకి చొరబడి ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయులపై దాడులు చేయడం మానుకోవాలని ఎస్సీ, ఎస్టీ కమిషన్ రాష్ట్ర చైర్మన్ బక్కి వెంకటయ్య హెచ్చరించారు. నిత్యం జరుగుతున్న దాడులను దళిత, గిరిజనులు ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో మంగళవారం ఆయన మాట్లాడుతూ.. కోటగిరి తెలుగు పండిట్ మల్లికార్జున్, తుక్కుగూడ ప్రధానోపాధ్యాయులు రాములు, యాలాల్‌లో సైన్స్ టీచర్‌పై, ప్రస్తుతం నరేందర్ నాయక్‌పై దాడి చేశారన్నారు. రాజకీయాలకు అతీతంగా ఉండే పాఠశాలలను వివాదాస్పదంగా మార్చవద్దన్నారు. తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు రాంబాబు నాయక్, డీబీఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, గిరిజన శక్తి రాష్ట్ర అధ్యక్షుడు వెంకటేష్ చౌహాన్ పాల్గొన్నారు.

బీసీలు రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలి

బీసీ కులాల ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండు యాదవ్



హిమాయత్‌నగర్: బీసీలు రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలని బీసీ కులాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు పాండు యాదవ్ పిలుపునిచ్చారు. అందుకు బీసీలంతా ఐక్యతతో ముందుకెళ్లాలని సూచించారు. ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో 60 శాతం పైగా జనాభా మనది–ముఖ్యమంత్రి కుర్చీ మనది కావాలి' అనే అంశంపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా 60 శాతం జనాభా ఉన్న బీసీలు రాబోయే ఎన్నికల్లో బీసీల ఓట్లు బీసీ అభ్యర్థులకే వేసుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన ఆర్డినెన్స్ 42 శాతం రిజర్వేషన్లను పలు కారణాలు చూపి వెనక్కి తీసుకోకుండా చూడాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఎస్సీ, ఎస్టీ రిజర్వ్‌డ్ స్థానాలు పోనూ మిగిలిన అన్ని స్థానాల్లో ఇండిపెండెంట్‌గా బీసీ యువత, నాయకులు పోటీ చేయాలని సూచించారు. సామాజిక కార్యకర్త డాక్టర్ వినయ్‌కుమార్, తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ, ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొక్క కాశీనాథ్, పలు బీసీ సంఘాల నేతలు వీజేఆర్ నారగోని, జె.అరుణ్ కుమార్, విజయ్ మహేంద్ర, శెట్టి భాస్కర్, టి.చెన్నయ్య, సంధ్యారాణి, అశ్విని తదితరులు పాల్గొన్నారు.

ఆగస్టు 22 నుంచి 24 వరకు ఇండియా ప్రాసెస్ ఎక్స్‌పో

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మంగళవారం బయో ఎనర్జీ, ఇండస్ట్రియల్ వృద్ధి సమయంలో వ్యర్థాల నిర్వహణ అనే అంశాలపై ప్యానెల్ చర్చలను నిర్వహించారు. వచ్చే నెలలో జరగనున్న రెండు ప్రధాన పారిశ్రామిక ప్రదర్శనలకు ముందస్తు కార్యక్రమం జరిగింది. ఆగస్టు 22 నుంచి 24వ తేదీ వరకు నిర్వహించనున్న ఇండియా ప్రాసెస్ ఎక్స్‌పో, కాన్ఫరెన్స్‌కు సంబంధించిన వివరాలను వెల్లడించారు. హైటెక్స్ బిజినెస్ హెడ్ టీజీ శ్రీకాంత్ మాట్లాడుతూ ఐపీఈసీ, ఎకో సస్టైన్ ఎక్స్‌పోలు పరిశ్రమల్లో మారుతున్న కొత్త ఆవిష్కరణలు, సస్టైనబుల్ టెక్నాలజీలు ప్రదర్శించేందుకు వేదికలుగా నిలుస్తాయన్నారు. అనంతరం పోస్టర్‌ను విడుదల చేశారు.

సీఎం ప్రజావాణికి 353 దరఖాస్తులు



ప్రజావాణి అర్జీల పరిష్కారంపై దివ్య, చిన్నారెడ్డిల భేటీ

లక్డీకాపూల్: మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో మంగళవారం నిర్వహించిన సీఎం ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 353దరఖాస్తులు అందాయి. పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖకు సంబంధించి 60, రెవెన్యూ శాఖ 63, విద్యుత్ శాఖ 22, పౌర సరఫరా శాఖ 07, ఇందిరమ్మ ఇండ్ల కోసం 57 దరఖాస్తులు వచ్చాయి. ఇతర శాఖలకు సంబంధించి 144 దరఖాస్తులు అందినట్లు ప్రజావాణి కోఆర్డినేటర్ రాకేశ్‌రెడ్డి తెలిపారు. సీఎం ప్రజావాణి ఇన్‌చార్జ్, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జి.చిన్నారెడ్డి, స్టేట్ నోడల్ అధికారి దివ్య దేవరాజన్ ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి పలు సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించారు.

దేవరకొండ కాంగ్రెస్ ఇన్‌చార్జిని విచారించిన 'సిట్'



మాట్లాడుతున్న నర్సింహారెడ్డి

బంజారాహిల్స్: ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో రోజురోజుకూ మరింత మంది బాధితులు బయటపడుతున్నారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కీలక నేతలతోపాటు వారి కీలక అనుచరుల ఫోన్లు టాప్ చేసినట్లు స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం (సిట్) అధికారుల విచారణలో తేలింది. మాజీమంత్రి కె.జానారెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిలకు సన్నిహితులుగా పేరుపొందిన నల్లగొండ జిల్లా దేవరకొండ నియోజకవర్గం కాంగ్రెస్ ఇన్‌చార్జి, పీసీసీ కార్యవర్గ సభ్యుడు జెలా నర్సింహారెడ్డి ఫోన్ ట్యాప్ అయినట్లు సిట్ అధికారులు గుర్తించారు. ఈ మేరకు ఆయనను మంగళవారం జూబ్లీహిల్స్‌లోని సిట్ కార్యాలయానికి పిలిపించారు. ఎప్పుడెప్పుడు ఆయన ఫోన్లు టాప్ అయ్యాయి, దానివల్ల ఆయన ఎదుర్కొన్న ఇబ్బందుల్ని గురించి వాంగ్మూలం సేకరించారు. ఈ సందర్భంగా నర్సింహారెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని ఓడించాలనే లక్ష్యంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక తప్పుడు పనులు చేసిందని, ఫోన్ ట్యాపింగ్ ద్వారా తమలాంటి వారిని వెంటాడిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎస్టీ నియోజకవర్గమైన దేవరకొండలో తాము పార్టీ కోసం పని చేస్తున్నామనే కక్షతో అనుక్షణం నిఘా పెట్టారని, ప్రచారం కోసం వెళ్తున్నా అడ్డంకులు కల్పించారని చెప్పారు. ఎన్ని కుట్రలు పన్నినా ప్రజలు కాంగ్రెస్ పార్టీకే పట్టం కట్టారని పేర్కొన్నారు.

విజిలెన్స్ అడిషనల్ ఎస్పీగా సుదర్శన్



లక్డీకాపూల్: హైదరాబాద్ మహానగర పాలక సంస్థ(జీహెచ్ఎంసీ)విజిలెన్స్ అడిషనల్ ఎస్పీగా ఎం.సుదర్శన్ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో మేయర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు.


యూనివర్సిటీల్లో ఎన్నికలు నిర్వహించాలి

– జార్జిరెడ్డి పీడీఎస్‌యూ డిమాండ్

ఉస్మానియా యూనివర్సిటీ: యూనివర్సిటీలతోపాటు ఇతర విద్య సంస్థల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎస్.నాగేశ్వర్‌రావు ప్రభుత్వాన్ని కోరారు. ఓయూలో పురుడుపోసుకున్న జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఏడాది పూర్తి చేస్తున్న సందర్భంగా మంగళవారం ఇక్కడ ఆయన మీడియాతో మాట్లాడారు. విద్యార్థి సమస్యలపై పోరాడుతూ అనతి కాలంలోనే రాష్ట్రంలోని 15 జిల్లాలకు తమ సంఘం విస్తరించినట్లు పేర్కొన్నారు. ఓయూ పూర్వ విద్యార్థి నేత, అమరుడు జార్జిరెడ్డి ఆశయాలకు అనుగుణంగా 2024 నవంబర్ 15న ఆవిర్భావించిన జార్జిరెడ్డి పీడీఎస్‌యూ యూనివర్సిటీలు, విద్య రంగ సమస్యలు, హాస్టల్స్, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, ప్రైవేటు విద్య సంస్థల్లో అధిక ఫీజులు, ఇంజినీరింగ్ ఫీజుల పెంపు తదితర అనేక అంశాలపై పోరాడుతున్నట్లు తెలిపారు. ఏ రాజకీయ పార్టీతో సంబంధం లేకుండా స్వచ్ఛందంగా పోరాడుతూ బలమైన విద్యార్థి ఉద్యమాన్ని నిర్మించడంలో సఫలమైనట్లు చెప్పారు.

చెత్తపై చిత్తశుద్ధి!

- ఫోన్ చేస్తే చాలు వచ్చి తొలగిస్తారు
- కొత్త సేవలకు సిద్ధమైన జీహెచ్ఎంసీ
- ప్రయోగాత్మకంగా తొలుత బేగంపేట సర్కిల్‌లో..
- అక్కడ వచ్చే ఫలితం ఆధారంగా నగరమంతా..



సాక్షి, సిటీబ్యూరో: స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డును రేపు (గురువారం) ఢిల్లీలో స్వీకరించనున్న సందర్భంలో జీహెచ్ఎంసీ.. స్వచ్ఛతకు సంబంధించి మరో కొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ప్రజలు కార్యాలయాల దాకా రాకుండా సాంకేతికత వినియోగంతోనే వివిధ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తున్న జీహెచ్ఎంసీ చెత్త తరలింపులోనూ దీన్ని వినియోగించుకోనుంది. ప్రజలు ఫోన్ చేస్తే చాలు.. చెత్తను తొలగించనుంది. రోజుల తరబడి ఇళ్లలో పేరుకుపోయిన చెత్తను, నరికిన చెట్ల కొమ్మల్ని తరలించనుంది. వీటితో పాటు ఏదైనా ఫంక్షన్ లేదా ఈవెంట్ నిర్వహించినప్పుడు వెలువడే ఆహార వ్యర్థాలను కూడా తరలించనుంది. ఇందుకోసం అధికారిక 'మై జీహెచ్ఎంసీ' మొబైల్ యాప్ ద్వారా రిక్వెస్ట్ చేసుకోవాల్సి ఉంటుంది. చిరునామా వివరాలతో పాటు చెత్త పరిమాణం దాదాపుగా ఎంత ఉంటుందో తెలియజేయాల్సి ఉంటుంది. మీరు ఎలాంటి వ్యర్థాలను తొలగించాలని కోరుతున్నారో ఆ వివరాల్ని యాప్‌లో సూచించాలి. అందుకుగాను యాప్‌లోనే ఉండే అంశాల నుంచి ఎంపిక చేసుకోవాలి.

యాప్‌లో ఉండే అంశాలు

- ఇంటి నుంచి చెత్త సేకరించే వాహనాలు రానందున పేరుకు పోయిన చెత్త.
- ఇంటిని శుభ్రం చేస్తే వెలువడిన చెత్త
- ఫంక్షన్, ఈవెంట్ నిర్వహణ ద్వారా వెలువడిన చెత్త.

వీటిలో సూచించిన అంశాన్ని గుర్తించి వెంటనే చర్యలు చేపడతారు.

- రిక్వెస్ట్ అందగానే సంబంధిత ఏఎంఓహెచ్ స్వచ్ఛ ఆటో నడిపే వారికి లేదా నగరంలో చెత్త నిర్వహణకు అధీకృత ఏజెన్సీ అయిన రాంకీకి సమాచారమిస్తారు. ఒక వేళ చెట్ల కొమ్మలు నరికిన వ్యర్థాలైతే నేరుగా రాంకీకి తెలియజేస్తారు. ప్రాజెక్ట్ అమలు చర్యలకు ఒక డీఈఈ సమన్వయం వహిస్తారు. తొలుత పైలట్ ప్రాజెక్టుగా.. చెత్త తరలింపు సేవల్ని బేగంపేట సర్కిల్‌లో చేపడుతున్నారు. రెండు రోజులుగా ట్రయల్ రన్ నిర్వహిస్తున్నారు.
- ఇరవై మంది నుంచి ఫోన్లు రాగా.. 14 మందికి సంబంధించిన చెత్త సమస్యను పరిష్కరించారు. నగరాన్ని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ పేర్కొన్నారు. తొలుత బేగంపేట సర్కిల్‌లో ప్రాజెక్టు పనితీరు పరిశీలించి, ప్రజల నుంచి కూడా ఫీడ్‌బ్యాక్ తెలుసుకొని, నగరవ్యాప్తంగా మిగతా 29 సర్కిళ్లలోనూ దీన్ని చేపడతామన్నారు. ఇళ్ల చెత్త తరలించేందుకు ఎలాంటి ఫీజు ఉండదు. ఇతర వ్యర్థాలకు సంబంధించి తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది.

ప్రజలకు సదుపాయం..

- ఈ సేవల ద్వారా నగరం పరిశుభ్రంగా ఉండటమే కాక ప్రజలకు ఎంతో సదుపాయం కలగనుందని అధికారులు భావిస్తున్నారు. ఇంటింటి చెత్త సేకరణకు గాను నగరంలోని స్వచ్ఛ ఆటోలు అన్ని ఇళ్లకూ వెళ్లడం లేదు. వారానికి ఒకరోజు, రెండు రోజులు మాత్రమే వెళ్తున్న ఆటోలు కూడా ఉన్నాయి. దీంతో చెత్తను ఇంట్లో ఉంచుకోలేక రోడ్లపై కుమ్మరిస్తున్నారు. అందుకు పెనాల్టీలు విధిస్తున్నా మానడం లేదు.
- దాంతో నగరం అపరిశుభ్రంగా, అందవిహీనంగానే కాక రోగాలవ్యాప్తికి తావిస్తోంది. ఈ ఫోన్ కాల్‌సేవల ద్వారా ఏ ప్రాంతం నుంచి ఎక్కువ ఫిర్యాదులొస్తున్నాయో తెలియడం ద్వారా ఇళ్ల నుంచి చెత్త తరలించని స్వచ్ఛ ఆటోలపై తగిన చర్యలు తీసుకునేందుకు వీలవుతుంది.

టెర్రస్ గార్డెన్స్ ఏర్పాటు చేయండి



- పైలట్ ప్రాజెక్టు కింద షేక్‌పేట, ములకనూర్ గురుకులాలు
- హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి

సాక్షి, సిటీబ్యూరో: విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో కిచెన్ గార్డెన్, టెర్రస్ గార్డెన్స్ ఏర్పాటుకు అవసరమైన నివేదికలు సమర్పించాలని హైదరాబాద్ కలెక్టర్ హరిచందన దాసరి అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో విద్యాశాఖ, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. సేంద్రియ ఎరువులతో ఆకుకూరలు, కూరగాయలు, వివిధ రకాల పండ్లు పండించే దిశగా ముందుగా సాగాలని సూచించా. పైలట్ ప్రాజెక్టు కింద షేక్‌పేట సాంఘిక సంక్షేమ శాఖ ఉన్నత పాఠశాల, ములకనూర్ పాఠశాలల్లో సంకల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేంద్రియ పంటలు పండించేందుకు చర్యలు తీసుకోనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పాఠశాలలు కళాశాలలు, వసతి గృహాల్లో అనువుగా ఉన్న స్థలాల వివరాలను అందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కిచెన్, టెర్రర్ గార్డెన్స్ ఏర్పాటుపై ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎస్ఎల్ఎంఆర్ వెల్లూరి శ్రీనివాసన్, రామలింగారెడ్డి అవగాహన కల్పించారు. సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ సంక్షేమ అధికారులు జి.ఆశన్న, కోటాజి, ప్రవీణ్ రెడ్డి, ఇలియాస్ అహ్మద్, సంకల్ప్ ఫౌండేషన్ ఎన్జీవో రోజీ, ఆర్‌సీఓలు, ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ ప్రకారమే పీహెచ్‌డీ అడ్మిషన్లు

– డిమాండ్ చేసిన ఎంఎస్ఎఫ్



సాక్షి, సిటీబ్యూరో: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ ప్రకారమే పీహెచ్‌డీ- 2025 కేటగిరీ-2 అడ్మిషన్ల తుది ఫలితాలను విడుదల చేయాలని ఎంఎస్ఎఫ్ డిమాండ్ చేసింది. మంగళవారం ఎంఎస్ఎఫ్ ప్రతినిధుల బృందం ఉస్మానియా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ కుమార్‌కు వినతిపత్రం సమర్పించింది. పీహెచ్‌డీ ఫలితాల్లో కూడా వర్గీకరణ అమలు చేయాలని, లేకపోతే వందలాది మంది ఎస్సీలోని మాదిగ, ఇతర ఉప కులాల విద్యార్థిని విద్యార్థులు అడ్మిషన్లు కోల్పోయే ప్రమాదం ఉందని ఎంఎఫ్ఎస్ ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. వీసీ సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపింది. వీసీని కలిసినవారిలో ఎంఎస్ఎఫ్ రాష్ట్ర అధికార ప్రతినిధి కొమ్ము శేఖర్ మాదిగ, జాతీయ ఉపాధ్యక్షుడు తోకల చిరంజీవి మాదిగ, నాయకులు వీరపాకుల పరుశురాం మాదిగ, దుడ్డు రామకృష్ణ మాదిగ, ఎడవల్లి అజయ్ మాదిగ, జన్నపాల మహేష్ మాదిగ, మంద రాజు మాదిగ, దీపంగి పవన్ కుమార్ మాదిగ, పుట్ట రమేష్, కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

అగ్రి వర్సిటీలకు నాబార్డు సహకారం అవసరం

వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు. చిత్రంలో నాబార్డు సీజీఎం ఉదయ్‌భాస్కర్

చిక్కడపల్లి: తెలంగాణలోని వ్యవసాయ, ఉద్యానవన వర్సిటీలకు మౌలిక సదుపాయాలను కల్పించేందుకు నాబార్డు సహకారం అందించాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. మంగళవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లో నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డు) 44వ వ్యవస్థాపక దినోత్సవాలు జరిగాయి. ముఖ్యఅతిథిగా హాజరై మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు జ్యోతిని వెలిగించి ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 30 మధ్య తరహా నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేయడానికి నాబార్డ్ నిధుల మంజూరు చేస్తే రైతాంగానికి ఎంతో మేలు జరుగుతుందన్నారు. రైతాంగానికి బ్యాంకులు ఇబ్బంది పెట్టకుండా రుణాలు అందించడానికి ముందుకు రావాలని సూచించారు. రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి నాబార్డు అందిస్తున్న రుణ సదుపాయాలు ఎంతో గొప్పగా ఉన్నాయని అన్నారు. వ్యవసాయం, ఇతర అనుబంధ రంగాల్లో అభివృద్ధి నిమిత్తం రుణాలు ఇవ్వాలని బ్యాంకర్లను కోరారు. దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి రేతుల సంక్షేమానికి ఎంతో కృషి చేసిన రైతుబాంధవుడని మంత్రి తుమ్మల కొనియాడారు. రాష్ట్రంలో మొదటిసారిగా సహకార రంగాన్ని బతికించారని కొనియాడారు.

నాకు బ్యాంకులో ఉద్యోగం రాలేదు, రుణం వచ్చింది..

గ్రామీణ బ్యాంకులో ఉద్యోగం కోసం ప్రయత్నించినా అది రాలేదని, అదే బ్యాంకులో అప్పు తీసుకొని వ్యవసాయం చేసి ఇంతటివాడనయ్యాయని మంత్రి తుమ్మల చెప్పారు. నాబార్డు సీజీఎం బి.ఉదయ్‌భాస్కర్ మాట్లాడుతూ గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి కింద వివిధ నీటిపారుదల, కనెక్టివిటీ పాఠశాల ప్రాజెక్టులకు రూ.1,100 కోట్ల మేరకు సహకారం అందించినట్లు చెప్పారు. స్వయం సహాయక బృందాలకు నాబార్డు రూ.9,673 కోట్ల మేరకు రీ ఫైనాన్స్ చేసిందన్నారు. సమావేశంలో రాష్ట్ర కోఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ ఎం.రవీందర్‌రావు, సహకార శాఖ ఎస్.రాధాకృష్ణన్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా సీజీఎం కె.భాస్కర్‌రావు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ చైర్మన్ కె.ప్రతాప్‌రెడ్డి, నాబార్డు జనరల్ మేనేజర్ గణపతి, బ్యాంక్ ఉన్నతాధికారులు , ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

నగరంలో నేడు

- శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్యసాయి నిగమాగమంలో ఉదయం 10 నుంచి రాత్రి 8.30 గంటల వరకు ఇండియన్ సిల్క్ గ్యాలరీ ఎక్స్‌పో జరుగుతుంది
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో డిజిటల్ ఆర్ట్, పెయింటింగ్ ఎగ్జిబిషన్ ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళాశక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.com కు మెయిల్ చేయగలరు.

మెట్రో ఫేజ్-2పై అసెంబ్లీలో తీర్మానం చేయాలి

-మేడ్చల్ మెట్రో సాధన సమితి డిమాండ్

సాక్షి,మేడ్చల్ జిల్లా: హైదరాబాద్ మెట్రో ఫేజ్-2పై వర్షాకాల అసెంబ్లీ, మండలి సమావేశాల్లో తీర్మానం చేయడానికి కృషి చేయాలని అన్ని పార్టీల ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మేడ్చల్ మెట్రో సాధన సమితి ఒక ప్రకటనలో కోరింది. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 ఆమోదానికి కేంద్ర ప్రభుత్వం వేగంగా స్పందించాలని విజ్ఞప్తి చేసింది. హైదరాబాద్‌లోని వెనుకబడిన ప్రాంతాలకు మెట్రో కనెక్టివిటీ కోసం కృషి చేస్తున్న నిబద్ధత కలిగిన పౌరుల సమూహం మేడ్చల్ మెట్రో సాధన సమితి(ఎంఎంఎస్ఎస్)గా ఏర్పడి పోరాటం చేస్తోందని తెలిపింది. హైదరాబాద్ భారతదేశంలో 4వ అతిపెద్ద నగరమని, సమగ్ర డీపీఆర్ సమర్పించినా మెట్రో ఫేజ్-2 ప్రతిపాదనలు కేంద్రం వద్ద పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగిస్తోందని మెట్రో సాధన సమితి నాయకులు మామిడి సంపత్‌రెడ్డి, కొండం అశోక్ రెడ్డి, మహేందర్‌రెడ్డి, ఊకంటి శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలు ప్రదానం



పురస్కార గ్రహీతలతో గుత్తా సుఖేందర్ రెడ్డి

నాంపల్లి: తెలుగు విశ్వవిద్యాలయం మంగళవారం నాంపల్లి ప్రాంగణంలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో వివిధ రంగాల్లో విశేషమైన సేవలు అందించిన 12 మంది ప్రముఖులను 2023వ సంవత్సరానికిగాను ప్రతిభా పురస్కారాలతో సత్కరించింది. ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి పురస్కార గ్రహీతలకు రూ.20,116 నగదుతోపాటు శాలువ, అభినందనపత్రం అందజేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మాతృభాష తెలుగును కాపాడుకోవాలని, అన్యభాషలను ద్వేషించవద్దని అన్నారు. విశిష్టఅతిథి, సింగరేణి కాలరీస్ సీఎండీ ఎం.బలరామ్ మాట్లాడుతూ సాహిత్యం, కళల ద్వారా సమాజాన్ని మేలుకొల్పుతున్న ప్రతిభామూర్తులను గుర్తించి పురస్కారాలతో సత్కరించడం హర్షణీయమని అన్నారు. సభకు అధ్యక్షత వహించిన తెలుగు వర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య వెలుదండ నిత్యానందరావు పురస్కార గ్రహీతలను సభకు పరిచయం చేస్తూ వారిలో ప్రతిభావిశేషాలను వివరించారు. అంతకుముందు రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు అతిథులకు స్వాగతం పలికారు. జానపద రంగంలో పురస్కారాన్ని అందుకున్న కడకంచి పాపయ్య తన బృందంతో చేసిన ప్రదర్శన సభికులను ఆకట్టుకుంది.

పురస్కార గ్రహీతలు వీరే...

ఎలనాగు(కవిత్వం), డాక్టర్ ప్రభల జానకి(విమర్శ), ఆచార్య ఆర్.లక్ష్మీరెడ్డి(చిత్రలేఖనం), ఎ.సంపత్‌రెడ్డి(శిల్పం), పేరిణి రమేష్‌లాల్(నృత్యం), బి.హరిప్రియ(సంగీతం), కాసుల ప్రతాపరెడ్డి(పత్రికారంగం), గుమ్మడి గోపాలకృష్ణ(నాటక రంగం), కడకంచి పాపయ్య (జానపద రంగం), ధూళిపాళ మహదేవమణి(అవధానం), ఆచార్య కె.మలయవాసిని(ఉత్తమ రచయిత్రి), డాక్టర్ శాంతినారాయణ(నవల/కథ) పురస్కారాలు స్వీకరించారు.

విద్యుత్ బిల్లుల బకాయిలపై స్పెషల్ డ్రైవ్

సాక్షి, సిటీబ్యూరో: విద్యుత్ బిల్లుల బకాయిల వసూళ్లకు దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. డిస్కం పరిధిలోని 728 కనెక్షన్లకుగాను రూ.600 కోట్లకుపైగా బకాయిలు వసూలు కావాల్సి ఉంది. పలుమార్లు నోటీసులు జారీ చేసినా బిల్లులు చెల్లించడం లేదు. దీంతో మంగళవారం డిస్కం ఇంజనీర్లు ఆయా బిల్ స్టాఫ్ సర్వీసు సంస్థల ముందు నోటీసు బోర్డులు ఏర్పాటు చేశారు. విద్యుత్ సంస్థకు బకాయి పడిన విషయం దాచి పెట్టి ఆయా ఆస్తులను అమ్మకానికి పెట్టడం, ఆ విషయం తెలియక పలువురు కొనుగోలు చేయడం వల్ల ఇబ్బందులు తలెత్తుతుండటంతో నోటీసు బోర్డులు ఏర్పాటు చేస్తున్నట్లు డిస్కం సీఎండీ ముషారఫ్ ఫారూఖీ తెలిపారు. విద్యుత్ బకాయిలతోపాటు కనెక్షన్లకు లింకు చేసిన ఆస్తుల క్రయ విక్రయాలు నిలిపి వేయాల్సిందిగా రిజిస్ట్రేషన్ల శాఖకు డిస్కం లేఖ రాసినట్లు పేర్కొన్నారు. స్పెషల్ డ్రైవ్‌లో ఇప్పటివరకు రూ.100 కోట్ల మేర మొండి బకాయిలు వసూలైనట్లు ప్రకటించారు.

డిప్యూటీ సీఎంకు ఇంజనీర్ల అభినందనలు

సాక్షి, సిటీబ్యూరో: నల్లగొండ జిల్లా యాదాద్రి థర్మల్ ప్లాంట్‌కు చెందిన 800 మెగావాట్ల కమర్షియల్ యూనిట్-1 ఆపరేషన్‌ను ప్రారంభించడం పట్ల తెలంగాణ స్టేట్ పవర్ ఇంజనీర్స్ అసోసియేషన్ హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రత్నాకర్‌రావు, సదానందం నేతృత్వంలోని ఇంజనీర్ల బృందం మంగళవారం డిప్యూటీ సీఎం, విద్యుత్ శాఖ మంత్రి భట్టి విక్రమార్కను కలిసి అభినందనలు తెలిపారు. విద్యుత్ సంస్థల్లో బదిలీ పాలసీని ఇవ్వాలని కోరగా, ఆయన సుముఖత వ్యక్తం చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు సురేష్‌కుమార్, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఐక్యతతోనే బహుజనులకు రాజ్యాధికారం

మున్నూరు కాపుల ఓరియంటేషన్ శిక్షణ కార్యక్రమంలో వక్తలు



మున్నూరు కాపుల ఓరియంటేషన్ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

చందానగర్: ఐక్యత, కార్యదీక్షతో బహుజనులకు రాజ్యాధికారం సిద్ధించడం తథ్యమని పలువురు వక్తలు అన్నారు. మంగళవారం చందానగర్‌లోని సుప్రజ గార్డెన్స్‌లో మున్నూరు కాపులకు ఒక రోజు ఓరియంటేషన్ శిక్షణ తరగతులు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు వద్దిరాజు రవిచంద్ర, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పురుషోత్తంరావు మాట్లాడుతూ ఇతర కులాల వారితో స్నేహంగా, పరస్పర సహకారం, స్పష్టమైన కార్యచరణతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. రాజకీయ పార్టీల తరహాలో మున్నూరు కాపులకు ఓరియంటేషన్ శిక్షణ తరగతులు నిర్వహించడం హర్షణీయమని అన్నారు. సంఘాన్ని గ్రామస్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. ఆత్మగౌరవ భవనం కోసం గత ప్రభుత్వ మంజూరు చేసిన ఐదు కోట్ల రూపాయలు మంజూరయ్యేలా కృషి చేస్తానని ఆది శ్రీనివాస్ అన్నారు. మున్నూరుకాపుల పేరు చివరన పటేల్ అని వచ్చేలా గెజిట్ నోటిఫికేషన్ కోసం ప్రయత్నిస్తానని చెప్పారు. టీజీపీఎస్సీ మాజీ సభ్యుడు విఠల్, జలమండలి కార్పొరేషన్ మాజీ చైర్మన్ ప్రకాష్, రౌతు కనకయ్య, మున్నూరు కాపుల విద్యావంతుల వేదిక రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్ వివిధ అంశాలపై బోధించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేష్, గాలి అనిల్‌కుమార్, మాజీ ప్రభుత్వ విప్ దాస్యం విజయ్‌భాస్కర్, మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్, సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, మహిళా వింగ్ ప్రెసిడెంట్ బండి పద్మ తదితరులు పాల్గొన్నారు.

గురుకులాల సమస్యలు పరిష్కరించాలి

ఉన్నతాధికారులకు విన్నవించిన ఎస్ఎఫ్ఐ నాయకులు



వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

నాంపల్లి: రాష్ట్రంలో గురుకులాల సమస్యలను పరిష్కరించాలని, సరిపడా నిధులు విడుదల చేయాలని, సీజనల్ వ్యాధులు సోకకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ నాయకులు సాంఘిక సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ సక్రు నాయక్, మహాత్మా జ్యోతిబాపూలే గురుకులాల డిప్యూటీ సెక్రటరీ చక్రవర్తి, ట్రైబల్ గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మిలకు మంగళవారం వినతి పత్రాలను అందజేశారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు మాట్లాడుతూ అద్దె భవనాల్లో నడుస్తున్న విద్యా సంస్థల్లో కనీస సౌకర్యాలులేవని, టాయిలెట్స్ సరిపడలేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిధుల సాకుతో నాణ్యమైన భోజనం కూడా అందించడంలేదని విచారం వ్యక్తం చేశారు. అశాస్త్రీయమైన సమయపాలన వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, ఉదయం 8 గంటలకే సిద్ధం కావడం, కాలకృత్యాలు తీర్చుకుని విద్యాసంస్థలకు హాజరు కావడం సాధ్యం కావడంలేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్‌రెడ్డి, రాష్ట్ర కమిటీ సభ్యులు జె.రమేష్, లెనిన్ గువేరా, జిల్లా నాయకులు కైలాష్ తదితరులు పాల్గొన్నారు.

అవసరమైతే న్యాయ పోరాటం

– 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ఆర్.కృష్ణయ్య

కాచిగూడ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయనున్న 42 శాతం బీసీ రిజర్వేషన్లను ఎవరైనా అడ్డుకునే ప్రయత్నిస్తే న్యాయ పోరాటానికి బీసీ న్యాయవాదులు సిద్ధంగా ఉండాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం అధ్యక్షతన మంగళవారం కాచిగూడలో బీసీ రిజర్వేషన్లు, ఆర్డినెన్స్ అమలు, న్యాయపరమైన అంశాలపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆర్.కృష్ణయ్య మాట్లాడారు. ఇది బీసీల ఆత్మగౌరవ పోరాటమని, రాజ్యాధికార సాధన కోసం బీసీలందరూ సంఘటితం కావాలన్నారు. బీసీ రిజర్వేషన్ల అమలుపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కూడా సుముఖంగానే ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైకోర్టు సీనియర్ అడ్వొకేట్లు రమేష్ బాబు, శ్రీనివాస్ యాదవ్, జక్కుల వంశీకృష్ణ, నీల వెంకటేష్, చెరుకు మణికంఠ, టి.రాజ్‌కుమార్, రాజు నేత, పగిళ్ల సతీష్, మోదీ రాందేవ్, దేవేందర్, అశోక్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



మేయర్‌ను కలిసిన జీహెచ్ఎంసీ పీఆర్ఓ



లక్డీకాపూల్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ (పీఆర్ఓ)గా కొత్తగా బాధ్యతలు స్వీకరించిన దశరథం నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం మేయర్ చాంబర్‌లో ఆమెను సీపీఆర్ఓ మహమ్మద్ ముర్తుజాతో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మేయర్ విజయలక్ష్మి ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ క్రమంలో జీహెచ్ఎంసీ అభివృద్ధి పనులు, ప్రజాసేవా కార్యక్రమాలు మరింత ప్రాముఖ్యతతో ప్రజల దృష్టికి తీసుకెళ్లేలా పనిచేయాలని మేయర్ దిశానిర్దేశం చేశారు.

సాక్షి సిటీ ప్లస్
13
హైదరాబాద్, బుధవారం, 16 జూలై 2025





ఎక్కడెక్కడ.. ఎంతెంత ధరల్లో..

కొరియన్ ఫుడ్ కేవలం ఒక సిటీ ట్రెండ్ మాత్రమే కాదు.. నగర ఫుడ్ కల్చర్‌లో ఒక భాగమైపోతోంది. సోషల్ మీడియా ప్రభావం, ఆరోగ్యంపై పెరుగుతున్న అవగాహన కారణంగా ఈ ఆహార శైలి నగరంలో స్థిరపడుతోంది. రానున్న రోజుల్లో మరిన్ని కొరియన్ రెస్టారెంట్లు నగరంలో ప్రారంభమయ్యే అవకాశం కనిపిస్తోంది. కాగా ఆయా రెస్టారెంట్స్‌లో స్ట్రీట్ స్టైల్ డిష్‌లు రూ.300 నుంచి రూ.500 మధ్య లభిస్తున్నాయి. బార్బెక్యూ ఫుల్ కోర్స్ మీల్స్ రూ.800 నుంచి రూ.1500 మధ్య అందుబాటులో ఉంటోంది. అయితే ఒకప్పుడు చైనా ఫుడ్ ఎలా ఊపేసిందో, ఆ తర్వాత ఇటాలియన్ వంటకాలు ఎంతగా నగరవాసులను ఆకట్టుకున్నాయో అదే తరహాలో కొరియన్ మెనూ కూడా సిటీ లైఫ్‌తో అల్లుకుపోయే అవకాశాలు కనిపిస్తున్నాయి.

కొరియన్ రుచులు.. కోరి.. కోరి..

క్రేజీ ట్రెండ్‌గా మారుతున్న.. కే-ఫుడ్





- నగరంలో కొరియన్ వంటకాలకు ఆదరణ
- విస్తరిస్తున్న ప్రత్యేక కొరియన్ రెస్టారెంట్స్
- కే-పాప్, కే.డ్రామా సిరీస్‌లపై ఆసక్తే కారణమే
- యువతను అత్యధికంగా ఆకట్టుకుంటున్న కే.ఫుడ్
- విదేశీ రుచులకు సై అంటున్న నగరవాసులు

భాగ్యనగర వాసులు ఆహార ప్రియులు అనడంలో ఎలాంటి సందేహం లేదు.. మన దేశీయ రుచులతో పాటు విదేశీ వంటకాలకూ నగరంలో క్రేజ్ ఏర్పడటమే దీనికి నిదర్శనం.. ఇందులో భాగంగానే ఇటీవలి కాలంలో కొరియన్ రుచులను కోరి.. కోరి ఎంచుకుంటున్నారు.. దీంతో సంప్రదాయ భారతీయ వంటకాలతో పాటు తాజాగా విదేశీ వంటకాలు కూడా హైదరాబాద్ వాసులను మెప్పిస్తున్నాయి. వాటిలో ముఖ్యంగా కొరియన్ రుచులకు ఆదరణ పెరుగుతోంది. ప్రత్యేకంగా యువతలో దీనికి గల క్రేజ్ రోజు రోజుకూ పెరుగుతోంది. దీంతో నగరంలో భారీ స్థాయిలో కొరియన్ రెస్టారెంట్లు వెలుస్తున్నాయి.

\- సాక్షి, సిటీబ్యూరో

నగరంలో ఏర్పాటైన పలు ప్రీమియం కొరియన్ రెస్టారెంట్లలో కొరియన్ వంటకాలు అందుబాటులో ఉన్నాయి. ఆధ్యాత్మిక ఆహార వాతావరణంతో కలిపి, కొరియన్ పాన్ ఆసియన్ ఫ్యూజన్ మెనూ జూబ్లీహిల్స్‌లోని చబ్బీ చో అందిస్తోంది. నేరుగా కొరియాలో ఉన్న అనుభూతిని కల్పించేలా హైటెక్ సిటీలోని హహన్స్ కిచెన్ యాంబియన్స్‌తో పాటు కొరియన్ బార్బెక్యూ కాన్సెప్ట్ ద్వారా అందిస్తుంది. ఇక కొరియన్ స్ట్రీట్ ఫుడ్‌కి కోకాపేట్‌లోని సారంఘీ కొరియన్ రెస్టారెంట్ ఫేమస్ అయ్యింది. బంజారాహిల్స్‌లోని సాంగ్స్ హాట్ డాగ్ కొరియన్ శైలి హాట్ డాగ్స్‌కు పేరొందిందిగా చెప్పుకోవచ్చు. ఇక బంజారాహిల్స్‌లోని సో రా సాంగ్ నగరంలోని తొలి కొరియన్ రెస్టారెంట్స్‌లో ఒకటి. ఇక్కడికి కొరియన్ దేశస్తులు తరచూ వస్తుంటారు. దీంతో పాటు నగరవాసులు సైతం కొరియన్ రెస్టారెంట్లకు వారాంతాల్లో క్యూ కడుతున్నారు.



ఈ నెలంతా.. కొరియన్ సంత..

హైటెక్ సిటీలో విందు వినోదాలకు పేరొందిన సోషల్ కమ్యూనిటీ కేఫ్ రిపబ్లిక్ ఆఫ్ కొరియా రాయబార కార్యాలయం సహకారంతో కోరే-యే పేరిట ఈ నెల మొత్తం కొరియన్ రుచుల పండుగను, కే-సందడి సహా నిర్వహిస్తోంది. ఈ కోరే-యే పండుగ నగరంలో కే-ఫుడ్‌కు ఉన్న క్రేజ్‌కు అద్దం పడుతోంది. దీని మెనూ రూపకల్పన చేసిన చెఫ్ షా అలీ మాట్లాడుతూ.. తాను గత 28 ఏళ్లుగా ఈ రంగంలో ఉన్నానని, అయితే కొరియన్ ఫుడ్‌కు పెరుగుతున్న ఆదరణ మునుపెన్నడూ చూడలేదన్నారు. చాలా కాలంగా 'కొరియన్ ఫుడ్ విశ్వవ్యాప్తం' అవుతోంది. ఇటీవల నగర కస్టమర్ల నుంచి అద్భుత ఫీడ్‌బ్యాక్ అందుతోందని సంతోషిస్తున్నాం' అని అలీ చెప్పారు. తొలుత చైనీస్ వంటకాలను ఆనందించే వ్యక్తిగా, ఇప్పుడు కొరియన్ వంటకాలు ఎంపికలో ఉన్నాయని అలీ చెప్పారు. కస్టమర్ సంతృప్తి, సానుకూల ఫీడ్‌బ్యాక్ తనలో ఆనందాన్ని నింపుతుందని చెబుతున్న ఆయన.. కొరియన్ రైస్ కేక్‌లు, కిమ్ (సీవీడ్), కిమ్చి, గోచుజాంగ్ సాస్, సోజు, టియోక్‌బోక్కి, బిబింబాప్, ఫ్రైడ్ చికెన్‌లతో భోజన ప్రియులను అలరిస్తున్నాం. ఈ ఫుడ్ ఫెస్ట్‌తో పాటు వర్క్‌షాపులు, కే-పాప్ డ్యాన్స్ క్లాసులు, కరావొకే ప్రోగ్రామ్స్, చా-డౌన్ ఛాలెంజ్‌లు పాప్-అప్ మార్కెట్‌లు ఇందులో భాగంగా ఉంటాయి. వీటితోపాటు కొరియన్ సంస్కృతి, సంప్రదాయాలు, సంగీత నృత్యాల నడుమ అచ్చమైన వాతావరణం కల్పిస్తున్నారు నిర్వాహకులు.



వినోదం నుంచి పుట్టిన విందు..

కొరియన్ సంగీతం కే-పాప్‌కి నగర యువత ఎక్కువగా ఆకర్షితులవుతున్నారు. అదే విధంగా కె.డ్రామా వెబ్ సిరీస్‌లు నచ్చడం వల్ల కూడా కొరియా సంస్కృతి, ఆహారపు అలవాట్లు నగరవాసులకు పరిచయమయ్యాయి. అలా ఆసక్తి పెరగడం వల్ల, వారి ఆహారపు అలవాట్లను కూడా అనుకరించాలనే ధోరణి ఇటీవలి కాలంలో పెరుగుతోంది. అలాగే కొరియన్ ఆహార శైలికి క్రేజ్ పెరగడానికి హెల్తీ ఈటింగ్ ట్రెండ్ కూడా ఓ కారణమే. ఈ వంటకాలు ఎక్కువగా లో-ఆయిల్, హై-ప్రొటీన్, తేలికగా జీర్ణమయ్యే కిమ్చీ వంటి ఫెర్మెంటెడ్ డిష్‌లు ఓ కారణం. ఆరోగ్యంపై శ్రద్ధపెట్టే వారు వీటిని ఎక్కువగా ఇష్టపడుతున్నారు.. మసాలాలు తక్కువగా ఉంటూ గమ్మత్తయిన రుచిని కలిగి ఉండే ఈ ఫుడ్ వండే విధానం కూడా యువతను ఆకర్షిస్తోంది. బిబిమ్‌బాప్, బుల్గోజీ, టియోక్బెక్కి, సంమ్జియోప్సాల్, కిమ్చి ఫ్రైడ్ రైస్.. వంటి వెరైటీ వంటకాలు నగరంలో పాపులర్ అయ్యాయి.



తిరస్కారాలే.. విజయానికి మెట్లుగా..

- 'గోల్డెన్ లెన్స్'లో జీవిత విశేషాలపై ప్రసంగం
- హైదరాబాద్, బిర్యానీ అంటే ఇష్టం
- ఆస్కార్ అవార్డు విజేత గునీత్ మోంగా

సనత్‌నగర్: 'నా జీవన ప్రయాణంలో ఎన్నో తిరస్కారాలకు గురయ్యాను.. అయినా వెనక్కి తగ్గలేదు.. వాటినే విజయవానికి మెట్లుగా మలచుకున్నా' అని ఆస్కార్ అవార్డు విజేత, ప్రముఖ సినీ నిర్మాత గునీత్ మోంగా అన్నారు. యువ మహిళా పారిశ్రామికవేత్తల సంఘం వైఎఫ్ఎల్ఓ (యంగ్ ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్) ఆధ్వర్యంలో బేగంపేటలోని ఐటీసీ కాకతీయ హోటల్లో 'గోల్డెన్ లెన్స్' పేరిట నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొని తన జీవితంలో ఎదురైన అనుభవాలను వారితో పంచుకుని స్ఫూర్తిని నింపారు. '20 సంవత్సరాలు ఒక అద్దె ఇంట్లో జీవించాను. నా తల్లిదండ్రులకు ఇల్లు కొనాలని అనుకున్నా. నెలకు రూ.5,000 అద్దె చెల్లిస్తూ జీవితాన్ని గడిపా. నా ప్రయాణం అంత సులభం కాదు. జీవితంలో అనేక ఛీత్కారాలను స్వాగతించా' అని గతాన్ని గుర్తుచేసుకున్నారు. ఏడాదికి 1500లకు పైగా సినిమాలు నిర్మితమవుతున్నా అందులో 10 శాతం కూడా మహిళా దర్శకులు లేకపోవడం బాధాకరమని, ఈ పరిస్థితి మారాలని, అందుకే ఉమెన్ ఇన్ ఫిలిం-ఇండియా చాప్టర్‌ని ప్రారంభించామని అన్నారు. ఇది మహిళలకు మద్దతు ఇచ్చే ప్లాట్‌ఫాం అని, వాళ్ల గొంతు వినబడాలని అన్నారు.

హైదరాబాద్ అన్నా, బిర్యానీ అన్నా ఇష్టం..

తనకు హైదరాబాద్ అన్నా, ఇక్కడి బిర్యానీ అన్నా ఎంతో ఇష్టమని, అవకాశం లభిస్తే టాలీవుడ్ కళాకారులతో కలిసి పనిచేయాలని ఉందని అన్నారు. ఆమె నిర్మించిన ప్రసిద్ధ చిత్రాలు 'ది లంచ్ బాక్స్, మసాన్, పగ్గలైత్, ఆస్కార్ గెలుచుకున్న డాక్యుమెంటరీ షార్ట్ ఫిల్మ్ ద ఎలిఫెంట్ విస్పరర్ వంటి చిత్ర అనుభవాలను పంచుకున్నారు. వైఎఫ్ఎల్ఓ చైర్‌పర్సన్ పల్లవి జైన్ మాట్లాడుతూ గునీత్ అనేక మందికి స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో ఎఫ్ఎల్ఓ, వైఎఫ్ఎల్ఓ సభ్యులు పాల్గొన్నారు.



బీటెక్ విద్యార్థుల సృజన

- 35 కిలోమీటర్ల చార్జింగ్ వాహనం తయారు
- రాష్ట్రపతి భవన్ వద్ద కొలాబరేషన్ కార్యక్రమంలో ప్రదర్శన

సుభాష్‌నగర్: వారిరువురూ బీటెక్ విద్యార్థులు.. అందరిలా కాకుండా కొత్తగా ఏదో చేయాలనే తలంపుతో వారిలోని నైపుణ్యానికి పదునుపెట్టారు. అనుకున్నదే తడవుగా.. చార్జింగ్‌తో నడిచే వాహనాన్ని తయారు చేశారు.. బొల్లారంలోని రాష్ట్రపతి భవన్ వద్ద మంగళవారం నిర్వహించిన కొలాబరేషన్ కార్యక్రమంలో ప్రదర్శనకు తీసుకెళ్తూ.. 44వ జాతీయ రహదారి సుచిత్ర వద్ద 'సాక్షి' కెమెరాకి చిక్కారు.. వారే దూలపల్లిలోని సెయింట్ మార్టిన్ ఇంజినీరింగ్ కళాశాలకు చెదిన బీటెక్ ట్రిపుల్ ఈ తృతీయ సంవత్సరం విద్యార్థులు రాహుల్, శుభం. నాలుగు గంటల పాటు చార్జ్ చేస్తే 35 కిలోమీటర్లు వెళ్లేలా దీన్ని తయారు చేశారు. దీని కోసం సుమారు ఆరు నెలలు కష్టపడినట్లు వారు చెబుతున్నారు. వాహనం తయారీకి సుమారు రూ.90వేలు ఖర్చయ్యిందని, ఈ వాహనానికి స్మార్ట్ సిటీ ఎలక్ట్రికల్ కార్ అని నామకరణం చేశామని పేర్కొన్నారు. తమను ప్రోత్సహిస్తే ముమ్ముందు తక్కువ ఖర్చుతో తక్కువ చార్జింగ్‌తో ఎక్కువ మైలేజ్ ఇచ్చే విధంగా కృషిచేస్తామని లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు.



ఆత్మవిశ్వాసంతో ఆశించిన ఫలితాలు

అధునాతన యాంటీ-ఏజింగ్ చికిత్సలు ప్రారంభం
హాజరైన సైనా నెహ్వాల్

సాక్షి, సిటీబ్యూరో : క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం నుంచే తనకు ధైర్యం, నమ్మకం వచ్చాయని, ఈ రెండింటితో ఎలాంటి విజయాలనైనా సుసాధ్యమవుతాయని ప్రముఖ భారతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ అన్నారు. చర్మ సంరక్షణలో అధునాతన సేవలందించే 'కాయ' నూతన క్లినిక్‌ను నగరంలోని ఏఎస్ రావు నగర్ వేదికగా సైనా మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా.. కాయ క్లినిక్‌లో నిబద్ధతతో అధునాతన సేవలందించడం అభినందనీయమని సైనా తెలిపారు. కాయ లిమిటెడ్ మార్కెటింగ్ హెడ్, వైస్ ప్రెసిడెంట్ నిషాంత్ నయ్యర్ మాట్లాడుతూ.. కాయ ప్రయాణంలో హైదరాబాద్ నగరం ఒక ముఖ్యమైన భాగమన్నారు. గొప్ప వారసత్వం, ఆధునిక జీవనశైలి ఈ నగర ప్రత్యకత, తక్కువ జీవన వ్యయం, అభివృద్ధి చెందిన ఐటీ రంగం ఎంతో మందిని ఆకర్షిస్తుందని కొనియాడారు. ఇలాంటి కారణాలతో ఆధునిక జీవనశైలిలో భాగమైన తమ సేవల విస్తరణకు అద్భుత స్థలంగా మారిందన్నారు. చాలామంది ప్రొఫెషనల్స్ ఎక్కువ సేపు స్క్రీన్ ముందు ఉండే పరిస్థితి కారణంగా చర్మంపై మచ్చలు, ముడతలు వంటి సమస్యలు తలెత్తుతున్నాయని ప్రముఖ డెర్మటాలజిస్టు, సౌత్ ఇండియా మెడికల్ అడ్వైజర్ డాక్టర్ వీణా ప్రవీణ్ తెలిపారు. దక్షిణాదిలో ప్రధానంగా హైదరాబాద్‌లో వ్యక్తిగత అవసరాలకు తగినట్లు యాంటీ-ఏజింగ్, హెయిర్ రెస్టొరేషన్ చికిత్సలకు డిమాండ్ పెరుగుతోందని వివరించారు.

ఎక్సలెన్స్ అవార్డ్స్ సందడి

సాక్షి, సిటీబ్యూరో: నృత్యాల హోరు.. పురస్కారాల జోరుతో సందడిగా సాగిన తెలంగాణ ఛాంబర్ ఆఫ్ ఈవెంట్స్ ఇండస్ట్రీ (టీసీఈఐ) ఎక్సలెన్స్ అవార్డ్స్ ఆకట్టుకుంది. నగరంలోని గండిపేట, ఉస్మాన్ సాగర్ రోడ్డుని నవాయ కన్వెన్షన్‌లో మంగళవారం నిర్వహించిన 8వ ఎడిషన్ పురస్కారాల ప్రదాన కార్యక్రమం సందడిగా సాగింది. దేశవ్యాప్తంగా ఈవెంట్స్ రంగానికి సంబంధించి సేవలు అందించిన వారిని గుర్తించి పలు అవార్డులు అందజేశారు. 'జేడ్ ఆఫ్ హైదరాబాద్, పెర్ల్ ఆఫ్ హైదరాబాద్, జెమ్ ఆఫ్ ఇండియా' పేరిట విభిన్న రకాలుగా ఈవెంట్స్ నిర్వహణలో భాగస్వాములైన వారికి, అలాగే రాష్ట్రంలో ఈవెంట్స్ రంగ అభివృద్ధికి దశాబ్దాలుగా కృషి చేసిన నామ్‌ధారి బిజినెస్ గ్రూప్‌కు చెందిన సూరత్ సింగ్ మల్హోత్రా, మ్యూజికల్ వేవ్స్‌కు చెందిన కొమ్ము ఆదర్శ్ కుమార్‌లకు జీవిత సాఫల్య పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి హాజరయ్యారు. టీసీఈఐ అధ్యక్షుడు బలరాం బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సంగీత, సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు అలరించాయి.







రక్తదాన శిబిరాల నిర్వహణలో కేఎల్‌హెచ్‌కు గుర్తింపు

సాక్షి, సిటీబ్యూరో: రక్తదాన శిబిరాల ద్వారా కేఎల్‌హెచ్ హైదరాబాద్ ప్రత్యేక గుర్తింపు దక్కించుకుంది. ఈ విద్యాసంస్థకు చెందిన బాచుపల్లి క్యాంపస్ నగరంలో రక్తదాన శిబిరాల ద్వారా ఎక్కువ యూనిట్ల రక్తం అందించిన కళాశాలలో అగ్రగామిగా నిలిచిన గుర్తింపు పొందింది. ఈ క్యాంపస్ ఒకే శిబిరంలో 245 యూనిట్ల రక్తాన్ని సేకరించి, అత్యున్నత ప్రమాణాన్ని నెలకొల్పడం ద్వారా పీవీ.నరసింహారావు చారిటబుల్ ట్రస్ట్ పురస్కారం దక్కించుకుంది. అదే విధంగా కేఎల్‌హెచ్ అజీజ్‌నగర్ క్యాంపస్ సైతం 200 యూనిట్ల రక్తాన్ని సమీకరించి పీవీ.నరసింహారావు చారిటబుల్ ట్రస్ట్ నుంచి అవార్డ్ అందుకుంది. ఈ వివరాలను కేఎల్‌హెచ్ ప్రతినిధులు ఓ ప్రకటనలో తెలిపారు.

వెస్టిండీస్ 27 ఆలౌట్

0	4	0	0	0	2	11	4	0	0	0	6
క్యాంప్‌బెల్ (సి) ఇన్‌గ్లిస్ (సబ్) (బి) స్టార్క్	మికైల్ (ఎల్బీడబ్ల్యూ) (బి) స్టార్క్	కెవ్లాన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) స్టార్క్	బ్రాండన్ కింగ్ (బి) స్టార్క్	రోస్టన్ ఛేజ్ (సి) ఇన్‌గ్లిస్ (సబ్) (బి) హాజల్‌వుడ్	షై హోప్ (ఎల్బీడబ్ల్యూ) (బి) స్టార్క్	జస్టిన్ గ్రీవ్స్ (సి) వెబ్‌స్టర్ (బి) బోలండ్	అల్జారి జోసెఫ్ (నాటౌట్)	షామర్ జోసెఫ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) బోలండ్	జోమెల్ వారికన్ (బి) బోలండ్	జేడెన్ సీల్స్ (బి) స్టార్క్	ఎక్స్‌ట్రాలు

'సిరాజ్ అవుట్టైనప్పుడు ఎలా అనిపించింది'

టీమిండియా కెప్టెన్ గిల్‌కు చార్లెస్ III ప్రశ్న ● భారత క్రికెట్ జట్లతో బ్రిటన్ రాజు భేటీ



లండన్: ఇంగ్లండ్‌తో మూడో టెస్టులో చివరి బ్యాటర్ అవుట్టైనపుడు ఎలా అనిపించిందని బ్రిటన్ రాజు చార్లెస్ III టీమిండియా కెప్టెన్ శుబ్‌మన్ గిల్‌ను ప్రశ్నించారు. మంగళవారం లండన్‌లోని క్లారెన్స్ హౌస్ గార్డెన్‌లో కింగ్ చార్లెస్... భారత పురుషుల, మహిళల క్రికెట్ జట్లతో ముచ్చటించారు. ఐదు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌లో భాగంగా లార్డ్స్ వేదికగా సోమవారం ముగిసిన మూడో మ్యాచ్‌లో టీమిండియా 22 పరుగుల తేడాతో ఇంగ్లండ్ చేతిలో పరాజయం పాలైంది. టాపార్డర్ ఆకట్టుకోలేకపోయినా... ఆఖర్లో టెయిలెండర్లు అద్భుతంగా పోరాడటంతో ఒకదశలో భారత జట్టు విజయం సాధిస్తుందని పించింది. కానీ హైదరాబాదీ సిరాజ్ చివరి వికెట్ రూపంలో వెనుదిరగడంతో టీమిండియా ఆశలు అడియాశలయ్యాయి. బషీర్ వేసిన బంతిని సిరాజ్ డిఫెన్స్ ఆడేందుకు ప్రయత్నించగా... బంతి నెమ్మదిగా వెళ్లి వికెట్లను తాకింది. దీంతో భారత్‌కు పరాజయం తప్పలేదు. భారత జట్లకు ఆతిథ్యమిచ్చిన సందర్భంగా కింగ్ చార్లెస్ దీని గురించి భారత సారథితో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇంగ్లండ్‌లో భారత హై కమిషనర్ విక్రమ్ దొరైస్వామి, డిప్యూటీ హై కమిషనర్ సుజిత్ ఘోష్, బీసీసీఐ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా, కార్యదర్శి దేవజిత్ సైకియా తదితరులు పాల్గొన్నారు. కింగ్ చార్లెస్‌తో భేటీ అనంతరం దానికి సంబంధించిన అంశాలను గిల్ పంచుకున్నాడు. 'కింగ్ చార్లెస్‌తో కలవడం చాలా బాగుంది. ఎన్నో విషయాల గురించి ఆయన మాట్లాడారు. మూడో టెస్టులో చివరి బ్యాట్స్‌మన్ అవుట్ అయిన విధానం చాలా దురదృష్టకరమని అన్నారు. అనుకోకుండా బంతి వికెట్ల మీదకు వెళ్లిందన్నారు. ఆ సమయంలో మీకు ఎలా అనిపించింది అని ప్రశ్నించారు. అది దురదృష్టకరమని... సిరీస్‌లో మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో మంచి ప్రదర్శన చేస్తామని కింగ్ చార్లెస్‌కు చెప్పాం. ఇంగ్లండ్‌లో ఎక్కడ మ్యాచ్‌లు ఆడినా మాకు విశేష ఆదరణ దక్కుతుంది. అందుకు తగ్గట్లే జట్టు కూడా విజయం కోసం శాయశక్తులా కృషి చేస్తోంది. సిరీస్‌లో ఇప్పటి వరకు ఇరు జట్లు మెరుగైన ప్రదర్శన చేశాయి. మూడు మ్యాచ్‌లూ ప్రేక్షకులను అలరించాయి. టెస్టు మ్యాచ్ చివరి రోజు చివరి సెషన్‌లో ఒక జట్టు స్వల్ప తేడాతో మాత్రమే ఓడిందంటే... ఆ మ్యాచ్‌లో 'క్రికెట్' గెలిచినట్లే' అని గిల్ అన్నాడు. ఇక భారత మహిళల క్రికెట్ జట్టు కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్‌తో కింగ్ చార్లెస్ ప్రయాణానికి సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. కింగ్‌తో భేటీ అనంతరం నాలుగో టెస్టు కోసం పురుషుల జట్టు మాంచెస్టర్‌కు బయలుదేరగా... మహిళల జట్టు వన్డే సిరీస్ కోసం సౌతాంప్టన్‌కు తిరుగు పయనమైంది.

నేడు ఇంగ్లండ్ మహిళల క్రికెట్ జట్టుతో భారత్ తొలి వన్డే
వేదిక: సౌతాంప్టన్ : సాయంత్రం గం. 5:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం



స్టార్క్


కరీబియన్ జట్టు అతి చెత్త రికార్డు

- ఆస్ట్రేలియాతో మూడో టెస్టులో ఘోర ప్రదర్శన
- 14.3 ఓవర్లలో ముగిసిన రెండో ఇన్నింగ్స్
- స్టార్క్‌కు 6 వికెట్లు...బోలండ్ హ్యాట్రిక్
- 176 పరుగులతో ఆసీస్ ఘన విజయం

తొలి ఓవర్లోనే మూడు వికెట్లు...

10 పరుగులు కూడా పూర్తి కాక ముందే సగం మంది పెవిలియన్‌కు... ఆ తర్వాత 'హ్యాట్రిక్' దెబ్బ... చివరకు కనీసం 15 ఓవర్లు కూడా ఆడకుండా ఖేల్ ఖతం... స్కోరు బోర్డు చూస్తే ఏడుగురు డకౌట్... ఒకే ఒక్కడు రెండంకెల స్కోరును చేరితే ఎక్స్‌ట్రాలదే రెండో స్థానం... టెస్టు క్రికెట్‌లో వెస్టిండీస్ జట్టు చాలా కాలంగా వెనుకబడిపోయిందనేది వాస్తవం... టి20ల జోరులో ఆ జట్టు బలహీనంగా మారిపోయిందనేది తెలుసు... కానీ పరిస్థితి మరీ ఇంత ఘోరంగా దిగజారిపోయిందనేది తాజా ప్రదర్శనతో తేలిపోయింది. ఒకదాన్ని మించిన మరొక చెత్త రికార్డులు సృష్టించిన విండీస్ '27 ఆలౌట్'తో టెస్టుల్లో రెండో అత్యల్ప స్కోరును నమోదు చేసింది. 100వ టెస్టు ఆడిన స్టార్క్‌కు బోలండ్ తోడై విండీస్‌ను కుప్పకూల్చారు.

కింగ్‌స్టన్ (జమైకా): వెస్టిండీస్ జట్టు తమ టెస్టు చరిత్రలోనే అతి పెద్ద పరాభవాన్ని మూటగట్టుకుంది. సొంతగడ్డపై ఆడుతూ కూడా కనీస ప్రదర్శన ఇవ్వలేక పూర్తిగా చేతులెత్తేసింది. ఆస్ట్రేలియాతో జరిగిన మూడో (డే అండ్ నైట్) టెస్టులో 204 పరుగుల విజయలక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్ కేవలం 14.3 ఓవర్లలో 27 పరుగులకే ఆలౌటైంది. జస్టిన్ గ్రీవ్స్ (11) రెండంకెల స్కోరు చేయగా, ఏడుగురు బ్యాటర్లు 'సున్నా' చుట్టారు. కెరీర్‌లో 100వ టెస్టు ఆడిన ఆస్ట్రేలియా టాప్ పేసర్ మిచెల్ స్టార్క్ (6/9) అద్భుత బౌలింగ్‌తో చెలరేగి ప్రత్యర్థి పని పట్టగా...స్కాట్ బోలండ్ (3/2) అరుదైన 'హ్యాట్రిక్'ను నమోదు చేశాడు. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగింది ఒకటే జట్టా అన్న తీరుగా ఆడిన ఆసీస్ 176 పరుగుల తేడాతో ఘన విజయం సాధించి సిరీస్‌ను 3-0తో క్లీన్‌స్వీప్ చేసింది. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 99/6తో మూడో రోజు ఆట కొనసాగించిన ఆసీస్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 121 పరుగులకే ఆలౌటైంది. విండీస్ బౌలర్లు అల్జారి జోసెఫ్ (5/27), షామర్ జోసెఫ్ (4/34) ఆసీస్‌ను దెబ్బ తీశారు. అయితే ఈ ఆనందం విండీస్‌కు ఎంతోసేపు నిలవలేదు.



బ్రాండన్ కింగ్

పతనం సాగిందిలా..

'పింక్' టెస్టుల్లో అసాధారణ రికార్డు ఉన్న స్టార్క్ ఎప్పటిలాగే ఆసీస్ బౌలింగ్‌ను మొదలు పెట్టాడు. తొలి బంతికే క్యాంప్‌బెల్ వికెట్ కీపర్‌కు క్యాచ్ ఇచ్చాడు. ఐదో బంతికి వికెట్ల ముందు దొరికిపోయిన కెవ్లాన్ అండర్సన్ రివ్యూ చేసినా లాభం లేకపోయింది. తర్వాతి బంతి బ్రాండన్ కింగ్ బ్యాట్‌ను తాకి స్టంప్స్‌ను గిరాటేయడంతో స్కోరు 0/3. తర్వాతి రెండు ఓవర్లలో విండీస్ చచ్చీ చెడి 5 పరుగులు రాబట్టింది. ఐదో ఓవర్ వేసిన స్టార్క్ తొలి బంతికి మికైల్ లూయిస్, మూడో బంతికి హోప్‌లను ఎల్బీగా వెనక్కి పంపాడు. తన తొలి 15 బంతుల్లోనే 5 వికెట్లు తీసిన అతను టెస్టుల్లో 400వ వికెట్‌ను కూడా తన ఖాతాలో వేసుకున్నాడు. మరోవైపు నేనూ ఉన్నానన్నట్లుగా రోస్టన్ ఛేజ్‌ను హాజల్‌వుడ్ పెవిలియన్ పంపించాడు. తర్వాతి 28 బంతుల పాటు వికెట్ కోల్పోకుండా విండీస్ జాగ్రత్త పడగా సెషన్ ముగిసింది. 'టీ' విరామం తర్వాత మరో మూడు ఓవర్లు కాస్త ప్రశాంతత కనిపించగా, టెస్టుల్లో అత్యల్ప స్కోరు (26)ను విండీస్ సమం చేసింది. అయితే బోలండ్ తన రెండో ఓవర్లో ప్రత్యర్థి పని పట్టాడు. తొలి మూడు బంతుల్లో వరుసగా గ్రీవ్స్, షామర్ జోసెఫ్, వారికాన్‌లను అవుట్ చేసి 'హ్యాట్రిక్' ఖాయం చేసుకున్నాడు. స్టార్క్ వేసిన ఇన్నింగ్స్ 15వ ఓవర్ రెండో బంతికి జోసెఫ్ సింగిల్ తీయడంతో అత్యల్ప స్కోరును విండీస్ దాటింది. కానీ తర్వాతి బంతికే సీల్స్‌ను బౌల్డ్ చేసి స్టార్క్ మ్యాచ్‌ను ముగించాడు.



బోలండ్

రికార్డులే రికార్డులు...

27 టెస్టుల్లో రెండో అత్యల్ప స్కోరు. గతంలో న్యూజిలాండ్ 26 పరుగులకు (1955లో ఆక్లాండ్‌లో ఇంగ్లండ్‌పై) ఆలౌటైంది. దీనికి ముందు విండీస్ అత్యల్ప స్కోరు 47.

14.3 ఓవర్లపరంగా మూడో స్వల్ప ఇన్నింగ్స్. గతంలో దక్షిణాఫ్రికా 12.3 ఓవర్లలో, శ్రీలంక 13.5 ఓవర్లలో ఆలౌటయ్యాయి.

7 ఇన్నింగ్స్‌లో అత్యధిక డకౌట్లు. గతంలో 9 సందర్భాల్లో 6 డకౌట్లు నమోదయ్యాయి.

15 స్టార్క్ తొలి 5 వికెట్లు పడగొట్టేందుకు తీసుకున్న బంతుల సంఖ్య. గతంలో ఎర్నీ తొషాక్, స్టువర్ట్ బ్రాడ్, స్కాట్ బోలండ్ తొలి 5 వికెట్లు పడగొట్టేందుకు 19 బంతులు తీసుకున్న రికార్డును స్టార్క్ బద్దలు కొట్టాడు.

2 ఇర్ఫాన్ పఠాన్ (పాకిస్తాన్‌పై 2006లో) తర్వాత ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే మూడు వికెట్లు తీసిన మొదటి బౌలర్ స్టార్క్.

6 విండీస్ టాప్-6 చేసిన పరుగులు. గతంలో ఆస్ట్రేలియా (1888లో) టాప్-6 కలిసి చేసిన 12 పరుగుల రికార్డును విండీస్ సవరించింది.

4 ఆస్ట్రేలియా తరఫున 400 వికెట్లు పూర్తి చేసుకున్న నాలుగో బౌలర్ స్టార్క్. వార్న్ (708), మెక్‌గ్రాత్ (563), లయన్ (562) ముందున్నారు.

10 టెస్టుల్లో ఆసీస్ తరఫున హ్యాట్రిక్ తీసిన పదో బౌలర్ బోలండ్.

6/9 కెరీర్ 100వ టెస్టులో స్టార్క్ అత్యుత్తమ ప్రదర్శన. మురళీధరన్ (6/54) ప్రదర్శనను స్టార్క్ సవరించాడు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా



హాసినిగానే గుర్తుపెట్టుకున్నారు

- జెనీలియా

''నా కెరీర్ ప్రారంభం నుంచి ఎప్పటికప్పుడు కొత్త తరహా పాత్రలు చేయాలనే ఉద్దేశంతోనే సినిమాలు చేస్తూ వచ్చాను. 'బొమ్మరిల్లు'లో నేను చేసిన హాసిని పాత్ర మరచిపోలేనిది. అలాగే 'హ్యాపీ'లో మధుమతి, 'కథ' సినిమాలో చిత్ర.. ఇలా విభిన్నమైన పాత్రలు చేశాను. 'తుజే మేరీ కసమ్' (నువ్వేకావాలి హిందీ రీమేక్)తో హిందీలో ఎంట్రీ ఇచ్చాను. ఆ తర్వాత 'బాయ్స్' సినిమా చేశాను. ఆ వెంటనే 'సత్యం' సినిమా అంగీకరించాను. అయితే ఆ సమయంలో 'సత్యం' చేయవద్దని నాకు కొంత మంది చెప్పారు. కానీ కథ నచ్చడంతో నా మనసు మాట విని ఆ సినిమా చేస్తే హిట్‌గా నిలిచింది. కథ మనకు నచ్చితే చేయాలి.. ఆ తర్వాత ప్రేక్షకులే మనల్ని గుర్తిస్తారు'' అని నటి జెనీలియా తెలిపారు. కిరీటి రెడ్డి, శ్రీలీల జోడీగా, జెనీలియా కీలక పాత్రలో నటించిన చిత్రం 'జూనియర్'. రాధాకృష్ణ దర్శకత్వంలో వారాహి చలన చిత్రం బ్యానర్‌పై రజని కొర్రపాటి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం హైదరాబాద్‌లో జెనీలియా విలేకరులతో మాట్లాడుతూ– ''తండ్రీ కొడుకుల కథే 'జూనియర్'. ఈ చిత్రంలో నేను ఓ లేడీబాస్ తరహా పాత్ర చేశాను. కిరీటి పాత్రతో నా రోల్‌కు ఉండే రిలేషన్ ఏంటి? అనేది సినిమాలో చూడాలి. శ్రీలీల అమేజింగ్ నటి. దేవిశ్రీ ప్రసాద్‌గారు మంచి మ్యూజిక్ ఇచ్చారు. సాయి కొర్రపాటిగారు గ్రాండ్‌గా నిర్మించారు. కథానాయికలకు పెద్దగా అభిమానులు ఉండరు. కానీ 'బొమ్మరిల్లు'లో హాసిని పాత్రతో చాలా మంది నాకు అభిమానులయ్యారు. నా కెరీర్‌లో బిజీగా ఉన్నప్పుడే నా తొలి సినిమా 'తుజే మేరీ కసమ్' హీరో రితేష్‌ను వివాహం చేసుకున్నాను. పెళ్లి తర్వాత తెలుగు సినిమాల్లో గ్యాప్ వచ్చింది. మళ్లీ నేను తిరిగి తెలుగు సినిమాలు ఎప్పుడు చేస్తున్నానని నా అభిమానులు సోషల్ మీడియా వేదికగా అడుగుతూనే ఉన్నారు. వారిలో మహిళలు ఎక్కువమంది ఉండటం నాకు సంతోషంగా అనిపించింది. తెలుగు అభిమానులు నన్ను హాసినిగానే గుర్తుపెట్టుకున్నారు. 'బొమ్మరిల్లు 2' ఉంటుందేమో చూడాలి. నాకంటూ డ్రీమ్ రోల్స్ లేవు. అసలు నేను నటిని కావాలనుకోలేదు. అలాంటిది ఇండస్ట్రీలోకి రావడం, ఇన్ని పాత్రలు చేయడం, ప్రేక్షకుల అభిమానాన్ని సంపాదించడం... ఇవన్నీ నాకు కలగానే అనిపిస్తాయి. నా యాక్టింగ్ కెరీర్‌ను కొనసాగిస్తాను. చిన్న పాత్రా? పెద్ద పాత్రా? అనేది ముఖ్యం కాదు. నా పాత్ర కథపై ప్రభావవంతంగా ఉంటే చాలు. రామ్‌చరణ్, ఎన్టీఆర్, అల్లు అర్జున్‌లతో నేను సినిమాలు చేశాను. వాళ్లందరూ ఇప్పుడు స్టార్స్ అయిపోయారు.. వాళ్ల ప్రయాణంలో భాగం కావడం నాకు సంతోషంగా ఉంది. 'బొమ్మరిల్లు' సినిమాలో కోట శ్రీనివాసరావుగారితో కలిసి నటించడాన్ని మర్చిపోలేను. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను. పెళ్లి తర్వాత రితేష్- నేను మా ప్రొడక్షన్ లో 'వేద్' (తెలుగు సినిమా మజిలీ మరాఠీ రీమేక్) సినిమా చేశాం. మంచి ప్రేమ కథ కుదిరితే మళ్లీ కలిసి నటిస్తాం'' అని చెప్పారు.


పౌరాణికంలో...



● ఎన్టీఆర్

హీరో ఎన్టీఆర్, డైరెక్టర్ త్రివిక్రమ్ శ్రీనివాస్‌లది హిట్ కాంబినేషన్. వీరి కలయికలో వచ్చిన తొలి చిత్రం 'అరవింద సమేత వీరరాఘవ' (2018) ఘన విజయం సాధించింది. వీరి కాంబోలో మరో సినిమా పౌరాణికం నేపథ్యంలో రాబోతున్న సంగతి తెలిసిందే. సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌పై సూర్యదేవర నాగవంశీ నిర్మించనున్నారు. ఈ మూవీ తాజా అప్‌డేట్స్ గురించి సూర్యదేవర నాగవంశీ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ''త్రివిక్రమ్‌గారు మా బ్యానర్‌లో తొలిసారి పౌరాణికం నేపథ్యంలో తీయనున్న సినిమా ఇది. ఈ చిత్రాన్ని ప్రకటించడానికి భారీ స్థాయిలో ప్లాన్ చేశాం. నందమూరి తారక రామారావుగారిని రాముడిగా, కృష్ణుడిగా చూసిన నాకు ఎన్టీఆర్‌ని దేవుడిగా చూపించబోతున్నామనే ఆనందం ఉంది. అయితే ఇటీవల బాలీవుడ్ నుంచి వచ్చిన 'రామాయణ'(రణ్‌బీర్ కపూర్) చిత్రం గ్లింప్స్ వచ్చాక దేశమంతా ఆ సినిమా గురించి మాట్లాడుకుంది. దీంతో మేం చేయబోయే చిత్రం గురించి 'రామాయణ' కి మించి మాట్లాడుకోవాలనే ఆలోచనతో కాస్త సమయం తీసుకుని ప్రకటిద్దామని ఆగాం. ప్రస్తుతం మా చిత్రం ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ జరుగుతున్నాయి. 2026 సెకండ్ హాఫ్ నుంచి ఎన్టీఆర్, త్రివిక్రమ్‌గార్ల చిత్రం షూటింగ్ ప్రారంభిస్తాం'' అని తెలిపారు.

ఆంధ్ర కింగ్ కోసం పాట



● రామ్

'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా కోసం హీరో రామ్ రచయితగా మారిపోయి ఓ పాట రాశారు. రామ్, భాగ్యశ్రీ బోర్సే హీరో హీరోయిన్లుగా, ఉపేంద్ర ఓ కీలక పాత్రలో నటిస్తున్న చిత్రం 'ఆంధ్ర కింగ్ తాలూకా'. పి. మహేశ్ బాబు దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా చివరి షెడ్యూల్ చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. కాగా 'ఆంధ్ర కింగ్ తాలూకా' సినిమా కోసం రామ్ ఓ పాట రాశారు. ఆయన పాట రాయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ పాటను సంగీత దర్శకుడు-గాయకుడు అనిరుధ్ రవిచందర్ పాడటం మరో విశేషం. ఈ పాట లిరికల్ వీడియో ఈ నెల 18న రిలీజ్ కానుంది. ''మంచి ఎమోషనల్ లిరిక్స్, అనిరుధ్ వాయిస్‌తో ఈ పాట ఆకట్టుకుంటుంది'' అని చిత్ర యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: వివేక్-మెర్విన్.

రామాయణ @ రూ. 4000 కోట్లు



● సాయి పల్లవి, రణ్‌బీర్ కపూర్

''యుగాలు మారినా, తరాలు మారినా రామాయణం ఎప్పటికీ గొప్ప ఇతిహాసమే. ప్రపంచమంతా మన భారతదేశంవైపు చూసేలా 'రామాయణ' సినిమా ఉంటుంది'' అని పేర్కొన్నారు నిర్మాత నమిత్ మల్హోత్రా. నితేశ్ తివారి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'రామాయణ'. రాముడిగా రణ్‌బీర్‌కపూర్, సీతగా సాయిపల్లవి, రావణుడిగా యశ్ నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నారు. కాగా 'రామాయణ' బడ్జెట్ గురించి నమిత్ మల్హోత్రా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. ''ఏ ఇతర సినిమా కూడా 'రామాయణ' దరిదాపుల్లోకి రాదు. దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో నిర్మిస్తున్నాం. గ్రాఫిక్స్‌పై ఎక్కువగా ఖర్చు చేస్తున్నాం. హాన్స్ జిమ్మర్, ఏఆర్. రెహమాన్ ది బెస్ట్ మ్యూజిక్ ఈ సినిమా కోసం ఇస్తున్నారు. ప్రపంచమంతా రామాయణ ఇతిహాసాన్ని చూడాలనే ఉద్దేశంతో ఈ సినిమాను భారీ స్థాయిలో నిర్మిస్తున్నాం'' అని పేర్కొన్నారు.

అదే సవాల్‌గా అనిపించింది



- ప్రవీణ పరుచూరి

''చిన్నప్పటి నుంచే నాకు సినిమాలంటే ఇష్టం. సినిమా అంటే చాలామంది యాక్టింగ్ అనుకుంటారు. అలా నేను కూడా అమెరికాలో యాక్టింగ్ క్లాసులకు వెళ్లాను. ఫిల్మ్ మేకింగ్ గురించి షార్ట్ కోర్సు చేశాను. నాట్యం నేర్చుకున్నాను. నటన, సాహిత్యం, సంగీతం వంటి అంశాలపై మరింత అవగాహన పెంచుకున్నాను. డైరెక్షన్ అనేది చాలా కష్టమైన క్రాఫ్ట్. నేను నిర్మించిన గత రెండు సినిమాలు ('కేరాఫ్ కంచరపాలెం, ఉమామహేశ్వర ఉగ్రరూపస్య') నాకు అనుభవాన్ని ఇచ్చాయి. దీంతో 'కొత్తపల్లిలో ఒకప్పుడు..' సినిమాతో దర్శకురాలిగా మారాను'' అన్నారు నటి-నిర్మాత- దర్శకురాలు ప్రవీణ పరుచూరి. మనోజ్ చంద్ర, మోనికా ప్రధాన పాత్రల్లో, ప్రవీణ పరుచూరి ఓ కీలక పాత్రలో నటించిన చిత్రం 'కొత్తపల్లిలో ఒకప్పుడు'. దగ్గుబాటి రానా సమర్పణలో పరుచూరి విజయ ప్రవీణ ఆర్ట్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 18న రిలీజ్ కానుంది. ప్రవీణ పరుచూరి మాట్లాడుతూ–''మన గ్రామ దేవతలపై మనకు నమ్మకం, విశ్వాసం ఉంటుంది. కొందరికి చెట్టుపై కూడా నమ్మకం ఉంటుంది. ఈ సినిమాలో ఓ చెట్టు గురించిన ప్రస్తావన కూడా ఉంది. అలాంటి నమ్మకాలను ఈ సినిమాలో న్యూట్రల్‌గా చూపించే ప్రయత్నం చేశాం. అల్లు అర్జున్‌గారితో పోలిక పెట్టడం లేదు కానీ..'పుష్ప2' సినిమాలోని జాతర సీన్ తరహా ఎనర్జీ ఉండే ఓ సీన్ ఉంది. రానాగారు మంచిగా సపోర్ట్ చేశారు. నటిగా, నిర్మాతగా, దర్శకురాలిగా ఈ సినిమా చేయడం సవాల్‌గా అనిపించలేదు. కానీ, ఓ డాక్టర్‌గా, ఆర్టిస్ట్‌గా టైమ్‌ను కేటాయించుకోవడం నాకు సవాల్‌గా అనిపించింది. నా తొలి మూడు సినిమాలు ఉత్తరాంధ్ర నేపథ్యంతోనే ఉన్నాయి. నా తర్వాతి సినిమాను సిటీ బ్యాక్‌డ్రాప్‌లో చేస్తాను. ఓ పూర్తిస్థాయి యాక్షన్ సినిమా చేయాలని ఉంది'' అని చెప్పారు.


మూడేళ్ల ప్రయాణం



● నరేష్ గౌడ, స్రవంతి మల్లిక్, నరసింహ నంది

విక్రమ్ ఆర్, సదన్ హాసన్, వినయ్, నరేష్ రాజ్, అదితీ మైకేల్, శ్రీలు దాసరి, మోహన సిద్ధి ముఖ్య తారలుగా రూపొందిన చిత్రం 'ప్రభుత్వ సారాయి దుకాణం'. '1940లో ఒక గ్రామం' సినిమాతో జాతీయ అవార్డు అందుకున్న నరసింహ నంది దర్శకత్వం వహించారు. ఎస్వీఎస్ ప్రొడక్షన్స్, శ్రీనిధి సినిమాస్‌పై దైవ నరేష్ గౌడ, పరిగి స్రవంతి మల్లిక్ నిర్మించారు. ఈ చిత్రం ఫస్ట్ లుక్ విడుదల కార్యక్రమానికి నిర్మాత ప్రసన్న కుమార్, దర్శకుడు సముద్ర, నటుడు పృథ్వీ అతిథులుగా హాజరై, సినిమా విజయం సాధించాలని ఆకాంక్షించారు. నరసింహ నంది మాట్లాడుతూ–''తెలంగాణలోని ఒక మారుమూల ప్రాంతంలో జరిగే పొలిటికల్ ఫ్యామిలీ ఇతివృత్తంతో ఈ సినిమా ఉంటుంది. నరేష్ గౌడ, పరిగి మల్లిక్‌గార్లు చాలా ప్యాషన్‌తో ఈ సినిమా చేశారు'' అని చెప్పారు. ''త్వరలో మా 'ప్రభుత్వ సారాయి దుకాణం' థియేటర్స్‌లో అలరించబోతోంది'' అన్నారు దైవ నరేష్ గౌడ. ''మా మూడేళ్ల ప్రయాణం ఈ సినిమా. అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని పరిగి స్రవంతి మల్లిక్ తెలిపారు.

సంత్ తుకారాం బయోపిక్



● సుబోధ్ భావే

నటుడు ఆదిత్య ఓం దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'సంత్ తుకారాం'. 17వ శతాబ్దపు మరాఠీ సాధువు సంత్ తుకారాం బయోపిక్‌గా రూపొందిన ఈ సినిమాలో మరాఠీ నటుడు సుబోధ్ భావే టైటిల్ రోల్ చేశారు. పురుషోత్తం స్టూడియోస్‌తో కలిసి బి.గౌతమ్‌కి చెందిన కర్జన్ ఫిల్మ్స్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 17న విడుదలవుతోంది. ఆదిత్య ఓం మాట్లాడుతూ– ''మరాఠీ సాధువు, కవి భక్తిని ప్రతిఘటనగా మార్చిన సంత్ తుకారాం జీవితం, వారసత్వం, సాహిత్య విప్లవం ఆధారంగా 'సంత్ తుకారాం' రూపొందించాను. సుబోధ్ భావే సంత్ తుకారాం పాత్రలో మెప్పించబోతున్నారు. నటుడు ముఖేష్ ఖన్నా వాయిస్ ఓవర్ సినిమాకి హైలైట్‌గా నిలుస్తుంది'' అని అన్నారు.

సాక్షి బిజినెస్

బుధవారం
16-7-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	నిఫ్టీ ▲
317	113
82,571	25,196

విదేశీ సూచీలు

నాస్‌డాక్	20,783	▲	146
డోజోన్స్	44,123	▽	327
ఎఫ్‌టీఎస్‌ఈ 100	8,938	▽	60
డాక్స్	24,060	▽	100
పాంషై	3,505	▽	14
నికాయ్	39,678	▲	218

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	85.55	86.57
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	114.10	117.06
€	యూరో	ఎస్‌బీఐ	99.10	101.85
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	57.55	59.04
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	55.23	57.45
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	64.45	69.15
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	22.00	23.49
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	22.47	24.25
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.09	12.91



టెస్లా కారు వచ్చేసింది..


టెస్లా కారులో మహారాష్ట్ర సీఎం ఫడ్నవీస్

ముంబైలో తొలి షోరూమ్ ప్రారంభం

- మోడల్ 'వై'ని ప్రవేశపెట్టిన కంపెనీ
- రేటు రూ. 59.89 లక్షల నుంచి మొదలు

ముంబై: అమెరికన్ ఎలక్ట్రిక్ కార్ల దిగ్గజం టెస్లా తాజాగా భారత మార్కెట్లోకి ఎంట్రీ ఇచ్చింది. ముంబైలో తొలి షోరూంను ప్రారంభించింది. అలాగే, మధ్య స్థాయి ఎలక్ట్రిక్ ఎస్‌యూవీ మోడల్ 'వై'ని ఆవిష్కరించింది. దీని ధర రూ. 59.89 లక్షల నుంచి ప్రారంభమవుతుంది. మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ మంగళవారం ఈ షోరూంను ప్రారంభించారు. టెస్లా భారత్‌లోనే పరిశోధనలు, తయారీ కార్యకలాపాలు కూడా చేపట్టాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన చెప్పారు. దేశీయంగా ఎక్స్‌పీరియన్స్ సెంటర్లు, సర్వీస్, చార్జింగ్ మౌలిక సదుపాయాలను పెద్ద ఎత్తున ఏర్పాటు చేయనున్నట్లు టెస్లా ఏపీఏసీ (ఏషియా పసిఫిక్) రీజియన్ చీఫ్ ఇసాబెల్ ఫాన్ తెలిపారు. ముంబై, ఢిల్లీలో 4 చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

రెండు వేరియంట్లు..

మోడల్ వై రెండు వేరియంట్స్‌లో లభిస్తుంది. ఒకసారి చార్జ్ చేస్తే 500 కి.మీ. రేంజిని (మైలేజీ) ఇచ్చే రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్ బేస్ ధర రూ. 59.89 లక్షలుగా ఉంటుంది. 622 కి.మీ. రేంజినిచ్చే లాంగ్ రేంజ్ రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్ ధర రూ. 67.89 లక్షలుగా ఉంటుంది. 2025 మూడో త్రైమాసికం లేదా నాలుగో త్రైమాసికం నుంచి డెలివరీలు ప్రారంభమవుతాయి. దీన్ని కంప్లీట్లీ బిల్ట్ యూనిట్ (సీబీయూ)గా చైనాలోని తమ ప్లాంటు నుంచి టెస్లా దిగుమతి చేసుకుని, ఇక్కడ విక్రయిస్తుంది. ముందుగా ఢిల్లీ, ముంబై, గురుగ్రామ్‌లో డెలివరీలు, రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తామని కంపెనీ తెలిపింది. టెస్లా డిజైన్ స్టూడియో ద్వారా వాహనం లోపల, వెలుపల, అలాగే ఫీచర్లను కూడా కస్టమైజ్ చేసుకోవచ్చని పేర్కొంది. భారత్‌లో టెస్లా వాహనాలకు లిబర్టీ జనరల్ ఇన్సూరెన్స్, ఎకో జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలు బీమా కవరేజీని అందిస్తాయి.

ప్రత్యేకతలు..

- టాప్ స్పీడ్ గంటకు 201 కి.మీ.
- గంటకు 0 - 100 కి.మీ. వేగం 5.6 సెకన్లలో
- ఫాస్ట్ చార్జర్లతో 15 నిమిషాల్లో 267 కి.మీ. చార్జింగ్
- వెనుక కూర్చునే వారి కోసం ఎనిమిది అంగుళాల స్క్రీన్. 9 స్పీకర్లు
- వెలుపల ఎనిమిది కెమెరాలు
- డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టమ్స్
- ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్
- రెండు వేరియంట్లు. ఆరు రంగుల్లో లభ్యం
- వైర్‌లెస్ స్మార్ట్‌ఫోన్ కనెక్టివిటీ, వైర్‌లెస్ చార్జర్

జర్మన్ కార్లతో పోటీ..

దేశీ మార్కెట్లో మెర్సిడెస్–బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడి లాంటి జర్మన్ ఎలక్ట్రిక్ లగ్జరీ కార్లతో టెస్లా మోడల్ వై పోటీ పడనుంది. టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా లాంటి భారతీయ ఎలక్ట్రిక్ వాహనాల తయారీ సంస్థల కార్ల ధర రూ. 30 లక్షల లోపే ఉంటోంది. దేశీయంగా ఉత్పత్తి చేయడాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో భారత్ ప్రస్తుతం కార్ల దిగుమతులపై 70–100 శాతం వరకు సుంకాలు విధిస్తోంది. వీటిని తగ్గించాలని కోరుతున్న టెస్లా, దేశంలో ముందుగా తమ కార్లను అమ్ముకునేందుకు, సర్వీస్ చేసేందుకు అనుమతిస్తే, అమ్మకాలను బట్టి తయారీ చేపట్టే అవకాశాన్ని పరిశీలిస్తామంటూ టెస్లా చెబుతోంది. కానీ, ఏ ఒక్క కంపెనీకో ప్రయోజనం చేకూర్చేలా విధానాలు ఉండవని కేంద్రం స్పష్టం చేసింది. అయితే, ఎలక్ట్రిక్ కార్ల వినియోగాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో భారత్‌లో తయారీపై రూ. 4,150 కోట్ల వరకు ఇన్వెస్ట్ చేస్తామనే హామీ ఇచ్చే కంపెనీలు 15 శాతం సుంకానికే ఏటా 8,000 వరకు వాహనాలను దిగుమతి చేసుకునేందుకు వెసులుబాటు కల్పిస్తూ ప్రత్యేక పథకాన్ని ప్రకటించింది.

ధరలు ఇలా..
(కంపెనీ వెబ్‌సైట్ ప్రకారం..)

- మోడల్ వై రియర్ వీల్ డ్రైవ్ ధర రూ. 59.89 లక్షలు (ముంబై ఎక్స్–షోరూం). ఆన్‌రోడ్ ధర రూ. 61,07,190.
- మోడల్ వై లాంగ్ రేంజ్ రియర్ వీల్ డ్రైవ్ ధర రూ. 67.89 లక్షలు (ముంబై ఎక్స్–షోరూం). ఆన్‌రోడ్ ధర రూ. 69,15,190.
- బుకింగ్ అమౌంట్ రూ. 22,220గా (నాన్–రిఫండబుల్) ఉంటుంది. తుది ధ్రువీకరణ కోసం ఏడు రోజుల్లోగా మరో రూ. 3 లక్షలు చెల్లించాలి.
- ఫుల్ సెల్ఫ్ డ్రైవింగ్ (ఎఫ్ఎస్‌డీ) ఆప్షన్ కోసం అదనంగా రూ. 6 లక్షలు.
- అమెరికాలో నగదు రూపంలో చెల్లిస్తే లాంగ్ రేంజ్ రియర్ వీల్ డ్రైవ్ వేరియంట్ ధర 37,490 డాలర్లుగా (సుమారు రూ. 32.24 లక్షలు) ఉంది.

నాలుగు రోజుల నష్టాలకు బ్రేక్

- ఆటో, ఫార్మా షేర్లకు డిమాండ్
- సెన్సెక్స్ లాభం 317 పాయింట్లు

ముంబై: దేశీయ స్టాక్ సూచీలు మంగళవారం లాభాల్లో ముగిశాయి. జూన్ రిటైల్ ద్రవ్యోల్బణం ఆరేళ్ల కనిష్టానికి దిగిరావడంతో ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు ఆశలు చిగురించాయి. అంతర్జాతీయ మార్కెట్లో సానుకూల సంకేతాలు మన మార్కెట్‌కు దన్నుగా నిలిచాయి. దీంతో సూచీల 4 రోజుల నష్టాలకు బ్రేక్ పడింది. సెన్సెక్స్ 317 పాయింట్లు పెరిగి 82,571 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 113 పాయింట్లు బలపడి 25,196 వద్ద నిలిచింది. ఒక దశలో సెన్సెక్స్ 490 పాయింట్లు బలపడి 82,744 వద్ద, నిఫ్టీ 163 పాయింట్లు ఎగసి 25,245 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. ఆసియాలో కొరియా, జపాన్, హాంగ్‌కాంగ్ సూచీలు 1% లాభపడ్డాయి. యూరప్ సూచీలు అరశాతం నష్టపోయాయి. అమెరికా సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి.

- వినిమయ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. బీఎస్ఈ ఇండెక్సుల్లో ఆటో 1.50%, ఫార్మా 1.14%, వినిమయ, ఎఫ్ఎంసీజీ, 1%, రియల్టీ, సర్వీసెస్ అరశాతం చొప్పున పెరిగాయి.



- తొలి త్రైమాసిక నికర లాభం 10% క్షీణత నమోదుతో హెచ్‌సీఎల్ టెక్ షేరు 3% నష్టపోయి రూ.1,566 వద్ద నిలిచింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

జూన్‌లో ఎగుమతులు ఫ్లాట్ 35 బిలియన్ డాలర్లు	ఆదాయం తక్కువ.. క్రెడిట్ కార్డు ఉందిగా!

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ లాభం అప్



న్యూఢిల్లీ: హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం (2025–26, క్యూ1) లో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. నికర లాభం 14% పైగా ఎగసి రూ. 546 కోట్లను తాకింది. గతేడాది ఇదే కాలంలో రూ.478 కోట్లు ఆర్జించింది. నికర ప్రీమియం ఆదాయం రూ. 12,510 కోట్ల నుంచి రూ. 14,466 కోట్లకు జంప్ చేసింది.

హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ షేరు బీఎస్ఈలో 1 శాతం క్షీణించి రూ. 757 వద్ద ముగిసింది.

మేడిన్ ఇండియా 'కియా క్యారెన్స్ క్లావిస్'

ప్రారంభ ధర రూ. 17.99 లక్షలు



న్యూఢిల్లీ: వాహనాల తయారీ సంస్థ కియా ఇండియా, దేశీయంగా తయారు చేసిన తొలి ఎలక్ట్రిక్ వాహనం క్యారెన్స్ క్లావిస్ ఈవీని ఆవిష్కరించింది. ఇది 404 కి.మీ., 490 కి.మీ. రేంజిని ఇచ్చేలా రెండు బ్యాటరీ ఆప్షన్లలో లభిస్తుంది. ధరలు రూ. 17.99 లక్షల నుంచి రూ. 24.49 లక్షలుగా ఉంటుంది. ఫాస్ట్ చార్జర్‌తో 39 నిమిషాల్లోనే 10 నుంచి 80 శాతం వరకు చార్జింగ్ అవుతుందని కియా ఇండియా ఎండీ గ్వాంగూ లీ తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపూర్‌లోని ప్లాంటులో కియా ఈ కార్లను ఉత్పత్తి చేస్తుంది. కంపెనీ ప్రస్తుతం ఈవీ6, ఈవీ9 పేరిట రెండు ఎలక్ట్రిక్ వాహనాలను దిగుమతి చేసుకుని, విక్రయిస్తోంది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం–బయాలజీ
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం–జనరల్ స్టడీస్–తెలంగాణ హిస్టరీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం–ఇంగ్లిష్

ఇండియన్ నేవీలో కొలువులు

భారత నౌకాదళం.. ఇండియన్ నేవీ సివిలియన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐఎన్‌సెట్)-2025 నోటిఫికేషన్ విడుదల చేసింది. దీనిద్వారా ఇండియన్ నేవీలో వివిధ గ్రూప్ బి, గ్రూప్ సీ విభాగాల్లో మొత్తం 1,110 ఉద్యోగాల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఎంపికైన అభ్యర్థులకు దేశవ్యాప్తంగా ఉన్న నావెల్ యూనిట్స్‌లో పనిచేసే అవకాశం కల్పిస్తుంది. ఈ నేపథ్యంలో.. ఐఎన్‌సెట్ 2025తో భర్తీ చేసే పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

- **నోటిఫికేషన్:** ఇండియన్ నేవీ సివిలియన్ ఎంట్రెన్స్ టెస్ట్(ఐఎన్‌సెట్)–2025
- **మొత్తం పోస్టుల సంఖ్య:** 1,110



» ఐఎన్‌సెట్–2025 నోటిఫికేషన్ విడుదల చేసిన నేవీ
» మొత్తం 1,110 గ్రూప్ బి, సీ పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ
» టెన్త్, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణులు అర్హులు

పోస్టుల వివరాలు

స్టాఫ్ నర్స్,చార్జ్‌మెన్,ఫార్మసిస్ట్,కెమెరామెన్, స్టోర్ సూపరింటెండెంట్, ఫైర్ ఇంజన్ డ్రైవర్,ఫైర్‌మెన్, స్టోర్ కీపర్,ట్రేడ్స్‌మెన్ మేట్,పెస్ట్‌కంట్రోల్ వర్కర్, మల్టీటాస్కింగ్ స్టాఫ్, డ్రాఫ్ట్స్‌మెన్ తదితరాలు..

అర్హతలు

ఆయా పోస్టును అనుసరించి పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, ఇంజనీరింగ్ డిప్లొమా, ఫార్మసీ డిప్లొమా, డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు కొన్ని పోస్టులకు అనుభవం, తదితర సర్టిఫికెట్లు ఉండాలి.

వయసు

స్టాఫ్ నర్స్, లేడీ హెల్త్ విజిటర్‌కు గరిష్ట వయోపరిమితి 45 ఏళ్లు, చార్జ్‌మెన్‌కు 18–30 ఏళ్లు; ఫార్మసిస్ట్ 18–27 ఏళ్లు, కెమెరామెన్‌కు 20–35 ఏళ్లు; ఫైర్ ఇంజన్ డ్రైవర్, ఫైర్‌మెన్‌కు 18–27 ఏళ్లు; స్టోర్ కీపర్, సివిలియన్ మోటార్ డ్రైవర్ ఆర్డినరీ గ్రేడ్, ట్రేడ్‌మెన్ మేట్, పెస్ట్‌కంట్రోల్ వర్కర్, భండారీ 18–25 ఏళ్లు; మల్టీ టాస్కింగ్ స్టాఫ్‌కు 18 -25ఏళ్లు, డ్రాఫ్ట్స్‌మెన్(కన్‌స్ట్రక్షన్) 18–27 ఏళ్లు ఉండాలి. రిజర్వేషన్ వర్గాలకు గరిష్ట వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

వేతనాలు

గ్రూప్ బీ పోస్టులకు నెలకు రూ.35,400 -రూ.1,42,400 ; గ్రూప్ సీ పోస్టులకు నెలకు రూ.18,000- రూ.81,100 వేతన శ్రేణి లభిస్తుంది.

ఎంపిక ప్రక్రియ

కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, ట్రేడ్/స్కిల్ టెస్ట్, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

వంద మార్కులకు రాత పరీక్ష

వంద మార్కులకు కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ పరీక్ష నిర్వహిస్తారు. జనరల్ ఇంటెలిజెన్స్ 25 మార్కులకు, జనరల్ అవేర్‌నెస్ 25 మార్కులకు, క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ 25 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 90 నిమిషాలు. కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌లో అన్ రిజర్వ్‌డ్ అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులు, ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 30 శాతం మార్కులు సాధించాలి

ప్రిపరేషన్ ఇలా

- ఇంగ్లిష్‌లో ఎక్కువ స్కోర్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఇందులో రీడింగ్ కాంప్రహెన్షన్, గ్రామర్ నుంచి ప్రశ్నలు ఉంటాయి. వొకాబులరీ, సెంటెన్స్ కరెక్షన్, క్లోజ్ టెస్ట్, సెంటెన్స్ రీఅరేంజ్‌మెంట్, జంబుల్డ్ సెంటెన్సెస్, మిస్‌స్పెల్ట్ వర్డ్స్ తదితరాలపై ప్రశ్నలు వస్తాయి. దీనికోసం పదో తరగతి స్థాయి గ్రామర్ పుస్తకాల అధ్యయనంతోపాటు సాధ్యమైనన్ని మోడల్ ప్రశ్నలను ప్రాక్టీస్ చేయాలి.
- క్వాంటిటేటివ్ అప్టిట్యూడ్ విభాగంలో మంచి మార్కుల కోసం నంబర్ సిస్టమ్, కంప్యూటేషన్ ఆఫ్ హోల్ నంబర్స్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, రిలేషన్‌షిప్ బిట్వీన్ అర్థిమెటిక్ ఆపరేషన్స్, పర్సంటేజెస్, రేషియో అండ్ ప్రపోర్షన్స్, యావరేజెస్, ఇంటరెస్ట్, ప్రాఫిట్ అండ్ లాస్, డిస్కౌంట్, టేబుల్స్ అండ్ గ్రాఫ్స్,మెన్సురేషన్, టైమ్ అండ్ డిస్టెన్స్, రేషియో అండ్ టైమ్, టైమ్ అండ్ వర్క్‌లపై పట్టు సాధించాలి. 8, 9, 10వ తరగతి గణితం పాఠ్యపుస్తకాల ద్వారా ప్రాథమిక భావనలపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత సాధ్యమైనన్ని గత ప్రశ్నలు, మోడల్ ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి.
- జనరల్ ఇంటెలిజెన్స్ విభాగంలో.. వెర్బల్, నాన్ వెర్బల్ టైప్ ప్రశ్నలు అడుగుతారు. సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, స్పేస్ విజువలైజేషన్, ప్రాబ్లం సాల్వింగ్, అనాలసిస్, జడ్జిమెంట్, డెసిషన్ మేకింగ్, విజువల్ మెమొరీ, డిస్క్రిమినేటింగ్ అబ్జర్వేషన్, రిలేషన్‌షిప్ కాన్సెప్ట్స్, ఫిగర్ క్లాసిఫికేషన్, అరిథమెటికల్ నంబర్ సిరీస్, నాన్ వెర్బల్ సిరీస్‌పై అవగాహన పెంచుకోవాలి.
- జనరల్ అవేర్‌నెస్‌లో విభాగం కోసం జాతీయ, అంతర్జాతీయ కరెంట్ అఫైర్స్‌ను తెలుసుకోవాలి. క్రీడలు, చరిత్ర, సంస్కృతి, జాగ్రఫీ, ఎకానమీ, జనరల్ పాలిటీ, భారత రాజ్యాంగం, శాస్త్ర సాంకేతిక పరిశోధనలు తదితర అంశాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. దీనికోసం ఏదైనా ప్రామాణిక దినపత్రికను అనుసరిస్తే సరిపోతుంది.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:** 18.07.2025
- **వెబ్‌సైట్:** www.joinindiannavy.gov.in

జాబ్ పాయింట్

బీహెచ్ఈఎల్‌లో 515 ఆర్టిసన్ గ్రేడ్–4 పోస్టులు

భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(బీహెచ్ఈఎల్).. వివిధ యూనిట్లలో ఆర్టిసన్ గ్రేడ్–4 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 515.
» **ఖాళీల వివరాలు:** ఫిట్టర్–176, వెల్డర్–97, టర్నర్–51, మెషినిస్ట్–104, ఎలక్ట్రీషియన్–65,ఎలక్ట్రానిక్స్ మెకానిక్–18,ఫౌండ్రీమన్–4.
» **అర్హత:** జనరల్, ఓబీసీ అభ్యర్థులకు కనీసం 60 శాతం, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 55 శాతం మార్కులతో పదో తరగతి ఉత్తీర్ణతతో పాటు ఐటీఐ/ఎన్‌టీసీ+ఎన్ఏసీ కలిగి ఉండాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి జనరల్/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు 27 ఏళ్లు, ఓబీసీ అభ్యర్థులకు 30 ఏళ్లు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 32 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.29,500 నుంచి రూ.65,000+ఇతర అలవెన్సులు(ఎంపికైన అభ్యర్థులు తాత్కాలిక ఉద్యోగులుగా ఒక సంవత్సరం పాటు కనీసం వేతనంతో పనిచేయాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఆర్టిసన్ గ్రేడ్–4గా రెగ్యులర్ చేస్తారు).
» **ఎంపిక విధానం:** రెండు దశల్లో ఎంపిక చేస్తారు. స్టేజ్–1 కంప్యూటర్ ఆధారిత పరీక్ష, స్టేజ్–2 స్కిల్ టెస్ట్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 16.07.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.08.2025
» **సీబీటీ పరీక్ష తేది:** సెప్టెంబర్ రెండో వారంలో
» **వెబ్‌సైట్:** http://careers.bhel.in

సీసీఆర్ఏఎస్, న్యూఢిల్లీలో 394 గ్రూప్–ఏ, బీ, సీ పోస్టులు

న్యూఢిల్లీలోని సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ ఆయుర్వేదిక్ సైన్సెస్(సీసీఆర్ఏఎస్) ..వివిధ విభాగాల్లో గ్రూప్–ఏ, బీ, సీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 394.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, ఎండీ/ఎంఎస్, ఎంఫార్మ్, బీఎస్సీ, ఎంఎస్సీ, ఎంఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 27 నుంచి 40 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు గ్రూప్–ఏ పోస్టులకు రూ.15,600 నుంచి రూ.39,100, గ్రూప్–బీ పోస్టులకు రూ.9,300 నుంచి రూ.34,800, గ్రూప్–సీ పోస్టులకు రూ.9,300 నుంచి రూ.34,800.
» **ఎంపిక విధానం:** సీబీటీ, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.08.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.08.2025
» **వెబ్‌సైట్:** https://ccras.nic.in

ఎస్‌బీఐలో 37 స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టులు

ముంబైలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ).. ఒప్పంద/రెగ్యులర్ ప్రాతిపదికన స్పెషలిస్ట్ కేడర్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 37.
» **పోస్టుల వివరాలు:** జనరల్ మేనేజర్–01, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్–28, డిప్యూటీ మేనేజర్ –18.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీఈ/ బీటెక్, ఎంటెక్, ఎంసీఏలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** జనరల్ మేనేజర్‌కు 45 నుంచి 55 ఏళ్లు, అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్‌కు 33 నుంచి 45 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 25 నుంచి 35 ఏళ్లు ఉండాలి
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.07.2025.
» **వెబ్‌సైట్:** https://sbi.co.in

హెచ్ఆర్ఆర్ఎల్, రాజస్థాన్‌లో 131 ఎగ్జిక్యూటివ్ పోస్టులు

రాజస్థాన్‌లోని హెచ్‌పీసీఎల్ రాజస్థాన్ రిఫైనరీ లిమిటెడ్(హెచ్ఆర్ఆర్ఎల్).. వివిధ విభాగాల్లో ఎగ్జిక్యూటివ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 131.
» **విభాగాలు:** సివిల్, ఫైర్ అండ్ సేఫ్టీ, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఎలక్ట్రికల్, మెకానికల్, కెమికల్, లీగల్, ఫైనాన్స్, హెచ్ఆర్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పీజీ, ఎంబీబీఎస్, బీటెక్, డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** జూనియర్ ఎగ్జిక్యూటివ్, అసిస్టెంట్ ఆఫీసర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజనీర్‌కు 25 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 42 ఏళ్లు, మెడికల్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, ఆఫీసర్, లీగల్ ఇంజనీర్‌కు 29 ఏళ్లు, సీనియర్ ఇంజనీర్, సీనియర్ ఆఫీసర్, కంపెనీ సెక్రటరీ 34 ఏళ్లు ఉండాలి.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ బేస్డ్ టెస్ట్, స్కిల్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక చేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.08.2025
» **వెబ్‌సైట్:** https://hrrl.in

కొంకణ్ రైల్వేలో 79 గ్రూప్–డి పోస్టులు

కొంకణ్ రైల్వే కార్పొరేషన్ లిమిటెడ్(కేఆర్‌సీఎల్) గ్రూప్–డి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 79.
» **పోస్టుల వివరాలు:** ట్రాక్ మెయింటైనర్–35, పాయింట్స్ మెన్–44.
» **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 18 నుంచి 45 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.18,000.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 23.07.2025.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.08.2025
» **వెబ్‌సైట్:** https://konkanrailway.com

ఆర్‌సీఎఫ్ఎల్, ముంబైలో 74 పోస్టులు

ముంబైలోని రాష్ట్రీయ కెమికల్స్ అండ్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్(ఆర్‌సీఎఫ్ఎల్).. వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 74.
» **పోస్టుల వివరాలు:** ఆపరేటర్(కెమికల్) ట్రైనీ–54, బాయిలర్ ఆపరేటర్ గ్రేడ్3–03, జూనియర్ ఫైర్‌మెన్ గ్రేడ్ 2–02, నర్స్ గ్రేడ్2–01, టెక్నీషియన్(ఇన్‌స్ట్రుమెంటేషన్) ట్రైనీ–04, టెక్నీషియన్(ఎలక్ట్రికల్)ట్రైనీ–02, టెక్నీషియన్(మెకానికల్) ట్రైనీ–08.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ, పదో తరగతి,ఇంటర్,డిప్లొమాలో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 01.02.2025 నాటికి 33 నుంచి 38 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:**నెలకు ఆపరేటర్‌కు రూ.22,000 నుంచి రూ.60,000, బాయిలర్ ఆపరేటర్‌కు రూ. 20,000 నుంచి రూ.55,000, జూనియర్ ఫైర్‌మెన్‌కు రూ.18,000 నుంచి రూ42,000, నర్స్ గ్రేడ్–2కు రూ.22,000 నుంచి రూ. 60,000, టెక్నీషియన్‌కు రూ.22,000 నుంచి 60,000.
» **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ టెస్ట్/స్కిల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.07.2025
» **వెబ్‌సైట్:** https://www.rcfltd.com

19న శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల అక్టోబర్ కోటా విడుదల

తిరుమల: తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన అక్టోబర్ కోటాను జూలై 19 ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. జూలై 21 ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఈ టికెట్లు పొందిన వారు జూలై 21 నుంచి 23 మధ్యాహ్నం 12 గంటల లోపు సొమ్ము చెల్లిస్తే లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్రదీపాలంకార సేవ, వార్షిక పుష్ప యాగం టికెట్లను జూలై 22న, అదేరోజు మధ్యాహ్నం 3 గంటలకు వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన కోటాను విడుదల చేస్తారు. ఇక జూలై 23న అంగప్రదక్షిణం టోకెన్ల కోటా, అనంతరం శ్రీవాణి టికెట్ల ఆన్‌లైన్ కోటా, మధ్యాహ్నం 3 గంటలకు వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను ఆన్‌లైన్‌లో విడుదల చేస్తుంది. అక్టోబర్ నెలకు సంబంధించి ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను జూలై 24న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది. . భక్తులు https://ttdevasthanams.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా శ్రీవారి ఆర్జిత సేవలు, దర్శన టికెట్లు బుక్ చేసుకోవచ్చు.

చిరుత కోసం కలెక్టర్, ఎస్పీ గాలింపు



గుర్రంగట్టుపైకి వెళ్తున్న కలెక్టర్ విజయేందిర

మహబూబ్‌నగర్ న్యూటౌన్: రెండు వారాలుగా మహబూబ్‌నగర్ పట్టణవాసులను హడలెత్తిస్తున్న చిరుత ఆచూకీ కోసం ఏకంగా కలెక్టర్, ఎస్పీ రంగంలోకి దిగారు. వీరన్నపేట, సున్నంబట్టి ప్రాంతాల్లో చిరుత సంచరిస్తోందని, తమకు రక్షణ కల్పించాలని స్థానికులు సోమవారం కలెక్టర్‌కు విన్నవించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ విజయేందిర బోయి, ఎస్పీ జానకి, డీఎఫ్‌వో సత్యనారాయణ వీరన్నపేట, గుర్రంగట్టు ప్రాంతాల్లో మున్సిపల్ అధికారులతో కలిసి గుట్టపై కాలినడకన కలియతిరిగారు. చిరుతను పట్టుకోవడంలో సాధ్యాసాధ్యాలను అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అటవీ, పోలీస్, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో బృందాలను ఏర్పాటు చేసి 24 గంటలూ పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు.

గ్రేట్ ఫ్లాటెనింగ్... ఇప్పుడు ట్రెండింగ్



సాక్షి, హైదరాబాద్ : ప్రస్తుతం కంపెనీలు, ఆయా సంస్థల్లోని వ్యవస్థలు వేగంగా మారిపోతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులుచేర్పులతో ఆర్థిక ఒత్తిళ్లు, సాంకేతికతలో పెరుగుతున్న వినియోగం, విధుల నిర్వహణలో సమర్థత సాధనకు కృషి అనే ఈ మూడు ప్రధాన అంశాల ప్రభావంతో సంస్థల నిర్మాణ విధానంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో కంపెనీలు, సంస్థల్లో మధ్యస్థ మేనేజర్ల (మిడిల్ మేనేజ్‌మెంట్) పాత్ర కొత్తగా నిర్వచించాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇందుకు తగ్గట్టుగానే టెక్నాలజీ రోజురోజుకూ వేగంగా మారుతోంది. ఆ మార్పు ఉత్పత్తుల స్థాయిలోనే కాకుండా, సంస్థల అంతర్గత నిర్మాణంలోనూ జరుగుతోంది. ఇప్పుడు చోటుచేసుకుంటున్న పరిణామాల్లో 'గ్రేట్ ఫ్లాటెనింగ్' అన్న పదం సిలికాన్ వ్యాలీలోనే కాదు..ప్రపంచవ్యాప్తంగా ఐటీ కంపెనీల్లో మారుతున్న ట్రెండ్‌కు సంకేతంగా నిలుస్తోంది. ఇందులో భాగంగా మధ్యస్థ మేనేజ్‌మెంట్ స్థాయిని తగ్గిస్తూ, నిర్ణయాలు తీసుకునే మార్గాన్ని వేగవంతం చేయాలనే లక్ష్యంతో టెక్ దిగ్గజాలు ముందుకు సాగుతున్నాయి. టెక్ కంపెనీలు సైతం తాము స్టార్టప్‌ల సెటప్ మాదిరిగా పనిచేయాలనే మానసిక స్థితిలో చిన్న బృందాలుగా, తక్కువ సంఖ్యలో మేనేజర్లతో ఎక్కువ ఉత్పాదకతను సాధించే లక్ష్యంతో ముందుకెళుతున్నాయి. చాట్‌బాట్‌లు, డేటా ఎనలిటిక్స్, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ టూల్స్ వంటి వినియోగంతో మానవ వనరుల నిపుణుల అవసరం తగ్గుతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

మిడిల్ మేనేజ్‌మెంట్‌కు సవాళ్లు	కొత్తగా మధ్యస్థ మేనేజర్ల పాత్ర నిర్వచించాల్సిన ఆవశ్యకత	వీరి స్థాయిని తగ్గిస్తూ వేగవంత నిర్ణయాల లక్ష్యంతో టెక్ దిగ్గజాలు ముందుకు..

ఇదే బాటలో దిగ్గజ కంపెనీలు

మైక్రోసాఫ్ట్, అమెజాన్, మెటా, గూగుల్, ఇంటెల్ వంటి కంపెనీలు సైతం సంస్థాగత వ్యవస్థలను పునర్‌వ్యవస్థీకరిస్తూ మార్పులు తీసుకొస్తున్నాయి. కొన్ని ప్రముఖ కంపెనీలు, సంస్థలు ఇప్పటికే ఈ మార్పులకు అనుగుణంగా మధ్యస్థ మేనేజర్ల పాత్రను కొత్తగా రూపుదిద్దేలా చర్యలు చేపట్టాయి. కృత్రిమ మేధ, ఆటోమేషన్ వంటి వాటిని ప్రవేశపెట్టి, మధ్యస్థ స్థాయి మేనేజ్‌మెంట్ పాత్రను తగ్గించేశాయి. దీని వల్ల నిర్ణయాలు వేగంగా తీసుకునే అవకాశం ఏర్పడడంతో పాటు మేనేజర్లను వ్యూహాత్మక విధానాల్లోకి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నాయి.

అనుకూల అంశాలు

- ✔ **సమర్థత, వేగవంతమైన నిర్ణయాలు:** బ్యూరోక్రసీని తగ్గించి, చిన్న బృందాలు స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునేలా చేయాలన్నదే లక్ష్యం. దీంతో ప్రాజెక్టులు వేగంగా పూర్తవుతాయి. మార్కెట్‌కు అనుగుణంగా వేగంగా స్పందించొచ్చు
- ✔ **వ్యయాల తగ్గింపు :** ఉద్యోగుల జీతాలు, ముఖ్యంగా మేనేజ్‌మెంట్ స్థాయిలో అధికంగా ఉండటంతో వాటిని తగ్గించడం ద్వారా కంపెనీలకు ప్రయోజనాలు చేకూరుతాయి. తాజా ఆర్థిక సంక్షోభ పరిస్థితుల్లో ఇది కీలకంగా మారింది.
- ✔ **ఇన్నోవేషన్‌కు మద్దతు:** మధ్యస్థ మేనేజ్‌మెంట్ లేకపోతే, నిర్ణయాలు తీసుకునే అధికారాన్ని నేరుగా పని చేసే ఉద్యోగులకు ఇవ్వొచ్చు. దీనివల్ల సృజనాత్మకత పెరిగే అవకాశముంది

ప్రతికూల అంశాలు

- ✘ **మిగిలిన మేనేజర్లపై పనిభారం :** తగ్గిన మేనేజ్‌మెంట్ వ్యవస్థకు ప్రత్యామ్నాయం లేకపోవడం వల్ల మిగిలిన వారిపై అధిక పనిఒత్తిడి పెరుగుతోంది. ఇది 'బర్నౌట్'కు దారితీయొచ్చు
- ✘ **నాయకత్వలోపం :** తొలగించిన మేనేజ్‌మెంట్‌ల స్థాయిల కారణంగా లీడర్‌షిప్ గ్యాప్ ఏర్పడి, టీమ్‌ల పనితీరు దెబ్బతినే అవకాశముంది
- ✘ **సీనియర్ స్థాయిలో మైక్రో మేనేజ్‌మెంట్ :** మధ్యస్థ స్థాయి లేకపోతే, టాప్ లెవల్ లీడర్‌షిప్ చిన్న విషయాల దాకా జోక్యం చేసుకోవడం వల్ల ఇది వ్యతిరేక ఫలితాన్నే కలిగించొచ్చు.
- ✘ **ప్రమోషన్ అవకాశాల తగ్గుదల :** మంచి ప్రతిభ కనబరిచే వారికి మధ్యస్థ మేనేజర్ స్థాయికి చేరే అవకాశాలు తగ్గి.. కెరీర్ ఎదుగుదలకు బ్రేకులు పడే ప్రమాదం.

సవాళ్లు ఎదురవుతున్నా.. అనేక కొత్త అవకాశాలు అందుబాటులోకి



కంపెనీలు, సంస్థలు నిర్వహణ వ్యయాన్ని తగ్గిస్తూ, కార్యకలాపాల్లో సమర్థత పెంపుదల కోసం మార్గాలు వెతుకుతున్నాయి. ఇప్పుడు ఎక్కువ కంపెనీలు ఫ్లాట్ (అంటే తక్కువ మేనేజ్‌మెంట్ లేయర్లతో కూడిన) సంస్థలుగా మారుతున్నాయి. దీనివల్ల వేగంగా నిర్ణయాలు తీసుకునే అవకాశం కలుగుతుంది. ఈ మార్పుల నేపథ్యంలో మధ్యస్థ మేనేజర్లు అధికంగా ప్రభావితం అవుతున్నారు. వారికి సవాళ్లు ఎదురవుతున్నా, అనేక అవకాశాలు కూడా అందుబాటులో వస్తున్నాయి.

– వెంకారెడ్డి, చీఫ్ పీపుల్ ఆఫీసర్, క్వాలీ జీల్ ఐఎన్‌సీ

డ్రగ్స్ పెడ్లర్లుగా పోలీసుల సుపుత్రులు

- సైబరాబాద్ డీసీపీ కొడుకు మోహన్ అరెస్టు.. ఇప్పటికే పోలీసుల అదుపులో ఓ ఎస్‌ఐబీ ఓఎస్డీ కుమారుడు
- మల్నాడు కిచెన్ యజమాని, డ్రగ్ పెడ్లర్ సూర్యతో వీరికి లింకులు
- దర్యాప్తులో గుర్తించిన సైబరాబాద్ ఈగల్ టీం

సాక్షి, హైదరాబాద్: ఒకవైపు మాదక ద్రవ్యాల రవాణాపై పోలీసులు ఉక్కుపాదం మోపుతుంటే.. మరోవైపు వారి కొడుకులే డ్రగ్స్ పెడ్లర్లుగా దందా నిర్వహిస్తున్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్‌లో ఓ డీసీపీ కుమారుడు మోహన్‌ను డ్రగ్స్ కేసులో సైబరాబాద్ ఈగల్ పోలీసులు అరెస్టు చేశారు. ఇంటెలిజెన్స్ వింగ్ (ఎస్‌ఐబీ) ఓఎస్డీ కొడుకు రాహుల్‌తేజను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఇటీవల అరెస్టయిన కొంపల్లిలోని మల్నాడు కిచెన్ యజమాని, అంతర్రాష్ట్ర డ్రగ్ పెడ్లర్ సూర్య అమ్మినేని సెల్‌ఫోన్ కాల్ డేటా, ఇతరత్రా సాంకేతిక ఆధారాలను విశ్లేషించగా.. వీరికి సూర్యతో సత్సంబంధాలు ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. నిందితుల సెల్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లను స్వాధీనం చేసుకున్న ఈగల్ బృందం వాటిని విశ్లేషిస్తోంది. వీరికి ఎంతమంది సెలబ్రిటీలు, ప్రముఖులతో లింక్‌లు ఉన్నాయో ఈగల్ పోలీసులు రట్టు చేసే పనిలో పడ్డారు.

గుట్టు రట్టయిందిలా..

డ్రగ్స్ కేసులో సూర్యతో సహా అరుగురిని అరెస్టు తర్వాత పోలీసులు వారి నెట్‌వర్క్‌పై దృష్టి పెట్టారు. సాంకేతిక ఆధారాలను ముమ్మరం చేయగా ఈ క్రమంలో ఎస్‌ఐబీ అధికారి కొడుకు రాహుల్‌తేజ పాత్ర తెరపైకి వచ్చింది. డ్రగ్స్ వ్యవహారంలో తేజ పాత్రపై లోతుగా దర్యాప్తు చేయగా, మరికొన్ని సంచలన విషయాలు బయట పడ్డాయి. గతేడాది జనవరిలో డ్రగ్స్ కేసులో నిజామాబాద్ పోలీసులు నాగ్‌పూర్–హైదరాబాద్ మార్గంలో కొకైన్, ఎండీఎంఏ రవాణా చేస్తుండగా విక్రం, ఖాజా మొహిద్దీన్‌లను పట్టుకున్నారు. వీరిని విచారించగా.. ఢిల్లీ, పంజాబ్, హిమాచల్ ప్రదేశ్‌లకు చెందిన ప్రధాన మాదక ద్రవ్యాల సరఫరాదారులకు తేజనే నిందితులకు పరిచయం చేశాడని ఆ ఇద్దరూ అంగీకరించారు. దీంతో నిజామాబాద్ పోలీసులు ఎఫ్‌ఐఆర్‌లోనూ ఏ–3గా తేజ పేరును చేర్చారు. కానీ, ఎప్పుడూ అరెస్టు చేయలేదు. పరారీలో ఉన్నట్టు పేర్కొన్నారు. తేజ హైదరాబాద్‌లో ఒక రెస్టారెంట్‌ను సైతం నడుపుతున్నాడు.

EAGLE
Elite Action Group
For Drug Law Enforcement

ముందస్తు బెయిల్ కూడా లేదు..

రాహుల్‌తేజ ఎస్‌ఐబీ ఓఎస్డీ కొడుకు కావడంతోనే గతంలో పోలీసులు అతన్ని అరెస్ట్ చేయకుండా జాప్యం చేశారనే విషయాన్ని సైబరాబాద్ ఈగల్ అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఇప్పటికే ఇద్దరు నిందితులపై న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేసిన నిజామాబాద్ పోలీసులు.. తేజపై మాత్రం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. ఇప్పటికే ఏ–3గా తేజ ఉన్నా, కనీసం బెయిల్ లేదా ముందస్తు బెయిల్ కూడా తీసుకోలేదంటే నిందితుడికి పోలీసులు ఎలా సహకరించారో స్పష్టమవుతుందని ఈగల్ అధికారులు అంటున్నారు. ఈ వ్యవహారాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అతడిపై చర్యలు తీసుకునేందుకు అధికారులు రెడీ అవుతున్నారు. అయితే, తాజాగా సూర్య అమ్మినేని కేసులో అరెస్టు చేస్తారా లేదా నిజామాబాద్ కేసులలో అరెస్టు చేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది.

సోదరుడికి పునర్జన్మనిచ్చిన సోదరి

- అప్లాస్టిక్ ఎనీమియాతో 11 ఏళ్ల బాలుడికి నరకం
- తన మూలకణాలు దానం చేసిన పదేళ్ల చెల్లెలు
- కొండాపూర్ కిమ్స్ కడల్స్‌లో అరుదైన చికిత్స



అరుదైన శస్త్రచికిత్సలో పాల్గొన్న వైద్య బృందం, రోగి, కుటుంబ సభ్యులు

గచ్చిబౌలి: ప్రాణాంతక వ్యాధితో బాధపడుతున్న సోదరుడికి తన సోదరి పునర్జన్మ ప్రసాదించింది. అప్లాస్టిక్ ఎనీమియా (ఎముక మజ్జ తగినంత కొత్త రక్త కణాలను తయారు చేయకపోవటం వల్ల వచ్చే వ్యాధి) అనే అరుదైన సమస్యతో బాధ పడుతున్న 11 ఏళ్ల బాలుడికి అతడి పదేళ్ల చెల్లెలి మూలకణాలతో కొండాపూర్‌లోని కిమ్స్ కడల్స్ ఆస్పత్రిలో విజయవంతంగా చికిత్స అందించారు. చికిత్స వివరాలను మంగళవారం ఆస్పత్రికి కన్సల్టెంట్ పీడియాట్రిక్ హెమటాలజిస్ట్, బోన్‌మారో ట్రాన్స్‌ప్లాంట్ నిపుణులు డాక్టర్ చందన మారెడ్డి మీడియాకు వివరించారు. వరంగల్ జిల్లాకు చెందిన బాధితుడు ఆస్పత్రికి వచ్చే సమయానికి తీవ్రమైన జ్వరంతో బాధపడుతున్నాడు. పైపెచ్చు రక్తంలో హిమోగ్లోబిన్, ప్లేట్‌లెట్లు, న్యూట్రోఫిల్స్ బాగా తక్కువ స్థాయిలో ఉన్నాయి. వైద్య పరీక్షల్లో అతడికి సివియర్ అప్లాస్టిక్ ఎనీమియా ఉన్నట్లు గుర్తించారు. ఇలాంటి సమయంలో సాధారణంగా బోన్‌మారో (రక్తమూలుగ మార్పిడి) చికిత్స చేస్తారు. కానీ, దాని వల్ల ఇతర సమస్యలు వస్తాయి. దీంతో అతడికి తన చెల్లెలి రక్తంలోంచి మూలకణాలు సేకరించి ఎక్కించారు. అంతర్జాతీయ ప్రొటోకాల్స్‌కు అనుగుణంగా చెల్లెలి మూలకణాలు పూర్తిస్థాయిలో మ్యాచ్ కాకపోయినా ఇతడికి ఎక్కించారు. ఇలాంటి సందర్భాల్లో చాలా సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. కానీ ఆ బాలుడు చాలా ధైర్యంగా చికిత్సకు సానుకూలంగా స్పందించటంతో ఎలాంటి సమస్యలు రాలేదని చందన మారెడ్డి తెలిపారు. బాధిత కుటుంబం ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉండడంతో ఆస్పత్రి నుంచి భారీగా రాయితీలు ఇచ్చి చికిత్స చేశామని వైద్య బృందం తెలిపింది. బాలుడు కోలుకోవటంతో మూడు వారాల తర్వాత డిశ్చార్జి చేసినట్లు డాక్టర్ చందన మారెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు డాక్టర్ అవినాశ్, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ విద్య, తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఈఎన్సీ మురళీధర్‌రావు అరెస్ట్

- ఆదాయానికి మించిన ఆస్తుల కేసు
- హైదరాబాద్, కరీంనగర్, జహీరాబాద్, వరంగల్‌లో ఏసీబీ సోదాలు..
- గుర్తించిన ఆస్తుల విలువ బహిరంగ మార్కెట్లో రూ.వందకోట్లపైనే..

సాక్షి, హైదరాబాద్/జహీరాబాద్:/కరీంనగర్ క్రైం: గత ప్రభుత్వంలో నీటిపారుదల శాఖలో కీలకంగా వ్యవహరించిన మాజీ ఈఎన్సీ సి.మురళీధర్ రావుపై అవినీతి నిరోధకశాఖ (ఏసీబీ) ఆదాయానికి మించి ఆస్తుల కేసు నమోదు చేసింది. దర్యాప్తులో భాగంగా ఏసీబీ బృందాలు మంగళవారం తెల్లవారుజాము నుంచి ఏకకాలంలో మురళీధర్‌రావు నివాసంతోపాటు బంధువుల ఇల్లు, కార్యాలయాలు కలిపి మొత్తం 12 చోట్ల సోదాలు చేపట్టాయి. బంజారాహిల్స్ రోడ్ నంబర్ 5లోని లోటస్ రొల్దనాలోని మురళీధర్ నివాసం, కొండాపూర్‌లోని వసెల్ల మిడోస్ విల్లా, కరీంనగర్, జహీరాబాద్‌లో రాత్రి వరకు సోదాలు కొనసాగినట్లు ఏసీబీ డీజీ కార్యాలయం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సోదాల్లో భారీగా ఆస్తుల పత్రాలు, బంగారం, బ్యాంకు డిపాజిట్లకు సంబంధించిన పత్రాలు స్వాధీనం చేసుకున్నట్టు పేర్కొంది. మురళీధర్‌ను అరెస్టు చేసిన అధికారులు వైద్య పరీక్షల అనంతరం ఏసీబీ స్పెషల్ కోర్టులో హాజరుపరిచారు. అనంతరం కోర్టు జ్యుడీషియల్ రిమాండ్ విధించింది.

సోదాల్లో గుర్తించిన ఆస్తులివీ... : హైదరాబాద్‌లో ఒక కమర్షియల్ భవనం, కొండాపూర్‌లో ఒక విల్లా, బంజారాహిల్స్‌లో ఒక ఫ్లాట్, యూసుఫ్‌గూడలో ఒక ఫ్లాట్, బేగంపేటలో ఒక ఫ్లాట్, కోకాపేటలో ఒక ఫ్లాట్, కరీంనగర్‌లో ఒక కమర్షియల్ భవనం, కోదాడలో ఒక అపార్ట్‌మెంట్, జహీరాబాద్‌లో 2 మెగావాట్ల సోలార్ పవర్ ప్రాజెక్టు, వరంగల్‌లో నిర్మాణంలో ఉన్న ఒక అపార్ట్‌మెంట్, 11 ఎకరాల వ్యవసాయ భూమి, హైదరాబాద్‌లోని నాలుగు ఖరీదైన ఓపెన్ ప్లాట్లు, మోకిలాలో 6500 చదరపు గజాల స్థలం, మెర్సిడెస్ బెంజ్ సహా మూడు కార్లు, బంగారు ఆభరణాలు, ఇతర బ్యాంకు డిపాజిట్లు ఉన్నాయి. ఈ ఆస్తుల మార్కెట్ విలువ బహిరంగ మార్కెట్‌లో రూ.వంద కోట్లకుపైనే ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఏసీబీ సోదాలు బుధవారం కూడా కొనసాగే అవకాశం ఉంది.



మురళీధర్ ఇంట్లో సోదాలు చేస్తున్న అధికారులు

ట్రాఫికింగ్‌పై ఎన్‌ఐఏ ముమ్మర దర్యాప్తు

సాక్షి ఎఫెక్ట్..

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: థాయ్‌లాండ్‌లోని సైబర్ కేఫ్‌ల కేంద్రంగా సాగుతున్న మానవ అక్రమ రవాణా కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) విచారణ ముమ్మరం చేసింది. ఈ దందాలో తొలికేసు నమోదైన కరీంనగర్ జిల్లా మానకొండూరులో మంగళవారం వివరాలు సేకరించారు. ఎన్‌ఐఏ అధికారులు ఈ కేసులో బాధితులతోపాటు దర్యాప్తు అధికారి ఇన్‌స్పెక్టర్ సంజీవ్‌తో మాట్లాడారు. పోలీస్‌స్టేషన్ సిబ్బందిని బయటికి పంపి.. బాధితులను దాదాపు గంటపాటు విచారించారు. థాయ్‌లాండ్ ఎందుకు వెళ్లారు? సైబర్ కేఫ్‌లో రిక్రూట్‌మెంట్ ఎలా జరిగింది? మయన్మార్ సరిహద్దు ఎలా దాటారు అనే విషయాలపై బాధితులు ఎన్‌ఐఏకి కూలంకషంగా వివరాలు అందించారు. ప్రధాన నిందితుడు హితేశ్‌ను ఇటీవల మానకొండూరు పోలీసులు ఢిల్లీ విమానాశ్రయంలో అదుపులోకి తీసుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో మరో సూత్రధారి రాజశేఖర్ ఉద్యోగాల పేరిట బాధితులను మోసంచేసి థాయ్‌లాండ్ ఎలా తీసుకెళ్తాడు? అన్న విషయంపైనా ఎన్‌ఐఏ ఒక అవగాహనకు వచ్చింది. ప్రస్తుతం రాజశేఖర్ థాయ్‌లాండ్, మయన్మార్‌లో లేడని, అతను లావోస్‌లో మారుపేరుతో తలదాచుకుంటున్నాడని బాధితులు ఎన్‌ఐఏకి వివరించారు. థాయ్‌లాండ్ సైబర్ కేఫ్‌లలో బందీలుగా చిక్కిన వారి విషయమై 'సాక్షి'వరుస కథనాలు, తదనంతర పరిణామాల నేపథ్యంలో 539 భారతీయ బందీల కేంద్రం సురక్షితంగా భారత్‌కు తీసుకొచ్చిన విషయం తెలిసిందే.

అందాల జలపాతం.. సందర్శన నిషేధం



దట్టమైన అడవి.. ఎత్తయిన గుట్టల నుంచి జాలువారుతున్న జలపాతం అందాల్ని చూడాలంటే రెండుకళ్లు చాలవు. గట్టు సింగారం గుట్టల పైనుంచి జాలువారి గౌరీగుండాల వద్ద జలపాతంగా మారి ప్రకృతి ప్రేమికుల మదిని మురిపిస్తోంది పెద్దపల్లి జిల్లా సబ్బితం గ్రామ శివారులోని జలపాతం. ఈ అందాలను ఆస్వాదించేందుకు పర్యాటకులు జిల్లాలు దాటి వస్తారు. అయితే ఈ జలపాతంపై అధికారులు దృష్టి సారించడం లేదు. అభివృద్ధి చేస్తామని అధికారులు, పాలకులు చెబుతున్నా ఆచరణలోకి రావడం లేదు. అభివృద్ధి కాదు కదా.. అసలు జలపాతం సందర్శన నిషేధమని పోలీసులు బోర్డులు పెట్టేశారు. జిల్లాకే తలమానికంగా మారిన గౌరీగుండాల జలపాతం వద్ద మౌలిక వసతులు కల్పిస్తే పర్యాటకంగా అభివృద్ధి చెందుతుందని జిల్లావాసులు చెబుతున్నారు. పర్యాటకులు జలపాతం వరకు వెళ్లేందుకు దారి కూడా సరిగా లేదు. ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకొని పర్యాటకంగా అభివృద్ధి చేయాలని కోరుతున్నారు. –సాక్షి ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.

సాక్షి ప్లస్
బుధవారం । 16-7-2025

గతేడాది 357 మంది మావోల మృతి

చనిపోయిన వారిలో పార్టీ సానుభూతిపరుడి నుంచి జనరల్ సెక్రటరీ వరకు..

నక్సల్బరీ పోరాటంలో గతేడాది భారీ నష్టాలు

గెరిల్లా యుద్ధతంత్రంలో కొత్త ఎత్తుగడల అమలుకు శ్రీకారం

వెలుగులోకి వచ్చిన మావోయిస్టు కేంద్ర కమిటీ డాక్యుమెంట్


ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు నిర్వహించిన సభ, హాజరైన ప్రజలు (ఫైల్)

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గతేడాది కాలంలో సానుభూతిపరుడి నుంచి జనరల్ సెక్రటరీ నంబాల కేశవరావు వరకు మొత్తం 357 మంది మావోయిస్టులు చనిపోయారు. మావోయిస్టు పార్టీ సెంట్రల్ కమిటీ (సీసీ) పేరిట గత జూన్ 23న రాసిన 22 పేజీల డాక్యుమెంట్‌లో ఈ వివరాలు స్పష్టంగా ఉన్నాయి. ఈ డాక్యుమెంట్ మంగళవారం వెలుగులోకి వచ్చింది. అందులోని వివరాల ప్రకారం...బూటకపు ఎన్‌కౌంటర్లలో 80 మంది చనిపోయారని, మొత్తంగా చనిపోయిన వారిలో 136 మంది మహిళలు ఉన్నారని, ఎదురుకాల్పులు కాకుండా అనారోగ్య కారణాలతో నలుగురు, ప్రమాదంలో మరొకరు మృతి చెందారు. నలుగురు సెంట్రల్ కమిటీ సభ్యులు, 16 మంది రాష్ట్ర కమిటీ సభ్యులు, 23 మంది జిల్లా కమిటీ సభ్యులు, 83 మంది ఏరియా కమిటీ, 138 మంది పార్టీ సభ్యులు, పీఎల్‌జీఏ 17, ఇతర విభాగాల వారు 40, గుర్తించని మృతులు 36 మంది ఉంటారని వివరించింది. వీరి త్యాగాలను స్మరించుకుంటూ ఈ నెల 28 నుంచి ఆగస్టు 3 వరకు అమర వీరుల సంస్మరణ వారోత్సవాలు నిర్వహించాలని నిర్ణయించింది.

చుట్టుముట్టి చంపుతున్నారు

నక్సల్బరీ విప్లవ పోరాటం మొదలైన తర్వాత ఆపరేషన్ కగార్‌తో ఏడాది వ్యవధిలోనే పెద్ద సంఖ్యలో సెంట్రల్, స్టేట్ కమిటీ సభ్యులను కోల్పోవడంతో తీవ్ర నష్టం జరిగిందని పార్టీ సెంట్రల్ కమిటీ పేర్కొంది. గతేడాది ఏప్రిల్‌లో జరిగిన కాంకేర్ ఎన్‌కౌంటర్ (29 మంది మావోయిస్టులు చనిపోయారు) తర్వాత సగటున ప్రతీ 20 రోజులకు ఒక భారీ ఎన్‌కౌంటర్ జరుగుతోందని, ఈ ఘటనల్లో కనిష్టంగా 10 నుంచి గరిష్టంగా 35 మంది వరకు మావోయిస్టులు చనిపోయారని తెలిపింది. 20 కిలోమీటర్ల వలయాకారంలో వేలాది మంది భద్రతాదళాలు చుట్టుముడుతూ తమపై దాడులు చేస్తున్నాయని, ఆధునిక ఆయుధాలు, టెక్నాలజీ గల భద్రతా దళాలను తమ కేడర్ ప్రాణాలకు తెగించి ఎదుర్కొంటోందని ఆ డాక్యుమెంట్‌లో పేర్కొంది.

నిజాలు దాస్తున్నారు

ప్రతీ ఎదురుకాల్పుల ఘటనలో భద్రతాదళాల వైపు కూడా పది మందికి మించి జవాన్లు చనిపోతున్నారని సెంట్రల్ కమిటీ తెలిపింది. తమకున్న అంచనా ప్రకారం ప్రతి దాడుల్లో 70 మంది జవాన్లు చనిపోగా, 130 మంది తీవ్రంగా గాయపడి ఉంటారని అభిప్రాయపడింది. అయితే ఈ విషయాన్ని దాచి పెడుతూ కేవలం మావోయిస్టుల మరణాల లెక్కలనే పాలకులు బయటకు వెల్లడిస్తున్నారని విమర్శించింది. దీర్ఘకాలిక సాయుధ పోరాటంలో ఎత్తుపల్లాలు సహజమేనని వివరణ ఇచ్చింది. అంతర్జాతీయ వ్యవహారాలపై కూడా ఈ డాక్యుమెంట్‌లో కేంద్ర కమిటీ తమ అభిప్రాయాలను తెలిపింది.

అనువైన సమయం కోసం

గెరిల్లా యుద్ధతంత్రంలో అనుసరించాల్సిన వ్యూహాలను సరైన రీతిలో అమలు చేయనందుకే పార్టీకి నష్టాలు పెరిగాయని సీసీ వివరణ ఇచ్చింది. 2024 ఆగస్టులో పొలిట్ బ్యూరో తీసుకున్న నిర్ణయాలను అమల్లోకి తీసుకురాబోతున్నట్టు పేర్కొంది. వర్గ పోరాటాన్ని వికేంద్రీకరించి అటవీ, గ్రామీణ, అర్బన్ ప్రాంతాల్లో పార్టీని విస్తరించాలని సీసీ స్పష్టంగా పేర్కొంది. పెరిగిన నిర్బంధం, పార్టీకి వరుసగా జరుగుతున్న నష్టాలను దృష్టిలో ఉంచుకొని ఈ విస్తరణ వీచేగాలిలా, ప్రవహించే నీరులా ఉండాలని కేడర్‌కు కేంద్ర కమిటీ సూచించింది. శత్రువు బలంగా ఉన్నప్పుడు ఎదురుగా నిలిచి పోరాటం చేయనక్కర్లేదని, అనువైన సమయం కోసం ఎదురుచూడాలని ఆదేశించింది. శాంతి చర్చలు జరపాలంటూ 9 రాష్ట్రాల నుంచి డిమాండ్ రావడం ఇటీవల కాలంలో కనిపించిన సానుకూల పరిణామమని ఆ పార్టీ పేర్కొంది. 2026 మార్చి 31 నాటికి మావోయిస్టులను అంతం చేస్తామని కేంద్రం చేసిన ప్రకటన ఎప్పటికీ నెరవేరబోదని ధీమా వ్యక్తం చేసింది.


గతేడాది చనిపోయిన మావోయిస్టుల వివరాలు

రాష్ట్రం	మృతుల సంఖ్య
దండకారణ్యం	281
తెలంగాణ	23
ఏవోబీ	09
ఒడిశా	20
బిహార్–జార్ఖండ్	14
ఎంఎంసీ	08
పశ్చిమ కనుమలు	01
పంజాబ్	01
అనారోగ్య కారణాలు	04
ప్రమాదంలో	01

● ఎంఎంసీ (మహారాష్ట్ర–మధ్యప్రదేశ్–ఛత్తీస్‌గఢ్ జోన్)

షకీల్.. విచారణ ఎదుర్కోవాల్సిందే!

హిట్ అండ్ రన్ కేసు కొట్టివేతకు హైకోర్టు నిరాకరణ



సాక్షి, హైదరాబాద్: హిట్ అండ్ రన్ కేసులో కుమారుడిని తప్పించేందుకు యత్నించారంటూ నమోదైన కేసులో బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. విచారణ ఎదుర్కోవాల్సిందేనని తేల్చి చెప్పింది. ఈ మేరకు ఎఫ్ఐఆర్‌ను రద్దు చేయాలని ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. 2023, డిసెంబర్ 23 రాత్రి 3 గంటల సమయంలో అతివేగంగా దూసుకెళ్లిన ఒక కారు ప్రజాభవన్ వద్ద ట్రాఫిక్ డివైడర్, బారికేడ్లను ఢీ కొట్టింది. విచారణ చేపట్టిన పోలీసులు.. కారు నడిపి ప్రమాదానికి కారకుడైన వ్యక్తి బోధన్ మాజీ ఎమ్మెల్యే కుమారుడు సాహిల్‌గా నిర్ధారించారు. ప్రమాద సమయంలో కారులో నలుగురు ప్రయాణించారని ధ్రువీకరించారు. ఈ దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి. అనంతరం సాహిల్‌ను పోలీసులు స్టేషన్‌కు తీసుకెళ్లారు. సాహిల్‌ను తప్పించి అతని స్థానంలో అబ్దుల్ ఆసిఫ్‌ను ఉంచేందుకు కొందరు పోలీసులు, షకీల్ యత్నించినట్లు గుర్తించిన అధికారులు వారిపై కేసు నమోదు చేశారు. ఈ కేసును కొట్టివేయాలంటూ షకీల్‌తో పాటు మరో ఇద్దరు హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. పిటిషన్లపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ఏపీపీ శాలినీ మిశ్రా వాదనలు వినిపిస్తూ.. ఈ కేసులో ప్రధాన నిందితుడు, షకీల్ కుమారుడు రాహిల్ విదేశాలకు పారిపోయాడని, అబ్దుల్ ఆసిఫ్‌ను డ్రైవర్‌గా చూపి కేసు నమోదు చేశారన్నారు. డ్రైవర్ గుర్తింపు కార్యక్రమానికి రాహిల్ హాజరుకావడం లేదని పేర్కొన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. వారి పిటిషన్లను కొట్టివేశారు.

కేంద్రమంత్రి బండి సంజయ్‌కి ఊరట

'ఎన్నికల'కేసును కొట్టివేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: కేంద్రమంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా దాఖలైన కేసును హైకోర్టు కొట్టివేసింది. 2023, నవంబర్ 30న మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై అవమానకర వ్యాఖ్యలు చేశారన్న ఫిర్యాదు మేరకు కరీంనగర్ పోలీసులు కేసు నమోదుచేశారు. కరీంనగర్ కోర్టులోని ఈ కేసును కొట్టివేయాలని సంజయ్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. ఈ కేసుకు అవసరమైన సాక్షుల వాంగ్మూలాలను సమర్పించడంలో దర్యాప్తు అధికారి విఫలమయ్యారన్నారు. పిటిషనర్‌పై కేసు చట్టవిరుద్ధమంటూ కొట్టివేశారు.

ఈటల రాజేందర్‌కు కూడా..

హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గానికి జరిగిన ఉప ఎన్నికల సందర్భంగా అమల్లో ఉన్న మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించినందుకు కమలాపూర్ పోలీస్‌స్టేషన్‌లో దాఖలైన కేసులో ఎంపీ ఈటల రాజేందర్‌కు హైకోర్టులో ఊరట లభించింది. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌ను ఉల్లంఘించి బీజేపీ కార్యకర్తలు భారీ ర్యాలీ నిర్వహించారని.. బాణాసంచా పేల్చడానికి యత్నించారన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఈ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలని ఈటల హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన న్యాయమూర్తి.. బాణసంచా పేల్చే సమయంలో పిటిషనర్ అక్కడ లేరని, అలాంటప్పుడు సెక్షన్ 285 ఆయనకు వర్తించదన్నారు. సాక్షుల వాంగ్మూలాలను దర్యాప్తు అధికారి సమర్పించలేదని చెబుతూ ఎఫ్ఐఆర్‌ను కొట్టివేశారు.

శాసనసభ ప్రాంగణంలో బోనాల పండగ

పాల్గొన్న మండలి చైర్మన్, శాసనసభ స్పీకర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో మంగళవారం బంగారు మైసమ్మ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, లెజిస్లేచర్ సెక్రటరీ నరసింహాచార్యులు, శాసనసభ, శాసనమండలి ఉద్యోగులు పాల్గొన్నారు.

రైతులకేం చేయాలో సీఎంకు తెలుసు

కాంగ్రెస్ ఎమ్మెల్యే సత్యం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రైతులకు ఏం చేయాలో కాంగ్రెస్ ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌రెడ్డికి తెలుసునని కాంగ్రెస్ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పష్టం చేశారు. ఆయన మంగళవారం సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా మంచి వర్షాలు కురవాలని, రైతులు సంతోషంగా ఉండాలని కోరుకుంటే.. కేటీఆర్ మాత్రం వర్షాలు పడొద్దని కోరుకుంటున్నారని ఆరోపించారు. సీజన్ పూర్తిగా ప్రారంభం కాకుండానే కేటీఆర్ శాపనార్థాలు ప్రారంభమయ్యాయని విమర్శించారు. రైతులకు నీళ్లు ఇవ్వడం లేదని గగ్గోలు పెడుతున్నారని, ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయి పంటలు ఎండిపోతున్నాయని పిచ్చి వాగుడు వాగుతున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో ఎక్కడైనా ఒక్క ఎకరమైనా ఎండిపోయిందని కేటీఆర్ నిరూపించాలని మేడిపల్లి సత్యం సవాల్ చేశారు.

దేశానికి వెలుగులు.. సింగరేణికి సిరులు


సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటు

మణిహారంగా ఎస్టీపీపీ

- మిగులు విద్యుత్ విక్రయంతో అదనపు ఆదాయం
- ఏటా రూ.600 కోట్లకు పైనే లాభాలు

జైపూర్: సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ (ఎస్టీపీపీ).. రాష్ట్రంతో పాటు, దేశంలోని అనేక రాష్ట్రాలకు విద్యుత్ కాంతులు పంచుతోంది. విద్యుదుత్పత్తి, నిర్వహణలో దేశంలో అగ్రగామిగా నిలిచిన ఈ సంస్థ.. మిగులు విద్యుత్‌ను విక్రయించి అదనపు ఆదాయం ఆర్జిస్తోంది. జైపూర్‌లోని ఈ పవర్ ప్లాంట్ సింగరేణి సంస్థకు మణిహారంగా మారి, ఏటా రూ.600 కోట్లకు పైగా లాభాలను ఆర్జిస్తోంది.

విద్యుదుత్పత్తిలో అగ్రగామి

సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్ 1200 మెగావాట్ల సామర్థ్యంతో రాష్ట్రంలో విద్యుత్ అవసరాలను తీర్చడమే కాకుండా, దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా విద్యుత్ సరఫరా చేయడానికి సిద్ధంగా ఉంది. రెండు యూనిట్లతో రోజుకు 58 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తున్న ఈ ప్లాంట్.. విద్యుత్ రంగంలో సింగరేణి సంస్థకు కీర్తిని తెచ్చిపెడుతోంది. జాతీయస్థాయిలో విద్యుదుత్పత్తి, నిర్వహణలో అనేక అవార్డులను అందుకుంటూ అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది.

రోజుకు 58 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి

ఎస్టీపీపీలోని ఒక్కొక్క యూనిట్ (600 మెగావాట్లు) రోజుకు 29 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తుంది. రెండు యూనిట్లు కలిపి పూర్తి సామర్థ్యంతో 58 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తి చేస్తాయి. ఈ విద్యుత్‌ను స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ (ఎస్ఎల్‌డీసీ)కు సరఫరా చేస్తారు. రాష్ట్రంలో విద్యుత్ డిమాండ్ ఆధారంగా, షెడ్యూల్ ప్రకారం రోజువారీ ఉత్పత్తిని నిర్ణయిస్తారు. ఉదయం ఎక్కువగా ఉండే విద్యుత్ డిమాండ్.. సాయంత్రానికి తగ్గుతుంది. ఈ డిమాండ్‌ను నియంత్రించేందుకు, 15 నిమిషాలకోసారి బ్లాక్ విధానంలో విద్యుత్ అవసరాలను అంచనా వేస్తారు.

లాభాల మణిహారం

జైపూర్‌లోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంట్.. సంస్థకు ఆర్థికంగా బలమైన ఆధారంగా నిలుస్తోంది. ఏటా రూ.600 కోట్లకు పైగా లాభాలను ఆర్జిస్తున్న ఈ ప్లాంట్, మిగులు విద్యుత్ విక్రయం ద్వారా మరింత ఆదాయాన్ని సమకూర్చనుంది. బొగ్గు ఉత్పత్తితో పాటు విద్యుత్ రంగంలోనూ సింగరేణి తనదైన ముద్ర వేస్తూ, అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది.

మిగులు విద్యుత్ విక్రయం

రాష్ట్ర డిమాండ్‌ను తీర్చిన తర్వాత.. మిగిలిన విద్యుత్‌ను బహిరంగ మార్కెట్‌లో ఇతర రాష్ట్రాలకు విక్రయించనున్నారు. ఈ మిగులు విద్యుత్‌ను గ్రిడ్ వ్యవస్థ ద్వారా ఇండియన్ ఎనర్జీ ఎక్స్ఛేంజ్‌లో విక్రయిస్తారు. ప్రస్తుతం ఒక యూనిట్ విద్యుత్ ధర రూ.5.32గా నిర్ణయించగా, ఇందులో స్థిర ధర రూ.1.58, చర ధర రూ.3.74గా ఉంది. డిమాండ్ తక్కువగా ఉన్న సమయంలో మిగిలిన విద్యుత్‌ను విక్రయించడం ద్వారా, స్థిర ధరతోపాటు చర ధరలో 20 శాతం అదనపు ఆదాయాన్ని పొందుతోంది. ఈ విధానం ఎస్టీపీపీకి అదనపు ఆదాయంతోపాటు మెరుగైన ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్ (పీఎల్ఎఫ్) సాధించేందుకు దోహదపడుతోంది.

రేవంత్‌ది బ్లాక్‌మెయిల్ జీవితం: గ్యాదరి కిశోర్



సాక్షి, హైదరాబాద్: క్లబ్బులు, పబ్బులతో రాజకీయ ప్రస్థానం ప్రారంభించిన సీఎం రేవంత్ రెడ్డిది బ్లాక్ మెయిల్ జీవితమని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే గ్యాదరి కిశోర్ కుమార్ విమర్శించారు. తుంగతుర్తి సభలో రేవంత్ తన బ్లాక్‌మెయిల్ వైఖరిని బయట పెట్టుకున్నారని మండిపడ్డారు. మంగళవారం తెలంగాణ భవన్‌లో కిశోర్ మీడియాతో మాట్లాడారు. 'సీఎం పర్యటన అడ్డుకుంటామని మేం చెప్పకున్నా రేవంత్ తుంగతుర్తి పర్యటన సందర్భంగా మమ్మల్ని ఎందుకు హౌజ్ అరెస్టులు చేశారు? మూడు ఫీట్లు అంటూ విమర్శలు చేస్తున్న రేవంత్ ఏమైనా ఆరు ఫీట్ల పొడవు ఉన్నారా? దేవాదుల ఎక్కడుందో తెలియని ముఖ్యమంత్రి సూర్యాపేటకు దేవాదుల నీళ్లు తెస్తామని చెప్తున్నాడు. నాగార్జునసాగర్ జలాలను ఉమ్మడి నల్లగొండ జిల్లాకు ఇవ్వకుండా ఖమ్మం తీసుకెళ్తున్నా జిల్లాకు చెందిన నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి స్పందించడం లేదు. తుంగతుర్తి సభకు రాకుంటే ఇందిరమ్మ ఇళ్లు, డ్వాక్రా రుణాలు ఇవ్వమని భయభ్రాంతులకు గురి చేసి జన సమీకరణ జరిపారు' అని కిశోర్ ఆరోపించారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు భిక్షమయ్య గౌడ్, కంచర్ల భూపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పన్నుల శాఖ అధికారులకు పోస్టింగులు

సాక్షి, హైదరాబాద్: చాలా కాలం కిందట జాయింట్ కమిషనర్లుగా పదోన్నతులు పొందిన ముగ్గురు జీఎస్టీ అధికారులకు ఎట్టకేలకు పోస్టింగులిచ్చారు. జాయింట్ కమిషనర్లు వాసవి జగన్నాథం, జి.లావణ్య, కె.గీతలకు పన్నుల శాఖ కమిషనర్ కార్యాలయంలో పోస్టింగులిస్తూ వాణిజ్య పన్నుల శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.ఎ.ఎం.రిజ్వీ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పదోన్నతులు వచ్చినా తాము పనిచేస్తున్న ప్రాంతాల నుంచి ప్రధాన కార్యాలయానికి రాబోమని భీష్మించుకు కూర్చున్న ఈ అధికారులకు మొత్తానికి స్థానచలనం కలగడం గమనార్హం. కాగా, వీరి స్థానంలో డిప్యూటీ కమిషనర్లుగా ఈ.జితేందర్‌రెడ్డి (సికింద్రాబాద్), ఈ.దీపారెడ్డి (అబిడ్స్), ఈ.అరవిందరెడ్డి (మాదాపూర్), కె.వేణుగోపాలరావు (నిజామాబాద్), ఎస్.రజని (కరీంనగర్)లను నియమిస్తున్నట్టు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

శ్రీధర్‌బాబుతో ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్ భేటీ

సాక్షి, హైదరాబాద్: ఐటీ, పరిశ్రమలశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబును బెంగళూరులోని ఫ్రాన్స్ కాన్సుల్ జనరల్, అడ్మినిస్ట్రేటర్ ఆఫ్ ది సేటెట్ మార్క్ లామీ మంగళవారం తెలంగాణ సచివాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తెలంగాణ–ఫ్రాన్స్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి తీసుకోవలసిన చర్యలు, ఇరు పక్షాల మధ్య సహకారాన్ని పెంపొందించడం, వివిధ రంగాల్లో భాగస్వామ్య అవకాశాలపై చర్చించారు. కార్యక్రమంలో టీజీఐఐసీ ఎండీ శశాంక, పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.




బెంగళూరులో జరుగుతున్న ఓబీసీ సలహా మండలి సమావేశంలో కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్యతో టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు


రాబోయే పరాభవ నామ సంవత్సరంలో (2026 -2027) పండగల జాబితాను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుకు అందజేస్తున్న తెలంగాణ విద్వత్సభ ప్రతినిధులు


నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టూరిజం అండ్ హాస్పిటాలిటీ మేనేజ్‌మెంట్ (నిథమ్) డైరెక్టర్ గా నియమితులైన ప్రొఫెసర్ వెంకట రమణ.. మంగళవారం పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు



అల.. మెరుపులా

విశాఖ సాగర తీరాన సరదాగా గడుపుదామని వచ్చే కొందరు అక్కడి రాళ్లపై కూర్చొని అలల సయ్యాటలను ఆస్వాదిస్తుంటారు. సెల్ఫీలు దిగుతూ సరదాగా గడుపుతుంటారు. అయితే ఒక్కోసారి అలలు ఇలా ప్రమాదకరంగా విరుచుకుపడుతూ ప్రాణాంతకంగా మారుతుంటాయి. ఆర్కేబీచ్‌లో సందర్శకులు ఇలా రాళ్లపై నిల్చొని సెల్ఫీలు తీసుకుంటుండగా ఓ పెద్ద రాకాసి అల ఇలా విరుచుకుపడింది. చూస్తున్నవారంతా ఒక్కసారిగా ఆందోళనకు గురయ్యారు. అయితే ప్రమాదమేమీ జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్ విశాఖపట్నం



ఈ బతుకు సవారీ ప్రమాదకారి

బండి వెనుక బండెడు లోడు. ఇక మిగిలింది ఆయిల్ ట్యాంకే.. అక్కడ కూడా ఓ మహిళ ..అనంతపురం నుంచి సమీప గ్రామాలకు వెళ్లి ప్లాస్టిక్ సామానులు అమ్ముకునే ఈ చిరు వ్యాపారి మంగళవారం ఇలా ప్రమాదకర రీతిలో ప్రయాణం సాగించాడు. ఈ దృశ్యాన్ని సాక్షి కెమెరా క్లిక్‌మనిపించింది. – సాక్షి ఫొటోగ్రాఫర్ అనంతపురం



జడివాన

విజయనగరం జిల్లా కేంద్రంలో మంగళవారం సాయంత్రం కురిసిన వర్షానికి లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. ప్రధానంగా గంటస్తంభం,నగర పాలక సంస్థ కార్యాలయం, రాజీవ్ క్రీడా ప్రాంగణానికి వెళ్లే రహదారిలో నీరు నిలిచిపోవడంతో వాహనాలపై వెళ్లే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

క్లుప్తంగా...

బాబు ఢిల్లీ పర్యటనలపై శ్వేతపత్రం విడుదల చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సాక్షి, అమరావతి: ఏడాదికాలంలో సీఎం చంద్రబాబు 21సార్లు ఢిల్లీ పర్యటించారని, ఆయన అక్కడికి వెళ్లి కేంద్రం నుంచి రాష్ట్రానికి ఏం సాధించారనే దానిపై శ్వేతపత్రం విడుదల చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. విజయవాడలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు ఢిల్లీ వెళ్లినప్పుడల్లా ప్రధాని మోదీ, హోం మంత్రి అమిత్‌షా, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో సహా కేంద్ర మంత్రులను కలుస్తున్నారని, అదంతా రాష్ట్ర అభివృద్ధి కోసమేనని చెబుతున్నారన్నారు. వాస్తవానికి అప్పుల విషయంలో తప్ప రాష్ట్రానికి కేంద్రం చేసిన సాయం ఏమీలేదని ఎద్దేవా చేశారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి: సీపీఎం

సాక్షి, అమరావతి: జీతాల పెంపు, సంక్షేమ పథకాల అమలు తదితర డిమాండ్ల పరిష్కారం కోసం మూడు రోజులుగా సమ్మె చేస్తున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు సీపీఎం రాష్ట్ర కమిటీ మద్దతు తెలిపింది. వారి డిమాండ్లు పరిష్కరించి సమ్మె విరమింపజేయాలని కూటమి ప్రభుత్వాన్ని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

'ఏపీఈఆర్‌సీ' సభ్యుడి పోస్టుకు దరఖాస్తు గడువు పొడిగింపు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ)లో ఖాళీగా ఉన్న సభ్యుడి(మెంబర్) పోస్టుకు దరఖాస్తు గడువును ఈనెల 25 వరకూ ప్రభుత్వం పొడిగించింది. ఈ పోస్టుకు గతనెల 18న నోటిఫికేషన్ విడుదలైంది. జూలై 9లోగా దరఖాస్తులను సమర్పించాలని తొలుత ప్రభుత్వం కోరింది. అనంతరం ఈనెల 16 వరకూ గడువు పొడిగించగా, తాజాగా మరో పది రోజులు పొడిగిస్తూ ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

జన్యుమార్పిడి విత్తనాల దిగుమతులను వ్యతిరేకించాలి

ఏపీ కౌలురైతుల సంఘం డిమాండ్

సాక్షి, అమరావతి: జన్యు మార్పిడి విత్తనాల దిగుమతులను వ్యతిరేకించాలని ఏపీ కౌలురైతుల సంఘం డిమాండ్ చేసింది. అమెరికా ప్రభుత్వం ఒత్తిడితో ఈ విత్తనాల కొనుగోలుకు కేంద్రం అంగీకరించినట్లు వస్తున్న వార్తలపై సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై.రాధాకృష్ణ, ఎం.హరిబాబు మంగళవారం ఓ ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. బలవంతంగా అంటగట్టేందుకు దిగుమతి సుంకాలను తగ్గిస్తోందన్నారు. వీటి వల్ల దేశీయ ఉత్పత్తులకు మార్కెట్ లేకుండా పోతుందన్నారు. తక్షణమే ఈ ప్రతిపాదనను కేంద్రం విరమించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు.

గురుకుల విద్యార్థులతో జూమ్ కాల్‌లో మాట్లాడిన మంత్రి

సాక్షి, అమరావతి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులతో రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి మంగళవారం వెలగపూడి సచివాలయం నుంచి జూమ్ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలు, టీచర్ల బోధనా తీరు వంటి అంశాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది కొత్తగా చేరిన విద్యార్థుల్లో భయం పోగొట్టి పాఠశాలల్లో ఆహ్లాద వాతావరణం నెలకొల్పేలా చర్యలు చేపట్టాలని పాఠశాలల ప్రిన్సిపల్స్‌ను మంత్రి ఆదేశించారు.

విద్యార్థులను ప్రయోగాల దిశగా ప్రోత్సహించండి

సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: విద్యార్థుల చిన్ని మెదళ్లలో సృజనాత్మక ఆలోచనలను ఉపాధ్యాయులు పసిగట్టి వారిని ప్రోత్సహిస్తే చాంపియన్లుగా, భావితరాల శాస్త్రవేత్తలుగా తీర్చిదిద్దవచ్చని సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు తెలిపారు. సమగ్ర శిక్ష, పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో మంగళవారం అటల్ టింకరింగ్ ల్యాబ్ జిల్లా రిసోర్స్ పర్సన్ల శిక్షణ విజయవాడలో ప్రారంభమైంది. విశిష్ట అతిథిగా హాజరైన ఎస్పీడీ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు సైన్స్, విజ్ఞానంపై ఆసక్తి పెంపొందించేందుకు పాఠశాలల్లో స్టెమ్ ల్యాబ్స్, అటల్ టింకరింగ్ ల్యాబ్స్ ఏర్పాటు చేశామన్నారు. వాటిలో విద్యార్థులతో ప్రయోగాలు చేయించి సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. జిల్లా సైన్స్ అధికారులు వారానికోసారైనా ల్యాబ్స్‌ను సందర్శించి ఉపాధ్యాయులకు, విద్యార్థులకు దిశానిర్దేశం చేయాలని పేర్కొన్నారు.

- వారం క్రితం అనంతపురం రూరల్ పరిధిలోని నారాయణపురం చెక్‌డ్యాం సమీపంలో తపోవనం హైస్కూల్ పిల్లలు ఐదుగురు మద్యం తాగుతున్నారు. ఆ బ్యాచ్‌లోని ఓ విద్యార్థి తండ్రి వీరి తతంగాన్ని కనిపెట్టాడు. తన కుమారుడిని పట్టుకొచ్చి బాగా కొట్టాడు. దీంతో ఆ విద్యార్థి అందరి పేర్లూ చెప్పాడు. విస్కీ తాగినట్టు వెల్లడించాడు.
- అనంతపురం నగరంలోని పొట్టిశ్రీరాములు పాఠశాలలో 8వ తరగతి పూర్తి చేసిన విద్యార్థి.. ఇటీవల స్కూల్లో టీసీ తీసుకుని 3వ రోడ్డులో ఉన్న ఓ హైస్కూల్‌లో చేరాడు.బడిలో ఈ విద్యార్థి ఇటీవల గంజాయి తాగుతుండగా ఉపాధ్యాయుడు గుర్తించాడు. తల్లిదండ్రులను పిలుస్తా అని హెచ్చరిస్తే.. ''పిలువు, నన్ను వాళ్లేం చేయగలరు'' అంటూ విద్యార్థి ఎదురుతిరిగే సరికి ఉపాధ్యాయుడు భయపడి విషయాన్ని అంతటితో వదిలేశాడు. విద్యార్థుల్లో పెడ ధోరణలు ఎంతగా పెరిగాయో ఈ రెండు ఘటనల ద్వారా అర్థం చేసుకోవచ్చు.



పర్యవేక్షణ కరువై పెడదారి

విద్యార్థుల్లో వింత పోకడ
- ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులే ఎక్కువగా పక్కదారి
- వారం క్రితం నారాయణపురం వద్ద లిక్కర్ తాగుతూ దొరికిన ఐదుగురు
- మరో ప్రభుత్వ స్కూల్లో 9వ తరగతి విద్యార్థి గంజాయి సేవనం
- ఎక్కువగా అర్బన్ ప్రాంతాల్లో ఇలాంటి విపరీత ఘటనలు
- ఉదాసీనంగా ఉపాధ్యాయులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ప్రభుత్వ స్కూళ్లలో పెరుగుతున్న విపరీత ధోరణులు అందరినీ విస్మయానికి గురి చేస్తున్నాయి. చిన్న వయసులోనే ఇలాంటి ఆలోచనలు ఎలా వస్తున్నాయన్నది ఎవరూ అంచనా వేయలేకపోతున్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ హైస్కూళ్లలో ఇలాంటి ఘటనలు తరచూ వెలుగు చూస్తున్నాయి. పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం, ఉపాధ్యాయులు కూడా తమకెందుకులే అని పట్టించుకోకపోవడం తదితర కారణాలతో పిల్లలు పెడదారి పడుతున్నట్లుగా తెలుస్తోంది.

14 ఏళ్లకే మద్య సేవనం...

తపోవనం హైస్కూలు విద్యార్థులు మద్యం సేవించిన ఘటన అనంతపురం జిల్లావ్యాప్తంగా కలకలం రేపింది. పదో తరగతి చదువుతున్న విద్యార్థులు ముగ్గురు, ఎనిమిదో తరగతి చదువుతున్న వారు ఇద్దరు ఉన్నట్లు తెలుసుకుని పలువురు విస్తుపోతున్నారు. మరోవైపు జిల్లాలో కొన్ని చోట్ల విద్యార్థులు పాఠశాలలకు గంజాయి తెచ్చుకుని సేవిస్తున్నారు. మరికొన్ని చోట్ల సెల్‌ఫోన్లలో అశ్లీల చిత్రాలు చూస్తూ గడుపుతున్నారు. కో ఎడ్యుకేషన్ ఉన్నచోట బాలికలతో అసభ్యంగా ప్రవర్తిస్తున్నారు. ఇటీవల ఓ ప్రభుత్వ స్కూల్‌లో 9వ తరగతి బాలిక ఓ బాలుడికి ప్రేమలేఖ రాసిన ఉదంతం బయటపడింది. ఈ క్రమంలో పిల్లలను స్కూళ్లకు పంపాలంటే తల్లిదండ్రులు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఉపాధ్యాయుల్లో ఉదాసీన వైఖరి

పిల్లలను ఏమంటే ఎలాంటి ముప్పు ముంచుకొస్తుందోనన్న భయంతో ఉపాధ్యాయులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. చాలామంది టీచర్లే క్రమశిక్షణ తప్పి క్లాసులకు వస్తున్నట్టు విద్యార్థులు చెబుతున్నారు. సమయానికి స్కూలుకు వెళ్లకపోవడం, వెళ్లినా క్లాసులు తీసుకోకపోవడం విద్యార్థులు ఇష్టారాజ్యంగా ప్రవర్తించడానికి కారణమవుతోంది. ఇక పిల్లల తల్లిదండ్రులు జీవనోపాధి నిమిత్తం వేరే ప్రాంతాలకు వెళ్లి ఎప్పుడో రాత్రికి ఇంటికి చేరుకుంటుండడంతో ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సత్సంబంధాలు లేక శాపంగా పరిణమిస్తోంది.

తల్లిదండ్రుల్లో మార్పు రావాలి



పిల్లల్లో పెడధోరణులను కాండాక్ట్ డిజార్డర్ అంటారు. తల్లిదండ్రుల పర్యవేక్షణ లేకపోవడం ప్రధాన కారణం. తల్లిదండ్రులకు మద్యం అలవాటు ఉన్నా ఇలా జరుగుతుంది. మొబైల్ ఫోన్లు, సామాజిక మాధ్యమాల ప్రభావం వల్ల కూడా పెడదారి పడుతున్నారు. తల్లిదండ్రుల ద్వారానే పిల్లల్లో పరివర్తన రావాలి.

–డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్య నిపుణులు, అనంతపురం

వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తు మార్పుపై అసత్య ప్రచారం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తు మార్చాలని తాను కోరినట్లుగా అసత్య ప్రచారం జరుగుతోందని యుగ తులసీ పార్టీ అధ్యక్షులు కె.శివకుమార్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎన్నికల గుర్తు ఫ్యాన్‌ను మార్చి గొడ్డలి గుర్తు కేటాయించాల్సిందిగా కేంద్ర ఎన్నికల కమిషన్‌ను కోరుతూ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడి హోదాలో తాను లేఖ రాసినట్లు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న కథనాన్ని ఆయన ఖండించారు. ఈ దుష్ప్రచారానికి కారకులైన వారిపై న్యాయపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరుతున్నట్టు పేర్కొన్నారు.

మైనారిటీల పురోభివృద్ధికి చర్యలు: మంత్రి ఫరూక్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మైనారిటీ వర్గాల పురోభివృద్ధికి ప్రణాళికా బద్ధంగా విస్తృత చర్యలు చేపట్టినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ చెప్పారు. వెలగపూడి సచివాలయంలోని మూడవ బ్లాక్‌లోని మైనారిటీ మంత్రిత్వ శాఖ పేషీలో మైనారిటీ శాఖ కార్యదర్శి సీహెచ్ శ్రీధర్, వివిధ విభాగాల ఉన్నతాధికారులతో మంత్రి మంగళవారం సమీక్ష నిర్వహించారు.

ప్రసన్న ముందస్తు బెయిల్ పిటిషన్‌పై విచారణ నేటికి వాయిదా

సాక్షి, అమరావతి: నెల్లూరు జిల్లా కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిపై వ్యాఖ్యలకు సంబంధించి కోవూరు పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలంటూ మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను హైకోర్టు బుధవారానికి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ యడవల్లి లక్ష్మణరావు మంగళవారం ఉత్తర్వులిచ్చారు.

కష్టాల ఊబిలో కోకో రైతు

కంపెనీల సిండికేట్‌తో రైతులకు భారీ నష్టం
- సీజన్ ముగిసిందంటూ కొనుగోళ్ల నిలిపివేత
- రైతుల వద్ద 800 టన్నులకు పైగా కోకో నిల్వలు
- పట్టించుకోని చంద్రబాబు ప్రభుత్వం
- గతేడాది కిలో రూ.1,050 ఉన్న కోకో ధర
- ఈ సీజన్‌లో సగటున కిలో రూ.450 మాత్రమే



సాక్షి ప్రతినిధి, ఏలూరు: కంపెనీలు సిండికేట్‌గా మారడం, ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కోకో రైతులు పూర్తిగా నష్టపోయారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కిలో కోకో ధర రూ.800 పలుకుతున్నా, కంపెనీల సిండికేట్ వల్ల మన రాష్ట్రంలో రూ.450కు మించలేదు. రైతుల నుంచి పూర్తిస్థాయిలో కోకో పంటను కొనుగోలు చేయకుండానే సీజన్ ముగిసిందని జూన్ నెలాఖరు నుంచి కొనుగోళ్లు నిలిపివేశాయి. దీంతో రైతుల వద్ద 800 టన్నులకు పైగా కోకో నిల్వలు మిగిలి ఉన్నాయి. అయినా చంద్రబాబు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని రైతులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు.

రైతుల వద్ద 800 టన్నులకు పైగా కోకో నిల్వలు

ప్రస్తుతం రైతుల వద్ద 800 టన్నులకు పైగా కోకో నిల్వలు ఉన్నట్టు అంచనా. ప్రస్తుతం సీజన్ ముగిసిందని, డిమాండ్ లేదని, కోకో నట్స్‌లో బటర్ శాతం తక్కువగా ఉందని... ఇలా రకరకాల సాకులతో దళారులు కిలో రూ.350 నుంచి రూ.400కు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. వాస్తవానికి మార్చి నుంచి కోకో పంటకు అంతర్జాతీయంగా కిలో ధర రూ.800–రూ.850 మధ్య కొనసాగుతోంది. మన రాష్ట్రంలో మాత్రం రూ.450కి మించి ధర పలకలేదు.

60 శాతానికి పైగా ధర పతనం
- రాష్ట్రంలో మాండలీజ్, క్యాంకో, జిందాల్, డీపీ చాక్లెట్, లోటస్‌తోపాటు మరికొన్ని కంపెనీలు కోకో కొనుగోలు చేస్తున్నాయి. మాండలీజ్ కంపెనీ మాత్రమే రైతుల నుంచి నేరుగా కొనుగోలు చేస్తుంది. మిగిలిన కంపెనీలు దళారుల ద్వారా కొనుగోలు చేయిస్తాయి.
- కోకోకు ఏటా ఫిబ్రవరి నుంచి జూన్ వరకు సీజన్‌గా పరిగణిస్తారు. ఏప్రిల్, మే నెలల్లో ధరలు అధికంగా ఉంటాయి. గతేడాది ఏప్రిల్, మే నెలల్లో కిలో రూ.1,050 పలికింది. ఈ ఏడాది 60శాతానికి పైగా ధర పతనమైంది. ఏప్రిల్, మే నెలల్లో రూ.450కి అత్యధిక కొనుగోళ్లు జరిగాయి.
- రైతు సంఘాలు, ప్రతిపక్షాల పోరాటాలతో ప్రభుత్వం కంటితుడుపు చర్యల్లో భాగంగా కిలోకు రూ.50 అదనంగా ఇస్తామని చెప్పింది. దానిని మే 23 నుంచి జూన్ 30వ తేదీ వరకు అమలు చేసి, ఏలూరు జిల్లాలో 1,638 టన్నులకు సంబంధించిన 2,200 మంది రైతులకు మాత్రమే కిలోకు అదనంగా రూ.50 చెల్లించారు. వాస్తవానికి ఏలూరు జిల్లాలోనే ఏటా 12వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుంది.
- రాష్ట్రంలో ఏలూరు జిల్లాలోనే అత్యధికంగా కోకో సాగు చేస్తారు. ఈ జిల్లాలో గతేడాది 36,290 ఎకరాల్లో కోకోను సాగు చేశారు.
- గత రెండు, మూడేళ్లుగా కోకో ధరలు గణనీయంగా పెరగడంతో రూ.40 వేల నుంచి రూ.50 వేలు పలికే కౌలు ధరలు, ఒక్కసారిగా రూ.లక్ష నుంచి రూ.1.20 లక్షలకు చేరాయి. దీంతో పెట్టుబడి అధికమైంది. కానీ, ధర పతనమైంది. రైతులు తీవ్రంగా నష్టపోయారు.

నష్టాల్లో మునిగిపోయాం



కోకో రైతులందరం నష్టాల్లో మునిగిపోయాం. గతేడాది కిలోకు రూ.1,050 వరకు ఇచ్చారు. నేడు రూ.400 మాత్రమే ఇస్తున్నారు. రైతులు చాలా పెట్టుబడి పెట్టారు. వ్యాపారులందరూ సిండికేట్ అయిపోయి రైతులను ముంచేశారు. బయటి వ్యాపారులను రానీయకుండా, వారు కొనుగోలు చేయకుండా రైతులను నష్టాలపాలు చేశారు.

– వంకినేని లక్ష్మీనారాయణ, వంగూరు, లక్ష్మీపురం గ్రామం, ఏలూరు జిల్లా

గిట్టుబాటు ధర కల్పించాలి



నాకున్న కొద్దిపాటి కొబ్బరితోటలో అంతర పంటగా కోకో సాగు చేస్తున్నా. గతేడాది కిలో రూ.800–రూ.1,200 మధ్య ధర పలికింది. ఇప్పుడు కిలో ధర రూ.400కి దిగజారింది. పెట్టుబడి వ్యయం పెరిగి, ఆదాయం తగ్గి ఆర్థికంగా నష్టపోతున్నా. అంతర్జాతీయ మార్కెట్ ప్రకారం కోకో గింజలకు కిలో రూ.900 గిట్టుబాటు ధర కల్పించి, వెంటనే కొనుగోలు చేసే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– తూత బాలాజీ కుమార్, తడికలపూడి గ్రామం, కామవరపుకోట మండలం

18, 19తేదీల్లో 'ఎస్ఆర్ఎం'లో గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్

ఎస్ఆర్ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య నారాయణరావు



గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్ వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఆర్ఎం ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆచార్య నారాయణరావు

సాక్షి, అమరావతి: అమరావతిలోని ఏపీఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఈనెల 18, 19 తేదీల్లో జాతీయ స్థాయి గ్రీన్ హైడ్రోజన్ సమ్మిట్–2025 నిర్వహించనున్నట్లు ఎస్ఆర్ఎం గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (రీసెర్చ్) ఆచార్య డి.నారాయణరావు తెలిపారు. సదస్సు వివరాలను మంగళవారం ఆయన విజయవాడలో వెల్లడించారు. ఈ సదస్సును సీఎం చంద్రబాబు ప్రారంభిస్తారని చెప్పారు. నీతి ఆయోగ్ మెంబర్ డాక్టర్ వీకే సారస్వతతో పాటు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఎంపీ పెమ్మసాని ఈ సదస్సులో పాల్గొంటున్నారని ఆయన వివరించారు. దేశవ్యాప్తంగా ఉన్న నిపుణులు, పారిశ్రామికవేత్తలు, పరిశోధన రంగ నిపుణులు, పెట్టుబడిదారులను సదస్సుకు ఆహ్వానిస్తున్నామని చెప్పారు. రానున్న రోజుల్లో ప్రభుత్వ సహకారంతో ఎస్ఆర్ఎంలో ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించి హైడ్రోజన్‌తో నడిచే కారును రూపొందిస్తామని వివరించారు. ఈ సదస్సు నిర్వహణకు నెడ్ క్యాప్ సంపూర్ణ సహకారం అందిస్తోందని కార్పొరేషన్ వీసీ, ఎండీ ఎం.కమలాకరబాబు తెలిపారు.

సీపీఎస్ ఉద్యోగులందరికీ రాష్ట్ర కాంట్రిబ్యూషన్ పెంచాలి

ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్

సాక్షి, అమరావతి: సీపీఎస్ ఉద్యోగులందరికీ రాష్ట్ర కాంట్రిబ్యూషన్ పెంచాలని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.సతీష్, సీఎం దాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 2019 జనవరి 1న సెంట్రల్ గెజిట్ నోటిఫికేషన్‌ను అమలు చేస్తూ మంగళవారం ప్రభుత్వం సీపీఎస్‌లో ఉన్న ఆలిండియా సర్వీసెస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వ వాటా కింద 10 నుంచి 14శాతం పెంచుతున్నట్లుగా ఉత్తర్వులు విడుదల చేసిందని ఆయన చెప్పారు. ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లకు మాత్రమే కాకుండా రాష్ట్రంలోని ప్రతి సీపీఎస్ ఉద్యోగికి 10 నుంచి 14 శాతం వరకు కాంట్రిబ్యూషన్ పెంచాలని, లేదంటే అందరికీ సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని వారు కోరారు. కూటమి ప్రభుత్వానికి ఆలిండియా సర్వీసెస్ అధికారులంటే ముద్దు అని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను తక్కువ చేస్తోందని మండిపడ్డారు.

పాత పెన్షన్ సాధన పోరాటానికి సంఘీభావం

2004 లోపు ఉద్యోగాల్లో చేరిన ఉపాధ్యాయులు, ఉద్యోగులకు పాత పెన్షన్ స్కీం వర్తింపచేయాలని చేస్తున్న పోరాటానికి ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘాలు మద్దతు ప్రకటించాయి. 2004 తర్వాత నియామకాలు జరిగిన వారికి పాత పెన్షన్ విధానాన్ని వర్తింప చేస్తూ కేంద్ర ప్రభుత్వం 57 ఉత్తర్వులు జారీ చేసిందని, ఈ జీవోను అనేక రాష్ట్రాలు అమలు చేశాయని ఏపీటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హృదయరాజు, చిరంజీవి పేర్కొన్నారు.

ఈ ఏడాదిలో 30వేల మంది మహిళలను

వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దుతాం

మున్సిపల్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్

సాక్షి, అమరావతి: ఈ ఆర్థిక సంవత్సరంలో పట్టణ ప్రాంతాల్లోని 30వేల మంది మహిళలను వ్యాపారవేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్ కుమార్ అన్నారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి లైవ్లీహుడ్స్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ యాక్సిలరేషన్ (లీప్) కార్యక్రమం మంగళవారం తాడేపల్లిలో నిర్వహించారు. ఇందులో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు లీప్ కార్యక్రమం దోహదం చేస్తుందన్నారు. మహిళల్లో ఉన్న ప్రతిభ, నైపుణ్యాలను వెలికితీసి వారిని బలమైన వ్యాపారవేత్తలుగా తయారు చేసేందుకు మెప్మా చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. లీప్ కార్యక్రమం ద్వారా ఈ ఏడాది రాష్ట్ర మంతా ఆడిట్ నిర్వహిస్తామన్నారు. మెప్మా ఎండీ ఎన్.తేజ్ భరత్ మాట్లాడుతూ.. మహిళల ఉన్నతికి మెరుగైన సలహాలు, సహాయ సహకారాలు అందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా స్వయం సాధికారతతో అభివృద్ధిలోకి వచ్చిన పలువురు మహిళలు తమ అభిప్రాయాలను పంచుకున్నారు.

సాగుబడి

పునర్వసు కార్తె: జూలై 19 వరకు
పుష్యమి కార్తె: 20 నుంచి



ఆక్వాలో కొత్త అధ్యాయం
చందువా పార

తీరప్రాంతంలోని ఆక్వా రైతులు ఉప్పునీటిలో పెంచదగిన జలపుష్పాల జాబితా చాలా తక్కువ. ఒకటి, రెండు రకాల ఉప్పునీటి రొయ్యలే అధికంగా సాగు చేస్తారు. వీటికి జబ్బులు సోకినప్పుడు ప్రత్యామ్నాయంగా ఉప్పునీటిలో సాగు చేయటానికి పండుగప్ప తర్వాత అంతకన్నా ఖరీదైన ఇండియన్ పాంపనొ (చందువా పార) చేప ఇప్పుడు అందుబాటులోకి వచ్చింది. ఇది వేగంగా పెరుగుతుంది. రుచిగా ఉంటుంది. సాగులో రొయ్యలు, పంచుగప్ప చేపతో పోల్చితే రైతులకు రిస్క్ చాలా తక్కువ. మరణాల శాతం తక్కువ. అయితే, దీని హేచరీ అందుబాటులో లేక పోవటం పెద్ద సమస్యగా ఉండేది. ఇప్పుడు ఆ కొరత తీరింది. విశాఖపట్నంలోని భారతీయ సముద్ర చేపల పరిశోధనా సంస్థ (సీఎంఎఫ్ఆర్ఐ) ప్రాంతీయ కార్యాలయ శాస్త్రవేత్తల సుదీర్ఘ పరిశోధనలు సత్ఫలితాలనిస్తున్నాయి.

సముద్రంలో పెరిగే చందువా జాతి చేపలను కోస్తా ప్రాంతంలో ఉప్పునీటి చెరువుల్లో పెంచడానికి అవసరమైన కాప్టివ్ బ్రీడింగ్, సీడ్ ప్రొడక్షన్ వంటి సాంకేతికతలన్నిటినీ సిఎంఎఫ్ఆర్ఐ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. చెరువుల్లోనే కాదు సముద్రతీరంలోని తక్కువ లోతులో నీటిపై తేలాడే పంజరాలను ఏర్పాటు చేసి చందువా పార చేపలను సాగు చేసే మారికల్చర్ టెక్నాలజీని కూడా సీఎంఎఫ్ఆర్ఐ రూపొందించింది. విశాఖ కార్యాలయంలో ఏర్పాటైన మారికల్చర్ ప్రయోగశాలలో చందువా పారతో పాటు బొంతలు (గ్రూపర్స్), అప్పాలు చేప (జాన్స్ స్నాపర్) వంటి జాతులపై కూడా విస్తృత పరిశోధనలు జరుగుతున్నాయి. కోస్తా ప్రాంత ఆక్వా రైతులు వైరస్ తదితర జబ్బులు, తుపాన్లు, ఎగుమతి మార్కెట్లలో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ఉంటారు. ఎగుమతి మార్కెట్ కోసం పెంచే రొయ్యలతో పాటు.. స్థానిక ప్రీమియం మార్కెట్ల కోసం పంట మార్పిడిగా పెంచే అధిక ధర గల చందువా పార వంటి చేపల సాగు సాంకేతికతలు అందుబాటులోకి రావటం ఆక్వా రైతులకు నిజంగా శుభవార్త. సీఎంఎఫ్ఆర్ఐ రూపొందించిన 'చందువా పార' చేపల సాగు పద్ధతులను సవివరంగా ఇప్పుడు తెలుసుకుందాం....

చందువా పార చేపల విశేషాలు...

శాస్త్రీయ నామం: ట్రాచినోటస్ మూకలీ.

కుటుంబం: కారంగిడే (జాక్స్, పాంపానోస్).

పరిమాణం: 10 గ్రాములు లేదా 2 అంగుళాల పిల్లలను చెరువుల్లో వేసుకుంటే 5-6 నెలల్లో అర కిలోకి పైగా సైజుకు పెరుగుతుంది.

స్వరూపం: బాగా ఎదిగిన చేపలు బంగారు నారింజ రంగులో మెరిసిపోతూ ఆకర్షణీయంగా ఉంటాయి. ముఖ్యంగా పొట్ట దగ్గర.

ఆవాసం: తీరప్రాంత సముద్ర జలాలు, నదీ ముఖ ద్వారాలలో కనిపిస్తాయి.

ఆహారం: తిండిపోతు. మాంసాహారి. అయితే, పండుగప్ప చేపల మాదిరిగా తమ జాతి చిన్న చేపలను పెద్ద చేపలు తినవు.

ఆక్వాకల్చర్‌కు అనుకూలతలు: మెరుగైన మాంసం నాణ్యత, అధిక మార్కెట్ డిమాండ్ కారణంగా సముద్ర జలాల్లోని పంజరాల్లో, కోస్తా ప్రాంత ఉప్పునీటి చెరువుల్లో సాగుకు.. ఈ రెండింటికీ అనువైనది.

వ్యాధి నిరోధకత: చాలా రకాల వ్యాధులను తట్టుకోగల నిరోధక శక్తి ఉండటం దీనికి గల మరో ప్రత్యేకత.

కేజ్ కల్చర్: తీరప్రాంత సముద్ర జలాల్లో కేజ్ కల్చర్ ద్వారా విజయవంతంగా సాగవుతోంది, వాణిజ్య స్థాయిలో పెంచటానికి అనువైనది.

సంతానోత్పత్తి: చందువా పార చేపలు ఫిబ్రవరి–ఏప్రిల్ నెలల్లో సంతానోత్పత్తి చేస్తాయి.

విత్తనోత్పత్తి: సెంట్రల్ మెరైన్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (సీఎంఎఫ్ఆర్ఐ) శాస్త్రవేత్తలు భారతీయ పాంపనో చేపల సంతానాభివృద్ధి, లార్వా పెంపకం, నర్సరీ పెంపకం కోసం సాంకేతికతను అభివృద్ధి చేశారు.

మార్కెట్ డిమాండ్: అధిక మార్కెట్ డిమాండ్ ఉంది. మంచి దేశీయ ధర పలుకుతోంది. రైతు నుంచి కిలో రూ. 35–450 వరకు పలుకుతోంది. వాణిజ్యపరంగా లాభదాయకమైన ఆక్వాకల్చర్ చేపల జాతిగా గుర్తింపు వచ్చింది.

ఒమేగా-3 కొవ్వు ఆమ్లాలు: చందువా పార చేపల్లో ఒమేగా–3 కొవ్వు ఆమ్లాలు పుష్కలంగా ఉన్నాయి. ఇవి గుండెకు చాలా ఆరోగ్యకరమైనవి. అందువల్ల హెల్దీ ఫ్యాట్ వనరుగా నిపుణులు చెబుతున్నారు.

చందువా పార సాగులో ఉత్తమ యాజమాన్య పద్ధతులు...

- 30 గ్రాముల కన్నా పెరిగిన సైజు పిల్లలను పెంపకపు చెరువులో వేసుకుంటే ఎక్కువ శాతం బతుకుతాయి.
- చెరువులో నీటి నాణ్యత, రంగులను మెరుగ్గా ఉంచుకోవాలంటే ప్రతి 15 రోజులకోసారి ఎరువులు వేసుకోవాలి.
- నీట కరిగిన ప్రాణవాయువు (డీఓ) ఎప్పుడూ 4 పిపిఎం కన్నా ఎక్కువగానే ఉండాలి.
- చెరువులో ఫీడింగ్ జోన్‌ను ఏర్పాటు చేసుకొని మేత వేస్తూ ఉంటే మేత వృథాని అరికట్టవచ్చు.
- నీటి నాణ్యత బాగుండాలంటే చెరువులోని నీటి పరిమాణంలో 25% నీటిని ప్రతి నెలా మార్చాలి. ఈ పని చేస్తే ప్రొబయోటిక్స్, వాటర్ కండిషనర్ మందులు వాడకుండా నివారించుకోవచ్చు.
- చెరువులో రోజుకు కనీసం 10 గంటల సేపు ఎకరానికి 2-3 పెడల్ వీల్ ఎయిరేటర్లను ఉపయోగించాలి.
- మంచి ఆదాయం రావాలంటే ఎకరానికి 5 వేల పిల్లలను వేసుకోవటం ఉత్తమం.

చందువా పార ఆక్వాకల్చర్ రంగంలో వచ్చే కొద్ది ఏళ్లలో కొత్త అధ్యాయాన్ని సృష్టించే అవకాశాలు కనిపిస్తున్నాయని నిపుణులు చెబుతున్నారు. జాతీయ మత్స్య అభివృద్ధి బోర్డు (ఎన్.ఎఫ్.డి.బి.) ఆర్థిక తోడ్పాటుతో బ్లూరెవెల్యూషన్ స్కీమ్ కింద ఆంధ్రప్రదేశ్‌లోని అనేక కోస్తా ప్రాంత చెరువుల్లో చందువా పార చేపలను సీఎంఎఫ్ఆర్ఐ ప్రోత్సహించి సాగు చేయించింది. సీఎంఎఫ్ఆర్ఐ విశాఖపట్నం ప్రాంతీయ కార్యాలయంలో సీనియర్ శాస్త్రవేత్తలు శేఖర్ మేగరాజన్, రితేష్ రంజన్, బిజి జేవియర్, శుభదీప్ ఘోష్, పొన్నగంటి శివ, నరసింహులు సిద్ధు, ఆర్.పి. వెంకటేష్, ఇమెల్డా జోసెఫ్‌లు సంయుక్తంగా అందించిన వివరాల ప్రకారం చందువా పార సాగులో అనేక దశల్లో చేపట్టాల్సిన ఉత్తమ యాజమాన్య పద్ధతుల విశేషాలు ఇలా ఉన్నాయి.

చెరువును సిద్ధం చేయటం...

చెరువు అంతటినీ 1.5 మీటర్ల లోతున సమతలంగా ఉండేలా రూపొందించాలి. పాత చెరువుల్లో ఈ చేపలను పెంచుతూ ఉంటే, చెరువు అడుగున పేరుకున్న వ్యర్థాలను తొలగించి, దుక్కి చెయ్యాలి. చందువా పార చేపల సాగుకు నీటి ఉదజని సూచిక (పిహెచ్) సగటున 7.5–8.5 మధ్యన ఉండాలి. మట్టి పిహెచ్ ఎంత ఉందన్న దాన్ని బట్టి చెరువును సిద్ధం చేసేటప్పుడు ఎంత సున్నం చల్లాలో ఆధారపడి ఉంటుంది.

నీటి యాజమాన్యం...

చెరువును సిద్ధం చేసిన తరువాత కాలువ నీటిని లేదా రిజర్వాయర్ నీటిని నేరుగా చెరువులోకి నింపవచ్చు. నీటిని నింపేముందు 100 మైక్రోమీటర్ల కన్నా తక్కువగా ఉండే ఫిల్టర్ బ్యాగ్‌లను విధిగా ఉపయోగించాలి. చెరువు నీటిలోకి అవాంఛనీయ చేపల పిల్లలు రాకుండా ఉండేందుకు ఈ ఫిల్టర్లు అవసరం. 10 పిపిఎం క్లోరినేషన్ ద్వారా చెరువును శుద్ధి చెయ్యాలి. నాలుగురోజుల తర్వాత క్లోరినేషన్ నీటిలో యూరియా (2.5 పిపిఎం), ట్రిపుల్ సూపర్ ఫాస్ఫేట్ (టిఎస్‌పి) (3 పిపిఎం) వాడి చెరువు నీటి నాణ్యతను సరిచేయాలి. చెరువులో సేంద్రియ లేదా రసాయనిక ఎరువులు వేసుకోవటం ద్వారా ప్లవకాల (ప్లాంక్టన్)ను వృద్ధి చెయ్యాలి. ప్లాంక్టన్ చెరువు నీటిలో పెరిగితేనే నీటి నాణ్యత సరిగ్గా ఉంటుంది. చందువా పార చేలు 5 నుంచి 40 పిపిటి వరకు ఉప్పు నీటిని తట్టుకోగలవు. అయితే, 15–35 పిపిటి మధ్యలో నీటి ఉప్పదనం ఉంటే మంచి అనుకూల వాతావరణం ఉంటుంది.

చేపపిల్లల రవాణా...

అత్యంత శ్రద్ధతో చేపపిల్లల రవాణా చెయ్యాలి. ఈ క్రమంలో ఒత్తిడి కలిగితే చేప పిల్లలకు సూక్ష్మ క్రిములు సోకడమే కాకుండా అవి చనిపోయే పరిస్థితి కూడా వస్తుంది. ఆక్సిజన్ సరఫరా ఉండేలా సెంటెక్స్ ట్యాంకుల్లో గానీ పాలిథిన్ బ్యాగుల్లో గానీ తీసుకెళ్లాలి. చేప పిల్లల సైజు, ప్రయాణ వ్యవధి, చేపపిల్లల సంఖ్య, రవాణా పద్ధతిని బట్టి జాగ్రత్తలు తీసుకోవాలి.

నర్సరీ పెంపకం...

నర్సరీ పెంపకంలో ఒక మీటరుకి 200 నుండి 280 పిల్ల చేపలు తగినంత స్టాకింగ్ డెన్సిటీగా చెప్పవచ్చు. చేపలు కృత్రిమ మేతకు అలవాటుపడతాయి. అయితే మేతలో మంచి పోషక విలువలు ఉండాలి. మొదటి దశలో ప్రోటీన్ 45%, కొవ్వు శాతం 111% చొప్పున శరీర బరువులో 10%, రోజుకు 4 - 5 సార్లు మేత ఇవ్వాలి. 2–3 గ్రాములు పెరిగిన పిల్లచేపలను 30–40 గ్రాములు వచ్చే వరకు 60 నుంచి 75 రోజుల పాటు పెంచాలి. ఆ తర్వాత పెంపకపు చెరువు (గ్రో–అవుట్ చెరువు) ల్లోకి మార్చాలి. ఆక్సిజన్ స్థాయిలు 4 పిపిఎం కన్నా ఎక్కువ ఉండేలా నిర్వహిస్తే 90–95% చేపలు పెరిగి పెద్దవుతాయి.

ఎకరానికి 5 వేలు...

నర్సరీలో పెంచిన చేప పిల్లలను ఎకరాకు 5000 చొప్పున పెద్ద చెరువుల్లోకి వదలాలి. ఎయిరేటర్లను చెరువు నాలుగు దిక్కులా అమర్చాలి. క్రమం తప్పకుండా ఎరువులు చల్లుతూ నీటి నాణ్యత చూసుకుంటూ ఉండాలి. అధిక ప్రోటీన్‌తో కూడిన నీటిపై తేలాడే (40% ప్రోటీన్ - 10% కొవ్వు పదార్థాలు) ఆహార గుళికలను చేప పిల్లలకు ఆహారంగా ఇవ్వాలి. మేత ఇస్తున్నప్పుడు గాలివాటానికి అనుగుణంగా, మేత వృథా కాకుండా పంజరపు లోపలి వలలో ఫీడ్ మెష్ ను (1 మీటర్ల లోతు) ఏర్పాటు చెయ్యాలి. తొందరగా జీర్ణం కావడం కోసం, ప్రతి 3 గంటలకొకసారి దాణా ఇవ్వాలి. ప్రతి పదిహేను రోజులకొకసారి చేపల బరువు తూచి, వాటి ఎదుగుదల ఆధారంగా దాణాను లెక్కవేసుకోవాలి. 10 నుంచి 20 గ్రాములు ఉన్న చేప పిల్లలని క్యూబిక్ మీటరుకు 1 నుంచి 1.25 చొప్పున చెరువులో వదిలినప్పుడు.. 5–6 నెలల్లో 500–600 గ్రాములకు, 12 నెలల వ్యవధిలో కిలో బరువుకు పెరుగుతాయని గత అనుభవాలు చెబుతున్నాయి. అయితే, 100 గ్రాము సైజులో ఉన్నప్పుడు చెరువులో వేస్తే కేవలం 7 నెలల్లోనే కిలో సైజుకు పెరుగుతాయి. చెరువు అడుగు భాగంలో ఉండే చెత్తని, బురదని ఎప్పటికప్పుడు తీసివేసి, శుభ్రపరుస్తుంటే విష వాయువుల ప్రభావం తక్కువగా ఉండి నీటి నాణ్యత మెరుగ్గా ఉంటుంది.


• పీవీసీ పైపులతో చేసిన ఫీడింగ్ ప్రదేశాలు


• సిల్వర్ పాంపెనో ఫింగర్‌లింగ్స్



• నర్సరీలో పెంచిన తర్వాత 25 గ్రా. వరకు పెరిగిన పాంపెనో

6 రాష్ట్రాల్లో మార్కెట్లు అనువైనవి...

మార్కెట్ సైజుకు పెరిగిన చందువ పార చేపలను డ్రాగ్ నెట్ వల సహాయంతో అత్యంత సులువుగా పట్టుకుని వెలికితీయవచ్చు. బయటికి తీసిన చేపలను మొత్తాన్ని వెంటనే పరిశుభ్రమైన నీటిలో కడిగి, ఐస్ ముక్కల్లో పెట్టి, తాజాగా, నాణ్యత పోకుండా చూడాలి. ప్లాస్టిక్ ట్రేలలో గానీ లేదా థర్మోకోల్ పెట్టెల్లో గాని పెట్టి, ఐస్ ముక్కలు చల్లి ప్యాక్ చేస్తారు. పెద్దమొత్తంలో సాగు చేయడమే కాకుండా, స్థానిక మార్కెట్‌లో గిరాకీని బట్టి బ్యాచ్ పద్ధతిలో కూడా హార్వెస్ట్ చేయవచ్చు. కేరళ, పశ్చిమ బెంగాల్, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, మహారాష్ట్రలలో ఎంపిక చేసిన కొన్ని మార్కెట్లు చందువా పార చేపలను విక్రయించడానికి అత్యంత అనువైనవి. ఒక ఎకరాకు 5000 పిల్లలు వేస్తే కేజీకి రూ. 325 చొప్పున (ఇది పాత ధర) రైతుకు సుమారు రూ. 2.25 లక్షలు నికర లాభం వస్తుందని అంచనా.

•

ఏ పంట పండించినా రైతులకు నికరంగా ఎంత ఆదాయం వస్తోంది అన్న దాన్ని బట్టే ఆ పంట మేలైనదా కాదా అనే విషయం ఆధారపడి ఉంటుంది. రైతుకు నికరాదాయం పెరగాలంటే ఏ పంటలు పండించాలి? పొట్ట పోసుకోవటానికి ఎంతోచ్చినా చాల్లే అని అందరూ పండించే సాధారణ పంటలు పండిస్తే లాభం లేదు. విదేశాలకు అవసరమైన పంటలేవో గ్రహించి పండించి, ఎగుమతి చెయ్యాలి. ఈ విషయంలో గుజరాత్, తమిళనాడు రాష్ట్రాలు ముందంజలో ఉన్నాయి. వాళ్లు పండించి ఎగుమతి చేస్తున్నవి ఇవీ: 1. తెల్ల ఉల్లిపాయ ఒరుగులు 2. మునగ ఆకుల పొడి!



ఇటు ఉల్లి ఒరుగులు

తెల్ల ఉల్లిపాయల ఒరుగులు అనాదిగా ఎగుమతి అవుతున్న సరుకు కాదు. ఇటీవల కాలంలోనే దీనికి విదేశాల్లో గిరాకీ వచ్చింది. ఆ అవకాశాన్ని అందరికన్నా ఎక్కువగా ఉపయోగించుకుంటున్నది గుజరాత్ రైతులే. ఆ తర్వాత మహారాష్ట్ర. విదేశాల్లో రెస్టారెంట్లు, హోటళ్లలో తెల్ల ఉల్లిపాయల ఒరుగుల్ని వాడుతున్నారు. అమెరికా, కెనడా, మెక్సికో, యూకే, జర్మనీ, ఫ్రాన్స్, స్పెయిన్‌లో ఈ ట్రెండ్ నడుస్తోంది. తెల్ల ఉల్లిపాయలకు ఎర్ర ఉల్లిపాయల కన్నా 30% అధిక ధర ఇచ్చి వ్యాపారులు కొంటున్నారు. అందుకే ఇవి పండిస్తున్నా అంటున్నారు గుజరాత్ భావ్‌నగర్ జిల్లా రైతు రాహుల్. తెల్ల ఉల్లి ఒరుగులు మన దేశంలో కిలోకి రూ. 130 ధర ఉంది. అంతర్జాతీయ మార్కెట్లో 2.5–3 డాలర్లు (రూ. 215–255) పలుకుతోంది. సరుకు నాణ్యత, దేశాన్ని బట్టి ధరల్లో మార్పుంటుంది. కొనే వారుంటే పండించే వారూ ఆసక్తి చూపుతారు. అలాగే తెల్ల ఉల్లి సాగు విస్తీర్ణం పెరుగుతూ వెళ్లింది. మొత్తం ఉల్లి సాగు విస్తీర్ణంలో 40% తెల్ల ఉల్లిదే. గత ఏడాది గుజరాత్‌లో 81,011 హెక్టార్లలో సాగైన ఉల్లి ఈ ఏడాది 93,500 హెక్టార్లకు పెరిగింది.



అటు మునగ పొడి!

ఇక రెండోది మునగ ఆకుల పొడి సంగతి. ప్రపంచంలో 80% మునగ సాగుతో భారత్ ముందుంది. మునగ సాగు, ఎగుమతిలో తమిళనాడు రైతులు అగ్రగామిగా ఉన్నారు. అయితే, ఇతర రాష్ట్రాల్లో రైతులు కూడా దీనిపై దృష్టి పెడుతున్నారు. ఉదాహరణకు పంజాబ్ రైతు పంకజ్ కుమార్. తోటి రైతులంతా వరి, గోధుమ పండిస్తుంటే ఆయన మాత్రం పదేళ్ల క్రితమే 1.5 ఎకరాల్లో మునగాకు పండించటం మొదలు పెట్టి, ఇప్పుడు పదెకరాలకు విస్తరించారు. జర్మనీ తదితర దేశాల్లో మునగాకు పొడికి గిరాకీ ఉంది. అందుకే మూడేళ్ల నుంచి అధిక సాంద్రతలో మునగాకును సాగు చేస్తున్నా అంటున్నారాయన. మునగ కొద్దిపాటి నీటి వసతితోనే వేగంగా పెరిగే పంట. అయితే, 6–10 ఏళ్ల తర్వాత పంట మార్పిడి చేయటం తప్పనిసరి అంటున్నారు సీనియర్ రైతులు. ఇంతకీ, ఇతర రాష్ట్రాల్లో రైతులు ముందున్నారా? అక్కడి ప్రభుత్వాలే రైతులచేత ముందడుగు వేయిస్తున్నాయా?? అని మనం ఆలోచించుకోవాలి. మనం ముందంజలో ఉండే పంటలు చాలా ఉన్నా.. ఈ రెండు పంటల విషయంలో ఇతర రాష్ట్రాలను చూసి మనమూ నేర్చుకుంటే మేలు!

బిజినెస్ రీల్

హైదరాబాద్‌లో వైజ్ కార్యాలయం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: రెమిటెన్స్ తదితర సేవలు అందించే ఫిన్‌టెక్ సంస్థ వైజ్ తాజాగా హైదరాబాద్‌లో తమ కార్యాలయాన్ని ప్రారంభించింది. ఇక్కడ ఇప్పటివరకు ఇంజినీరింగ్, ఆపరేషన్స్ మొదలైన విభాగాల్లో 70 మంది సిబ్బందిని తీసుకున్నామని, రాబోయే రోజుల్లో మరింత మందిని రిక్రూట్ చేసుకుంటామని హైదరాబాద్ కేంద్రానికి సారథ్యం వహిస్తున్న వైజ్ ఏపీఏసీ ఇంజినీరింగ్ విభాగం హెడ్ స్మృతి రవి తెలిపారు. రెమిటెన్సులకు సంబంధించి మిగతా అంతర్జాతీయంగా ఇతరత్రా సంస్థలు 3–5 శాతం వరకు ఫీజులు వసూలు చేస్తుండగా, తమ ఫీజులు సగటున 0.58 శాతమే ఉంటున్నాయని, 65 శాతం వరకు సీమాంతర నగదు బదిలీలు ఇన్‌స్టంట్‌గా ఇరవై సెకన్లలోపే జరుగుతున్నాయని వివరించారు. 2013లో భారత్‌లోకి ఇన్‌వార్డ్ రెమిటెన్సులు, 2021లో ఔట్‌వార్డ్ నగదు బదిలీ సేవలు ప్రారంభించినట్లు స్మృతి తెలిపారు.

మార్కెట్లోకి వివో ఎక్స్ ఫోల్డ్5

ధర రూ. 1,49,999



న్యూఢిల్లీ: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ వివో మరింత పల్చని ఎక్స్ ఫోల్డ్5 ఫోల్డబుల్ ఫోన్‌ను భారత మార్కెట్లో ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 1,49,999గా ఉంటుంది. 217 గ్రాముల బరువు, 8.03 అంగుళాల మెయిన్ డిస్‌ప్లే, 6.53 అంగుళాల కవర్ స్క్రీన్, 600 ఎంఏహెచ్ బ్యాటరీ, 2కే జియస్ మాస్టర్ డిస్‌ప్లే మొదలైన ఫీచర్లు ఇందులో ఉన్నాయి. జూలై 30 నుంచి వివో ఇండియా ఈ–స్టోర్, ఫ్లిప్‌కార్ట్‌తో పాటు రిటైల్ ఔట్‌లెట్స్‌లో ఇది లభిస్తుంది. జులై 29 వరకు ప్రీ–బుక్ చేసుకోవచ్చు. ఎస్‌బీఐ, హెచ్‌డీఎఫ్‌సీ తదితర బ్యాంక్ కార్డులపై 10 శాతం వరకు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్‌లాంటి ఆఫర్లు ఉన్నాయి.

హార్వర్డ్ బిజినెస్ స్కూల్‌లో కేస్ స్టడీగా జెడ్ బ్లాక్



ముంబై: మాజీ క్రికెటర్ ఎంఎస్ ధోని ప్రచారకర్తగా వ్యవహరించే జెడ్ బ్లాక్ అగరబత్తుల సంస్థకు అరుదైన గౌరవం లభించింది. ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ బిజినెస్ స్కూల్ జెడ్ బ్లాక్ విజయాల విశ్లేషణకు తమ విద్యార్థులు, ప్రాక్టీషనర్లకు ఒక కేస్ స్టడీగా ఎంపిక చేసుకుంది. దీనిపై ఎండీపీహెచ్ అంకిత్ అగర్వాల్ స్పందిస్తూ... స్థానిక ఇళ్ల నుంచి అంతర్జాతీయ తరగతి గదుల వరకు ఎదిగిన మా విజయ ప్రస్థానం భారతీయ వ్యాపార సంస్థలకు గర్వకారణమన్నారు. 2027 నాటికి రూ.1,000 కోట్ల సంస్థగా అవతరించడం లక్ష్యమన్నారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

16-7-2025

విశాఖ	540–00
చిత్తూరు	583–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	496–00
విజయవాడ	515–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	510–00
వరంగల్	512–00
రిటైల్ ధర	5.70

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ETERNAL	271	2.9
TITAN	3,402.00	1.2
HDFCLIFE	767	1.05
ONGC	244.15	0.99
GRASIM	2,789.00	0.98

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
JIOFIN	319.3	-2
TECHM	1,575.00	-1.72
WIPRO	254.25	-1.57
INFY	1,570.50	-1.53
HCLTECH	1,613.50	-1.51

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	7,010
ఎన్‌ఎస్‌ఈ	96,302
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,30,513
ఎఫ్ఐఐ	+ 120
డీఐఐ	+ 1,555

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	66.44	$ 66.98
బ్రెంట్	68.75	$ 69.21

జూన్‌లో ఎగుమతులు ఫ్లాట్

- 35 బిలియన్ డాలర్లు
- దిగుమతులు 54 బిలియన్ డాలర్లు
- సేవల ఎగుమతులు 33 బిలియన్ డాలర్లు
- నాలుగు నెలల కనిష్టానికి ద్రవ్యలోటు



న్యూఢిల్లీ: వస్తు ఎగుమతులు జూన్ నెలలో 35.14 బిలియన్ డాలర్లుగా (రూ.2.99 లక్షల కోట్లు) నమోదయ్యాయి. 2024 జూన్ నెలలోనూ ఎగుమతులు 35.16 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. దిగుమతులు 3.71 శాతం క్షీణించి 53.93 బిలియన్ డాలర్లు (రూ.4.58 లక్షల కోట్లు)గా ఉన్నాయి. దీంతో వాణిజ్య లోటు నాలుగు నెలల కనిష్ట స్థాయిలో 18.78 బిలియన్ డాలర్లకు పరిమితమైంది. పెట్రోలియం ఉత్పత్తులు, వస్త్రాలు, రత్నాభరణాలు, లెదర్, ముడి ఇనుము, ఆయిల్ సీడ్స్, జీడి పప్పు, దినుసులు, పొగాకు, కాఫీ ఎగుమతులు క్రితం ఏడాది జూన్ నెలతో పోల్చి చూస్తే క్షీణించాయి. ఇదే కాలంలో ఇంజనీరింగ్, టీ, బియ్యం, రెడీ మేడ్ వస్త్రాలు, కెమికల్స్, సముద్ర ఉత్పత్తులు, ఫార్మా ఎగుమతుల పరంగా సానుకూల వృద్ధి నమోదైంది. జూన్ త్రైమాసికంలో వస్తు, సేవల ఎగుమతులు 210 బిలియన్ డాలర్లుగా ఉంటాయని.. క్రితం ఏడాది ఇదే త్రైమాసికం కంటే 6 శాతం ఎక్కువని వాణిజ్య శాఖ కార్యదర్శి సునీల్ భత్వాల్ తెలిపారు.

ఎగుమతులు–దిగుమతులు

- జూన్‌లో పెట్రోలియం ఉత్పత్తుల ఎగుమతులు క్రితం ఏడాది ఇదే నెలతో పోల్చి చూస్తే 16 శాతం తగ్గి 4.61 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ వరకు మొదటి త్రైమాసికంలో 15 శాతానికి పైగా తగ్గి 17.4 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తుల ఎగుమతులు జూన్‌లో 47 శాతం పెరిగి 4.14 బిలియన్ డాలర్లకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి జూన్ మధ్య కాలంలోనూ ఎగుమతులు 47 శాతం వృద్ధితో 12.4 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో (ఏప్రిల్–జూన్) వస్తు ఎగుమతులు క్రితం ఏడాది ఇదే కాలంతో పోల్చి చూస్తే 2 శాతం పెరిగి 112 బిలియన్ డాలర్లకు చేరాయి. దిగుమతులు సైతం 4 శాతానికి పైగా పెరిగి 179 బిలియన్ డాలర్లకు చేరాయి.
- ఏప్రిల్–జూన్ కాలంలో వాణిజ్య లోటు 67 బిలియన్ డాలర్లుగా నమోదైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 62 బిలియన్ డాలర్లుగా ఉంది.
- ముడి చమురు దిగుమతులు 8 శాతం తగ్గి 25.73 బిలియన్ డాలర్లుగా, బంగారం దిగుమతులు 26 శాతం తగ్గి 1.9 బిలియన్ డాలర్ల చొప్పున జూన్‌లో నమోదయ్యాయి.
- జూన్‌లో సేవల ఎగుమతుల విలువ 32.84 బిలియన్ డాలర్లుగా ఉంటుందని వాణిజ్య శాఖ అంచనా వేసింది. క్రితం ఏడాది ఇదే కాలంలో ఇది 28.67 బిలియన్ డాలర్లుగా ఉంది. సేవల దిగుమతుల విలువ 15 బిలియన్ డాలర్ల నుంచి 17.58 బిలియన్ డాలర్లకు పెరిగింది.

మెసేజీలకు టెల్కోల గుర్తింపు 'కోడ్'

న్యూఢిల్లీ: సిసలైన మెసేజీలు, స్పామ్ మెసేజీలను మొబైల్ యూజర్లు సులువుగా గుర్తించేందుకు వీలుగా టెలికం సంస్థలు ప్రత్యేక విధానాన్ని అమల్లోకి తెచ్చాయి. దీని ప్రకారం మెసేజీల వర్గీకరణ బట్టి వాటిని పంపించే వారి పేరు లేదా హెడర్‌కి ముందు నిర్దిష్ట 'కోడ్' వస్తుంది. ప్రమోషనల్ ఎస్ఎంఎస్‌లకు 'పి' (ఆంగ్ల అక్షరం), సర్వీస్ సంబంధితమైనవాటికి 'ఎస్', లావాదేవీలకు సంబంధించిన వాటికి 'టి', ప్రభుత్వం నుంచి వచ్చే మెసేజీలకు 'జి' అని కనిపిస్తుంది. దీనితో ఏ ఎస్ఎంఎస్ ఏ కోవకి చెందినదో సులువుగా తెలుసుకునేందుకు వీలవుతుందని, అవాంఛిత మెసేజీలకు దూరంగా ఉండొచ్చని టెలికం సంస్థల సమాఖ్య సీవోఏఐ డైరెక్టర్ జనరల్ ఎస్‌పీ కొచర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇలాంటి ఓటీటీ యాప్‌లపై నియంత్రణ లేకపోవడమే ఇందుకు కారణమన్నారు. ఈ నేపథ్యంలో ఓటీటీ యాప్‌లను కూడా నియంత్రణ పరిధిలోకి తీసుకొస్తే వినియోగదారుల ప్రయోజనాలను పరిరక్షించేందుకు వీలవుతుందని కొచర్ పేర్కొన్నారు.

పట్టణాల్లో పెరిగిన నిరుద్యోగ రేటు

- జూన్‌లో 7.1 శాతం
- దేశవ్యాప్తంగా 5.6 శాతం
- మే నెలలోనూ ఇదే రేటు
- పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: జూన్‌లో నిరుద్యోగిత (నిరుద్యోగం రేటు) ఫ్లాట్‌గా నమోదైంది. ఈ ఏడాది మే నెలలో మాదిరే జూన్‌లోనూ 5.6 శాతం వద్దే (అన్ని వయసుల వారికి సంబంధించి) కొనసాగింది. ఏప్రిల్‌లో ఉన్న 5.1 శాతం కంటే కొంచెం ఎక్కువ. కానీ, పట్టణాల్లో నిరుద్యోగ రేటు వరుసగా మూడో నెలలోనూ పెరిగింది. జూన్‌లో 7.1 శాతంగా నమోదైంది. ఈ మేరకు పీరియాడిక్ లేబర్‌ఫోర్స్ సర్వే వివరాలను కేంద్ర గణాంకాలు, ప్రణాళికల అమలు శాఖ విడుదల చేసింది. పనిచేయగల అర్హతలు ఉండీ, పనిదొరక్క ఖాళీగా ఉన్న వారి గురించి ఈ గణాంకాలు తెలియజేస్తాయి.

- పట్టణాల్లో అన్ని వయసుల వారికి సంబంధించిన నిరుద్యోగ రేటు 7.1 శాతానికి చేరింది. మేలో 6.9 శాతం, ఏప్రిల్‌లో 6.5 శాతం చొప్పున ఉండడం గమనార్హం.
- పట్టణాల్లో 15.29 సంవత్సరాల వారిలో నిరుద్యోగ రేటు జూన్‌లో 18.8 శాతానికి పెరిగింది. మే నెలలో ఇది 17.9 శాతంగా ఉంటే, ఏప్రిల్‌లోనూ 17.2 శాతంగా ఉంది.
- దేశవ్యాప్తంగా మహిళలకు సంబంధించి నిరుద్యోగ రేటు జూన్‌లో 5.6 శాతానికి తగ్గింది. మేలో ఇది 5.8 శాతంగా ఉంది.
- 15–29 ఏళ్ల వయసు వారిలో నిరుద్యోగిత మే నెలలో 15 శాతంగా ఉంటే, జూన్‌లో 15.3 శాతానికి పెరిగింది.
- కార్మిక శక్తి భాగస్వామ్య రేటు (15 ఏళ్లకు మించిన వారిలో) మే నెలలో ఉన్న 54.8 శాతం నుంచి జూన్‌లో 54.2 శాతానికి పరిమితమైంది. గ్రామీణ ప్రాంతాల్లో 56.1 శాతం, పట్టణ ప్రాంతాల్లో 50.4 శాతం చొప్పున జూన్‌లో నమోదైంది.
- పురుష కార్మికుల భాగస్వామ్య రేటు గ్రామీణ ప్రాంతాల్లో 78.1 శాతం, పట్టణాల్లో 75 శాతం చొప్పున ఉంది. మే నెలతో పోల్చి చూస్తే స్వల్పంగా తగ్గింది. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా కార్మికుల భాగస్వామ్య రేటు జూన్‌లో 35.2 శాతానికి తగ్గింది.
- గ్రామీణ ప్రాంతాల్లో స్త్రీ, పురుషుల నిరుద్యోగ రేటు పెరగడానికి.. సొంత పనులపై ఆధారపడడం వల్లేనని ఈ సర్వే నివేదిక తెలిపింది.

ఆదాయం తక్కువ.. క్రెడిట్ కార్డు ఉందిగా!

- రూ.50,000లోపు వేతన జీవుల ధోరణి
- 93 శాతం క్రెడిట్ కార్డులపై ఆధారపడిన వారే

ముంబై: తక్కువ ఆదాయ వర్గాల వారికి క్రెడిట్ కార్డులు ఆధారంగా మారుతున్నాయి. రూ.50,000లోపు ఆదాయం ఉన్న వేతన జీవుల్లో 93 శాతం మంది అవసరాల కోసం క్రెడిట్ కార్డులపై ఆధారపడుతున్నట్లు థింక్ 360.ఏఐ సంస్థ అధ్యయనంలో వెల్లడైంది. స్వయం ఉపాధిపై ఉన్న వారిలో 85 శాతం మంది క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్నారు. ఉద్యోగం, స్వయం ఉపాధిలో ఉన్న 20,000 మంది వ్యక్తుల ఏడాది కాల ఆర్థిక తీరును అధ్యయనం చేసి థింక్ 360 ఈ వివరాలను విడుదల చేసింది. బై నౌ పే లేటర్ (బీఎన్‌పీఎల్/ఇప్పుడు కొని తర్వాత చెల్లించే సదుపాయం) సేవలను సైతం వీరు వినియోగిస్తున్నారు. స్వయం ఉపాధిలోని వారిలో 18%, వేతన జీవుల్లో 15% మంది బీఎన్‌పీఎల్‌ను వినియోగిస్తున్నారు. ఒకప్పుడు ఆకాంక్షలుగానే ఉన్న క్రెడిట్ కార్డులు, బీఎన్‌పీఎల్ సేవలు నేడు నిపుణుల నుంచి తాత్కాలిక ఉద్యోగుల వరకు.. ప్రతి ఒక్కరికీ నిత్యావసరంగా మారాయని థింక్360 వ్యవస్థాపకుడు, సీఈవో అమిత్ దాస్ తెలిపారు. డిజిటల్ రుణాల్లో ఫిన్‌టెక్‌లు పోషిస్తున్న ముఖ్య పాత్రను కూడా ఈ సంస్థ తన నివేదికలో ప్రస్తావించింది.



నిరుద్యోగులకు ఇన్ఫీ మద్దతు

ఫౌండేషన్ ద్వారా రూ. 200 కోట్ల పెట్టుబడి

బెంగళూరు: సాఫ్ట్‌వేర్ సేవల దేశీ దిగ్గజం ఇన్ఫోసిస్ దేశీయంగా యువతకు చేయూతనివ్వనుంది. ఇందుకు సీఎస్ఆర్ విభాగం ఇన్ఫోసిస్ ఫౌండేషన్.. తాజాగా ఇన్ఫోసిస్ స్ప్రింగ్ బోర్డ్ లైవ్‌లీహుడ్ ప్రోగ్రామ్‌కు తెరతీసింది. తద్వారా 2030కల్లా 5 లక్షల మంది ఉద్యోగార్థులకు అర్థవంతమైన ఉపాధిని కల్పించేందుకు దారి చూపనుంది. ఇందుకు తొలి దశలో రూ. 200 కోట్లు వెచ్చించనుంది. గ్రాడ్యుయేట్లు, అండర్‌గ్రాడ్యుయేట్లకు ఉపాధి కల్పించడంపై దృష్టి సారించనుంది. సైన్స్, టెక్నాలజీ, ఇంజినీరింగ్, మ్యాథమెటిక్స్(స్టెమ్), నాన్‌స్టెమ్ రంగాలలో యువతకు మద్దతివ్వనుంది. నైపుణ్య పెంపు కార్యక్రమాలపై దృష్టి పెట్టడం దేశీయంగా అతిపెద్ద అవకాశమని ఇన్ఫోసిస్ ఫౌండేషన్ ట్రస్టీ సుమిత్ విర్మాణీ ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఐపీవోకు 2 కంపెనీలు రెడీ

- సెబీ నుంచి తాజాగా గ్రీన్ సిగ్నల్
- జాబితాలో స్టడ్స్ యాక్సెసరీస్
- వియ్‌వర్క్ ఇండియా మేనేజ్‌మెంట్



న్యూఢిల్లీ: పబ్లిక్ ఇష్యూ చేపట్టేందుకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నుంచి తాజాగా రెండు కంపెనీలకు గ్రీన్ సిగ్నల్ లభించింది. జాబితాలో వియ్‌వర్క్ ఇండియా మేనేజ్‌మెంట్, స్టడ్స్ యాక్సెసరీస్ నిలిచాయి. ఈ రెండు కంపెనీలు 2025 ఫిబ్రవరి, మార్చిలో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. కాగా.. ఈ ఏడాది మార్చిలో వియ్‌వర్క్ ఇండియా లిస్టింగ్ ప్రతిపాదనను సెబీ నిలిపి ఉంచిన సంగతి తెలిసిందే. అయితే తాజాగా అనుమతించింది. ఇతర వివరాలు చూద్దాం..

ఎంబసీ గ్రూప్ నుంచి

2017లో ప్రారంభమైన వియ్‌వర్క్ ఇండియా మేనేజ్‌మెంట్.. ఐపీవోలో భాగంగా 4.37 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయానికి ఉంచనుంది. ప్రమోటర్ ఎంబసీ గ్రూప్ సంస్థ ఎంబసీ బిల్డ్‌కాన్ ఎల్ఎల్‌పీతోపాటు.. ప్రస్తుత వాటాదారు సంస్థ 1 ఏరియల్ వే టెనెంట్ లిమిటెడ్ షేర్లను ఆఫర్ చేయనున్నాయి. వెరసి ఐపీవో నిధులు కంపెనీకి చేరబోవు. కంపెనీ ప్రధానంగా ప్రీమియం ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్ సదుపాయాలు కల్పిస్తోంది. అధిక నాణ్యతతోకూడిన ఫ్లెక్సిబుల్ వర్క్‌స్పేస్‌ను కస్టమర్లకు అందిస్తోంది. చిన్న, మధ్యతరహా, భారీ ఎంటర్‌ప్రైజెస్‌సహా.. వ్యక్తులకు సైతం కార్యాలయ సౌకర్యాలు ఏర్పాటు చేస్తోంది.

హెల్మెట్స్ విక్రయాలు

పబ్లిక్ ఇష్యూలో భాగంగా స్టడ్స్ యాక్సెసరీస్ ప్రమోటర్లతోపాటు ప్రస్తుత వాటాదారులు 77.9 లక్షల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఫలితంగా ఐపీవో నిధులు కంపెనీకి అందబోవు. కంపెనీ ప్రధానంగా స్టడ్స్, ఎస్ఎంకే బ్రాండ్లతో ద్విచక్ర వాహన హెల్మెట్ల డిజైన్, తయారీ, మార్కెటింగ్ చేపడుతోంది. వీటితోపాటు.. ద్విచక్ర వాహన లగేజీ, గ్లోవ్స్, హెల్మెట్ లాకింగ్ డివైస్, రెయిన్ సూట్స్, రైడింగ్ జాకెట్, స్టడ్స్ బ్రాండ్‌తో ఐవేర్‌ను సైతం విక్రయిస్తోంది. కంపెనీ.. భారత్‌సహా 70 దేశాలలో హెల్మెట్లు, అనుబంధ ప్రొడక్టులను విక్రయిస్తోంది.

చైనా కంపెనీతో డిక్సన్ జత

- ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీకి జేవీ
- క్యూ టెక్‌లో 51% వాటా కొనుగోలు



న్యూఢిల్లీ: దేశీ ఎలక్ట్రానిక్ కాంట్రాక్ట్ తయారీ దిగ్గజం డిక్సన్ టెక్నాలజీస్ తాజాగా చైనా కంపెనీ చాంగ్‌కింగ్ యుహాయ్ ప్రెసిషన్ మాన్యుఫాక్చరింగ్ కో లిమిటెడ్‌తో చేతులు కలిపింది. తద్వారా ఏర్పాటు చేయనున్న భాగస్వామ్య కంపెనీ(జేవీ) ద్వారా ప్రెసిషన్ పరికరాల తయారీ, సరఫరాకు తెరతీయనుంది. వీటిని ల్యాప్‌టాప్, మొబైల్, ఆటోమోటివ్, ఐవోటీ తదితర ఎలక్ట్రానిక్ ప్రొడక్టుల తయారీలో వినియోగిస్తారు. రూ. 22,919 కోట్ల విలువైన ప్రోత్సాహక ఆధారిత ఎలక్ట్రానిక్స్ పరికరాల తయారీ పథకంలో పాలుపంచుకోనున్నట్లు డిక్సన్ ప్రకటించింది. చైనా కంపెనీతో దేశీయంగా జేవీ ఏర్పాటుకు కట్టుబడే ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు డిక్సన్ పేర్కొంది. జేవీలో డిక్సన్ వాటా 74 శాతంకాగా.. చైనా కంపెనీకి 26 శాతం వాటా లభించనున్నట్లు వెల్లడించింది.

ఫింగర్ ప్రింట్ మాడ్యూల్స్‌పై దృష్టి

ఐటీ సపోర్ట్, సైబర్ సెక్యూరిటీ, హోమ్ ఆటోమేషన్, వెబ్ డెవలప్‌మెంట్ సర్వీసులందించే కున్షన్ క్యూ టెక్ మైక్రోఎలక్ట్రానిక్స్ (ఇండియా)లో మెజారిటీ వాటా కొనుగోలు చేయనున్నట్లు డిక్సన్ టెక్నాలజీస్ తాజాగా పేర్కొంది. క్యూ టెక్‌లో 51 శాతం వాటా కొనుగోలుకి కట్టుబడే ఒప్పందాన్ని కుదుర్చుకున్నట్లు తెలియజేసింది. అయితే డీల్ విలువను వెల్లడించలేదు. ప్రైమరీ, సెకండరీ పెట్టుబడుల ద్వారా వాటాను సొంతం చేసుకోనున్నట్లు తెలియజేసింది. మొబైల్ హ్యాండ్‌సెట్లకు కెమెరా, ఫింగర్‌ప్రింట్ మాడ్యూల్స్ సరఫరాతోపాటు.. ఐవోటీ సిస్టమ్స్, ఆటోమోటివ్ అప్లికేషన్స్ తయారీ, సరఫరాలకు తాజా భాగస్వామ్యం సహకరించనున్నట్లు వివరించింది.

తాజా వార్తల నేపథ్యంలో డిక్సన్ టెక్ షేరు 0.5 శాతం క్షీణించి రూ. 15,818 వద్ద ముగిసింది.

క్యూ3 ఫలితాలు

ఐసీఐసీఐ లంబార్డ్ లాభం జోరు

క్యూ1లో రూ. 747 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ ఐసీఐసీఐ లంబార్డ్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 29 శాతం జంప్‌చేసి రూ. 747 కోట్లను తాకింది. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 580 కోట్లు ఆర్జించింది. స్థూల రిటెన్ ప్రీమియం రూ. 7,931 కోట్ల నుంచి రూ. 8,053 కోట్లకు ఎగసింది. మొత్తం ఆదాయం సైతం రూ. 5,352 కోట్ల నుంచి రూ. 6,083 కోట్లకు బలపడింది.

ఫలితాల నేపథ్యంలో ఐసీఐసీఐ లంబార్డ్ షేరు బీఎస్ఈలో 1 శాతం క్షీణించి రూ. 2,001 వద్ద ముగిసింది.

హెచ్‌డీబీ ఫైనాన్షియల్ లాభం డౌన్

క్యూ1లో రూ. 568 కోట్లు

న్యూఢిల్లీ: ఎగువతరగతి ఎన్‌బీఎఫ్‌సీ.. హెచ్‌డీబీ ఫైనాన్షియల్ సర్వీసెస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం స్వల్పంగా 2 శాతం నీరసించి రూ. 568 కోట్లకు పరిమితమైంది. గతేడాది (2024–25) ఇదే కాలంలో రూ. 582 కోట్లు ఆర్జించింది. ప్రయివేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజం హెచ్‌డీఎఫ్‌సీ అనుబంధ సంస్థ మొత్తం ఆదాయం మాత్రం రూ. 2,387 కోట్ల నుంచి రూ. 2,726 కోట్లకు బలపడింది. నికర వడ్డీ ఆదాయం 18 శాతం జంప్‌చేసి రూ. 2,092 కోట్లకు చేరింది. కంపెనీ నిర్వహణలోని ఆస్తులు(ఏయూఎం) 15 శాతం ఎగసి రూ. 1,09,690 కోట్లను తాకింది. స్థూల రుణాలు 4 శాతంపైగా పుంజుకుని రూ. 1,09,342 కోట్లకు చేరాయి. రుణ నష్టాలు, ప్రొవిజన్లు రూ. 412 కోట్ల నుంచి రూ. 670 కోట్లకు పెరిగాయి.

ఫలితాల నేపథ్యంలో హెచ్‌డీబీ ఫైనాన్స్ షేరు బీఎస్ఈలో 0.4 శాతం క్షీణించి రూ. 841 వద్ద ముగిసింది.

ఐసీఐసీఐ ప్రు లైఫ్ లాభం జూమ్

క్యూ1లో రూ. 302 కోట్లు

న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ కంపెనీ ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2025–26) తొలి త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలు సాధించింది. ఏప్రిల్–జూన్(క్యూ1)లో నికర లాభం 34 శాతం జంప్‌చేసి రూ. 302 కోట్లను తాకింది. వ్యయాలు తగ్గడం, ప్రీమియం పుంజుకోవడం ఇందుకు సహకరించాయి. గతేడాది(2024–25) ఇదే కాలంలో కేవలం రూ. 225 కోట్లు ఆర్జించింది. కాగా.. నికర ప్రీమియం ఆదాయం సైతం రూ. 7,875 కోట్ల నుంచి రూ. 8,503 కోట్లకు ఎగసింది. మొత్తం వ్యయాలు రూ. 1,985 కోట్ల నుంచి రూ. 1,892 కోట్లకు తగ్గాయి.

ఫలితాల నేపథ్యంలో ఐసీఐసీఐ ప్రు లైఫ్ షేరు బీఎస్ఈలో 0.5 శాతం క్షీణించి రూ. 670 వద్ద ముగిసింది.

క్యూ2లో కార్ల విక్రయాలు డౌన్

- ఏప్రిల్–జూన్‌లో 1.4 శాతం క్షీణత; 10.11 లక్షల యూనిట్లకు పరిమితం
- సియామ్ గణాంకాల్లో వెల్లడి



ముంబై: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో దేశీయంగా కార్లు వంటి ప్యాసింజర్ వాహన విక్రయాలు 1.4 శాతం క్షీణించి 10,11,882 యూనిట్లకు పరిమితమయ్యాయి. గత క్యూ2లో ఇవి 10,26,006 యూనిట్లుగా నమోదయ్యాయి. అటు ద్విచక్ర వాహనాల అమ్మకాలు 6.2 శాతం క్షీణించి 46,85,631 యూనిట్ల నుంచి 46,74,562 యూనిట్లకు తగ్గాయి. కమర్షియల్ వాహనాల (సీవీ) అమ్మకాలు సైతం 0.6 శాతం క్షీణించాయి. 2,24,575 యూనిట్ల నుంచి 2,23,215 యూనిట్లకు తగ్గాయి. అయితే, త్రిచక్ర వాహనాల విభాగం మాత్రం స్వల్పంగా 0.1 శాతం పెరిగి 1,65,211 యూనిట్లకు చేరింది. వాహనాల తయారీ సంస్థల సమాఖ్య సియామ్ మంగళవారం విడుదల చేసిన గణాంకాల్లో ఈ అంశాలు వెల్లడయ్యాయి. తొలి త్రైమాసికంలో ప్యాసింజర్ వాహనాల (పీవీ) అమ్మకాలు మరోసారి 10 లక్షల మార్కును దాటినట్లు సియామ్ తెలిపింది. గత రెండేళ్లలో ఇలా జరగడం ఇది రెండోసారని వివరించింది. అయితే, తొలి త్రైమాసికం చివర్లో అమ్మకాలు నెమ్మదించడంతో గత క్యూ1తో పోల్చినప్పుడు ఈసారి 1.4 శాతం క్షీణత నమోదైందని సియామ్ ప్రెసిడెంట్ శైలేష్ చంద్ర తెలిపారు. క్యూ1లో పీవీల విభాగంలో యుటిలిటీ వాహనాల వాటా 66 శాతానికి పెరిగింది. యూవీల అమ్మకాలు 3.8 శాతం పెరిగాయి. పీవీల ఎగుమతులు 13.2 శాతం వృద్ధితో అత్యధికంగా 2.04 లక్షల యూనిట్లుగా నమోదయ్యాయి.

పండుగ సీజన్‌పై ఆశలు..

రేర్ ఎర్త్ మ్యాగ్నెట్లపై చైనా ఆంక్షల కారణంగా క్యూ1లో ఎదురైన సవాళ్లు సమీప కాలంలోనూ కొనసాగే అవకాశం ఉన్నప్పటికీ, పరిశ్రమకు స్థూల ఆర్థిక పరిస్థితులు సానుకూలంగా కనిపిస్తున్నాయని చంద్ర చెప్పారు. వడ్డీ రేట్లు తగ్గడం, పండుగ సీజన్ రానుండటం వంటి అంశాలతో కొనుగోలుదారుల సెంటిమెంట్ మెరుగుపడొచ్చని ఆశిస్తున్నామని వివరించారు. సాధారణంగా పండుగ సీజన్‌లో పీవీలు, టూ–వీలర్లకు డిమాండ్ నెలకొంటుందని తెలిపారు. అలాగే వర్షపాతం సాధారణ స్థాయి కన్నా అధికంగా ఉండటమనేది గ్రామీణ ప్రాంతాల వారి ఆదాయాలు మెరుగుపడేందుకు దోహదపడుతుందని సియామ్ పేర్కొంది. గ్రామీణ ప్రాంతాల్లో డిమాండ్‌పై ఎక్కువగా ఆధారపడే టూ–వీలర్లు, ఎంట్రీ స్థాయి వాహనాలకు ఇది సానుకూలమని వివరించింది. గత ఆరు నెలల్లో రిజర్వ్ బ్యాంక్ కీలక పాలసీ రేట్లను 100 బేసిస్ పాయింట్ల మేర తగ్గించడంతో క్రమంగా వడ్డీ భారం తగ్గి, వాహన రంగంపై సానుకూల ప్రభావం ఉంటుందని పేర్కొంది.

టాటా క్లిక్‌తో లులులెమన్ జట్టు



న్యూఢిల్లీ: కెనడాకు చెందిన అథ్లెటిక్ దుస్తుల కంపెనీ లులులెమన్ భారత మార్కెట్లోకి ప్రవేశించడంపై కసరత్తు చేస్తోంది. ఇందులో భాగంగా తమ ఫ్రాంచైజీ భాగస్వామిగా టాటా క్లిక్‌ను ఎంపిక చేసుకుంది. ప్రణాళిక ప్రకారం 2026 ద్వితీయార్థంలో తొలి ఆఫ్‌లైన్ స్టోర్‌ను ప్రారంభించనుంది. అలాగే, టాటా క్లిక్‌కి చెందిన టాటా క్లిక్ లగ్జరీ, టాటా క్లిక్ ఫ్యాషన్‌లో కూడా తమ ఉత్పత్తులను విక్రయించనుంది.

ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ స్టోర్స్‌లో లైఫ్‌స్టైల్ దుస్తులు, ఫుట్‌వేర్, యాక్సెసరీలు మొదలైనవి ఉంటాయని సంస్థ తెలిపింది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 30 పైగా దేశాల్లో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు వివరించింది.



ఫౌజా సింగ్ కన్నుమూత

- రోడ్డు ప్రమాదంలో 'శతాధిక మారథాన్ రన్నర్' మృతి
- 89 ఏళ్ల వృద్ధాప్యంలో మొదలైన పరుగు

న్యూఢిల్లీ: పరుగు పెట్టేందుకు, పోటీ పడేందుకు వయస్సు అడ్డంకి కాదని నిరూపించిన 'శతాధిక మారథాన్ రన్నర్' ఫౌజా సింగ్ మృతి చెందారు. అయితే 114 ఏళ్ల ఫౌజాది ఇప్పటికీ సహజ మరణం కాదు. మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆయన మరణించారు. జలంధర్‌లోని సొంతూరు బీస్‌పిండ్‌లో నడక కోసం బయటికెళ్లిన ఆయన్ని గుర్తుతెలియని వాహనం 'ఢీ'కొట్టింది. దీంతో తీవ్రంగా గాయపడి ఆయన మృతి చెందారు. లేటు వయసులో అదికూడా 89 ఏళ్లు వచ్చాక సుదీర్ఘ మారథాన్ పరుగులో పోటీపడిన కురువృద్ధుడిగా ఆయన పేరుగాంచారు. పోటీపడటమంటే కేవలం పేరు నమోదు చేసుకొని నాలుగైదు అడుగులు వేసి ఊరుకోలేదు. పోటీని కడదాకా పూర్తి చేసిన రన్నర్‌గా నిలిచాడు. 90 ఏళ్ల వయసులో లండన్ మారథాన్, న్యూయార్క్ మారథాన్, హాంకాంగ్ మారథాన్ ఇలా ప్రతిష్టాత్మక ఈవెంట్‌లలో ఆయన ఉత్సాహంగా పోటీపడ్డారు. క్రీడలు, చారిటీలకు ఆయన అందించిన సేవలకు గుర్తింపుగా క్వీన్ ఎలిజబెత్-2 చేతుల మీదుగా పురస్కారాన్ని కూడా పొందారు. 2012 లండన్ ఒలింపిక్స్‌లో టార్చ్ బేరర్‌గా వ్యవహరించారు. 2011లో జరిగిన టొరంటో మారథాన్ ఆయన జీవితంలో ఒక గొప్ప పరుగని చెప్పాలి. సరిగ్గా 100 సంవత్సరాల వయసులో పోటీపడిన ఆయన తన వయో విభాగంలో పలు రికార్డులను నమోదు చేశారు. అయితే దురదృష్టవశాత్తు ఈ రికార్డులేవీ 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో నమోదు కాలేదు. ఎందుకంటే ఆయన వద్ద ఎలాంటి జనన ధ్రువీకరణ పత్రం లేకపోవడంతో అధికారికంగా ఈ వయసు అని నిర్ధారణ లేకే అరుదైన గిన్నిస్‌లోకి ఎక్కే అవకాశం దక్కలేదు. వందేళ్లకు పైగా జీవితంలో ఫౌజా సింగ్ ఎక్కువగా బ్రిటన్‌లో గడిపారు. కట్టుకున్న భార్య, కన్న కూతురు, కుమారుడు ఇలా కుటుంబంలోని వారు కన్నుమూశాక మూడేళ్ల క్రితమే ఆయన భారత్‌కు వచ్చారు.



రెండు రోజుల ముందుగానే... క్రికెట్... రైట్ రైట్...



లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ ప్రారంభోత్సవం కంటే ముందే ఏడు క్రీడాంశాల్లో పోటీలు షురూ

- 1900 ఒలింపిక్స్ తర్వాత పునరాగమనం చేయనున్న క్రికెట్
- 2028 విశ్వ క్రీడల షెడ్యూల్ విడుదల చేసిన నిర్వాహకులు
- జూలై 14 నుంచి 30 వరకు విశ్వక్రీడలు

లాస్ ఏంజెలిస్: మరో మూడేళ్ల తర్వాత జరగనున్న లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ షెడ్యూల్ విడుదలైంది. 2028 జూలై 14 నుంచి 30 వరకు ఈ విశ్వక్రీడల సంరంభం కొనసాగనుంది. అయితే సంప్రదాయానికి భిన్నంగా ఈ ఏడాది పలు క్రీడాంశాల షెడ్యూల్‌లో మార్పులు చోటు చేసుకున్నాయి. ఒలింపిక్స్ ప్రారంభ వేడుకకు ముందే ఆరంభమయ్యే క్రీడాంశాల సంఖ్య పెరగగా... విశ్వక్రీడల చివర్లో నిర్వహించే అథ్లెటిక్స్‌ను ఈ సారి ముందే జరపనున్నారు. మొత్తం 351 మెడల్ ఈవెంట్స్ జరగనున్న ఈ విశ్వక్రీడల షెడ్యూల్‌లోని కొన్ని విశేషాలు...

➤ 2028 జూలై 14న లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్ ఆరంభ వేడుక జరగనుండగా... అంతకు రెండు రోజుల ముందే పలు క్రీడా పోటీలు ప్రారంభం కానున్నాయి. 1932, 1984 ఒలింపిక్స్ క్రీడలకు వేదికగా నిలిచిన లాస్ ఏంజెలిస్‌లోని విఖ్యాత ఎల్ఏ మెమోరియల్ కొలోజియంతోపాటు ఇంగ్లెవుడ్‌లోని స్టేట్ ఆఫ్ ఆర్ట్ స్టేడియంలో ప్రారంభోత్సవ వేడుకలు నిర్వహిస్తారు. ముగింపు వేడుకలకు ఎల్ఏ మెమోరియల్ కొలోజియం వేదికగా నిలుస్తుంది.

➤ బాస్కెట్‌బాల్, క్రికెట్, హాకీ, హ్యాండ్‌బాల్, రగ్బీ సెవెన్స్, ఫుట్‌బాల్, వాటర్ పోలో వంటి ఈవెంట్‌లలో పోటీలు ముందే మొదలవనున్నాయి.

➤ 1920 ఒలింపిక్స్ తర్వాత... విశ్వక్రీడల ప్రారంభ వేడుకకు ముందు ఇన్ని క్రీడాంశాల్లో పోటీలు మొదలు కావడం ఇదే తొలిసారి. 2024 పారిస్ ఒలింపిక్స్‌లో ఆర్చరీ, హ్యాండ్‌బాల్, రగ్బీ సెవెన్స్, ఫుట్‌బాల్ పోటీలు మాత్రమే ముందు ప్రారంభించారు.

➤ ప్రధాన క్రీడా వేదిక లాస్ ఏంజెలిస్‌కు 50 కిలోమీటర్ల దూరంలోని పొమెనాలో క్రికెట్ పోటీలు జరగనుండగా... జూలై 12న ప్రారంభం కానున్న ఈ పోటీలు 29న ముగియనున్నాయి. జూలై 20, 29న మెడల్ మ్యాచ్‌లు నిర్వహిస్తారు.

➤ టి20 ఫార్మాట్‌లో నిర్వహించనున్న ఈ టోర్నీలో... పురుషుల, మహిళల విభాగాల్లో ఆరేసి జట్లు పాల్గొననున్నాయి. 1900 ఒలింపిక్స్‌లో చివరిసారి క్రికెట్ పోటీలు నిర్వహించగా... సుదీర్ఘ కాలం తర్వాత తిరిగి ప్రవేశ పెట్టారు.

➤ అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) క్రికెట్‌తో పాటు బేస్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, లాక్రాస్, స్క్వాష్ వంటి పలు క్రీడాంశాలను లాస్ ఏంజెలిస్ ఒలింపిక్స్‌లో చేర్చేందుకు అనుమతి ఇచ్చింది.

➤ ఆరంభ వేడుక తదుపరి రోజు అంటే జూలై 15న ట్రయాథ్లాన్‌లో తొలి మెడల్ ఈవెంట్ జరగనుంది.

➤ ఒలింపిక్స్‌లో స్విమ్మింగ్ పోటీలు ముగిసిన తర్వాత అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం పరిపాటి కాగా... ఈసారి మొదట అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించి చివరి వారంలో స్విమ్మింగ్ ఈవెంట్లు జరుగనున్నాయి.

➤ 2028 జూలై 30న ఒలింపిక్స్ ముగింపు వేడుకలు నిర్వహించనుండగా... చివరగా స్విమ్మింగ్ పోటీలు జరుగుతాయి.

ఇక వన్డే సిరీస్ లక్ష్యంగా...

నేడు ఇంగ్లండ్‌తో భారత మహిళల జట్టు తొలి పోరు

- సాయంత్రం గం. 5:30 నుంచి సోనీ స్పోర్ట్స్‌లో ప్రత్యక్ష ప్రసారం

సౌతాంప్టన్: పరిమిత ఓవర్ల క్రికెట్ సిరీస్‌లో పాల్గొనేందుకు వచ్చిన భారత మహిళల జట్టు మొదటి మిషన్‌ను విజయవంతంగా పూర్తిచేసింది. ఐదు టి20ల సిరీస్‌ను 3-2తో కైవసం చేసుకుంది. ఇప్పుడు రెండో మిషన్ కోసం శ్రమించేందుకు సిద్ధమైంది. భారత్, ఇంగ్లండ్‌ల మధ్య మూడు వన్డేల సిరీస్‌లో భాగంగా నేడు ఇక్కడ తొలి వన్డే జరుగుతుంది. పొట్టి సిరీస్ ఇచ్చిన విజయోత్సాహంతో హర్మన్‌ప్రీత్ బృందం ఆత్మవిశ్వాసంతో ఉండగా... సొంతగడ్డపై సిరీస్‌ను కోల్పోయామన్న కసితో ఇంగ్లండ్ ఉంది. ఈ నేపథ్యంలో వరుసగా వన్డే సిరీస్‌నూ కోల్పోయేందుకు ఏమాత్రం సిద్ధంగా లేని ఆతిథ్య జట్టు తొలి మ్యాచ్ నుంచి పట్టుబిగించాలని భావిస్తోంది.

జోరు మీదున్న టీమిండియా

ఇక్కడ తాజా టి20 సిరీస్‌లోనే కాదు... ఇటీవల శ్రీలంక గడ్డపై జరిగిన ముక్కోణపు వన్డే సిరీస్‌లోనూ భారత్ విజేతగా నిలిచింది. దక్షిణాఫ్రికా, శ్రీలంకలను మట్టికరిపించింది. ఇప్పుడు ఇంగ్లండ్‌తో ద్వైపాక్షిక సిరీస్‌లోనూ గెలిచి వన్డే ప్రపంచకప్‌కు ముందు పూర్తిస్థాయి సన్నద్ధతను చాటాలని హర్మన్‌ప్రీత్ బృందం ఆశిస్తోంది. షఫాలీ వర్మ స్థానంలో యువ ఓపెనర్ ప్రతీక రావల్, స్మృతి మంధాన భారత ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తారు. ముక్కోణపు సిరీస్‌లో చెలరేగిన ప్రతీక, ఇక్కడ టి20 సిరీస్‌లో అదరగొట్టిన మంధాన వన్డేల్లో శుభారంభమిస్తే... జెమీమా, హర్మన్‌ప్రీత్, హర్లీన్, రిచా ఘోష్ మిడిలార్డర్‌ను చక్కబెట్టేస్తారు. ఇక బౌలింగ్ విషయానికొస్తే తెలుగుతేజం స్పిన్నర్ నల్లపురెడ్డి శ్రీచరణి మ్యాచ్ మ్యాచ్‌కి పురోగతి సాధిస్తోంది. ఇంగ్లండ్‌లాంటి పిచ్‌లపై స్పిన్ మ్యాజిక్‌తో ప్రత్యర్థుల్ని కట్టిపడేయడం భారత జట్టుకు అదనపు బలం కానుంది. అనుభవజ్ఞులైన దీప్తి శర్మ, అరుంధతి రెడ్డిలతో కూడిన బౌలింగ్ దళం ఓవరాల్ పటిష్టంగా ఉంది. ఇక ఆతిథ్య జట్టు విషయానికొస్తే రెగ్యులర్ కెప్టెన్ నాట్ సీవర్ బ్రంట్ అందుబాటులోకి రావడం జట్టుకు కాస్త లాభించే అంశం. అయితే 20 ఓవర్లనే సరిగ్గా ఎదుర్కోలేకపోయిన బాధ్యతలేని బ్యాటింగ్ దళంతో 50 ఓవర్ల వన్డేలో ఏమేరకు రాణిస్తుందో చూడాలి.



బ్రిటన్ రాజు చార్లెస్‌తో భారత మహిళల జట్టు

తుది జట్లు (అంచనా)

భారత్: హర్మన్‌ప్రీత్ (కెప్టెన్), స్మృతి మంధాన, ప్రతీక, హర్లీన్, జెమీమా, రిచా ఘోష్, దీప్తిశర్మ, స్నేహ్ రాణా, శ్రీచరణి, అమన్‌జోత్, అరుంధతి.

ఇంగ్లండ్: నాట్ సీవర్ బ్రంట్ (కెప్టెన్), సోఫియా, టామీ బ్యూమోంట్, సోఫీ ఎకిల్‌స్టోన్, లారెన్ బెల్, బౌచియర్, క్యాప్సీ, కేట్ క్రాస్, చార్లీ డీన్, అమీ జోన్స్, లారెన్ ఫిలెర్.

76 భారత్, ఇంగ్లండ్ మహిళల జట్ల మధ్య ఇప్పటి వరకు 76 వన్డేలు జరిగాయి. 34 మ్యాచ్‌ల్లో భారత్, 40 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ గెలిచాయి. మరో రెండు మ్యాచ్‌ల్లో ఫలితం రాలేదు.

35 ఇంగ్లండ్ గడ్డపై ఇంగ్లండ్‌తో భారత జట్టు ఆడిన మ్యాచ్‌లు. ఇందులో 9 మ్యాచ్‌ల్లో భారత్ నెగ్గగా... 24 మ్యాచ్‌ల్లో ఇంగ్లండ్ విజయం సాధించాయి. రెండు మ్యాచ్‌ల్లో ఫలితం రాలేదు.

రుతపర్ణ-శ్వేతపర్ణ జోడీ ఓటమి

టోక్యో: జపాన్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-750 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌కు శుభారంభం లభించలేదు. టోర్నీ తొలి రోజు మహిళల డబుల్స్ విభాగంలో 'పాండా సిస్టర్స్' జోడీ రుతపర్ణ-శ్వేతపర్ణ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగింది. కొకోనా ఇషికావా-మైకో కవాజోయి (జపాన్) ద్వయంతో జరిగిన మ్యాచ్‌లో ఒడిశాకు చెందిన రుతపర్ణ-శ్వేతపర్ణ 13-21, 7-21తో ఓడిపోయింది. 32 నిమిషాల్లో ముగిసిన ఈ మ్యాచ్‌లో రెండు గేముల్లో ఆరంభ దశలో రుతపర్ణ-శ్వేతపర్ణ ఆకట్టుకున్నా... ఆ తర్వాత తడబడ్డారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో దక్షిణ కొరియా ప్లేయర్, ప్రపంచ 14వ ర్యాంకర్ సిమ్ జు యున్‌తో పీవీ సింధు... ప్రపంచ 7వ ర్యాంకర్ పోర్న్‌పవీ చోచువోంగ్ (థాయ్‌లాండ్)తో ఉన్నతి హుడా; రక్షిత శ్రీతో అనుపమ పోటీపడతారు. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో తొలి రౌండ్‌లో చైనా ప్లేయర్ వాంగ్ జెంగ్ జింగ్‌తో లక్ష్య సేన్ ఆడతాడు.



పురుషుల డబుల్స్‌లో భారత్ నుంచి సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి; హరిహరన్-రూబన్ కుమార్ జోడీలు పోటీపడుతున్నాయి. తొలి రౌండ్‌లో కాంగ్ మిన్ హియుక్-కి డాంగ్ జు (దక్షిణ కొరియా)లతో సాత్విక్-చిరాగ్; కిమ్ వన్ హో-సియో సెంగ్ జే (దక్షిణ కొరియా)లతో హరిహరన్-రూబన్ తలపడతారు.

మళ్లీ టాప్-10లోకి షఫాలీ వర్మ

ఐసీసీ మహిళల టి20 ర్యాంకింగ్స్

దుబాయ్: భారత మహిళల క్రికెట్ జట్టు ఓపెనర్ షఫాలీ వర్మ అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) టి20 ర్యాంకింగ్స్‌లో తిరిగి టాప్-10లోకి దూసుకొచ్చింది. ఇంగ్లండ్‌తో సిరీస్‌లో 176 పరుగులతో మెరిసిన షఫాలీ... ఐసీసీ మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో నాలుగు స్థానాలు ఎగబాకి 655 పాయింట్లతో తొమ్మిదో ర్యాంక్‌కు చేరింది. ఫామ్‌లో లేని కారణంగా కొంతకాలంగా జట్టుకు దూరమైన షఫాలీ పునరాగమనంలో ఇంగ్లండ్‌పై 158.56 స్ట్రయిక్‌రేట్‌తో ఆకట్టుకుంది. దాని ఫలితంగానే ర్యాంకింగ్స్‌లో ముందంజ వేసింది. ఈ జాబితాలో భారత్ నుంచి స్మృతి మంధాన (767 పాయింట్లు) మూడో ర్యాంక్‌లో కొనసాగుతోంది. బెత్ మూనీ (794 పాయింట్లు; ఆస్ట్రేలియా), హేలీ మాథ్యూస్ (774 పాయింట్లు; వెస్టిండీస్) తొలి రెండు స్థానాల్లో ఉన్నారు. టీమిండియా మిడిలార్డర్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ రెండు స్థానాలు కోల్పోయి 14వ ర్యాంక్‌కు పరిమితం కాగా... కెప్టెన్ హర్మన్‌ప్రీత్ సింగ్ 15వ స్థానంలో కొనసాగుతోంది. బౌలింగ్ విభాగంలో భారత స్పిన్నర్ దీప్తి శర్మ (732 పాయిట్లు) ఒక స్థానం కోల్పోయి 3వ ర్యాంక్‌లో ఉండగా... రాధా యాదవ్ మూడు స్థానాలు మెరుగుపరుచుకొని 15వ ర్యాంక్‌కు చేరింది. పాకిస్తాన్ బౌలర్ సాదియా ఇక్బాల్ అగ్రస్థానంలో ఉంది. హైదరాబాదీ బౌలర్ అరుంధతి రెడ్డి నాలుగు స్థానాలు ఎగబాకి 39వ ర్యాంక్‌లో నిలిచింది.



భారత్ 'ఎ'కు రెండో ఓటమి

ఆమ్‌స్టెల్వీన్ (నెదర్లాండ్స్): యూరప్ పర్యటనలో భారత్ 'ఎ' పురుషుల హాకీ జట్టుకు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. మంగళవారం ఇంగ్లండ్‌తో జరిగిన హోరాహోరీ పోరులో భారత 'ఎ' జట్టు 2-3 గోల్స్ తేడాతో ఓడింది. మన జట్టు తరఫున మణీందర్ సింగ్, ఉత్తమ్ సింగ్ చెరో గోల్ చేశారు. ఈ టూర్‌లో భాగంగా తొలి మూడు మ్యాచ్‌ల్లో గెలిచి 'హ్యాట్రిక్' నమోదు చేసుకున్న భారత్... ఆ తర్వాత వరుసగా రెండు మ్యాచ్‌ల్లో ఓడింది. 'ప్రతి మ్యాచ్ నుంచి పాఠాలు నేర్చుకుంటున్నాం. గత రెండు మ్యాచ్‌ల్లో పోరాడినా ఫలితం దక్కలేదు. మెరుగైన ప్రత్యర్థులతో మరో మూడు మ్యాచ్‌లు ఆడనున్నాం. వాటిలో మెరుగైన ప్రదర్శన కనబరిచేందుకు ప్రయత్నిస్తాం' అని కోచ్ శివేంద్ర సింగ్ అన్నాడు. తదుపరి మ్యాచ్‌లో బెల్జియంతో భారత జట్టు ఆడుతుంది.

బషీర్ స్థానంలో డాసన్

ఎనిమిదేళ్ల తర్వాత ఇంగ్లండ్ టెస్టు జట్టులో చోటు



లండన్: లెఫ్టార్మ్ స్పిన్నర్ లియామ్ డాసన్ సుదీర్ఘ విరామం అనంతరం ఇంగ్లండ్ టెస్టు జట్టుకు ఎంపికయ్యాడు. భారత్‌తో మాంచెస్టర్‌లో ఈ నెల 23 నంచి జరిగే నాలుగో టెస్టు కోసం డాసన్‌ను తీసుకున్నారు. లార్డ్స్‌లో జరిగిన మూడో టెస్టులో గెలిచిన ఇంగ్లండ్ 2-1తో ఆధిక్యంలో ఉంది. అయితే ఈ టెస్టు సందర్భంగా స్పిన్నర్ షోయబ్ బషీర్ చేతి వేళ్లకు గాయమైంది. దీంతో అతను చివరి రెండు టెస్టులకు దూరమయ్యాడు. అతని స్థానంలోనే డాసన్‌ను తీసుకున్నట్లు ఇంగ్లండ్ క్రికెట్ బోర్డు (ఈసీబీ) ఒక ప్రకటనలో తెలిపింది. 35 ఏళ్ల డాసన్ చివరిసారిగా 2017లో దక్షిణాఫ్రికాతో టెస్టు ఆడాడు. మళ్లీ ఎనిమిదేళ్ల తర్వాత పునరాగమనం చేయనున్నాడు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో 212 మ్యాచ్‌లాడి 371 వికెట్లు తీసిన డాసన్ అంతర్జాతీయ కెరీర్‌లో మాత్రం ఆ మేరకు రాణించలేకపోయాడు. కేవలం 3 టెస్టులు, 6 వన్డేలు, 14 టి20లు మాత్రమే ఆడగలిగాడు.

నాలుగో టెస్టుకు ఇంగ్లండ్ జట్టు: స్టోక్స్ (కెప్టెన్), క్రాలీ, డకెట్, పోప్, రూట్, బ్రూక్, కార్స్, స్మిత్, ఆర్చర్, వోక్స్, డాసన్, బెథెల్, అట్కిన్సన్, జోష్ టంగ్.



అనంత్ బజాజ్ స్మారక తెలంగాణ ఓపెన్ సబ్ జూనియర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ మంగళవారం పుల్లెల గోపీచంద్ అకాడమీలో ముగిసింది. నాలుగు రోజుల పాటు ఈ టోర్నమెంట్‌ను నిర్వహించారు. ఈ టోర్నీ అండర్-15 బాలుర సింగిల్స్‌లో ఎస్.కృష్ణ, బాలికల సింగిల్స్‌లో అవని గోవింద్... అండర్-13 బాలుర సింగిల్స్‌లో డి.రాజ్‌వీర్, బాలికల సింగిల్స్‌లో శాన్వి నిమ్మ విజేతలుగా నిలిచారు. అండర్-15 బాలుర డబుల్స్‌లో చిన్మయ్ వాంఖెడే-కృష్ణ పుప్పల, బాలికల డబుల్స్‌లో మాన్య అగర్వాల్-వై.శ్రుతి... అండర్-13 బాలుర డబుల్స్‌లో అద్వైత్-రాజ్‌వీర్, బాలికల డబుల్స్‌లో ఆభా జాదవ్-దియా ఆనంద్ విజయాన్ని అందుకున్నారు. ముగింపు కార్యక్రమానికి ఎస్ అండ్ పీ గ్లోబల్ సీనియర్ డైరెక్టర్ స్రవంతి ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

ఇంగ్లండ్, న్యూజిలాండ్‌లతో భారత్ వార్మప్ మ్యాచ్‌లు

దుబాయ్: వన్డే ప్రపంచకప్ టోర్నీకి సన్నాహకంగా భారత మహిళల జట్టు రెండు వార్మప్ మ్యాచ్‌లను ఆడనుంది. ఇంగ్లండ్, న్యూజిలాండ్ జట్లతో బెంగళూరు వేదికగా ఈ సన్నాహక మ్యాచ్‌లు ఆడుతుంది. భారత్, శ్రీలంక ఉమ్మడిగా ఆతిథ్యమిచ్చే మహిళల ప్రపంచకప్ ఈ ఏడాది సెప్టెంబర్, అక్టోబర్‌లలో జరుగుతుంది. సెప్టెంబర్ 25న బెంగళూరులోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ గ్రౌండ్‌లో ఇంగ్లండ్‌తో తొలి సన్నద్ధ పోరు ఆడుతుంది. తర్వాత 27న చిన్నస్వామి స్టేడియంలో న్యూజిలాండ్‌తో మరో ప్రాక్టీస్ పోరులో తలపడుతుంది. సెప్టెంబర్ 25 నుంచి 28 వరకు జరిగే 9 వార్మప్ మ్యాచ్‌లు డే-నైట్‌గా జరుగుతాయి. ఇందుకోసం బెంగళూరులో రెండు వేదికలు, కొలంబోలో రెండు వేదికల్ని ఖరారు చేశామని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఆయన ప్రధాని అవుతారని మీకు తెలుసా?

రాహుల్‌పై పిటిషన్‌ను తిరస్కరించిన బాంబే హైకోర్టు

ముంబై: హిందుత్వ నాయకుడు వీర్ సావర్కర్ గురించి చదివి అవగాహన పెంచుకోవాలని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను బాంబే హైకోర్టు మంగళవారం తిరస్కరించింది. సావర్కర్ గురించి రాహుల్‌గాంధీ చేసిన బాధ్యతారహిత ప్రకటనలు గందరగోళాన్ని సృష్టిస్తున్నాయని పిటిషనర్, అభినవ్ భారత్ కాంగ్రెస్ అనే సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు పంకజ్ కుముద్‌చంద్ర ఫడ్నిస్ ఆరోపించారు. ఆయన ప్రధానమంత్రి అయితే, అప్పుడు విధ్వంసం సృష్టిస్తారని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'మీ పిటిషన్‌లో అధ్యయనం చేయమని ఆదేశించాలంటూ మీరు కోరారు. కోర్టు చదవమని అతన్ని ఎలా బలవంతం చేస్తుంది?' అని ప్రధాన న్యాయమూర్తి అలోక్ ఆరాధే, న్యాయమూర్తి సందీప్ మార్నేలతో కూడిన ధర్మాసనం ప్రశ్నించింది. అంతేకాదు.. ఆయన ప్రధాని అవుతారని మాకు తెలియదు.. మీకు తెలుసా? అని ప్రశ్నించింది. గాంధీపై పరువు నష్టం దావా వేసుకునే చట్టపరమైన మార్గం పిటిషనర్‌కు ధర్మాసనం పేర్కొంది. ఈ విషయంలో వీర్ సావర్కర్ మనవడు పుణే కోర్టును ఆశ్రయించారని, విచారణ జరుగుతోందని ధర్మాసనం వెల్లడించింది.

రాజ్యసభ ఛైర్మన్ ధన్‌ఖడ్‌తో ఖర్గే భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: ఏఐసీసీ అధ్యక్షుడు, రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే మంగళవారం ఉపరాష్ట్రపతి, రాజ్యసభ ఛైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్‌ను కలిశారు. ఈ నెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పార్లమెంట్ వర్షాకాల సమావేశాలపై చర్చలు జరిపారు. అనంతరం ఖర్గే 'ఎక్స్'లో '21 నుంచి మొదలయ్యే రాజ్యసభ సమావేశాలు ఫలప్రదంగా జరగాలని ప్రతిపక్షం కోరుకుంటోంది. ప్రజలకు ఆందోళన కలిగిస్తున్న అనేక వ్యూహాత్మక, రాజకీయ, సామాజిక ఆర్థిక అంశాలతోపాటు విదేశాంగ విధానంపై సభలో చర్చించాల్సిన అవసరం ఉంది. దీనిపై రాజ్యసభ ఛైర్మన్‌తో ఫలవంతమైన చర్చలు జరిపాను'అని వెల్లడించారు. ముఖ్యంగా పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్, యుద్ధ విరమణలో అమెరికా జోక్యంపై అధ్యక్షుడు ట్రంప్ చేసిన ప్రకటనలు, అమెరికా సుంకాలు, అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్‌వర్మ అభిశంసన, బిహార్‌లో ఎన్నికల కమిషన్ నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, మణిపూర్‌లో కొనసాగుతున్న ఉద్రిక్త పరిస్థితులు వంటి అంశాలపై చర్చ జరగాలని ఖర్గే చెప్పినట్లు తెలుస్తోంది.

రేపు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల ప్రదానం

సాక్షి, న్యూఢిల్లీ: దేశంలోని పర్యావరణ పరిశుభ్రతకు ప్రతిరూపంగా నిలిచిన నగరాలను సత్కరించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ 2024–25 అవార్డుల ప్రదానం 17న న్యూఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరగనుంది. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అవార్డులను అందజేయనున్నారు. ఈసారి సర్వేక్షణ్‌లో 4,500కు పైగా నగరాలు పాల్గొనగా 3 వేల మంది ప్రత్యేక పరిశీలకులు దేశవ్యాప్తంగా 45 రోజులపాటు పర్యటించారు. 11 లక్షల మంది గృహస్తులు, 14 కోట్ల మంది పౌరులు సర్వేలో పాల్గొన్నారు. మొత్తం నాలుగు కేటగిరీల్లో 78 అవార్డులను ఇవ్వనున్నారు.

కాక్‌పిట్‌లోకి వెళ్లేందుకు ఇద్దరి యత్నం

స్పైస్‌జెట్ విమానం ప్రయాణం ఆలస్యం

న్యూఢిల్లీ: అహ్మదాబాద్ ప్రమాదం తరువాత.. విమానాయన సంస్థల భద్రతపై అనుమానాలు కలుగుతున్న నేపథ్యంలో.. ఇద్దరు ప్రయాణికుల చర్యలు స్పైస్ జెట్ ప్రయాణానికి అంతరాయం కలిగించాయి. సోమవారం ఢిల్లీ నుంచి ముంబై వెళ్లాల్సిన స్పైస్‌జెట్ విమానంలో ఇద్దరు ప్రయాణికులు కాక్‌పిట్‌లోకి ప్రవేశించడానికి ప్రయత్నించారు. మధ్యాహ్నం 12:30 గంటలకు బయలుదేరాల్సిన ఎస్‌జీ 9282 విమానం టేకాఫ్‌కు సిద్ధమవుతుండగా ఈ సంఘటన జరిగింది. వారి సీట్లకు వెళ్లాల్సిందిగా కేబిన్ సిబ్బంది, తోటి ప్రయాణికులు, కెప్టెన్ పదేపదే చెప్పినప్పటికీ వారు పట్టించుకోలేదు. దీంతో ఆ ఇద్దరు ప్రయాణికులను విమానం నుంచి దింపేశారు. ఈ ప్రక్రియ అంతా దాదాపు ఏడు గంటల ఆలస్యానికి దారితీసింది. చివరికి విమానం రాత్రి 7:21 గంటలకు బయలుదేరింది.

పారాగ్లైడర్ కూలిపోయి పర్యాటకుని మృతి

ధర్మశాల: హిమాచల్ ప్రదేశ్‌లో విషాదం జరిగింది. ధర్మశాల శివారులోని పారాగ్లైడింగ్ సైట్‌లో.. పారాగ్లైడర్ కూలిపోవడంతో అహ్మదాబాద్‌కు చెందిన 25 ఏళ్ల సతీష్ రాజేశ్ మరణించాడు. టేకాఫ్ సమయంలో గ్లైడర్ గాల్లోకి లేవలేక కొద్ది దూరం తర్వాత కూలిపోయింది. ఈ ఘటనలో సతీష్‌తోపాటు పైలట్ సూరజ్‌కూ గాయాలయ్యాయి. సతీష్‌కు తల, నోటితోపాటు శరీరంలోని ఇతర భాగాలకూ తీవ్ర గాయాలవ్వడంతో మొదట ధర్మశాలలోని జోనల్ హాస్పిటల్‌లో చికిత్స అందించి, తరువాత టాండా మెడికల్ కాలేజీకి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి మరణించాడు. సూరజ్ చికిత్స పొందుతున్నాడు. ఇంద్రునాగ్‌లో గత ఆరు నెలల్లో ఇది రెండో ప్రాణాంతక పారాగ్లైడింగ్ ప్రమాదం. జనవరిలో, గుజరాత్‌లోని అహ్మదాబాద్‌కు చెందిన 19 ఏళ్ల భావ్‌సర్ ఖుషీ టేకాఫ్ సమయంలో తన గ్లైడర్ కూలిపోవడంతో మరణించింది. ఆమె పైలట్ కూడా ఈ ప్రమాదంలో గాయపడ్డాడు. రెండు కేసుల్లోనూ పారాగ్లైడింగ్ భద్రతా నిబంధనల ఉల్లంఘనలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నటుడు, నిర్మాత ధీరజ్‌కుమార్ కన్నుమూత

ముంబై: బాలీవుడ్ సీనియర్ నటుడు, నిర్మాత ధీరజ్ కుమార్(79) కన్నుమూశారు. న్యూమోనియాతో బాధపడుతున్న ఆయన్ను శనివారం కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆస్పత్రి ఐసీయూలో చేర్పించారు. పరిస్థితి విషమించి మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో తుదిశ్వాస విడిచారని సన్నిహితులు తెలిపారు. ధీరజ్ కుమార్ నటించిన 'రోటీ కపడా ఔర్ మకాన్', నిర్మించిన ఓం నమః శివాయ్, అదాలత్ వంటి టీవీ సీరియళ్లు ఎంతో ప్రజాదరణ పొందాయి. సినిమా, టీవీ రంగాలతో ఈయనకు ఐదు దశాబ్దాల అనుబంధం ఉంది. 1965లో సూపర్‌స్టార్ రాజేశ్ ఖన్నా, సినీ నిర్మాత సుభాష్ ఘాయ్ తదితరులు పాల్గొన్న టాలెంట్ షోలో ఫైనల్‌కు చేరినప్పటి నుంచి వినోద పరిశ్రమతో ధీరజ్ కుమార్ ప్రయాణం మొదలైంది. హిందీతోపాటు పలు పంజాబీ సినిమాల్లోనూ నటించారు.

పరువునష్టం కేసులో రాహుల్‌కు బెయిల్

లక్నో: దేశ సైనిక బలగాలపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ దాఖలైన పరువునష్టం కేసులో కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీకి లక్నో కోర్టు బెయిలిచ్చింది. 2022లో భారత్ జోడో యాత్ర సందర్భంగా రాహుల్ ఆర్మీపై వ్యాఖ్యలు చేసినట్లు మాజీ సైనికాధికారి ఒకరు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదైందని ఆయన లాయర్ ప్రాన్షు అగర్వాల్ చెప్పారు. స్వయంగా హాజరు కావడంతో స్పెషల్ కోర్టు ఆయన్ను బెయిల్‌పై విడుదల చేసిందని తెలిపారు. కోర్టు సూచనల మేరకు పూచీకత్తుతో బెయిల్‌కు దరఖాస్తు చేసుకున్నారన్నారు. రాహుల్ రాకతో కోర్టు పరిసరాల్లో భారీగా పోలీసు బందోబస్తు ఏర్పాటైంది.

కొత్త గెకో జాతి గుర్తింపు

గౌహతి: అసోంలోని బ్రహ్మపుత్ర నది ఒడ్డున బల్లి మాదిరిగా కనిపించే కొత్త గెకో జాతిని పరిశోధకులు కనుగొన్నారు. ఈశాన్య రాష్ట్రాల్లో ఇటువంటి జాతిని కనుగొనడం ఇది రెండోసారని సీఎం హిమంత బిశ్వ శర్మ మంగళవారం తెలిపారు. 'అసోం జీవ వైవిధ్యానికి మరో జాతి జతయింది. బ్రహ్మపుత్ర నది ఉత్తరం ఒడ్డునున్న దీర్ఘేశ్వరి ఆలయం వద్ద కనిపించిన ఈ జాతికి సీనెమాస్పిస్ బ్రహ్మపుత్ర అని పేరు పెట్టారు'అని ఆయన ఎక్స్‌లో వెల్లడించారు. దీని జాడను గుర్తించిన పరిశోధకుల బృందంలో మహారాష్ట్రలోని వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ అండ్ రీసెర్చ్ సొసైటీకి చెందిన అమిత్ సయ్యెద్, ఇండోనేసియాకు చెందిన థసున్ అమరసింఘే, అస్సాంకు చెందిన మధురిమా దాస్, రూపాంకర్ భట్టాచార్య, జయాదిత్య పురకాయస్థ ఉన్నారు. ఇవి పగలు మాత్రమే సంచరించే జీవులు. శ్రీలంకలో మాత్రమే ఇవి ఉంటాయని భావించేవారు. అయితే, సీనెమాస్పిస్ అస్సామిన్సిస్ అనే గెకో జాతి ఉనికి 2000వ సంవత్సరంలో బయటపడటంతో పూర్వకాలంలో శ్రీలంకతో ఈశాన్య భారతానికి సంబంధాలున్నాయనే సిద్ధాంతానికి మరింత బలం చేకూరినట్లయిందని పరిశోధకులు అంటున్నారు.



పిల్లల ఆట వస్తువుల్లా కనిపిస్తున్నవన్నీ బోట్లు. యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో గంగానది పరవళ్లు తొక్కుతుండటంతో మంగళవారం ఇవన్నీ ఇలా ఒక చోటుకు చేరగా తీసిన డ్రోన్ చిత్రమిది.



అమర్‌నాథ్ వార్షిక యాత్ర కొనసాగుతున్న వేళ శ్రీనగర్‌లోని ప్రముఖ పర్యాటక ప్రాంతం లాల్ చౌక్ వద్ద ముందస్తు బందోబస్తులో భాగంగా భద్రతా బలగాల పహారా

స్థానిక జాతులపై పరుల దండయాత్ర

- వలసదారులతో స్థానిక జనాభా స్థితిగతుల్లో మార్పులు
- అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆందోళన

గౌహతి: తమ రాష్ట్రంలోకి వెల్లువెత్తుతున్న వలసలపై అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ ఆందోళన వ్యక్తం చేశారు. స్థానిక జాతులపై దండయాత్ర జరుగుతోందని, ఓ మతానికి చెందిన జనం ఇక్కడి భూములు ఆక్రమించుకుంటున్నారని ఆరోపించారు. స్థానిక జనాభా స్థితిగతుల్లో మార్పులు వస్తున్నాయని చెప్పారు. వలసదారులతో స్థానిక ప్రజలు కష్టాలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. హిమంత బిశ్వ శర్మ మంగళవారం మీడియాతో మాట్లాడారు. పొరుగు రాష్ట్రం(పశ్చిమ బెంగాల్) నుంచి ఓ మతానికి చెందినవారు ఉద్దేశపూర్వకంగా తమ రాష్ట్రంలోకి వస్తున్నారని చెప్పారు. వారికి సొంత రాష్ట్రంలో భూములు, ఇళ్లు ఉన్నప్పటికీ అస్సాంలో అక్రమంగా స్థిరపడుతున్నారని, ప్రభుత్వ, అటవీ భూములు ఆక్రమిస్తున్నారని వివరించారు. వారి వల్ల అడవులు విధ్వంసానికి గురవుతున్నాయని తెలిపారు. అస్సాంలో ఓటర్లుగా పేర్లు నమోదు చేసుకుంటున్నారని ఆక్షేపించారు. వారి సంఖ్య వేలల్లోకి చేరిన తర్వాత ఓటు బ్యాంక్‌గా మారుతుండడంతో రాజకీయ పార్టీలు వలసదారులపై చర్యలు తీసుకోకుండా వెనుకంజ వేసే పరిస్థితి వస్తోందని వెల్లడించారు.

5 నెలలు.. రూ.7వేల కోట్లు

భారతీయుల నుంచి సైబర్ నేరగాళ్లు కొట్టేసిన మొత్తం ● ఓటీపీ, డిజిటల్ స్కాం, క్రిప్టో కరెన్సీ, ఆన్‌లైన్ ఫ్రాడ్‌లతో స్వాహా

సాక్షి, న్యూఢిల్లీ: సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. కేవలం 5 నెలల వ్యవధిలో అక్షరాలా రూ.7వేల కోట్లను దేశ ప్రజల నుంచి కొట్టేశారు. దీనిని బట్టి చూస్తే మే–జూలై మధ్యలో సైబర్ నేరగాళ్లు కొట్టేసిన మొత్తం రూ.10వేల కోట్ల వరకు ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓటీపీ ఫ్రాడ్ మొదలు డిజిటల్ స్కాం వరకు ఒక్కో వ్యక్తిని ఒక్కో రకంగా మోసం చేస్తున్న నేరగాళ్లు లక్షల రూపాయిలు కొల్లగొడుతున్నట్లు కేంద్రం గుర్తించింది. ఈ నేరాలు చేసే వారంతా ఆగ్నేయాసియా దేశాల వాళ్లు కాగా చేయించేది మాత్రం చైనీయులేనని నిఘా విభాగం స్పష్టం చేసింది.

ఐ4సీ ఏం చెబుతోందంటే..

దేశ ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా చేసుకుని వివిధ దేశాలకు చెందిన సైబర్ నేరాలకు వివిధ దేశాలకు చెందిన వారు పాల్పడుతున్నారని హోంశాఖ గుర్తించింది. వివిధ మార్గాల్లో డబ్బు కొట్టేస్తున్న వాళ్లంతా మయన్మార్, కంబోడియా, వియత్నాం, లావోస్, థాయ్‌లాండ్‌లకు చెందిన వారేనని ఇండియన్ సైబర్ క్రైం కో–ఆర్డినేషన్ సెంటర్(ఐ4సీ) డేటా తేల్చింది. వీరి వెనుక ఉన్నది మాత్రం చైనీయులేననేది ఐ4సీ స్పష్టం చేస్తోంది. నెలకు రూ. వెయ్యి కోట్ల వసూళ్లే లక్ష్యంగా వీరు అమాయకులను ఉచ్చులోకి దించుతున్నట్లు తెలిపింది.

డబ్బంతా వెళ్లేది అటే..

సిటిజన్ ఫైనాన్షియల్ సైబర్ ఫ్రాడ్ రిపోర్టింగ్ అండ్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(సీఎఫ్‌సీఎఫ్ఆర్ఎంఎస్) డేటా ప్రకారం దేశంలో జనం నుంచి కొట్టేసిన డబ్బంతా ఆగ్నేయాసియా దేశాలకు వెళుతున్నట్లు వెల్లడైంది. జనవరిలో రూ.1,192 కోట్లు, ఫిబ్రవరిలో రూ.951 కోట్లు, మార్చిలో రూ.1,000 కోట్లు, ఏప్రిల్‌లో రూ.731 కోట్లు, మేలో రూ.999 కోట్లు కొట్టేసినట్లు సమాచారం. ఓటీపీ ఫ్రాడ్స్, డిజిటల్ స్కాం, పోలీసులమని చెప్పి కాల్స్ చేసి బెదిరింపులకు పాల్పడటం, క్రిప్టో కరెన్సీ, లాటరీ స్కాం, క్రెడిట్ కార్డు పాయింట్స్ క్లెయిం, ఈ నెంబర్‌పై ఆఫర్ ఉంది కారు గిఫ్ట్‌గా వస్తుందని చెప్పడం, పెళ్లి చేసుకోవడానికి యూఎస్ నుంచి వస్తున్నట్లు నమ్మబలకడం, లింకులు పంపి డబ్బు కొట్టేయడం తదితర మార్గాల్లో జనం నుంచి లాగేస్తున్నారు.

మన వాళ్లే ఏజెంట్లు

సైబర్ నేరాల పేరుతో అమాయకుల నుంచి డబ్బు కొట్టేసేందుకు దేశంలోని కొన్ని రాష్ట్రాల్లో మనవాళ్లను ఏజెంట్లుగా నియమించుకోవడం గమనార్హం. ఇటీవల ఈ విషయాలు వివిధ రాష్ట్రాల పోలీసుల దర్యాప్తులు తేలాయి. మహారాష్ట్ర, తమిళనాడు, జమ్మూకశ్మీర్, ఉత్తరప్రదేశ్, ఢిల్లీ వంటి ప్రాంతాల్లో వందల కొద్దీ ఏజెంట్లు సైబర్ నేరగాళ్ల సహకరిస్తున్నారు. చైనా నుంచి కీలక వ్యక్తుల సూచనలు.. మయన్మార్, కంబోడియా, వియత్నాం, లావోస్, థాయ్‌లాండ్‌లకు దేశాల నేరగాళ్ల ఆదేశాలతో మనవాళ్లు నేరాల్లో ప్రత్యక్షంగా భాగస్వాములుగా మారుతున్నట్లు గుర్తించారు. ఇటువంటి వాటిపై అప్రమత్తంగా ఉండాలని, వీరి ఉచ్చులో పడొద్దని కేంద్రం పదేపదే హెచ్చరిస్తున్నా కేటుగాళ్లఉచ్చులో జనం పడుతుండటం గమనార్హం.

అనుమానమే లేదు.. ఆంక్షలు ఎదుర్కొంటాం

రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ వెల్లడి

మాస్కో: ఉక్రెయిన్‌పై యుద్ధం ఆపకపోతే రష్యాపై మరిన్ని ఆంక్షలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్ మంగళవారం స్పందించారు. అమెరికా కొత్త ఆంక్షలు విధిస్తే కచ్చితంగా ఎదుర్కొంటామని, అందులో అనుమానమే లేదని తేల్చిచెప్పారు. అమెరికా చర్యలను తట్టుకొని నిలబడే శక్తి రష్యాకు ఉందని స్పష్టంచేశారు. ట్రంప్ హెచ్చరికల వెనుక అసలు కారణాలు ఏమిటో తెలుసుకోవాలని కోరుకుంటున్నామని చెప్పారు. ఉక్రెయిన్‌పై కాల్పుల విరమణకు రష్యా అధినేత పుతిన్ ముందుకు రాకపోతే రష్యాపై 100 శాతం టారిఫ్‌లు విధిస్తామని ట్రంప్ సోమవారం అల్టిమేటం జారీ చేసిన సంగతి తెలిసిందే. పుతిన్ తీరుపట్ల ట్రంప్ ఆగ్రహంతో ఉన్నారు. పగటిపూట ముద్దుగా మాట్లాడుతూ.. రాత్రి పూట ఉక్రెయిన్‌పై క్షిపణులు ప్రయోగిస్తున్నారని పుతిన్‌పై ట్రంప్ నిప్పులు చెరిగారు. రష్యాను కట్టడి చేయడానికి ఉక్రెయిన్‌కు మద్దతుగా మిస్సైల్ సిస్టమ్స్, బ్యాటరీలు అందజేస్తామని ట్రంప్ ఇటీవలే ప్రకటించారు.

'ఈడీ అధికారాల'పై ఈ నెల 31న విచారణ

న్యూఢిల్లీ: మనీ లాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) విషయంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)కి ఉన్న అధికారాలను సమర్థిస్తూ 2022 ఇచ్చిన తీర్పు పట్ల దాఖలైన పిటిషన్లపై ఈ నెల 31వ తేదీన విచారణ చేపడతామని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలియజేసింది. పీఎంఎల్ఏ కింద నిందితులను అదుపులోకి తీసుకోవడానికి, వారి ఆస్తులను అటాచ్ చేయడానికి ఈడీకి అధికారాలు ఉన్నాయని పేర్కొంటూ సుప్రీంకోర్టు 2022లో తీర్పు ఇచ్చింది. ఈ తీర్పును పునఃసమీక్షించాలని కోరుతూ పలు పిటిషన్లు దాఖలయ్యాయి. వాస్తవానికి ఈ పిటిషన్లపై ఈ నెల 16న విచారణ జరగాల్సి ఉండగా, కొన్ని కారణాల వల్ల 31వ తేదీకి వాయిదా వేస్తున్నట్లు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల బాగ్చీతో కూడిన ధర్మాసనం మంగళవారం వెల్లడించింది. అందుకు తమకు అభ్యంతరం లేదని పిటిషనర్ల తరఫు న్యాయవాది కపిల్ సిబల్ చెప్పారు.

డిపార్ట్‌మెంట్ హెడ్ లైంగిక వేధింపులు.. ఆత్మహత్యకు యత్నించిన విద్యార్థిని మృతి

భువనేశ్వర్: వేధింపుల ఫిర్యాదును పట్టించుకోవడం లేదని ఆత్మహత్య ప్రయత్నం చేసిన ఒడిశా విద్యార్థి మృతి మృతి చెందింది. బాలాసోర్‌లోని ఫకీర్ మోహన్ అటానమస్ కాలేజీలో ఇంటిగ్రేటెడ్ బి.ఎడ్ చదువుతున్న 20 ఏళ్ల యువతి.. డిపార్ట్‌మెంట్ హెడ్ సమీర్ కుమార్ సాహూ తనను లైంగికంగా వేధిస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్, స్థానిక పోలీసులకు అధికారికంగా ఫిర్యాదు చేసింది. అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అంతర్గత కమిటీని ఏర్పాటు చేసినప్పటికీ, అది పెద్దగా పురోగతి సాధించలేదు. ఇదే విషయమై శనివారం కళాశాల ప్రిన్సిపాల్‌ను కలిసిన ఆమె.. కొద్దిసేపటికే క్యాంపస్‌లోనే నిప్పంటించుకుంది. ఆమెను మొదట బాలాసోర్ జిల్లా ఆసుపత్రిలో చేర్చి, తరువాత ఎయిమ్స్ భువనేశ్వర్‌కు తరలించారు. 90 శాతం కాలిన గాయాలతో ఆమె ప్రాణాలతో పోరాడింది. తీవ్రమైన గాయాలతో పరిస్థితి విషమించడంతో జూలై 14న ఆమె మరణించింది. నిరంతర వేధింపుల కారణంగా యువతి మానసికంగా బాధపడుతోందని తోటి విద్యార్థులు తెలిపారు. సాహూ పదే పదే అనుచిత డిమాండ్లు చేసేవాడని, అంగీకరించకపోతే ఫెయిల్ చేస్తానని బెదిరించేవాడని వెల్లడించారు. ఘటనపై ఒడిశా ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి విచారాన్ని వ్యక్తం చేశారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. బాధితురాలి కుటుంబానికి పూర్తి మద్దతు, న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. కళాశాల ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ ఘోష్‌ను అరెస్టు చేశారు.

రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం: నవీన్ పట్నాయక్

కాగా, ఇది బీజేపీ ప్రభుత్వం చేసిన సంస్థాగత హత్యని ఒడిశా మాజీ ముఖ్యమంత్రి, బీజేడీ అధినేత నవీన్ పట్నాయక్ మంగళవారం ఆరోపించారు. తీవ్ర పదజాలంతో సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేశారు. న్యాయం కోసం తిరిగి, తిరిగిన ఆమె నిరాశకు గురై ఆత్మహత్య చేసుకుందన్నారు. 'విఫల వ్యవస్థ ఒకరి ప్రాణాలను ఎలా తీస్తుందో చెప్పడానికి ఇదో ఉదాహరణ. విద్యార్థి మృతి అత్యంత బాధాకరం. మరింత బాధాకరమైన విషయం ఏమిటంటే ఇది ప్రమాదం కాకుండా వ్యవస్థ మౌనంగా ఉండటం వల్ల జరగడం. ఆమె తన ప్రాణాలను కోల్పోవడానికి కేవలం శారీరక గాయం మాత్రమే కారణం కాదు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కూడా ఉంది. పోరాటంలో ఆమె ఒంటరిగా మిగిలిపోవడం వల్లే చనిపోయింది'అని పట్నాయక్ పేర్కొన్నారు.

అమెరికాను ముంచెత్తిన వరదలు

రవాణా వ్యవస్థ, విద్యుత్‌కు అంతరాయం

- న్యూయార్క్, న్యూజెర్సీల్లో అత్యవసర పరిస్థితి
- 1,600 విమానాలురద్దు, 10 వేల విమానాల రాకపోకలు ఆలస్యం

వాషింగ్టన్: న్యూయార్క్ నగరంతో సహా అమెరికాలోని ఈశాన్య ప్రాంతంలో కుండపోత వర్షం కురిసింది. అనేక నగరాలను ఆకస్మిక వరదలు ముంచెత్తాయి. దీంతో రవాణా వ్యవస్థకు అంతరాయం ఏర్పడింది. గ్యాస్ స్టేషన్లు, సబ్‌వేలు మునిగిపోయాయి. విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. విమాన రాకపోకలు ఆలస్యమయ్యాయి. సోమవారం సాయంత్రానికే న్యూయార్క్, వాషింగ్టన్, బాల్టిమోర్, నెవార్క్, న్యూజెర్సీ, వర్జీనియా వంటి అనేక ప్రాంతాలలో వరద హెచ్చరికలు జారీ చేశారు. సాయంత్రమే స్టేటెన్ ఐలాండ్, మాన్‌హట్టన్‌లోని కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షం పడింది. న్యూయార్క్‌లో వాహనాలు వరదనీటిలో చిక్కుకున్నాయి. డ్రైవర్లకు రెస్క్యూ సిబ్బంది సహాయం చేశారు. న్యూజెర్సీలో వరదల కారణంగా బస్సులు, రైళ్లు ఆలస్యంగా నడిచాయి. ఆకస్మిక వరదలు, భారీ వర్షాల కారణంగా న్యూజెర్సీ గవర్నర్ ఫిల్ మర్ఫీ అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. పౌరులు ఇళ్లలోనే ఉండాలని, అనవసరమైన ప్రయాణాలను నివారించాలని సూచించారు. న్యూజెర్సీలోని కొన్ని ప్రాంతాల్లో 5 అంగుళాల వరకు వర్షం కురిసింది.

టెక్సాస్‌లో 131కి చేరిన మృతులు..

మరోవైపు టెక్సాస్‌లో వరదల కారణంగా మరణించిన వారి సంఖ్య 131కి పెరిగింది. గ్రేటర్ కెర్‌విల్లే ప్రాంతంలో 97 మంది ఆచూకీ తెలియలేదు. కెర్ కౌంటీ మరణాల్లో దాదాపు మూడింట ఒక వంతు మంది పిల్లలే కావడం గమనార్హం.

విమాన కార్యకలాపాలకు అంతరాయం..

తుఫాను కారణంగా సోమవారం ఒక్క రోజే అమెరికా అంతటా విమాన కార్యకలాపాలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దాదాపు 10,000 విమానాలు ఆలస్యమయ్యాయి. 1,600 కంటే ఎక్కువ రద్దయ్యాయి. ఫ్లోరిడాను భారీ వర్షాలు ముంచెత్తే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరించారు. ఇది విమాన రాకపోకలను మరింత ప్రభావితం చేయనుంది.

వాటికి సొంతింట్లో తిండి పెట్టొచ్చుగా?

ఆ కుక్కలకు వీధుల్లో ఎందుకు ఆహారం అందిస్తున్నారు?

- వీధికుక్కలకు ఫీడింగ్ పాయింట్లు ఏర్పాటుచేయాలన్న పిటిషనర్‌పై సుప్రీం అభ్యంతరం
- ఇప్పటికే వీధిశునకాలు సమస్యగా మారాయని మండిపాటు

న్యూఢిల్లీ: వీధిశునకాలను ఎక్కడపడితే అక్కడ పెంచిపోషిస్తున్న కారణంగా కుక్కలున్న రోడ్లపై చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఒంటరిగా వెళ్లలేని పరిస్థితి దాపురించిందని సర్వోన్నత న్యాయస్థానం అసహనం వ్యక్తంచేసింది. వీధి శునకాల కోసం ప్రత్యేకంగా ఆహారకేంద్రాలు తెరవాలంటూ పిటిషన్ దాఖలుచేసిన ఒక వ్యక్తిపై ఆగ్రహం వ్యక్తంచేస్తూ జస్టిస్ విక్రమ్ నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల సుప్రీంకోర్టు ధర్మాసనం ఆయన తరఫున హాజరైన న్యాయవాదిపై పలు ప్రశ్నలు సంధించింది. ''వీధిశునకాల బాగోగులు పట్టించుకునే ఇలాంటి దయార్ద్ర హృదయుల కోసం కాలనీలోని ప్రతి రోడ్డును, ప్రతి సందును భోజనాల కోసం కేటాయించాలా?. ఆయన ఉండే కాలనీలోని వీధి శునకాలన్నింటికీ ఆయన సొంతింట్లోనే ఆహారం పెట్టొచ్చుగా?. ఎవ్వరూ ఆయనకు అడ్డుచెప్పరు''అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. జంతువుల జనన నియంత్రణ నిబంధనలు, 2023లో 20వ రూల్ ప్రకారమే తమ ఏరియాలోని వీధిశునకాలకు క్లయింట్ ఆహారం పెడుతుంటే ఆయా కాలనీవాసులు, అపార్ట్‌మెంట్ యజమానులు అడ్డుచెబుతున్నారని, వేధిస్తున్నారని పిటిషనర్ తరఫు న్యాయవాది వాదించారు. జనం పెద్దగా తిరగని ప్రాంతాల్లో ఫీడింగ్ పాయింట్లు ఏర్పాటుచేసేలా పురపాలికలను ఆదేశించాలని న్యాయవాది కోరారు. దీనిపై సుప్రీంకోర్టు మండిపడింది. ''మేమొక మంచి సలహా ఇస్తాం. పిటిషనర్ ఇంట్లోనే ఒక షెల్టర్‌ను తెరవండి. అక్కడే ప్రతి ఒక్క వీధిశునకానికి ఆహార ఏర్పాట్లు చేసుకోండి''అని కోర్టు సూచించింది. గ్రేటర్ నోయిడాలో ఇలాంటి పాయింట్లు ఉన్నా నోయిడా సిటీలో లేవని న్యాయవాది వాదించడంతో కోర్టు మళ్లీ స్పందించింది. ''మీరొక సైకిల్ తొక్కుతూ ఉదయం పూట అలా వెళ్లి రండి. వీధి శునకాలున్న రోడ్డులో ఏం జరుగుతుందో మీకే తెలుస్తుంది''అని కోర్టు వ్యాఖ్యానించింది. ''నేను రోజూ ఉదయం వాకింగ్‌కు వెళ్తా. ఎన్నో కుక్కలను చూస్తా'' అని అనడంతో కోర్టు కల్పించుకుని ''ఉదయపు నడకకు వెళ్లే వాళ్లకు వీధిశునకాల బెడద ఎక్కువ. అందులోనూ సైకిల్, ద్విచక్ర వాహనాలు నడిపే వాళ్లకు కుక్కల బెడద మరింత ఎక్కువ. అవి వెంట బడి కిందపడి గాయపడేలాచేస్తాయి. వాటి కారణంగా కిందపడి ప్రాణాలమీదకు తెచ్చుకున్న వాళ్లు ఎంతో మంది ఉన్నారు''అని కోర్టు వ్యాఖ్యానించింది. ఇదే అంశంలో పెండింగ్‌లో ఉన్న ఇతర కేసులతో కలిపి ఈ పిటిషన్‌ను తర్వాత విచారిస్తామని కోర్టు తెలిపింది.

విమానం ఇంజన్ల షట్‌డౌన్ ఘటనలు.. ఐదేళ్లలో 65

సహచట్టం దరఖాస్తుకు అందజేసిన సమాచారంలో డీజీసీఏ వెల్లడి

హైదరాబాద్: అహ్మదాబాద్ ఘటన అనంతరం విమాన ప్రమాదాలకు సంబంధించిన ఒళ్లు గగుర్పొడిచే అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. గత ఐదేళ్ల కాలంలో విమానాల ఇంజన్లు షట్‌డౌన్ అయిన ఘటనలు 65 నమోదవగా, ప్రమాదంలో ఉన్నామంటూ పైలట్లు కేవలం 17 నెలల వ్యవధిలోనే 11సార్లు కాల్ చేసినట్లు వెల్లడైంది. ఇందులో అహ్మదాబాద్ ఘటన, ఇండిగో విమానాన్ని దారి మళ్లించిన ఘటనలను మినహాయించారు. సమాచార హక్కు చట్టం కింద టైమ్స్ ఆఫ్ ఇండియా పంపిన దరఖాస్తుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) అందజేసిన సమాధానంలో ఈ వివరాలుండటం గమనార్హం. అహ్మదాబాద్‌లో ఎయిరిండియా విమానం దుర్ఘటనకు ఇంజన్ ఫ్యూయల్ షట్‌డౌన్ కారణం కావచ్చునంటూ ప్రాథమిక నివేదిక అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో బయటకు వచ్చిన ఈ వివరాలు విమాన ప్రయాణికులకు భయం పుట్టించేలా ఉన్నాయి.

మెరుగ్గా లేని భారత్ రికార్డు

దేశంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న విమానయాన సంస్థల్లో ఇంజిన్ లోపాల ఘటనలు నెలకు కనీసం ఒకటి చొప్పున నమోదవుతున్నాయి. ఎయిరిండియా డ్రీమ్‌లైనర్ ఘటన ఇందుకు తాజా ఉదాహరణగా డీజీసీఏ పేర్కొంది. గడిచిన ఐదేళ్ల 2020–2025 మధ్య కాలంలో సంభవించిన ఇంజన్ షట్‌డౌన్ ఘటనల్లో టేకాఫ్‌తోపాటు ఆకాశంలో ఉన్న సమయంలోనూ జరిగినవి ఉన్నాయంది. అయితే, చాలా సందర్భాల్లో పైలట్లు పనిచేసే ఒక్క ఇంజన్‌తోనే విమానాలను దగ్గర్లోని ఎయిర్‌పోర్టుల్లో సురక్షితంగా ల్యాండ్ చేశారని తెలిపింది. టర్బయిన్ పనిచేయకపోవడం నుంచి ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాల్లో లోపాల వరకు అన్ని సాంకేతిక అంశాలను కలిపి నిపుణులు ఇంజన్ షట్‌డౌన్‌గా పేర్కొంటున్నారని డీజీసీఏ వివరించింది. 2024 జనవరి 1–2025 మే 31 మధ్య కాలంలో ప్రమాదంలో ఉన్నామంటూ పైలట్లు కాల్ చేసిన ఘటనలు 11 నమోదయ్యాయని, ఇందులో సాంకేతికలోపాలు, ఎమర్జెన్సీ ల్యాండింగ్‌కు సాయం కోరడం వంటివి ఉన్నాయని డీజీసీఏ పేర్కొంది. ఈ 11 విమానాల్లో నాలుగు హైదరాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండయ్యాయంది. ప్రమాదంలో ఉన్నామంటూ పంపే సంకేతాలు (మేడే కాల్స్) సర్వసాధారణంగా జరుగుతుండేవేనని నిపుణులు అంటున్నారు. అయితే, ఇందులో భారత్‌కు ఏమంత సంతృప్తికరమైన రికార్డులేదని పెదవి విరుస్తున్నారు. ఈ విషయంలో ఇంటర్నేషనల్ సివిల్ ఏవియేషన్ ఆర్గనైజేషన్ విడుదల చేసిన జాబితాలో భారత్ 48వ స్థానంలో నిలిచింది.

అశోకుడికి బౌద్ధమత దీక్ష ఇచ్చిన గురువు ఎవరు?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
ఇండియన్ హిస్టరీ

మౌర్య యుగం

1. భారతదేశంలో అత్యధిక ప్రాంతాన్ని ఒకే పాలన కిందికి తీసుకొచ్చిన మొదటి పాలకులు ఎవరు?
ఎ) మౌర్యులు బి) నంద
సి) హర్యాంక డి) గుప్త
2. మౌర్య వంశ స్థాపకుడైన చంద్రగుప్త మౌర్యుడి కులాన్ని గురించి ప్రస్తావించిన గ్రంథం ఏది?
ఎ) పరిశిష్ట పర్వన్
బి) బృహత్కథా మంజరి
సి) ముద్రా రాక్షసం డి) కథాసరిత్సాగర
3. కౌటిల్యుడు 1000 కార్షాపణాలకు చంద్రగుప్త మౌర్యుడిని కొని, తక్షశిలలో విద్యాభ్యాసం చేయించినట్లు తెలుపుతున్న సాహిత్యం ఏది?
ఎ) జైన సాహిత్యం బి) బౌద్ధ సాహిత్యం
సి) వైదిక సాహిత్యం డి) పైవేవీ కావు
4. కిందివాటిలో సరైంది ఏది?
ఎ) చంద్రగుప్తుడు చివరి నందరాజు ధననందుడిని ఓడించి, మౌర్య సామ్రాజ్యాన్ని స్థాపించాడు
బి) చంద్రగుప్తుడికి పర్వతకుడు అనే రాజు సహాయం చేసినట్లు పరిశిష్ట పర్వన్ అనే జైనగ్రంథం తెలుపుతోంది
సి) వాయవ్య భారత ఆధిపత్యం కోసం చంద్రగుప్తుడికి, మాసిడోనియా రాజు సెల్యుకస్ నికేటర్‌కు మధ్య యుద్ధం జరిగింది
డి) పైవన్నీ
5. చంద్రగుప్త మౌర్యుడి ఆస్థానానికి సెల్యుకస్ నికేటర్ రాయబారిగా పంపిన మెగస్తనీస్ రచించిన గ్రంథం?
ఎ) ఇండికా బి) నేచురల్ హిస్టరీ
సి) పెరిప్లస్ ఆఫ్ ది ఎరిత్రియన్ సీ
డి) ది అనబేసిస్ ఆఫ్ అలెగ్జాండర్
6. పశ్చిమ ప్రాంతంలో సౌరాష్ట్ర వరకు చంద్రగుప్త మౌర్యుడి రాజ్యం విస్తరించినట్లు తెలుపుతున్న శాసనం ఏది?
ఎ) హాతిగుంఫా బి) జునాగఢ్
సి) అలహాబాద్ డి) విలస
7. జునాగఢ్ శాసనం ప్రకారం ఏ సౌరాష్ట్ర గవర్నర్ 'సుదర్శన తటాకం'ను నిర్మించారు?
ఎ) పుష్య గుప్తుడు బి) బుధ గుప్తుడు
సి) తిష్య డి) ఇంద్ర కరణుడు
8. చంద్రగుప్త మౌర్యుడు సల్లేఖన వ్రతాన్ని ఏ ప్రాంతంలో ఆచరించాడు?
ఎ) సువర్ణగిరి బి) శ్రావణ బెళగొళ
సి) పాటలీపుత్రం డి) వైశాలి
9. గ్రీకులు బిందుసారుడిని 'అమిత్ర ఘేట్స్' అని పేర్కొన్నారు. అంటే?
ఎ) అమిత ప్రేమ ఉన్నవాడు
బి) ఎన్నో విజయాలు సాధించినవాడు
సి) శత్రువులను భయంకరంగా నాశనం చేసినవాడు
డి) శత్రువులను క్షమించినవాడు
10. తక్షశిలలో తిరుగుబాటును అణచివేయడానికి అశోకుడిని బిందుసారుడు పంపినట్లు తెలుపుతున్న ఆధారాలు ఏవి?
ఎ) దివ్య వదన గ్రంథం
బి) షిర్‌కాఫ్ శాసనం సి) ఎ, బి
డి) పైవేవీ కావు
11. ప్రఖ్యాత అజీవక పండితుడు పింగళి వత్స ఏ మౌర్యపాలకుడి ఆస్థానంలో ఉండేవాడు?
ఎ) బిందుసారుడు బి) అశోకుడు
సి) కునాల డి) సంప్రతి
12. బిందుసారుడి వారసుల మధ్య వారసత్వ యుద్ధం జరిగిన కాలం?
ఎ) క్రీ.పూ. 270 – 260
బి) క్రీ.పూ. 273 – 269
సి) క్రీ.పూ. 267 – 265
డి) క్రీ.పూ. 265 – 260
13. అశోకుడి శాసనాలను జేమ్స్ ప్రిన్సెస్ చదివిన సంవత్సరం ఏది?
ఎ) 1837 బి) 1860 సి) 1875 డి) 1825
14. 'అశోక' పేరుతో కనుగొన్న మొదటి శాసనం ఏది?
ఎ) జౌళి శాసనం బి) ధౌగడ
సి) మస్కి డి) ఉడెగోళం
15. మౌర్యుల కాలంలో గూఢచారులుగా ఎవరిని నియమించేవారు?
ఎ) వేశ్యలు బి) వితంతువులు
సి) అనాథ బాలలు డి) పైవారందరినీ
16. పురాణాలు అశోకుడిని ఏమని పేర్కొన్నాయి?
ఎ) ప్రియదర్శి బి) దేవానాంప్రియ
సి) అశోకవర్ధన డి) పైవేవీ కావు
17. అశోకుడు రాజు కాక ముందు ఏ ప్రాంతానికి రాజ ప్రతినిధిగా పనిచేశాడు?
ఎ) ఉజ్జయినీ బి) తక్షశిల
సి) గాంధార డి) కళింగ
18. అశోకుడు తన సోదరుల్లో తిస్యను తప్ప మిగిలిన 99 మందిని హతమార్చి రాజ్యాన్ని ఆక్రమించినట్లు తెలుపుతున్న గ్రంథం?
ఎ) దీప వంశ బి) మహా వంశ
సి) ఛుఖ వంశ డి) టిబెట్ చరిత్ర
19. శాసనాల్లో (అలహాబాద్ స్తంభ శాసనం) అశోకుడి భార్యగా ఎవరిని పేర్కొన్నారు?
ఎ) కారువాకి బి) అసంధి మిత్ర
సి) తిస్యరక్షిత డి) విదిశ మహాదేవి
20. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) అశోకుని జీవితం మలుపుతిప్పిన సంఘటన కళింగయుద్ధం (క్రీ.పూ. 262 – 261)
బి) అశోకుడు రాజ్యానికి వచ్చిన 8 ఏళ్ల తర్వాత కళింగయుద్ధం చేసినట్లు 13వ శిలా శాసనం తెలుపుతోంది
సి) కళింగయుద్ధ పరిణామాలకు చలించి అశోకుడు బౌద్ధ మతం స్వీకరించినట్లు బబ్రూ శాసనం తెలుపుతోంది
డి) పైవన్నీ
21. అశోకుడికి బౌద్ధమత దీక్ష ఇచ్చిన గురువు?
ఎ) ఉప గుప్తుడు
బి) సింహళ గ్రంథాల ప్రకారం నిగ్రధ
సి) ఎ, బి డి) ఎవరూ కాదు
22. ఆంధ్రప్రదేశ్‌లో ఏ ప్రాంతంలో అశోకుడి పెద్ద శిలాశాసనం లభించింది?
ఎ) ఎర్రగుడి బి) రేణిగుంట
సి) బేతంచర్ల డి) మందపల్లి
23. అశోకుడు ప్రజల్ని తన కన్నబిడ్డలుగా భావించినట్లు తెలుపుతున్న శాసనం?
ఎ) ధౌళి బి) జౌగడ
సి) ఎ, బి డి) పైవేవీకావు
24. ద్వి భాషల్లో ఉన్న అశోకుడి శాసనం ఏది?
ఎ) కాందహార్ బి) బైరట్
సి) కల్సి డి) అలహాబాద్
25. అశోకుడు బుద్ధుడి జన్మస్థలం సందర్శించి ఆ గ్రామ ప్రజలకు పన్ను మినహాయింపు ఇచ్చినట్లు తెలుపుతున్న శాసనం ఏది?
ఎ) రాంపూర్వ బి) రుమ్మిందై
సి) కౌశాంబి డి) మన్‌షేరా
26. అశోకుడి శాసనాలను తరలించిన వ్యక్తులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
గ్రూప్ – ఎ
1. అలహాబాద్ శాసనం
2. తోప్రా, మీరట్ శాసనాలు
3. బైరట్ శాసనం
గ్రూప్ – బి
a. అక్బర్
b. ఫిరోజ్ షా తుగ్లక్
c. కన్నింగ్ హామ్
ఎ) 1-a, 2-b, 3-c
బి) 1-c, 2-b, 3-a
సి) 1-b, 2-a, 3-c
డి) 1-a, 2-c, 3-b
27. అశోకుడి శాసనాలు ఎక్కువగా బ్రాహ్మీలిపిలో ఉన్నాయి. అయితే ఖరోష్టి లిపిలో ఉన్న శాసనం ఏది?
ఎ) మన్‌షేరా బి) షాబాజ్ గిరి
సి) ఎ, బి డి) ఏదీకాదు
28. అశోకుడు 250 రాత్రులు బౌద్ధ సంఘంలో గడిపినట్లు తెలుపుతున్న శాసనం?
ఎ) ఎర్రగుడి బి) మస్కి
సి) ఎ, బి డి) ఏదీకాదు
29. జతపరచండి.




గ్రూప్ – ఎ
1. యజ్ఞాలు, జంతుబలుల నిషేధం
2. ధర్మ మహామాత్యుల నియామకం
3. బోధివృక్షం సందర్శన
4. పరమత సహనం
5. కళింగయుద్ధం, సమకాలీన రాజులు
గ్రూప్ – బి
a. మొదటి శిలాశాసనం
b. అయిదో శిలాశాసనం
c. ఎనిమిదో శిలా శాసనం
d. 7, 12వ శిలాశాసనాలు
e. 13వ శిలాశాసనం
ఎ) 1-a, 2-b, 3-c, 4-d, 5-e
బి) 1-e, 2-d, 3-c, 4-b, 5-a
సి) 1-c, 2-e, 3-b, 4-d, 5-a
డి) 1-b, 2-e, 3-a, 4-d, 5-c
30. కింది వాటిలో అశోకుడు నిర్వహించిన బౌద్ధ సంగీతి ఏది?
ఎ) మొదటి సంగీతి బి) రెండో సంగీతి
సి) మూడో సంగీతి డి) నాలుగో సంగీతి
31. అశోకుడు వివిధ ప్రాంతాలకు పంపిన ప్రచారకులు, ప్రాంతాలకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
గ్రూప్ – ఎ
1. శ్రీలంక
2. హిమాలయప్రాంతం
3. సువర్ణభూమి (బర్మా)
4. కశ్మీర్, గాంధార
5. మహిష మండలం
గ్రూప్ – బి
a. మహేంద్ర, సంఘమిత్ర
b. మజ్జిహిమ
c. సోనా, ఉత్తర
d. మజ్ హంతిక
e. మహాదేవుడు
ఎ) 1-e, 2-d, 3-c, 4-b, 5-a
బి) 1-a, 2-b, 3-c, 4-d, 5-e
సి) 1-c, 2-e, 3-b, 4-d, 5-a
డి) 1-b, 2-e, 3-a, 4-d, 5-c
32. అశోకుడి తర్వాతి పాలకులు ఎవరు?
ఎ) తూర్పు ప్రాంతం – దశరథుడు
బి) పశ్చిమ ప్రాంతం– కునాల
సి) ఎ, బి డి) పైవేవీ కావు
33. కింది వారిలో కశ్మీరీ చరిత్రలో ప్రముఖ స్థానం కలిగిన అశోకుడి కుమారుడు ఎవరు?
ఎ) కునాల బి) సంప్రతి
సి) మహేంద్ర డి) జలుక
34. మౌర్య వంశ చివరి పాలకుడు ఎవరు?
ఎ) బృహద్రధుడు బి) దశరథుడు
సి) సంప్రతి డి) కునాల
35. మౌర్యుల పాలనను అంతం చేసి శుంగ వంశాన్ని స్థాపించింది ఎవరు?
ఎ) అగ్నిమిత్ర శుంగ
బి) పుష్యమిత్ర శుంగ
సి) దేవభూతి డి) వసుమిత్ర
36. మౌర్యవంశ పతనం గురించి తెలుపుతున్న లిఖిత ఆధారాలు ఏవి?
ఎ) హర్ష చరిత్ర బి) విష్ణు పురాణం
సి) ఎ, బి డి) పైవేవీ కావు
37. మౌర్యుల పాలన ఎన్నేళ్లు కొనసాగింది?
ఎ) 150 బి) 137 సి) 100 డి) 400
38. మౌర్యుల పాలనను తెలుపుతున్న ముఖ్య ఆధారం?
ఎ) కౌటిల్యుడు – అర్థశాస్త్రం
బి) మెగస్తనీస్ – ఇండికా
సి) ఎ, బి డి) పైవేవీ కావు
39. కింది వాటిలో కౌటిల్యుడు పేర్కొన్న సప్తాంగాలకు చెందినవి?
ఎ) రాజు, రాజ్యం బి) మంత్రి, దుర్గం
సి) దండం, మిత్రరాజ్యం, కోశం
డి) పైవన్నీ
40. కింది వాటిలో అశోకుడి ఏ శాసనం మంత్రి పరిషత్ గురించి వివరిస్తోంది?
ఎ) మూడో శిలాశాసనం
బి) ఆరో శిలాశాసనం
సి) ఎ, బి డి) పైవన్నీ
41. మౌర్యుల కాలంలో ముఖ్య విభాగాలు, అధిపతులకు సంబంధించి కింది వాటిని జతపరచండి.
గ్రూప్ – ఎ
1. సీతాధ్యక్షుడు
2. అకరాధ్యక్షుడు
3. లక్షణాధ్యక్షుడు
4. పోతువాధ్యక్షుడు
5. గణికాధ్యక్షుడు
గ్రూప్ – బి
a. రాజు భూముల నిర్వహణ
b. గనులు
c. టంకశాల
d. తూనికలు, కొలతలు
e. వేశ్యలు
ఎ) 1-a, 2-b, 3-c, 4-d, 5-e
బి) 1-e, 2-d, 3-c, 4-b, 5-a
సి) 1-b, 2-e, 3-d, 4-c, 5-a
డి) 1-c, 2-a, 3-d, 4-e, 5-b
42. కింది వాటిలో సరైంది ఏది?
ఎ) సమాహర్త – పన్నులు వసూలు చేసే అధికారి
బి) సన్నిదాత – ప్రభుత్వ ఆదాయాన్ని భద్రపరచే అధికారి
సి) తీర్థులు – మంత్రి పరిషత్ ఉపాధ్యక్షుడు
డి) పైవన్నీ
43. మౌర్యుల కాలంలో ఇతీజ్ఞ మహామాత్రులు ఏ శాఖను పర్యవేక్షించేవారు?
ఎ) రహదారుల పర్యవేక్షణ
బి) స్త్రీల సంక్షేమం
సి) వృద్ధుల సంక్షేమం
డి) దమ్మ ప్రచారం
44. మౌర్యుల నగరపాలనను విపులంగా వివరించి గ్రంథం?
ఎ) ఇండికా బి) అర్థశాస్త్రం
సి) కథావత్తు డి) విష్ణుపురాణం
45. మౌర్యుల సామ్రాజ్యంలో ప్రధాన భాగాలు, రాజధానులను జతపరచండి.
గ్రూప్ – ఎ
1. మౌర్య సామ్రాజ్యం
2. ఉత్తరాపథం
3. పశ్చిమ పథం (అవంతి)
4. ప్రాచ్య పథం (కళింగ)
5. దక్షిణా పథం
గ్రూప్ – బి
a. పాటలీపుత్రం
b. తక్షశిల
c. ఉజ్జయినీ
d. తొసలి
e. సువర్ణగిరి
ఎ) 1-a, 2-b, 3-c, 4-d, 5-e
బి) 1-e, 2-d, 3-c, 4-b, 5-a
సి) 1-c, 2-e, 3-b, 4-a, 5-d
డి) 1-b, 2-e, 3-d, 4-c, 5-a
46. పాటలీపుత్రం ఏ నదుల సంగమ ప్రాంతంలో ఉంది?
ఎ) సోన్, గండక్ బి) గంగా, సోన్
సి) ఘాగ్రా, గండక్
డి) గంగా, ఘాగ్రా
47. మౌర్యుల పాలనా విభాగాలు, అధికారులకు సంబంధించి కింది వాటిలో సరైంది?
ఎ) జనపథం– యువరాజు
బి) ఆహారం – ప్రాదేశికుడు, రజ్జుక
సి) విషయం– స్థానిక, గోప
డి) పైవన్నీ

సమాధానాలు

1) ఎ; 2) సి; 3) బి; 4) డి; 5) ఎ;
6) బి; 7) ఎ; 8) బి; 9) సి; 10) సి;
11) ఎ; 12) బి; 13) ఎ; 14) సి; 15) డి;
16) సి; 17) ఎ; 18) బి; 19) ఎ; 20) డి;
21) సి; 22) ఎ; 23) సి; 24) ఎ; 25) బి;
26) ఎ; 27) సి; 28) సి; 29) ఎ; 30) సి;
31) బి; 32) సి; 33) డి; 34) ఎ; 35) బి;
36) సి; 37) బి; 38) సి; 39) డి; 40) సి;
41) ఎ; 42) డి; 43) బి; 44) ఎ; 45) ఎ;
46) బి; 47) డి.

సాధారణ గుండె లయను నియంత్రించే విటమిన్?

మానవ శరీరానికి 13 విటమిన్లు అవసరం. వీటిని ప్రధానంగా రెండు రకాలుగా వర్గీకరించారు. అవి నీటిలో కరిగేవి, కొవ్వుల్లో కరిగేవి. ఎ, డి, ఇ, కె విటమిన్లు కొవ్వుల్లో కరుగుతాయి. ఇవి కొవ్వు కణాల్లో నిల్వ ఉంటాయి. విటమిన్ బి, సి లు నీటిలో కరుగుతాయి. వీటిని శరీరం ఎక్కువ మొత్తంలో నిల్వ ఉంచుకోలేదు. కాబట్టి ఇవి లభించే ఆహారం ఎక్కువగా తీసుకోవాలి.



విటమిన్లు

- మనిషి ఆహారంలో స్వల్ప మోతాదులో మాత్రమే అవసరమయ్యే కర్బన పోషకాలు విటమిన్లు.
- విటమిన్లు శక్తి వనరులు కాదు.
- ఒక విటమిన్ లేదా విటమిన్‌లోని ఒక భాగం లేదా విటమిన్ నుంచి ఏర్పడిన ఉత్పాదకం సహ ఎంజైమ్‌గా వ్యవహరిస్తూ రసాయనిక చర్యలో పాల్గొనే ఎంజైమ్‌లకు సహాయపడతాయి.
- విటమిన్ అనే పదాన్ని కాసిమర్ ఫంక్ ప్రతిపాదించాడు. విటమిన్లను ఆంగ్ల అక్షరాల క్రమంలో నామకరణం చేసే పద్ధతిని ప్రతిపాదించింది జె.సి. డ్రుమాన్డ్.
- విటమిన్లు ప్రధానంగా 2 రకాలు
  - **కొవ్వులో కరిగేవి:** ఎ, డి, ఇ, కె.
  - **నీటిలో కరిగేవి:** బి–కాంప్లెక్స్, సి

విటమిన్ – ఎ

విటమిన్–ఎ రసాయన నామం రెటినాల్. సాధారణ నామం జీరాప్తాల్మియా నిరోధక విటమిన్. ఆరోగ్యకరమైన దృష్టికి, సాధారణ ఆరోగ్యానికి ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే కంటిలోని కార్నియా దెబ్బతిని జీరాప్తాల్మియా సంభవిస్తుంది.

లభ్యత: క్యారెట్, పసుపు రంగులోని ఫలాలు, నారింజ, సొరచేప కాలేయం నూనె, ఆకుకూరలు, జంతువుల కాలేయంలో ఎక్కువగా లభిస్తుంది. శాకాహారంలో ఇది బీటా కెరోటిన్ రూపంలో లభిస్తుంది. పేగులోని సూక్ష్మజీవులు దీన్ని రెటినాల్‌గా మారుస్తాయి.

విటమిన్ – డి

దీని రసాయన నామం కాల్సిఫెరాల్. దీన్నే రికెట్స్ నిరోధక విటమిన్, సన్‌షైన్ విటమిన్ అని కూడా పిలుస్తారు. బలమైన ఎముకలు, దంతాలకు ఇది అవసరం. శరీరంలోని కాల్షియం, ఫాస్పరస్, జీవక్రియలను నియంత్రిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే చిన్నారుల్లో రికెట్స్ వ్యాధి సంభవిస్తుంది. ఎముకలు బలహీనపడి, వంకరలు తిరిగడం ఈ వ్యాధి లక్షణం. పెద్దల్లో ఈ విటమిన్ లోపం వల్ల ఎముకలు బలహీనపడి ఆస్టియోమలేసియా వ్యాధి సంభవిస్తుంది.

లభ్యత: శాకాహారంలో ఇది లభించదు. పాలు, గుడ్లు, కాడ్ చేప కాలేయం నూనె, జంతువుల కాలేయం, పుట్టగొడుగుల్లో సమృద్ధిగా లభిస్తుంది.

విటమిన్ – ఇ

దీని రసాయన నామం టోకోఫెరాల్. దీన్ని బ్యూటీ విటమిన్ లేదా వంధ్యత్వ నిరోధక విటమిన్ అంటారు. స్త్రీ, పురుషుల్లో ప్రత్యుత్పత్తి వ్యవస్థకు ఇది అవసరం. కాంతివంతమైన చర్మాన్ని ఇస్తుంది. దీని లోపం అరుదుగా సంభవిస్తుంది. ఇది లోపిస్తే పురుషుల్లో వంధ్యత్వం వస్తుంది, మహిళల్లో గర్భస్రావం జరుగుతుంది.

లభ్యత: ఫలాలు,కూరగాయలు, విత్తనాలు (బాదం, పిస్తా), చేపలు, మాంసం, చేప నూనె, కాలేయంలో లభిస్తుంది.

విటమిన్ – కె

దీని రసాయన నామం ఫిలోక్వినోన్ లేదా మెనాక్వినోన్. దీన్ని రక్తస్రావ నిరోధక విటమిన్ అని కూడా అంటారు. రక్త స్కంధన ప్రక్రియలో అనుబంధ రక్తస్కంధన కారకంగా ఇది వ్యవహరిస్తుంది. ఈ విటమిన్ లోపిస్తే గాయాలైనప్పుడు రక్తం ఆలస్యంగా గడ్డ కడుతుంది.

లభ్యత: పేగులోని సూక్ష్మజీవులు దీన్ని తయారుచేస్తాయి. కాలిఫ్లవర్, క్యాబేజి, ఆకుకూరలు, కాలేయం, మూత్రపిండాల్లో లభిస్తుంది.

విటమిన్ – సి (ఆస్కార్బిక్ ఆమ్లం)

ఇది స్కర్వీ నిరోధక విటమిన్. బలమైన చిగుళ్లకు, నోటి ఆరోగ్యానికి ఇది అవసరం. ఇది లోపిస్తే స్కర్వీ వ్యాధి సంభవిస్తుంది.

లక్షణాలు: చిగుళ్ల నుంచి రక్తం కారడం, దంతాలు ఊడిపోవడం, నాలుకపై పుండ్లు ఏర్పడటం ఈ వ్యాధి లక్షణాలు.

లభ్యత: నారింజ, బత్తాయి, నిమ్మ లాంటి సిట్రస్ ఫలాలు, ఉసిరి, మాంసం, కాలేయంలో లభిస్తుంది.

విటమిన్ – బి1

దీని రసాయన నామం థయమిన్. బెరిబెరి నిరోధక విటమిన్ అని అంటారు. శక్తి విడుదల, నాడీవ్యవస్థ, రక్తప్రసరణ అభివృద్ధి వ్యవస్థకు అవసరం. దీనిలోపం ద్వారా బెరిబెరి వ్యాధి వస్తుంది. చిన్నారుల్లో తడి బెరి బెరి (ఛాతీలో నీరు నిండటం), పెద్దల్లో పొడి బెరిబెరి(చర్మం పొడిబారటం) సంభవిస్తుంది. పాలీన్యూరిటిస్ అనే నాడీ క్షీణత వ్యాధి సంభవిస్తుంది.

లభ్యత: పొట్టు తీయని అన్ని రకాల ధాన్యాలు, మాంసంలో లభిస్తుంది.

విటమిన్ – బి2

దీన్నే విటమిన్–జి లేదా ఎల్లో ఎంజైమ్ అని కూడా అంటారు. కొవ్వులు, పిండి పదార్థాల జీవక్రియలో పాల్గొంటుంది. ఈ విటమిన్ లోపిస్తే అరిబోఫ్లెవినోసిస్ అనే వ్యాధి వస్తుంది. నోటి అంచున పగుళ్లు ఏర్పడటం(ఖీలోసిస్/ యాంగ్యులర్ స్టొమాటిస్), నాలుక వాపు (గ్లోసైటిస్) ఈ వ్యాధి లక్షణాలు.

లభ్యత: పాలు, పాల ఉత్పత్తుల్లో ఎక్కువగా ఉంటుంది. కాబట్టి దీన్ని లాక్టోఫ్లెవిన్ అని, గుడ్ల పచ్చసొనలోనూ అధికంగా లభించడం వల్ల ఓవోఫ్లెవిన్ అని అంటారు. కాలేయంలోనూ ఉంటుంది కాబట్టి హెపటోఫ్లెవిన్ అని కూడా అంటారు. ఎండు ఫలాలు, కూరగాయలు, మాంసంలో లభిస్తుంది.

విటమిన్ – బి3

దీని రసాయన నామం నియాసిన్. నికోటినిక్ యాసిడ్ లేదా నికోటినమైడ్‌గానూ పిలుస్తారు. ఇది పెల్లగ్రా నిరోధక విటమిన్. ఆరోగ్యకరమైన నాడీవ్యవస్థ, చర్మం, జీర్ణక్రియకు ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే పెల్లగ్రా వ్యాధి సంభవిస్తుంది. చర్మం ఎర్రగా కందడం(డెర్మటైటిస్), నీళ్ల విరేచనాలు (డయేరియా), మతిమరుపు (డెమెన్షియా) ఈ వ్యాధి లక్షణాలు. తీవ్రలోపం తలెత్తితే మరణించే ప్రమాదం ఉంది. అందుకే దీన్ని 4డి/3డి సిండ్రోమ్ అంటారు.

లభ్యత: మాంసం, కూరగాయలు, ఆకుకూరలు, పప్పుధాన్యాల్లో ఎక్కువగా లభిస్తుంది.

విటమిన్ – బి5

దీన్నే పాంటోథెనిక్ యాసిడ్ అని పిలుస్తారు. కో ఎంజైమ్–ఎ గానూ వ్యవహరిస్తారు. కొలెస్ట్రాల్, న్యూరోట్రాన్స్‌మీటర్ల ఉత్పాదన, శక్తి విడుదలకు విటమిన్–బి5 అవసరం. దీనిలోపం వల్ల అరికాళ్లలో మంటలు కలిగే బర్నింగ్ ఫీట్ సిండ్రోమ్ వస్తుంది.

లభ్యత: మాంసం, గుడ్లు, బ్రెడ్‌లో లభిస్తుంది.

విటమిన్ – బి6

దీన్నే పైరిడాక్సిన్ లేదా పైర్డాక్సల్ ఫాస్ఫేట్ అంటారు. ప్రొటీన్ల జీవక్రియకు ఇది అవసరం. ఈ విటమిన్ లోపిస్తే చర్మం పొడిబారుతుంది. విపరీతమైన బలహీనత వస్తుంది. మార్నింగ్ డిసీజ్ అనే వ్యాధి సంభవిస్తుంది.

లభ్యత: మాంసం, గోధుమ, మొక్కజొన్న, సోయాబీన్, వేరుశనగ, బాదంలో ఎక్కువ మోతాదులో లభిస్తుంది.

విటమిన్ – బి7

దీన్నే విటమిన్ –హెచ్, బయోటిన్ అని కూడా పిలుస్తారు. శక్తి విడుదల, అమైనో ఆమ్లాలు, గ్లైకోజన్ ఉత్పత్తికి అవసరం. పేగులోని సూక్ష్మజీవులు దీన్ని అందిస్తాయి. ఈ విటమిన్ చాలా అరుదుగా లోపిస్తుంది. ఉడికించని గుడ్డు తెల్లసొనలో ఎవిడిన్ అనే పదార్థం ఉంటుంది. ఇది బయోటిన్ వినియోగాన్ని అడ్డుకుంటుంది.

విటమిన్ – బి9

దీన్నే ఫోలిక్ యాసిడ్ అంటారు. ఎర్రరక్తకణాల పరిపక్వత, హీమోగ్లోబిన్ తయారీకి ఇది అవసరం. పిండం అభివృద్ధి, మానసిక వికాసానికి తోడ్పడుతుంది. ఈ విటమిన్ లోపిస్తే మెగాలోబ్లాస్టిక్ లేదా మ్యాక్రోస్టిక్ అనీమియా వ్యాధి వస్తుంది. గర్భిణుల్లో ఇది తీవ్రంగా లోపిస్తే పుట్టబోయే పిల్లల్లో స్పైనా బిఫిడా అనే మానసిక వైకల్యం సంభవిస్తుంది

లభ్యత: స్ట్రాబెర్రీ, టమాట, కాలిఫ్లవర్, అరటి, క్యాబేజి, పాలకూర, నారింజల్లో లభిస్తుంది.

విటమిన్ – బి12

దీన్నే సైనోకోబాలమిన్ అంటారు. ఎర్ర రక్తకణాల పరిపక్వత, హీమోగ్లోబిన్ తయారీకి అవసరం. ఈ విటమిన్ లోపిస్తే పెర్నిసియస్ అనీమియా సంభవిస్తుంది.

లభ్యత: మాంసాహారం, గుడ్లు, పాల లాంటి జంతు ఉత్పత్తుల్లో మాత్రమే లభిస్తుంది. మొక్కల్లో లభించదు.

విటమిన్ – బి17

దీన్నే యాంటి కేన్సర్ విటమిన్ అని అంటారు. వాస్తవానికి ఇది విటమిన్ కాదు. మొక్కల్లో కేన్సర్ నిరోధక లక్షణాలున్న రసాయనాలన్నింటినీ కలిపి బి17 అంటారు.

మాదిరి ప్రశ్నలు

1. కిందివాటిలో $బి_{15}$ అని పిలిచే విటమిన్?
ఎ) పాంటోథెనిక్ ఆమ్లం
బి) పంగామిక్ ఆమ్లం
సి) నియాసిన్ డి) ఫోలిక్ ఆమ్లం
2. ఒక గ్రాము కొవ్వు నుంచి ఎన్ని కేలరీల శక్తి విడుదలవుతుంది?
ఎ) 4.1 బి) 4.3 సి) 9.3 డి) 8.0
3. కింది వాటిలో అవశ్యక అమైనోఆమ్లం?
ఎ) అలనిన్ బి) ప్రోలిన్
సి) సిస్టీన్ డి) ఆర్జినిన్
4. చర్మం, రోమాలు, గోళ్లు తదితరాల్లో ఉండే ప్రత్యేకమైన ప్రొటీను?
ఎ) కెరోటిన్ బి) కెరాటిన్
సి) అల్బుమిన్ డి) కాండ్రిన్
5. తల్లిపాలలో ఉండే ప్రొటీన్ల శాతం?
ఎ) 2.4 బి) 3.1 సి) 6.2 డి) 0.3
6. మేక పాలలో ఉండే లాక్టోజ్ శాతం?
ఎ) 3.6 బి) 4.6 సి) 4.2 డి) 0.7
7. అధిక నీటి శాతం ఉన్న పాలు?
ఎ) ఆవు పాలు బి) గేదె పాలు
సి) మేక పాలు డి) గాడిద పాలు
8. విటమిన్ బి12 లోపం ద్వారా వచ్చే రక్తహీనతను ఏమంటారు?
ఎ) పెర్నిసియస్ రక్తహీనత
బి) న్యూట్రిషినల్ రక్తహీనత
సి) మెగలోబ్లాస్టిక్ రక్తహీనత
డి) మ్యాక్రోస్టిక్ రక్తహీనత
9. మానవుడి సాధారణ జీవక్రియ రేటు(బీఎంఆర్)కు ఎన్ని కేలరీ శక్తి అవసరం?
ఎ) 1200–1500 బి) 1500–1700
సి) 500–700 డి) 2000–3000
10. విటమిన్–ఎ లోపం ద్వారా కంటి కార్నియా పొడిబారడాన్ని ఏమంటారు?
ఎ) నిక్టలోపియా బి) జీరాప్తాల్మియా
సి) కెరటోమలేసియా డి) ఏదీకాదు
11. పెద్దల్లో విటమిన్ డి లోపం ద్వారా ఎముకలు క్షీణించి బలహీన పడటాన్ని ఏమంటారు?
ఎ) ఆస్టియో పోరోసిస్
బి) ఆస్టియో మలేషియా
సి) ఆస్టియో ఆర్థ్రైటిస్ డి) ఆస్టీటిస్ ఫైబ్రోజా
12. సాధారణ గుండె లయను నియంత్రించే విటమిన్?
ఎ) ఆస్కార్బిక్ ఆమ్లం బి) థయమిన్
సి) నియాసిన్ డి) పెరిడాక్సిన్
13. ఎల్లో ఎంజైమ్ అని ఏ విటమిన్‌ను పిలుస్తారు?
ఎ) బి2 బి) బి5 సి) బి6 డి) బి7
14. కండరాల్లో అధిక మోతాదులో ఉండే ప్రొటీన్?
ఎ) గ్లుటెన్ బి) కొల్లాజెన్
సి) కెసిన్ డి) మయోసిన్
15. కిందివాటిలో ఏ విటమిన్ లోపం వల్ల ఖీలోసిస్ సంభవిస్తుంది?
ఎ) పాంటోథెనిక్ ఆమ్లం బి) నియాసిన్
సి) పెరిడాక్సిన్ డి) రిబోఫ్లెవిన్
16. పాల చక్కెర(లాక్టోజ్)లో ఉండే మోనోశాకరైడ్లు?
ఎ) గ్లూకోజ్, ఫ్రక్టోజ్ బి) గ్లూకోజ్, గాలక్టోజ్
సి) గ్లూకోజ్, గ్లూకోజ్ డి) ఏవీ కాదు
17. సగటున మనిషికి రోజుకు ఎంత మోతాదులో విటమిన్ సి అవసరం?
ఎ) 2 మి.గ్రా. బి) 50 మి.గ్రా.
సి) 75 మి.గ్రా. డి) 30 మి.గ్రా.
18. కింద ఇచ్చిన ఏ అమైనో ఆమ్లంలో సల్ఫర్ ఉంటుంది?
ఎ) మిథియోనిన్ బి) హిస్టిడీన్
సి) గ్లైసిన్ డి) ప్రోలిన్

సమాధానాలు

1) బి	2) సి	3) డి	4) బి
5) ఎ	6) సి	7) ఎ	8) ఎ
9) బి	10) బి	11) బి	12) ఎ
13) ఎ	14) డి	15) డి	16) బి
17) బి	18) ఎ		

నిజాం ఉల్‌ముల్క్ మహారాష్ట్రులతో కుదుర్చుకున్న సంధి?

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

తెలంగాణ చరిత్ర

మాదిరి ప్రశ్నలు

1. అద్దంకి గంగాధర కవి ఎవరి కొలువులో ఉండేవాడు?
   1) సింగ భూపాలుడు
   2) ఇబ్రహీం కుతుబ్‌షా
   3) అబుల్ హాసన్ తానీషా
   4) కాకతి ప్రతాపరుద్రుడు
2. తెలుగుభాషకు తొలి వ్యాకరణం?
   1) ఆంధ్రశబ్ద చింతామణి
   2) ఆంధ్రభాషా భూషణం
   3) కావ్యాలంకార సంగ్రహం
   4) కవిజనాశ్రయం
3. 'శ్రీ పర్వత స్వామి' ఏ రాజ వంశీయుల కులదైవం?
   1) శాలంకాయనులు 2) ఆనందగోత్రీకులు
   3) ఇక్ష్వాకులు 4) విష్ణుకుండినులు
4. బుద్ధుణ్ని దేవుడిగా ఆరాధించడం ప్రారంభించిన ప్రాథమిక శాఖ ఏది?
   1) దిగంబరులు 2) హీనాయానం
   3) మహాయానం 4) శ్వేతాంబరులు
5. తెలంగాణలో సామాజిక సాంస్కృతిక చైతన్యం తీసుకొచ్చింది ఎవరు?
   1) అఘోరనాథ ఛటోపాధ్యాయ
   2) దస్తూల్ హోషాంగ్
   3) ముల్లా అబ్దులఖియా
   4) పైవారంతా
6. తల్లి పేరుతో శాసనాలు వేయించిన ఇక్ష్వాక రాజు?
   1) రెండో ఏహబల శాంతమూలుడు
   2) రెండో వీరుపురుషదత్తుడు
   3) మొదటి వీరపురుషదత్తుడు
   4) మొదటి శాంతమూలుడు
7. పేష్కస్ అంటే?
   1) ప్రభుత్వానికి రైతు చెల్లించాల్సిన శిస్తు
   2) జమీందారుకు రైతు చెల్లించాల్సిన శిస్తు
   3) ప్రభుత్వానికి జమీందారు చెల్లించాల్సిన శిస్తు
   4) గ్రామాధికారికి రైతు చెల్లించాల్సిన శిస్తు
8. నిజాం ఉల్‌ముల్క్ మహారాష్ట్రులతో కుదుర్చుకున్న సంధి?
   1) మునిషిప్ గాంప్ 2) వార్నా సంధి
   3) దురారీ సరాయి 4) పైవన్నీ
9. ఏ నిజాం పరిపాలనా కాలంలో వహాబీ ఉద్యమం ప్రారంభమైంది?
   1) అఫ్జల్ ఉద్దౌలా 2) మహబూబ్ అలీఖాన్
   3) నాసిరుద్దౌలా 4) సలాబత్ సింగ్



10. మీరట్‌లో తిరుగుబాటు ఏ రోజున ప్రారంభమైంది?
    1) 1857 మే 10 2) 1858 నవంబర్ 1
    3) 1856 డిసెంబర్ 10 4) 1858 జనవరి 1
11. 'నిజాం రాజ్యం కల్తీలేని మధ్యయుగపు రాచరికం' అని వ్యాఖ్యానించింది ఎవరు?
    1) రావి నారాయణ రెడ్డి
    2) బద్దం ఎల్లారెడ్డి
    3) పుచ్చలపల్లి సుందరయ్య
    4) చంద్ర రాజేశ్వరరావు
12. ఇక్ష్వాకు అంటే అర్థం?
    1) చెరకు 2) పక్షి
    3) పర్వతం 4) నది
13. గౌతమీ బాలశ్రీ వేయించిన శాసనం?
    1) నాసిక్ శాసనం
    2) చినగంజాం శాసనం
    3) మ్యాకదోని శాసనం
    4) నానాఘాట్ శాసనం
14. శర్వవర్మ, గుణాఢ్యుడు ఎవరి ఆస్థాన కవులు?
    1) యజ్ఞశ్రీ శాతకర్ణి 2) పులోమావి
    3) గౌతమీపుత్ర శాతకర్ణి 4) హాలుడు
15. మొగల్ రాజపురం గుహలను ఎవరు నిర్మించారు?
    1) ఇక్ష్వాకులు 2) ఆనంద గోత్రీకులు
    3) శాలంకాయనులు 4) విష్ణుకుండినులు
16. 1915లో సంఘ సంస్కార నాటక మండలి స్థాపించి, హరిజనులతో నాటకాలు వేయించింది ఎవరు?
    1) నరాలశెట్టి దేవేంద్రుడు 2) శేషాద్రి
    3) కృష్ణస్వామి 4) భాగ్యరెడ్డి వర్మ
17. కాకతీయుల కాలంలో మంత్రులు, సేనాధిపతులు, రాజోద్యోగులందరూ ఏ వర్గానికి చెందినవారు?
    1) బ్రాహ్మణ 2) క్షత్రియ
    3) వైశ్యులు 4) శూద్రులు
18. శాతవాహన కాలంనాటి వర్తకులు?
    1) సార్థవాహులు 2) తిలపిష్టకులు
    3) సుగధికులు 4) సేధి
19. ఇక్ష్వాకుల కాలంలో తలవర అంటే?
    1) ఒక వృత్తి
    2) రాజు సమకూర్చుకున్న సైన్యం
    3) సేనాధిపతి, సామంతరాజు
    4) నాణెం
20. 'విజ్ఞాన చంద్రికా మండలి' స్థాపన?
    1) 1906 2) 1907
    3) 1908 4) 1908
21. జస్టిస్ పార్టీ మౌలికంగా?
    1) హరిజనుల పార్టీ
    2) బ్రాహ్మణ పక్షపాత పార్టీ
    3) బ్రాహ్మణ వ్యతిరేక పార్టీ
    4) ఉన్నత వర్గాల పార్టీ
22. హిందూ ధర్మ పరిషత్తు పేరిట 1925 ఏప్రిల్ 1న మత విషయక కాన్ఫరెన్స్ జరిగింది. ఈ సదస్సుకు అధ్యక్షత వహించింది ఎవరు?
    1) కర్తుకోటి శంకరాచార్యులు
    2) రాజా ప్రతాపగిర్జీ
    3) పండిట్ శేషాద్రి 4) భాగ్యరెడ్డి వర్మ
23. 'సూత్తనిపాతం' ఏ మతగ్రంథం?
    1) జైన 2) హిందూ
    3) బౌద్ధ 4) ఏదీకాదు
24. భట్టిప్రోలులో నివసించే ఏ జాతి బౌద్ధమతాన్ని స్వీకరించింది?
    1) నాగులు 2) పుళిందులు
    3) యక్షులు 4) ద్రావిడులు
25. భట్టిప్రోలు ప్రాచీన నామం ఏది?
    1) ప్రతిపాలపురం 2) బేతవోలు
    3) ఘంటశాల 4) శ్రీ పర్వతం
26. హేతువాది ప్రాధాన్యత ఇచ్చే వాదం?
    1) ప్రతీత్య సముత్పవాదం
    2) గతి తార్కిక భౌతికవాదం
    3) కార్యకరణ వాదం 4) కర్మసిద్ధాంతం
27. శుద్ధి ఉద్యమాన్ని చేపట్టింది?
    1) బ్రహ్మసమాజం 2) ఆర్యసమాజం
    3) దివ్యజ్ఞాన సమాజం 4) పైవన్నీ
28. 1975లో విధించిన ఎమర్జెన్సీ వల్ల ఏ పార్టీ ఆవిర్భవించింది?
    1) భారతీయ లోక్‌దళ్ 2) జనతాపార్టీ
    3) భారతీయ జనతాపార్టీ 4) ఏదీకాదు
29. శాతవాహన కాలం నాటి నిగమాలంటే ?
    1) గ్రామాలు 2) నగరాలు
    3) పట్టణాలు 4) రెవెన్యూ మండలాలు
30. బైబిల్‌ను తెలుగులోకి అనువదించిన తొలి విదేశీయుడు?
    1) బ్రేక్ 2) జెవెక్ బాక్
    3) కెప్టెన్ ఓర్ 4) ఎడిసన్
31. చౌరీ- చౌరా సంఘటనతో ఆగిపోయిన ఉద్యమం?
    1) సహాయనిరాకరణ 2) శాసనోల్లంఘన
    3) వందేమాతర ఉద్యమం
    4) క్విట్ ఇండియా ఉద్యమం
32. ఈ కింద పేర్కొన్న ఏ గ్రంథాల్లో వరంగల్ నగరాన్ని వర్ణించారు?
    1) రాజశేఖర చరిత్ర 2) కళాపూర్ణోదయం
    3) క్రీడాభిరామం 4) నీలాంబరి
33. శాతవాహనానంతర యుగంలో భూములను పగ్గాలతో కొలిచి ఆయకట్టును నిర్ణయించే వారిని ఏమనేవారు?
    1) హస్తికోశ 2) సెట్టి
    3) అక్షపటలాధికృతుడు 4) రజ్జుకుడు
34. 'గుడిసెలు కాలిపోతున్నాయి' రచన ద్వారా జాతీయ పురస్కారం పొందినవారు?
    1) బోయి భీమన్న 2) సి. నారాయణ రెడ్డి
    3) కంభంపాటి రామశాస్త్రి
    4) గుడిపాటి వెంకటాచలం
35. హరిజన్ సేవక్ సంఘ్ ద్వారా రాజకీయ చైతన్యం తీసుకొచ్చినవారు?
    1) భాగ్యరెడ్డి వర్మ
    2) కోదాటి నారాయణరావు
    3) జమలాపురం కేశవరావు
    4) మందముల నరసింగరావు
36. శాతవాహనుల కాలంనాటి పన్నెండు బృంద నాట్య శిల్పాలు ఎక్కడ లభించాయి?
    1) అమరావతి 2) జగ్గయ్యపేట
    3) గుడిమల్లం 4) కార్లే గుహలు
37. నిజాం ఉల్‌ముల్క్ అసలు పేరు?
    1) ముబారిజ్ ఖాన్
    2) చిన్‌ఖిలిచ్ ఖాన్
    3) మీర్ ఖమీరుద్దీన్ ఖాన్
    4) బహదూర్ షా
38. పర్ణిక శ్రేణి, పూసిన శ్రేణులు ఎవరి కాలం నాటివి?
    1) శాతవాహనులు 2) విష్ణుకుండినులు
    3) ఇక్ష్వాకులు 4) తూర్పు చాళుక్యులు
39. బౌద్ధ శిల్పకళలో అంగాలెన్ని?
    1) 2 2) 3 3) 4 4) 5
40. కుతుబ్‌షాహీలు ఏ సాంఘిక దురాచారం రూపుమాపటానికి ప్రయత్నించారు?
    1) వేశ్యాలోలత 2) సతీసహగమనం
    3) బాల్యవివాహాలు 4) అంటరానితనం
41. బౌద్ధుల ప్రార్థన మందిరం?
    1) స్తూపం 2) ఛత్రం
    3) చైత్యం 4) విహారం
42. రాజనీతిని గురించి వివరించిన గ్రంథం?
    1) రాయవాచకం 2) ఆముక్తమాల్యద
    3) సుమతీ శతకం 4) రామాభ్యుదయం
43. ఎవరికాలంలో నాగార్జున కొండ సుప్రసిద్ధ విద్యాకేంద్రంగా వర్ధిల్లింది?
    1) శాలంకాయనులు 2) ఆనంద గోత్రీకులు
    3) ఇక్ష్వాకులు 4) విష్ణుకుండినులు
44. శాతవాహనుల కాలంలో ఇత్తడి పనిచేసే వారి శ్రేణి?
    1) కమర 2) వధికి
    3) సెలవధికి 4) కాసకార
45. చాందా రైల్వే ఆందోళన ఎవరి పరిపాలనా కాలంలో జరిగింది?
    1) ఉస్మాన్ అలీఖాన్ 2) మహబూబ్ అలీఖాన్
    3) నాసిరుద్దౌలా 4) సికిందర్ జా
46. భారతదేశాన్ని తన రెండో మాతృభూమిగా పేర్కొన్న మహిళ?
    1) మేడం బ్లావట్ స్కీ 2) అనిబిసెంట్
    3) మదర్ థెరిస్సా 4) ఎవరూ కాదు
47. గోల్కొండ ఏ పరిశ్రమకు ప్రసిద్ధిగాంచింది?
    1) కలంకారి 2) నూలు వస్త్రాలు
    3) వజ్రాలు 4) ముత్యాలు
48. మహాపరినిర్యాణం అంటే ?
    1) బుద్ధుడి ధర్మప్రచారం 2) బుద్ధుడి జననం
    3) బుద్ధుడి తపస్సు 4) బుద్ధుడి మరణం
49. మొదటి కర్ణాటక యుద్ధం నాటి ఆర్కాటు నవాబు?
    1) ముజఫర్ జంగ్ 2) సలాబత్ జంగ్
    3) అన్వరుద్దీన్ 4) మహ్మద్ అలీ
50. బయ్యారం శాసనం ఎవరి చరిత్రను గురించి తెలుపుతుంది?
    1) కొండవీటి రెడ్లు 2) బాదామి చాళుక్యులు
    3) శాతవాహనులు 4) కాకతీయులు

సమాధానాలు

1) 2; 2) 4; 3) 3; 4) 3; 5) 4; 6) 4; 7) 3; 8) 4; 9) 1; 10) 1; 11) 1; 12) 1; 13) 1; 14) 4; 15) 4; 16) 4; 17) 2; 18) 1; 19) 3; 20) 1; 21) 3; 22) 2; 23) 3; 24) 1; 25) 1; 26) 3; 27) 2; 28) 2; 29) 3; 30) 2; 31) 1; 32) 3; 33) 4; 34) 1; 35) 2; 36) 4; 37) 3; 38) 3; 39) 3; 40) 2; 41) 3; 42) 2; 43) 3; 44) 4; 45) 2; 46) 2; 47) 3; 48) 4; 49) 3; 50) 4. .

They act just like human beings!

BANK EXAMS

GENERAL ENGLISH

Directions (Q. No. 1-10): Read each sentence to find out whether there is any grammatical mistake/ error in it. The error if any, will be in one part of the sentence, mark the number of that part with error as your answer. Mark (5) as your answer, if there is 'No error'.

1. When we moved (1)/ we have to put (2)/ our furniture in storage (3)/ for a while. (4) No error (5)
2. She knows that (1)/ child (2)/ had been telling (3)/ stories again. (4) No error (5)
3. The only stipulation is (1)/ that the topic you choose (2)/ must be related (3)/ to yours studies. (4) No error (5)
4. We are learning to (1)/ step back from ourselves (2)/ and identity (3)/ our strengths and weaknesses. (4) No error (5)
5. Books provides (1)/ with ideas (2)/ and a stimulus (3)/ for play. (4) No error (5)
6. Children from (1)/ certain backgrounds tend for (2)/ stereotyped by (3)/ their teachers. (4) No error (5)
7. The team coach (1)/ forced to step into stop (2)/ the two athletes from (3)/ coming to blows. (4) No error (5)
8. She stationed (1)/ at the window (2)/ to await for (3)/ his return. (4) No error (5)
9. The procession (1)/ made it's stately progress (2)/ through the streets (3)/ of the city. (4) No error (5)
10. The remains (1)/ of the building (2)/ stand as a stark remainders (3)/ of the fire. (4) No error (5)

Directions (Q. No. 11-15): Each question below has a blank/ two blanks, each blank indicating that something has been omitted. Choose the word/ set of words from the five options for each blank that best fits the meaning of the sentence as a whole.

11. These _____ are intended to smooth the ___ to a peace treaty.
    1) negotiations; path
    2) talks; pavement
    3) arbitration; road
    4) dialogues; process
    5) confrontations; dispute
12. We tried to contact all ___ students, but one or two ____ the net.
    1) former; missed
    2) passed; forgotten
    3) failed; overlooked
    4) previous; forgot
    5) former; skip
13. The findings of the report _____ slanted in favour of the manufacturers.
    1) are been 2) were been
    3) had been 4) has been
    5) is been
14. The rise in _____ is a clear _____ that the government's policies are not working.
    1) popularity; signature
    2) population; progress
    3) prices; signal
    4) people; symptom
    5) places; pause
15. Chest pains can be a _____ of heart problems.
    1) recurring tension
    2) warning signal
    3) mounting pressure
    4) indicator 5) pulsation

Directions (Q. No. 16-20): Rearrange the following six sentences (A), (B), (C), (D), (E) and (F) in a proper sequence to form a meaningful paragraph and then answer the questions given below.

A. As with people some monkeys are lazy, like those who sleep all day in the zoo, and some are industrious, like the little fellows who collect pennies for the organ-grinder.

B. If you invite them to dinner, they can sit quite comfortably in real chairs and use a knife and fork exactly as you.

C. As a matter of fact, Monkeys are like people, when certain kinds of monkeys are domesticated, they act just like human beings.

D. They smoke cigars, drink beer and look almost human when dressed.

E. Sometimes he even leads them in singing, first howling some weird notes, then signaling his companions to join in the chorus.

F. In speaking of monkeys which act like human beings, mention should be made of the Brazilian monkey which often balances himself on the top of a tree and makes a speech to the monkeys below him.

16. What is the LAST sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) D
17. What is the THIRD sentence after rearrangement?
    1) A 2) B 3) D 4) F 5) E
18. What is the FIFTH sentence after rearrangement?
    1) A 2) C 3) D 4) E 5) F
19. What is the FIRST sentence after rearrangement?
    1) B 2) A 3) C 4) D 5) E
20. What is the FOURTH sentence after rearrangement?
    1) A 2) B 3) C 4) E 5) F



Directions (Q. No. 21 - 25): Which of the phrases (1), (2), (3) and (4) given below each sentence should replace the phrase underlined in the sentence to make it grammatically correct? If there is no error, mark (5) No correction required as your answer.

21. When I arrived, I have the sensation that she had been expecting me.
    1) has 2) will have
    3) will be having 4) had
    5) No correction required
22. We are concrete seeking new ways of expanding our membership.
    1) evidently 2) firstly
    3) vastly 4) currently
    5) No correction required
23. You will perhaps discover, that practice does help, that success does come with effort and determination and a positive mind-set.
    1) has come 2) will come
    3) would come 4) will be coming
    5) No correction required
24. The brightest persons in a class are not always the good students.
    1) comparable 2) winner
    3) best 4) active
    5) No correction required
25. I hired a cleaning lady who comes in twice a month and is now in disposable.
    1) indisposable 2) indisputable
    3) indispensable 4) incorrigible
    5) No correction required

Directions (Q. No. 26-30): Read the following passage carefully and answer the questions given below it. Certain words have been printed in bold to help you locate them while answering some of the questions.

Delivering mail to small villages in India was once a difficult, **perilous** and exciting job. The postman traveled on foot, often wading through swamps or crawling through jungles in order to reach the many villages on his route.

The Indian mailman might sometimes encounter a fierce tiger or panther along the way, yet the only weapon he carried was a sharp spear. He never went to work without his bells, which he would shake in order to **ward off** evil spirits. Wild animals or evil spirits, nothing ever interrupted his work.

The Indian letter carrier was an honoured and respected person; he was treated with great courtesy. So wise he thought to be that he was frequently called upon to solve the village disputes.

It is certainly evident that only a very brave man would take a job that **compelled** him to fight off wild animals in order to get his work done. You can understand why everyone in India looked upon the man who delivered mail as a true national hero.

26. Which statement is true?
    a. Mailmen in India were considered heroes.
    b. Some people in India used to believe in evil spirits.
    1) Only a 2) Only b
    3) Both a and b
    4) Neither a nor b
    5) Either a or b
27. Which statement is false?
    a. The letter carrier was often asked to settle disputes in the villages that he visited.
    b. An Indian mailman used to carry modern weapons as protection against wild animals.
    1) Only a 2) Only b
    3) Both a and b
    4) Neither a nor b
    5) Either a or b
28. The synonym of **ward off** is
    1) Encourage 2) Protest
    3) Keep 4) Deflect
    5) Depend
29. The antonym of **perilous**
    1) Hazardous 2) Bounty
    3) Terrifying 4) Harmless
    5) Detrimental
30. The antonym of **compelled**
    1) Obliged 2) Constrained
    3) Bound 4) Chained
    5) Liberated

Directions (Q. No. 31-40): In the following passage there are blanks, each of which has been numbered. These numbers are printed below the passage and against each, five words/ phrases are suggested, one of which fits the blank appropriately. Find out the appropriate word/ phrase in each case and mark your answer.

A professor at an eastern college _____ (31) that the special sense the visually challenged people _____ (32) on is connected in some way with ____ (33) hearing. The professor ____ (34) described 1500 tests in which blind people and people with normal sight, but blindfolded, _____ (35) to avoid walking into walls. The visually challenged passed the tests with greater ____ (36) than those who could see. The blind would _____ (37) forward confidently, sensing the wall when they were as much as fifteen feet _____ (38) it. They claimed that their ears sent them a warning _____ (39) that the wall was near. This seems quite possible, for when their ears were covered so that they could not hear; they often ran right _____ (40) the wall. You can imagine how valuable this strange power must be to the blind. Do you think that it is nature's way of making up to them for their lost sight?

31. 1) believes 2) deem
    3) judge 4) accept
    5) doubt
32. 1) grasp 2) depend
    3) relay 4) reel
    5) realize
33. 1) there 2) they
    3) their 4) them
    5) that
34. 1) lately 2) newly
    3) just 4) recently
    5) freshly
35. 1) attempt 2) attempting
    3) attempts 4) will attempt
    5) attempted
36. 1) ease 2) difficulty
    3) effort 4) relieve
    5) alleviate
37. 1) stepping 2) stride
    3) tramp 4) tumble
    5) amble
38. 1) through 2) thorough
    3) from 4) away
    5) apart
39. 1) memo 2) letter
    3) meaning 4) message
    5) point
40. 1) inside 2) outside
    3) inwards 4) in
    5) into

Directions (Q. No. 41-42): choose the wrongly spelt word from the five options given.

41. 1) Cemetery 2) Scenary
    3) Scenario 4) Composure
    5) Predicament
42. 1) Stationery 2) Stationary
    3) Impeccabal 4) Juggernaut
    5) Delicious

Directions (Q. No. 43-45): In each of the following four sets of words a set is either synonymous or antonymous, identify that set and mark your answer.

43. 1) Luscious; Sacrilege
    2) Prophecy; Luxurious
    3) Somersault; Impediment
    4) Obnoxious; Abhorrent
    5) None of these
44. 1) Atrocious; Oblige
    2) Entourage; Tourist
    3) Ensemble; Entangle
    4) Pilfer; Embezzle
    5) None of these
45. 1) Ensconce; Shelve
    2) Acrimonious; Corrigible
    3) Sanctimonious; Succulent
    4) Corrigendum; Adjudicate
    5) None of these

Answers

1) 2; 2) 1; 3) 4; 4) 3; 5) 1; 6) 2; 7) 2; 8) 3; 9) 2; 10) 3; 11) 4; 12) 1; 13) 3; 14) 3; 15) 2; 16) 4; 17) 2; 18) 5; 19) 3; 20) 1; 21) 4; 22) 4; 23) 5; 24) 3; 25) 3; 26) 3; 27) 2; 28) 4; 29) 4; 30) 5; 31) 1; 32) 2; 33) 3; 34) 4; 35) 5; 36) 1; 37) 2; 38) 3; 39) 4; 40) 5; 41) 2; 42) 3; 43) 4; 44) 4; 45) 1.